
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 333

ఆదివారం 23-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 333

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 23-2-2025



భారత్ X పాకిస్తాన్

చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా నేడు దుబాయ్‌లో జరిగే మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే టీమిండియా సెమీస్‌లో స్థానం దాదాపుగా ఖాయం చేసుకుంటుంది. పాక్ ఓడితే మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

- వివరాలు 14లో



మేనిగనిగలకు..

ఒక మహిళ తాలూకు ఆరోగ్యం ఎలా ఉందన్నది ఆమె మేని ఛాయ, నిగారింపు వంటి అంశాలు పట్టి చూపుతాయి. వేర్వేరు వయసుల్లో చర్మంలో వచ్చే మార్పులెలా ఉంటాయో.. వాటిని అధిగమించి మేనిని ఆరోగ్యంగా ఉంచుకునే రక్షణ చర్యలేమిటో చూద్దాం.

- వివరాలు 13లో



మఖానా.. మా ఖానా

ఈ సూపర్ ఫుడ్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

మార్కెట్లో కేజీ ధర రూ.2,000 పైమాటే...

అద్భుత ఆరోగ్య సుగుణాలతో పెరుగుతున్న ప్రాచుర్యం

బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటుకు బడ్జెట్లో ప్రకటనతో మరింత దన్ను

పేరేమో బ్లాక్ డైమండ్స్.. లోపలున్నది వైట్ గోల్డ్! అవునండీ.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సూపర్ ఫుడ్ 'మఖానా' సంగతే ఇది. పుష్కలమైన పోష కాలతో ఆరోగ్య వరప్రదాయినిగా అంతర్జాతీయ ఖ్యాతినా ర్జించిన ఫూల్ మఖానా క్రేజ్ కేక పుట్టిస్తోంది. మఖానాకు తాజా కేంద్ర బడ్జెట్లో కూడా పెద్దపీట వేయడంతో దీని పేరు మరింత మార్మోగుతోంది. బిహార్‌లో మఖానా బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్లో మోదీ సర్కారు ప్రకటిం చింది. దీంతో మార్కెటింగ్ సదుపాయాలు పెరగడంతో పాటు రైతులకు మరింత చేయూత లభించనుంది.

వివరాలు 12లో▶

హీరోలా ఎగిరే జీరో..

ఫ్యూచర్ కారు 'మోడల్ జీరో'ను అభివృద్ధి చేస్తున్న అమెరికా సంస్థ

వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

రోడ్డుపై రయ్యిన వెళ్తున్నారు.. దారిలో ట్రాఫిక్ జామ్.. ఎటూ ముందుకు వెళ్లలేని పరిస్థితి.. ఇలాంటి సందర్భాల్లో అమాంతం పైకి ఎగిరి ముందుకు వెళ్లగల కారుంటే..?! ఇలాం టి ఊహను నిజం చేయబోతోంది అమెరికాకు చెందిన అలెఫ్ ఏరోనాటిక్స్ అనే ఆటోమోటివ్, ఏవియేషన్ సంస్థ. తాజాగా మోడల్ జీరో అనే కారును ప్రయోగాత్మకంగా కాలిఫోర్ని యాలోని ఓ రోడ్డుపై విజయవంతంగా పరీక్షించింది. అందుకు సంబంధించిన వీడియోను సంస్థ నెటిజన్లతో పంచుకుంది.



వివరాలు 3లో▶

న్యూస్‌రీల్

నేడే మహాకుంభాభిషేక సంప్రోక్షణ



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య స్వర్ణ విమాన గోపుర కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి యాదగిరిగుట్ట క్షేత్రం ముస్తా బైంది. ఆదివారం జరిగే స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు.

- వివరాలు 5లో▶

యుద్ధం @ మూడేళ్లు



ఉక్రెయిన్.. రష్యా దురాక్రమణ జెండా ఎగరేసి దూసుకురావడంతో అస్తిత్వమే లక్ష్యంగా సర్వ శక్తులూ ఒడ్డి పోరాడుతున్న పొరుగుదేశం. అణ్వస్త్ర సామర్థ్యం, అమేయ సైన్యంతో కొద్దికొ ద్దిగా ఆక్రమించుకుంటూ వస్తున్న రష్యాను నిలువరించేందుకు ఉక్రెయిన్ యుద్ధంచేస్తూ శతథా ప్రయత్నాలు చేయబట్టి రేపటికి సరిగ్గా మూడేళ్లు. 36 నెలల తర్వాత అయినా ఉక్రెయిన్ ఊపిరి పీల్చుకుంటుందో లేదోనని, యుద్ధప్రభావిత విపరిణామాలతో తిప్పలు పడుతున్న ఎన్నో ప్రపంచదేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.


- వివరాలు 6లో▶

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



ప్రభుత్వ ఉద్యోగులకు పేరుకుపోయిన బకా యిలను, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లు లను తక్షణమే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

- వివరాలు 12లో▶



కుప్పకూలిన సొరంగం


శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగం పనుల్లో ప్రమాదం

14 కిలోమీటర్ల లోపల ఘటన.. శిథిలాల్లో చిక్కుకున్న 8 మంది

నీటి ఊట పెరగడంతో కాంక్రీట్ సెగ్మెంట్లు ఊడిపోయి.. భారీ శబ్దంతో కూలిపడిన పైకప్పు

- 50 మంది కార్మికులు సురక్షితంగా బయటకు.. ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు లోపలే..
- హుటాహుటిన సహాయక చర్యలు.. శిథిలాలు, బురదతో తీవ్ర ఇబ్బంది
- టన్నెల్‌లో నీటిని, బురదను తొలగిస్తున్నామన్న మంత్రి ఉత్తమ్
- ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. ఉన్నత స్థాయి సమీక్ష.. సహాయక చర్యలు వేగిరం చేయాలని ఆదేశం
- సీఎంకు మోదీ ఫోన్.. ప్రమాదంపై ఆరా

2లో



సహాయక చర్యల నిమిత్తం లోకో ట్రాక్ ద్వారా టన్నెల్‌లోనికి వెళ్తున్న రెస్క్యూ బృందాలు



ఒక్కసారిగా నీళ్లొచ్చాయి

"ఉదయం 8.30కి టన్నెల్ పను లను పరిశీలించేందుకు లోప లికి వెళ్లాను. ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. అకస్మాత్తుగా నీళ్లు వచ్చి సిమెంట్ సెగ్మెంట్ కూలి పడింది. అవతల వైపు ఇంకా కూలీలు ఉన్నారు. మేం పరుగెత్తుకుంటూ బయటికి వచ్చేశాం. ఏం జరిగిందో అర్థం కాలేదు.

- శశికుమార్, ప్రమాదం నుంచి బయటపడ్డ ఏఈ



నీళ్లు దూకని సొరంగాలు!

రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగాల పనులు 2లో

ఎక్కడ తప్పు జరిగిందో నిరూపించండి

సమగ్ర సర్వేపై కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు సీఎం సవాల్

సర్వేపై కొందరు తప్పుడు మాటలు చెబుతున్నారు

వ్యవస్థను కుప్పకూల్చే కుట్ర ఇది

కేసీఆర్ సర్వేలో బీసీలు 51 శాతం ఉంటే... ఇప్పుడు 56.33 శాతానికి పెరిగారు

- పకడ్బందీగా సర్వే చేపట్టాం.. జనగణనలో కులగణన చేర్చాలని తీర్మానం చేస్తున్నాం
- సామాజిక వర్గాల వారీగా మార్చి 10లోగా తీర్మానాలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- కేసీఆర్ సర్వే అధికారికం కాదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజాభవన్‌లో బీసీ నేతలతో సమావేశం



శనివారం ప్రజాభవన్‌లో బీసీ నేతలతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నూటికినూరు శాతం పక్కాగా నిర్వహించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్వే చేపట్టిందని, ప్రత్యేకంగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి, చట్టపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక శాఖకు అప్ప గించి పకడ్బందీగా నిర్వహించినట్లు వివరిం చారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి సాహసం చేయలేదని, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వ్యవస్థను కుప్పకూల్చే కుట్రలో భాగంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం ప్రజాభవ న్‌లో బీసీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. సర్వే చేపట్టిన విధానం, ఫలితా లు, బీసీల జనాభాకు సంబంధించిన అంశాలను

మిగతా 3వ పేజీలో ▶

ప్రాధాన్య ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు!

కేంద్ర సాయం కోసం డీపీఆర్‌లు ఢిల్లీకి పంపాలని సీఎం రేవంత్ ఆదేశం 5లో

దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

సీఎం అసమర్థతతో ఆర్థిక లోటు గరిష్ట స్థాయికి చేరిందని మండిపాటు



రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంలా ఉన్నారని ఆరోపణ

కృష్ణా జలాల దోపిడీపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో దివ్యంగా ఉన్న రాష్ట్రం 15 నెలల కాంగ్రెస్ పాలనలో దివాలా తీసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామా రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతతో రాష్ట్ర ఆర్థికలోటు గరిష్ట స్థాయికి చేరిందని విమర్శించారు. తిక్క నిర్ణయాలు, హైడ్రా లాంటి దిక్కుమాలిన విధానాలతో రాష్ట్ర ఆదాయం పూర్తిగా పడిపోయిందని దుయ్యబట్టారు. తన చేతగానితనంతో కేవలం ఒక్క ఏడాదిలోనే అన్ని రంగాలనూ సీఎం చావుదెబ్బ కొట్టాడని వ్యాఖ్యానించారు. శని వారం తెలంగాణ భవన్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'అధికారంలోకి వచ్చి నప్పటి నుంచే కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై ఒక ఎజెండా ప్రకారం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. తల్లి లాంటి రాష్ట్రాన్ని కేన్సర్‌తో మిగతా 12వ పేజీలో ▶

14,236 అంగన్‌వాడీ కొలువులు

6,399 టీచర్లు, 7,837 హెల్పర్ల ఖాళీలకు త్వరలో నియామక ప్రకటనలు

ఫైలుపై మంత్రి సీతక్క సంతకం.. వచ్చే నెలలో నోటిఫికేషన్లు విడుదల!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అందుకు సంబంధించిన ఫైలుపై సంతకం చేశారు. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్లు సమాచారం. ముఖ్య మంత్రి వద్ద కూడా ఈ ఫైలుకు వేగం గా పరిష్కారం లభిస్తుందని మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ విభా గంలో మొత్తం 14,236

మిగతా 3వ పేజీలో ▶





సూపర్ సిక్స్ సంగతి మర్చిపోయేలా భలే దబ్బా కొట్టిస్తున్నార్సార్!

కట్టు కట్టడాలూ.. ఇంజెక్షన్లు చేయడాలూ ఆన్‌లైన్‌లోనే..

9 జిల్లాల్లోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో ఇంకా ఆన్‌లైన్ తరగతులే

అడ్మిషన్లు పూర్తయి రెండు నెలలైనా మొదలు కాని ప్రత్యక్ష బోధన

కాలేజీలకు క్లర్కులు, స్వీపర్లను కూడా కేటాయించని సర్కార్

మే-జూన్‌లో మొదటి సంవత్సరం పరీక్షలు



నిర్మల్ నర్సింగ్ కాలేజీలో ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్న అధ్యాపకురాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళా శాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన కొత్త నర్సింగ్ కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించకపోవడంతో విద్యార్థిను లు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది డిసెం బర్ మొదటి వారంలోనే అడ్మిషన్లు పూర్తయినప్పటికీ, కొత్తగా ఏర్పా టైన 16 కళాశాలలకు గాను 9 చోట్ల ఇప్పటికీ ప్రత్యక్ష బోధన ప్రారం భం కాలేదు. వచ్చే మే-జూన్‌లో నర్సింగ్ మొదటి సంవత్సరం పరీ క్షలు జరపాల్సి ఉండగా, విద్యార్థినులు ఆన్‌లైన్‌లో మొక్కుబడిగా పాఠాలు వింటున్నారు. 16 కాలేజీల్లో కాళోజీ వర్సిటీ ద్వారా అడ్మిషన్లు పూర్తికాగా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆయా కళాశా లలకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, టీచింగ్ స్టాఫ్‌ను నియమించింది. అయితే క్లరికల్ స్టాఫ్, నాలుగో తరగతి ఉద్యోగుల నియామకం జర గలేదు. ఆఫీస్ సబార్డినేట్, అటెండర్లు, జూని యర్, సీనియర్ అసిస్టెంట్లు, క్లర్కులు, వాచ్‌మెన్,

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

25న ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు పిటిషన్లను ఈనెల 25న సుప్రీంకోర్టు విచారించనుంది. మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వాదనలు వినేందుకు సుప్రీంకోర్టు జాబితాలో చేర్చింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ పలుసార్లు వాయిదా పడింది.

రాహుల్ గాంధీతో మధుయాష్కీ గౌడ్ భేటీ

పార్టీ అంతర్గత వ్యవహారాలు, ప్రభుత్వ పాలన తీరుపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ భేటీ అయ్యారు. శనివారం ఢిల్లీలో 30 నిమిషాల పాటు భేటీ అయిన మధుయాష్కీ రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రాష్ట్రంలో కులగణన కోసం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన పలు అంశాలను, ప్రజల్లో వస్తున్న స్పందనను రాహుల్‌కి వివరించారు. కులగణనతో తెలంగాణను దేశంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని మధుయాష్కీ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రాజకీయాల పరిణామాలతో పాటు పార్టీకి సంబంధించిన పలు అంతర్గత అంశాలను, ప్రభుత్వ పాలన తీరును రాహుల్‌గాంధీ అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో తెలంగాణలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని మధుయాష్కీ వివరించారు. 2014 తర్వాత ఉస్మానియా యూనివర్సిటీతో సహా రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో నియామక ప్రక్రియను పూర్తిగా స్తంభింపచేశారన్నారు. దీంతో పదేళ్లలో యూనివర్సిటీల్లో సుమారు 2,700 పోస్టులు భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సర్వే పొరపాట్లకు అంగన్‌వాడీలు బాధ్యులా?

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పొరపాట్లకు అంగన్‌వాడీ ఉపాధ్యాయులను బాధ్యులుగా చూపడం అవివేకమని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సర్వే ప్రక్రియంతా అంగన్‌వాడీ ఉపాధ్యాయులే నిర్వహించి క్రోడీకరించినట్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వ్యాఖ్యానించడం సరికాదని.. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టేకుమళ్ల సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో సర్వేకు అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కేవలం సహకారం అందించారని గుర్తు చేశారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులను అగౌరవపరిచేలా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు.

సొరంగంలో చిక్కుకున్నది వీరే..

సొరంగంలో చిక్కుకున్న వారిలో రాబిన్స్ ఇండియా కంపెనీకి చెందిన ఇద్దరు మెషీన్ ఆపరేటర్లతోపాటు జేపీ కంపెనీకి చెందిన ఇద్దరు ఇంజనీర్లు, నలుగురు కార్మికులు ఉన్నారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంజనీర్ మనోజ్‌కుమార్, ఫీల్డ్ ఇంజనీర్ శ్రీనివాస్, జమ్మూకశ్మీర్‌కు చెందిన జనరల్ ఆపరేటర్ సన్నీసింగ్, పంజాబ్‌కు చెందిన ఎరెక్టర్ ఆపరేటర్ విర్సా సింగ్, జార్ఖండ్‌కు చెందిన కార్మికులు సందీప్ సాహు, జాగ్తా క్షేస్, సంతోష్ సాహు, అన్జు సాహు ఉన్నారు.



సన్నీసింగ్



గురుప్రీత్‌సింగ్



మనోజ్‌కుమార్



శ్రీనివాస్



సందీప్ సాహు

నీళ్లు దూకని సొరంగాలు!

రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగాల పనులు

- 2005 ఆగస్టులో పనులు ప్రారంభించిన వైఎస్సార్ సర్కారు
- 43.93 కిలోమీటర్ల తొలి సొరంగం.. 34.71 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తి
- తరచూ ఆటంకాలు.. వరదలతో 2019లో ఇన్‌లెట్‌లో నిలిచిపోయిన తవ్వకం
- టన్నెల్ తవ్వే మెషీన్ బేరింగ్ చెడిపోవడంతో ఔట్‌లెట్‌లో 2023 జనవరిలో నిలిచిన పనులు
- అమెరికా నుంచి ప్రత్యేక నౌకలో పరికరాలను రప్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇంతలో ప్రమాదం జరగడంతో పనుల పునః ప్రారంభంపై ప్రభావం
- ఎంత వేగంగా బాగుచేసినా ఏడాది పడుతుందంటున్న నిపుణులు


సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, నల్లగొండ: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులకు అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మొదలైన ఈ ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4.15లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ పీడిత 516 గ్రామాలకు తాగునీటిని గ్రావిటీ ద్వారా అందించేందుకు ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం ఎడమగట్టు కాల్వ ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ-ఎస్ఎల్‌బీసీ)ను ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు 1979లోనే అంకురార్పణ జరిగింది. 1982 జూలై 29న రూ.480 కోట్లతో సొరంగ మార్గం పనులు చేపట్టాలని నిర్ణయించిన ఉమ్మడి ఏపీ ప్రభుత్వం జీవో 306ను విడుదల చేసింది. అయినా పనులు మొదలుకాలేదు. తర్వాత 22 ఏళ్ల వరకు దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. 2005లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు తిరిగి జీవం పోశారు. రూ.2,813 కోట్ల అంచనాతో రెండు సొరంగాల నిర్మాణ పనులకు 2005 ఆగస్టు 11న పరిపాలన అనుమతులు జారీ చేశారు. 2006లో సొరంగం పనులకు శంకుస్థాపన జరిగింది.

రెండు సొరంగాలతో ప్రాజెక్టు..

భూసేకరణ, ఇతర వ్యయాలు పోగా.. రెండు సొరంగాల నిర్మాణానికి రూ.2,259 కోట్లతో ఈపీసీ విధానంలో టెండర్లను ఆహ్వానించగా.. రూ.1,925 కోట్లను కోట్ చేసి జేపీ అసోసియేట్స్ లిమిటెడ్ పనులను దక్కించుకుంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నీటిని తీసుకునేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట (ఇన్‌లెట్) నుంచి నల్లగొండ జిల్లాను ఆనుకొని ఉన్న మన్నెవారిపల్లి (ఔట్‌లెట్) వరకు 43.930 కిలోమీటర్ల పొడవున 10 మీటర్ల వెడల్పుతో తొలి సొరంగాన్ని ప్రతిపాదించారు. శ్రీశైలం జలాశయం నుంచి నీటిని ఈ తొలి సొరంగం ద్వారా తరలించి లింక్ కాల్వ ద్వారా డిండి జలాశయంలోకి చేర్చాల్సి ఉంది. అక్కడి నుంచి లింక్ కాల్వతో 7.13 కిలోమీటర్ల రెండో సొరంగ మార్గంలో తరలించి.. మరో లింక్ కాల్వ ద్వారా పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటిని చేర్చాల్సి ఉంది.

రెండు వైపుల నుంచి తవ్వకాలు..

43.93 కిలోమీటర్లతొలి సొరంగానికి గాను ఇప్పటివరకు 34.71 కిలోమీటర్ల మేర పనిపూర్తవగా.. మరో 9.56 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ఈ సొరంగాన్ని రెండు టన్నెల్ బోర్ మెషీన్ల (టీబీఎం)తో రెండు వైపుల (ఇన్‌లెట్, అవుట్‌లెట్) నుంచి తవ్వుకుంటూ వెళుతున్నారు. శ్రీశైలం జలాశయం ఇన్‌లెట్ నుంచి 13.93 కి.మీ. పనులు పూర్తవగా.. అవతల మన్నెవారిపల్లి (ఔట్‌లెట్) వైపు నుంచి మరో 20.43 కి.మీ తవ్వకం పూర్తయింది. మధ్యలో 9.55 కి.మీ మేర సొరంగం తవ్వాల్సి ఉంది. మరోవైపు డిండి రిజర్వాయర్ నుంచి నీళ్లను పెండ్లిపాక రిజర్వాయర్‌కు తరలించడానికి చేపట్టిన 7.13 కిలోమీటర్ల రెండోసొరంగం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. కానీ అందులో 3.84 కి.మీ. సొరంగానికి మాత్రమే లైనింగ్ పూర్తవగా.. మిగతా 3.29 కి.మీ ప్రాంతానికి లైనింగ్ చేయాల్సి ఉంది.



మరికొన్ని రోజుల్లో పరికరాలు వస్తాయనగా..

2019లో వచ్చిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఇన్‌లెట్ టన్నెల్‌లోకి సీపేజీ పెద్ద ఎత్తున రావడంతో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి నీటిని తొలగించే ప్రక్రియ మాత్రమే నడుస్తోంది. మరోవైపు ఔట్‌లెట్ వైపు రాయి గట్టిదనం ఎక్కువగా ఉండటంతో టన్నెల్ బేరింగ్ మెషీన్ బేరింగ్, అడాప్టర్, రింగ్ బేర్ దెబ్బతిని 2023 జనవరి 29న పనులు నిలిచిపోయాయి. అమెరికాకు చెందిన రాబిన్స్ కంపెనీ నుంచి బేరింగ్‌ను కొనుగోలు చేసి.. ప్రత్యేక నౌక ద్వారా మన దేశానికి తరలిస్తున్నారు. భారీ పరిమాణంలో ఉండే ఈ పరికరాలు చెన్నైకి చేరుకుని.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఇక్కడికి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో రెండు వైపులా తవ్వకాలను పునరుద్ధరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌లెట్ నుంచి తవ్విన సొరంగంలో సీపేజీ (నీటి ఊటలు)ను నియంత్రించేందుకు గ్రౌటింగ్ చేస్తున్నారు. అయితే తాజా ప్రమాదం కారణంగా ఇప్పట్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. టన్నెల్‌లో డీవాటరింగ్ చేసి, సీపేజీలో ఉన్న టీబీఎం మెషీన్‌ను బాగుచేసి పనులు ప్రారంభించాలంటే.. కనీసం ఏడాది సమయం పడుతుందని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఇన్‌లెట్ ఏరియల్ వ్యూ



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు వివరాలివీ..

ఎస్ఎల్‌బీసీ సొరంగాల పనుల తొలి అంచనా వ్యయం రూ.2,813 కోట్లు
గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన అంచనా వ్యయం: రూ.4,637.75 కోట్లు
ప్రాజెక్టులో ఇప్పటివరకు పూర్తయిన పనుల విలువ: రూ.2,689.47 కోట్లు
ఇంకా జరగాల్సిన పనుల విలువ: రూ.1,948 కోట్లు
పరిపాలన అనుమతులు జారీ అయినది: 2005 ఆగస్టు 11
నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్‌తో ఒప్పందం జరిగినది: 2005 ఆగస్టు 28
ప్రాజెక్టులోని సొరంగాలు: రెండు
తొలి సొరంగం పొడవు: 43.93 కిలోమీటర్లు
ఇందులో తవ్వకం పూర్తయిన నిడివి: 34.71 కిలోమీటర్లు
రెండో సొరంగం పొడవు: 7.13 కిలోమీటర్లు (మొత్తం పూర్తయింది)
ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో నీరందే ఆయకట్టు: 4.15 లక్షల ఎకరాలు
తాగునీరు అందే ఫ్లోరైడ్ పీడిత గ్రామాలు: 516
టన్నెల్స్ పూర్తికి ప్రస్తుత సర్కారు విధించుకున్న గడువు: 2026

కుప్పకూలిన సొరంగం

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో ప్రమాదం



నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ప్రమాదం చోటుచేసుకున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం



సొరంగం లోపలి భాగం

సాక్షి, నాగర్‌కర్నూల్/ సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకం పనుల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం సొరంగం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలడంతో 8 మంది లోపలే చిక్కుకుపోయారు. అందులో ఇద్దరు ఇంజనీర్లు, మరో ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారు. వారిని కాపాడేందుకు అధికారులు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. కానీ బాధితులు సొరంగంలో 14 కిలోమీటర్ల లోపల శిథిలాలు, బురదలో చిక్కుకుపోవడంతో బయటికి తీసుకురావడం కష్టంగా మారింది. ఘటన విషయం తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు టన్నెల్ వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మరోవైపు సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి ప్రమాదంపై ఆరా తీశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపుతామని, పూర్తి సహకారం అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు.

ఇటీవలే పనులు పునః ప్రారంభమై...

శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలను తరలించే 'ఎస్ఎల్‌బీసీ' ప్రాజెక్టులో భాగంగా భారీ సొరంగం నిర్మిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వైపు (టన్నెల్ ఇన్‌లెట్) నుంచి టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)తో ఈ తవ్వకం కొనసాగుతోంది. కొంతకాలం కింద టీబీఎం బేరింగ్ చెడిపోగా పనులు నిలిచిపోయాయి. ఇటీవలే అమెరికా నుంచి పరికరాలు తెప్పించి మరమ్మతు చేశారు. నాలుగైదు రోజుల కిందే పనులను పునః ప్రారంభించారు. ప్రస్తుతం సొరంగం లోపల 14వ కిలోమీటర్ వద్ద పనులు జరుగుతున్నాయి. శనివారం ఉదయం టన్నెల్ ఇన్‌లెట్ నుంచి 14 కిలోమీటర్ పాయింట్ వద్దకు ప్రాజెక్టు ఇంజనీర్లు, మెషీన్ ఆపరేటర్లు, కార్మికులు చేరుకున్నారు.

నీటి ఊట పెరిగి.. కాంక్రీట్ సెగ్మెంట్ ఊడిపోయి..

ఉదయం 8.30 గంటల సమయంలో టన్నెల్‌లో నీటి ఊట పెరిగింది. దీనితో మట్టి వదులుగా మారి.. సొరంగం గోడలకు రక్షణగా ఏర్పాటు చేసిన రాక్‌బోల్ట్, కాంక్రీట్ సెగ్మెంట్లు ఊడిపోయాయి. పైకప్పు నుంచి మట్టి, రాళ్లు కుప్పకూలాయి. ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించడంతో.. టీబీఎం మెషీన్‌కు ఇవతలి వైపున్న 50 మంది వరకు కార్మికులు సొరంగం నుంచి బయటికి పరుగులు తీశారు. మెషీన్‌కు అవతలి వైపున్న 8 మంది మాత్రం మట్టి, రాళ్ల, శిథిలాల వెనుక చిక్కుకుపోయారు. టన్నెల్‌లో సుమారు 200 మీటర్ల వరకు పైకప్పు శిథిలాలు కూలినట్టు సమాచారం.

వేగంగా సహాయక చర్యలు చేపట్టినా...: సొరంగం పైకప్పు కూలిన విషయం తెలిసిన వెంటనే.. లోపల చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. పైకప్పు కూలిపడటంతో జనరేటర్ వైర్లు తెగిపోవడంతో సొరంగం మొత్తం అంధకారం ఆవహించింది. పైగా 14 కిలోమీటర్ల లోపల ఘటన జరగడం, నీటి ఊట ఉధృతి పెరగడం, శిథిలాలు, బురదతో నిండిపోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఇబ్బందిగా మారింది. ఈ సొరంగానికి ఇన్‌లెట్ తప్ప ఎక్కడా ఆడిట్ టన్నెళ్లు, ఎస్కేప్ టన్నెళ్లు లేవు. దీనితో ఒక్క మార్గం నుంచే లోపలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం సాయంత్రానికి సుమారు 150 మంది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, సింగరేణి రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఆదివారం ఉదయానికి ఆర్మీ బృందాలు సైతం చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొననున్నాయి.



రంగంలోకి దిగిన విపత్తు సహాయక బృందం

ఘటనా స్థలికి చేరుకున్న మంత్రులు

సొరంగం ప్రమాదం విషయం తెలిసిన వెంటనే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. సహాయక చర్యలను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు క్షేత్రస్థాయిలో రెస్క్యూ ఆపరేషన్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కిషన్‌రెడ్డి ఫోన్

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. ఎన్డీఆర్ఎఫ్ బలగాలను పంపించాలని, కేంద్రం నుంచి అన్నిరకాల సహాయం అందించాలని కోరారు. అమిత్ షా సానుకూలంగా స్పందించారని.. హైదరాబాద్ నుంచి ఒకటి, విజయవాడ నుంచి 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ప్రమాద స్థలానికి పంపారని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇక సొరంగం ప్రమాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

శరవేగంగా సహాయక చర్యలు: సీఎం రేవంత్



సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, అగ్నిమాపక, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అక్కడి పరిస్థితిని తనకు తెలియజేయాలని స్పష్టం చేశారు. ఇక ఈ అంశంపై శనివారం రాత్రి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్షించారు. ప్రమాదం ఘటన, సహాయక చర్యల పరిస్థితి, ఇతర అంశాలను సీఎంకు మంత్రి ఉత్తమ్ వివరించారు.

పూర్తి సహకారం అందిస్తాం: ప్రధాని మోదీ



ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు పూర్తి సహకారం అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి ప్రమాదంపై ఆరా తీశారు. సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టామని సీఎం రేవంత్ వివరించారు. దీనితో కేంద్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని, సహాయక చర్యల కోసం సత్వరమే ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తామని మోదీ హామీ ఇచ్చారు.

అందరినీ కాపాడుతాం

ఎన్డీఎంఏ, ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్: మంత్రి ఉత్తమ్

ఘటనపై బీఆర్ఎస్ అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపాటు



ఘటనా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారిలో జేపీ అసోసియేట్స్ కంపెనీకి చెందిన ఇద్దరు ఇంజనీర్లు, జార్ఖండ్‌కు చెందిన నలుగురు కూలీలు, మరో ఇద్దరు అమెరికన్ కంపెనీ రాబిన్స్ ఉద్యోగులు ఉన్నారని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వారందరినీ కాపాడుతామని చెప్పారు. సీఎం రేవంత్‌తో సమీక్ష అనంతరం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షణలో ఎన్డీఎంఏ, ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక యంత్రాల సాయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. సొరంగంలో నీటిని, బురదను తొలగించే పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈ సొరంగం తవ్వకాన్ని పర్యవేక్షిస్తున్న రాబిన్స్ కంపెనీ.. ఇప్పటికే వివిధ దేశాల్లో 3 వేల కిలోమీటర్లకు పైగా సొరంగాలను తవ్విందని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తయితే మూడు, నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.

బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం...

సొరంగం కూలిన ఘటనపై బీఆర్ఎస్ అబద్ధాలను ప్రచారం చేస్తోందని ఉత్తమ్ ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో సొరంగంలో సీపేజీ జరిగిందని, అప్పుడు నీటి తొలగింపు (డీవాటరింగ్) కోసం రూ.29 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం ప్రమాదంలో 8 మంది చనిపోతే ఎవరూ అక్కడికి వెళ్లిన పాపాన పోలేదని విమర్శించారు. అప్పుడు ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో అరెస్టు చేశారని పేర్కొన్నారు. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో ప్రమాదం జరిగితే.. తాను హుటాహుటిన బయలుదేరి 11 గంటల కల్లా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించానని వెల్లడించారు. అవాంతరాలన్నీ అధిగమించి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.

టన్నెల్ ప్రమాదానికి బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిదే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి పూర్తి బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. టన్నెల్ పైకప్పు కూలిన ఘటనలో లోపల చిక్కుకొని ఉన్నవారిని క్షేమంగా బయటకు తీసుకురావాలని, దీని కోసం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని శనివారం 'ఎక్స్'వేదికగా ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో పెద్ద దుర్ఘటన జరగడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక బరాజ్‌లో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు, తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఈ వరుస వైఫల్యాలపై ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, కమీషన్ల వేటలో పర్యవేక్షణను గాలికొదిలేశారని, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడిపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. టన్నెల్ ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా రైతులు అప్పులు చేసి బోర్లు వేయొద్దని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఎక్స్‌లో మరో పోస్ట్ పెట్టారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ముందుచూపు లేని ముఖ్యమంత్రితో వచ్చిందని ధ్వజమెత్తారు.

క్లుప్తంగా...

ఏం చేశారని మీకు ఓటేయాలి?

- సీఎంను ప్రశ్నించిన కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను పరిష్కరించని కాంగ్రెస్ పార్టీకి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటెందుకు వేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి.. ముక్కు నేలకు రాసి పట్టభద్రుల ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. లక్ష్మణ్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అడ్డుకట్ట వేయకపోతే.. తెలంగాణ భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేకు ముడిపెట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా ముస్లింలను బీసీలలో చేర్చాలనేది కాంగ్రెస్ కుట్ర అని లక్ష్మణ్ ఆరోపించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సాక్షి, హైదరాబాద్: మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డికి సీపీఐ మద్దతు ప్రకటించింది. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేసిన విజ్ఞప్తితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రాసిన లేఖపై సానుకూలంగా స్పందించినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్‌తో ఉన్న స్నేహ ధర్మం ప్రకారం.. పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ను గెలిపించి, మతతత్వ బీజేపీని ఓడించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా రాష్ట్రాన్ని, ఫెడరల్ స్ఫూర్తిని విస్మరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రుల ఎన్నికల్లో సీపీఎం మద్దతు కాంగ్రెస్‌కే!

- నేడు అధికారికంగా ప్రకటించనున్న ఆ పార్టీ కార్యదర్శి జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ప్రధాన వామపక్ష పార్టీల మద్దతు లభించింది. ఇప్పటికే సీపీఐ తమ మద్దతు ప్రకటించగా, సీపీఎం కూడా కాంగ్రెస్ అభ్యర్థినే బలపర్చాలని నిర్ణయించింది. ఈ స్థానంలో కాంగ్రెస్ పార్టీకి బీజేపీ పోటీ ఇస్తున్న నేపథ్యంలో సైద్ధాంతికంగా రాజకీయ శత్రువుగా భావించే బీజేపీని ఓడించేందుకే వామపక్షాలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించాయి. ఈమేరకు ఆదివారం కరీంనగర్ వెళ్లనున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధికారిక ప్రకటన చేయనున్నారు. మతతత్వ బీజేపీ గెలుపును అడ్డుకునే వ్యూహంలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించాలని పార్టీ కార్యదర్శివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఎం శ్రేణులను జాన్‌వెస్లీ కోరనున్నారు. వామపక్షాలతో పాటు టీజేఎస్ కూడా కాంగ్రెస్ అభ్యర్థికే మద్దతు ప్రకటించడం గమనార్హం.

రైతులపై మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఓటమి తరువాత తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టడం కేటీఆర్ కుటుంబానికి అలవాటేనని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు రైతును ఆదుకోవలసింది పోయి.. రాజకీయం చేయాలని భావించడం సిగ్గుచేటని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కేటీఆర్ వ్యాఖ్యలను వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. అధికారంలో ఉండగా భూరికార్డుల సవరణ పేరుతో ధరణిని తెచ్చి.. ఐటీ మంత్రిగా రైతుల భూ వివరాలు, ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా నంబర్లను విదేశీ సంస్థకు ఇచ్చింది కేటీఆర్ అని ధ్వజమెత్తారు. కేసీఆర్ రెవెన్యూ మంత్రిగా ఉంటూ.. 30 లక్షల ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టి.. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న రైతుల భూ హక్కులను రద్దు చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ దశలోనే నిపుణులంతా వ్యతిరేకించినా.. అనుమతులు లేకుండా ఆదరాబాదరగా నిర్మించి ప్రాజెక్ట్ కూలిపోవడానికి కారకులయ్యారని ధ్వజమెత్తారు.

హీరోలా ఎగిరే జీరో..

- సరికొత్త ఫ్యూచర్ కారు 'మోడల్ జీరో'ను అభివృద్ధి చేస్తున్న అమెరికా సంస్థ
- నిట్టనిలువుగా టేకాఫ్ అయి ఎగురుతూ వెళ్లగలగడం ప్రత్యేకత
- కాలిఫోర్నియాలో ఓ రోడ్డుపై చేపట్టిన ప్రయోగం విజయవంతం
- ఇప్పటికే ప్రీ బుకింగ్‌లు మొదలు.. ధర రూ. 2.57 కోట్లు
- భవిష్యత్తులో ఉత్పత్తి పెంచి రూ. 27 లక్షలకే అందిస్తామంటున్న అలెఫ్ ఏరోనాటిక్స్





ట్రాఫిక్‌జామ్‌లకు భయపడి కారును బయటకు తీయాలంటేనే భయపడుతున్నారా? అయితే మీలాంటి వారి కోసమే ఓ ఎగిరే కారు సిద్ధమవుతోంది. అమెరికాకు చెందిన అలెఫ్ ఏరోనాటిక్స్ అనే ఆటోమోటివ్, ఏవియేషన్ సంస్థ సరికొత్త ఫ్యూచర్ కారును అభివృద్ధి చేస్తోంది. రోడ్డుపై రయ్యిమని దూసుకెళ్లగలగడంతోపాటు అవసరమైనప్పుడు అమాంతం పైకి ఎగిరి వెళ్లగల కారును సిద్ధం చేస్తోంది. తాజాగా మోడల్ జీరో అనే కారును ప్రయోగాత్మకంగా కాలిఫోర్నియాలోని ఓ రోడ్డుపై విజయవంతంగా పరీక్షించింది. అందుకు సంబంధించిన వీడియోను సంస్థ నెటిజన్లతో పంచుకుంది. ఆ వీడియోలో మోడల్ జీరో కారు రోడ్డుపై కాస్త దూరం ప్రయాణించి ఆపై నిట్టనిలువుగా టేకాఫ్ అయి ముందున్న కారు పైనుంచి ఎగురుతూ ముందుకు సాగింది. అనంతరం మళ్లీ రోడ్డుపై దిగి ముందుకు కదిలింది.

-సాక్షి, సెంట్రల్ డెస్క్

ఎలా సాధ్యమైంది?

సాధారణ కార్లలో బానెట్‌లో ఇంజన్ ఉంటే మోడల్ జీరో కారులో మాత్రం నాలుగు చిన్న ఇంజన్లను వాటి చక్రాల వద్ద కంపెనీ అమర్చింది. వాటి సాయంతో సాధారణ ఎలక్ట్రిక్ కారులాగానే ఈ కారు రోడ్డుపై దుసుకెళ్తోంది. ఇక ఖాళీగా ఉన్న బానెట్, డిక్కీలలో మొత్తం ఎనిమిది ప్రొపెల్లర్లను సంస్థ ఏర్పాటు చేసింది. వేర్వేరు వేగములతో వేటికవే విడివిడిగా పరిభ్రమించగలగడం ఈ ప్రొపెల్లర్ల ప్రత్యేకత. ఫలితంగా కారు ఏ దిశలో అయినా ఎగరడం సాధ్యం అవుతోంది. ఇందుకోసం డిస్ట్రిబ్యూటెడ్ ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ టెక్నాలజీని కంపెనీ ఉపయోగించింది. కారు ఫ్రేమ్ కోసం కార్బన్ ఫైబర్ వాడటంతో బరువు 385 కిలోలకే పరిమితమైంది. ప్రస్తుత నమూనా గాల్లో సుమారు 177 కి.మీ. దూరం ప్రయాణించగలదని.. రోడ్డుపై మాత్రం 56 కి.మీ. దూరం వెళ్లగలదని అలెఫ్ ఏరోనాటిక్స్ వివరించింది. రెండు సీట్లుగల మోడల్ ఏ రకం కారు రోడ్డుపై సుమారు 320 కి.మీ. దూరం ప్రయాణించగలదని.. గాల్లో 177 కి.మీ. దూరం వెళ్లగలదని తెలిపింది.

ఫ్లయింగ్ కార్లకన్నా భిన్నమైనది..

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే అభివృద్ధి దశలో ఉన్న ఫ్లయింగ్ కార్లకన్నా తాము రూపొందిస్తున్న కారు భిన్నమైనదని అలెఫ్ ఏరోనాటిక్స్ తెలిపింది. ఈవీటాల్ ఫ్లయింగ్ ట్యాక్సీల వంటి కార్లు టేకాఫ్ కోసం రోడ్డును రన్‌వేలాగా ఉపయోగిస్తాయని.. కానీ తాము అభివృద్ధి చేస్తున్న కారు మాత్రం రోడ్డుపై నిట్టనిలువుగా టేకాఫ్ తీసుకోగలదని పేర్కొంది. సాధారణ ప్రజలు ఈ కారును వాడటం ఎంతో సులువని.. కేవలం 15 నిమిషాల్లో కారులోని కంట్రోల్స్‌పై పట్టు సాధించొచ్చని కంపెనీ సీఈఓ జిమ్ డకోవ్నీ పేర్కొన్నారు. 'రైట్ బ్రదర్స్ విమాన వీడియో తరహాలో మా కారు ప్రయోగ వీడియో మానవాళికి సరికొత్త రవాణా సాధ్యమని నిరూపిస్తుందని భావిస్తున్నా'అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ధర ఎక్కువే..

మోడల్ ఏ రకం కారుపై కంపెనీ ఇప్పటికే ప్రీ ఆర్డర్లు తీసుకుంటోంది. రోల్స్ రాయిస్, బెంట్లీ, ఆస్టన్ మార్టిన్ వంటి లగ్జరీ కార్ల తరహాలోనే ఈ కారు ధరను సుమారు రూ. 2.57 కోట్లుగా కంపెనీ ఖరారు చేసింది. అయితే భవిష్యత్తులో భారీ స్థాయిలో ఉత్పత్తి చేపట్టి సామాన్యులకు అందుబాటు ధరలో ఉండేలా సుమారు రూ. 27.35 లక్షలకు కారును అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

ఎక్కడ తప్పు జరిగిందో నిరూపించండి



శనివారం ప్రజా భవన్‌లో జరిగిన బీసీ నేతల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తోపాటు పలువురు బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమగ్ర సర్వే, బీసీ జనాభా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

కేసీఆర్ ఎన్నికల కోసం వాడుకున్నారు

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన మాటకు కట్టుబడి సర్వే చేపట్టాం. అన్ని రంగాల్లో బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన చేయాల్సిందే. కేసీఆర్ చేసిన సకలజనుల సర్వే తప్పుల తడకగా ఉన్నందునే ఆ లెక్కలను బయటపెట్టలేదు. వాటిని ఆయన ఎన్నికల కోసం వాడుకున్నారు.. ప్రజల కోసం వాడలేదు. ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్వే ప్రక్రియ చేపట్టింది. ఇంటింటికి ఎన్యుమరేటర్లు వెళ్లి సమాచారం సేకరించారు. ఆ సమాచారాన్ని తప్పులు దొర్లకుండా ఎన్యుమరేటర్ సమక్షంలో కంప్యూటరీకరించారు. తప్పులు జరిగాయని మాట్లాడుతున్న వారు ఎక్కడ తప్పు జరిగిందో నిరూపించాలి. అర్థంలేని ఆరోపణలు పట్టించుకోవాల్సిన పనిలేదు. కేసీఆర్ చేసిన సర్వే ప్రకారం బీసీలు 51 శాతం ఉంటే.. సమగ్ర ఇంటింటి సర్వే ప్రకారం బీసీ జనాభా 56.33 శాతం ఉంది. బీసీల లెక్క తగ్గిందా? పెరిగిందా? అనే విషయాన్ని బీసీలు గమనించాలి' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

ఒకట్రెండు ఆధిపత్యవర్గాల కోసం...

జనగణనలో కులగణన చేపట్టాలనే డిమాండ్ ఎప్పట్నుంచో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'స్వతంత్ర భారత దేశంలో ఇప్పటివరకు కులగణన చేపట్టలేదు. ఒక్కసారి బీసీల లెక్క తెలిస్తే వాటా అడుగుతారనే ఆందోళనతో కొందరు కుట్ర చేస్తున్నారు. ప్రధానంగా బీజేపీలోని ఒకట్రెండు ఆధిపత్యకులాల కుట్రల వల్లే ఈ ప్రక్రియ జరగడంలేదు. ఎంతోకాలంగా ఉన్న డిమాండ్‌ను మనం విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం. దేశంలో కులగణన చేపట్టడం ఇష్టంలేకనే బీజేపీ కులగణనపై తప్పుడు ప్రచారం చేస్తోంది. బీజేపీకి నేను విసిరే సవాల్ ఒక్కటే. జనగణనలో కులగణన చేర్చాలి. అప్పుడే ఎవరి లెక్క ఏంటో తేలుతుంది. జనగణనలో కులగణన చేర్చాలని ఈ సమావేశం వేదికగా తీర్మానం చేస్తున్నాం. సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి మార్చి 10లోగా తీర్మానాలు చేయండి. బీసీలు ఐకమత్యాన్ని చాటాలి. అప్పుడే రాజకీయంగా, విద్య, ఉద్యోగాల పరంగా ప్రయోజనం ఉంటుంది. బలహీన వర్గాలకు కులగణన నివేదికనే బైబిల్, భగవద్గీత, ఖురాన్. భవిష్యత్‌లో దేశంలో బీసీ రిజర్వేషన్ల గురించి చర్చించాలంటే తెలంగాణ గురించి, రేవంత్ రెడ్డి గురించి చర్చించుకునే పరిస్థితి ఉంటుంది. మోదీ రాజకీయంగా వ్యతిరేకత ఎదుర్కోనాల్సి వస్తుందనే ఈ ప్రక్రియను తప్పుబడుతున్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఉద్యోగాలు పోతాయనే భయంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సర్వే ప్రక్రియ పూర్తి చేయడంతో నా బాధ్యత పూర్తయింది. దీన్ని పట్టాలెక్కించి గమ్యం చేర్చే వరకు ముందుకు తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదే. తప్పుడు మాటలు మాట్లాడటం కాదు.. ఏ బ్లాక్‌లో, ఏ ఇంట్లో తప్పు జరిగిందో నిరూపించాలని కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి సవాల్ విసురుతున్నా' అని రేవంత్ పేర్కొన్నారు.

2011 జనగణనలో ఎస్సీ, ఎస్టీ వివరాలే వెల్లడించారు: భట్టి

చివరగా జరిగిన 2011 జనగణనలో కేవలం ఎస్సీ, ఎస్టీల వివరాలు మాత్రమే బయట పెట్టారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరించారు. దేశంలో తెలంగాణ ప్రభుత్వం మినహా ఇప్పటివరకు బీసీ జనగణనను శాస్త్రీయంగా తేల్చలేదు. కేసీఆర్ చేసిన సకలజనుల సర్వే అధికారికం కాదని, దానిని కేబినెట్లో పెట్టలేదని, శాసనసభలో చర్చ జరపలేదని, అందుకే అది చెల్లుబాటు కాదన్నారు. దేశంలో మొదటిసారి బీసీ జనాభాను అధికారికంగా లెక్క తేల్చి ముద్ర వేశామని, దీనిని ఆయా వర్గాల ప్రయోజనం కోసం ఎలా ముందుకు తీసుకెళ్లాలో బీసీ ప్రజా ప్రతినిధులు, సంఘాలు ఆలోచన చేయాలన్నారు. బీసీ సర్వే అధికారికంగా జరగడంతో బీఆర్ఎస్‌కు నష్టం కలుగుతుందని, అందుకే సర్వే బాగాలేదని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో బీసీ సర్వే విజయవంతమైతే దేశవ్యాప్తంగా చేయాల్సి వస్తుందని, అందుకే బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కులగణనతో తెలంగాణలో సరికొత్త అధ్యాయం మొదలైందన్నారు. కులగణన సర్వేతో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా మారిందని చెప్పారు. బీసీలకు సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఎవరెంతో చెప్పలేదు!

- బీసీల భేటీలో సొంత పార్టీ నేతలకూ కులాల లెక్కలు చెప్పని ప్రభుత్వం
- కులం పేర్ల ప్రస్తావన విషయంలో వీహెచ్, అంజన్‌కుమార్ మధ్య వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన జరిగినా.. బీసీల్లో ఏ కులం జనాభా ఎంత ఉందో ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదనే చర్చ జరుగుతోంది. కులగణనపై భవిష్యత్ కార్యాచరణ కోసం నిర్వహించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బీసీ నేతల సమావేశంలోనూ ఈ కులాల లెక్కలు చెప్పకపోవడం గమనార్హం. బీసీలకు స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఏ కులం జనాభా ఎంత ఉందో... ఎవరి వాటా ఎంతో ఈ సమావేశంలో చెప్తారని బీసీ నేతలు భావించారు. కానీ, శనివారం ప్రజాభవన్ వేదికగా జరిగిన సమావేశంలో సీఎం, డిప్యూటీసీఎం, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు... ఇలా అందరూ కేవలం ఉపన్యాసాలు మాత్రమే ఇచ్చారు కానీ, ఏ కులం జనాభా ఎంత ఉందన్న దానిపై సొంత పార్టీ నేతలకు కూడా స్పష్టత ఇవ్వలేదని అంటున్నారు. ఇక, సమావేశంలో భాగంగా కులాల పేర్లు ప్రస్తావించే విషయంలో మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, ఎం.అంజన్‌కుమార్ యాదవ్ మధ్య వాగ్వాదం జరిగింది. వీహెచ్ మాట్లాడే సమయంలో తమ కులం పేరు ప్రస్తావించలేదంటూ అంజన్ కుమార్ అభ్యంతరం చెప్పడం, దీనికి స్పందించిన వీహెచ్.. అంజన్ కుటుంబానికి ఎంపీ సీటు ఇచ్చారు కదా అని వ్యాఖ్యానించడం, తమకేమీ ఊరికే ఇవ్వలేదని, త్యాగాలు చేస్తే ఇచ్చారంటూ అంజన్ కౌంటర్ ఇవ్వడంతో కాసేపు సమావేశంలో నవ్వులు విరిసినట్టు తెలిసింది. ఈ సమావేశంలో ఎంబీసీ వర్గాలకు చెందిన ఆరుగురికి మాట్లాడే అవకాశం ఇచ్చారు.

కట్టు కట్టడాలూ.. ఇంజెక్షన్లు చేయడాలూ ఆన్‌లైన్‌లోనే..

▶ మొదటి పేజీ తరువాయి

వార్డెన్లతో పాటు హౌస్‌కీపింగ్ స్టాఫ్ వంటి మానవ వనరులు కూడా ప్రభుత్వం సమకూర్చకపోవడంతో టీచింగ్ స్టాఫ్ ఆన్‌లైన్‌లో బోధన చేస్తున్నారు.

కొన్ని జిల్లాల్లో తాత్కాలిక స్టాఫ్

ఏడు కొత్త నర్సింగ్ కళాశాలల్లో ప్రస్తుతం తరగతి గది బోధన సాగుతోంది. నారాయణపేటలో ఇటీవల సీఎం పర్యటన సందర్భంగా తాత్కాలిక స్టాఫ్‌ను నియమించి, ఆఫ్‌లైన్ తరగతులు కొనసాగిస్తున్నారు. కొడంగల్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, రామగుండం, జనగామలోని కళాశాలల్లో మెడికల్ కాలేజీలు, జిల్లా కలెక్టర్లు, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్లు సమకూర్చిన తాత్కాలిక స్టాఫ్‌తో ఆఫ్‌లైన్ తరగతులను ప్రారంభించారు.

కళాశాలలు ఒకచోట.. హాస్టళ్లు మరోచోట..

హడావుడిగా నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేసినప్పటికీ, కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. తాత్కాలిక పద్ధతిలో కళాశాలలు ఒకచోట ఉంటే, హాస్టళ్లను మరోచోట ఏర్పాటు చేశారు. కాలేజీలు, హాస్టళ్లకు సంబంధం లేకుండా జిల్లా ఆసుపత్రులు ఇంకో చోట ఉన్నాయి. ప్రత్యక్ష బోధన సాగుతున్న ఏడు కళాశాలల్లో కూడా కాలేజీ, హాస్టల్‌కు మధ్య దూరం చాలా ఉండడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. డీఎంఈ కార్యాలయం టీచింగ్ స్టాఫ్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్‌ను తాత్కాలికంగా అడ్జస్టు చేయడమే తప్ప విద్యార్థులు, ఫ్యాకల్టీ గురించి పట్టించుకోలేదు. ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి, ఆందోల్ వంటి ప్రాంతాల్లో ఫ్యాకల్టీ స్థానికంగా నివాసం ఉండే పరిస్థితులు కూడా లేవు. విధులు నిర్వహించేందుకు కూడా భయపడే పరిస్థితి. వరంగల్, మంచిర్యాల నుంచి ఫ్యాకల్టీ ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్ వెళ్లి వచ్చేందుకు రవాణా సౌకర్యం కూడా సరిగా లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతం.

విద్యార్థులు కూడా అంతంతే

సాధారణంగా బీఎస్సీ నర్సింగ్‌కు డిమాండ్ ఎక్కువే. ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో చేరనివారు నర్సింగ్ విద్య వైపు మొగ్గు చూపుతారు. అయితే, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో సౌకర్యాలు లేకపోవటంతో వాటిల్లో చేరేందుకు విద్యార్థినులు ఇష్టపడటంలేదు. ప్రతి కాలేజీకి 60 సీట్లు కేటాయించగా.. ఆసిఫాబాద్‌లో 39 మంది విద్యార్థులే చేరారు. భూపాలపల్లిలో 45 మంది, ములుగులో 56 మంది ప్రవేశం పొందారు. కాలేజీల సొంత భవనాల నిర్మాణానికి ప్రతి జిల్లాకు రూ.26 కోట్లు కేటాయించినప్పటికీ.. నారాయణపేట, కొడంగల్ వంటి కొన్ని ప్రాంతాల్లో మాత్రమే స్థల సేకరణ పూర్తయి నిర్మాణాలకు శంకుస్థాపనలు జరిగాయి. అన్ని జిల్లాల్లో కాలేజీ, హాస్టల్ జిల్లా ఆసుపత్రికి సమీపంలో వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని విద్యార్థినులు, అధ్యాపకులు కోరుతున్నారు.

14,236 అంగన్‌వాడీ కొలువులు

▶ మొదటి పేజీ తరువాయి

పోస్టులు ఖాళీగా ఉండగా వాటిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 6,399, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు 7,837 ఖాళీగా ఉన్నట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ లెక్కగట్టింది.

'కోడ్' ముగిశాక నియామక ప్రక్రియ...

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,700 అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ప్రీ ప్రైమరీ విద్యను కూడా అందుబాటులోకి తీసుకొస్తోంది. అయితే అంగన్‌వాడీల్లో ఖాళీలుంటే నిర్దేశించుకున్న లక్ష్యాల అమలు కష్టసాధ్యం అవుతుందన్న ఉద్దేశంతో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖకు సూచించింది. దీంతో పదవీ విరమణకు అర్హత సాధించిన వారు, పదోన్నతికి అర్హత ఉన్న వారితోపాటు కేటగిరీలవారీగా ఖాళీలను లెక్కించి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ప్రస్తుతం ఏడు ఉమ్మడి జిల్లాల పరిధిలో అమల్లో ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి వచ్చే నెల తొలివారం వరకు కొనసాగనుంది. దీంతో కోడ్ ముగిశాక నియామక నోటిఫికేషన్లు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలవారీగా ఖాళీలను ఖరారు చేశాక వాటిని ఆయా జిల్లా కలెక్టర్లకు పంపేలా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపట్టనుంది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడతాయి. గతంలో ఈ పోస్టులను భర్తీ చేసినప్పటికీ వేల సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే తొలిసారి.



ద్రవ్యము నీయొద్ద నుండగా రేపు ఇచ్చెదను పోయి రమ్మని నీ పొరుగువానితో అనవద్దు.
– క్రైస్తవ ధర్మం

ఇది కుట్రపూరిత నిర్లక్ష్యం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



కాలం కలిసొస్తే కొందరికి అధికారం సంప్రాప్తించవచ్చు. అదృష్టం ఈడ్చితంతే కొందరు సరాసరి సింహాసనం మీదనే కూలబడవచ్చు. నక్కజిత్తులతో, తోడేలు వంచనతో, వెన్నుపోటుతో, మోసపు మాటలతో మరికొందరు 'పవర్'ఫుల్‌గా మారిపోవచ్చు. కానీ వారందరూ ప్రజానాయకులు కాలేరు. అసలు నాయకుడంటే ఎవరు? అతనెట్లా ఉండాలి?... నమ్మకానికి నిలువెత్తు ప్రతిరూపంలా ఉండాలి. ఆడిన మాట మీద నిలబడే వాడై ఉండాలి. మడమ తిప్పని వాడై ఉండాలి. నిరంతరం జనం గుండె చప్పుళ్లను వినగలిగే విద్యాపారంగతుడై ఉండాలి. సకల జనుల శ్రేయస్సు కోసం పరితపించే తాపసిగా ఉండాలి. అటువంటి ప్రజా నాయకుడికి అధికార హోదాలను మించిన గౌరవం ఉంటుంది. జనం గుండెల్లో కొలువుండే అత్యున్నత హోదా ఉంటుంది.

ఆ నాయకుడు వీధుల్లోకి వస్తే జనవాహిని అతని వెంట ప్రవహిస్తుంది. ఆబాలగోపాలం ఆనందోద్వేగాలతో హోరెత్తుతుంది. అది గిరిజన ప్రాంతమా... నగరం నడిబొడ్డా అనే తేడా ఉండదు. అన్ని చోట్లా ఒకటే స్పందన. ఆ నాయకుడు కనిపించగానే జనశ్రేణుల పాదాలు జజ్జినకరె గజ్జల సడి చేయడానికి సిద్ధమవుతాయి. అతడే ప్రజానాయకుడు! ద మాస్ లీడర్! ఇటువంటి మాస్ లీడర్లు ఎందరుంటారు? ఆంధ్రరాష్ట్రం విషయానికి వస్తే అప్పుడెప్పుడో స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రకాశం పంతులు గారిలో ఈ మ్యాజిక్ ఉండేదట. ఆ తర్వాత ఒక ఎన్టీ రామారావు... ఒక వైఎస్ రాజశేఖర రెడ్డి... ఇదిగో ఇప్పుడు ఒక జగన్‌మోహన్‌రెడ్డి. దట్సాల్!

సింహం ఇంకా వేటకు బయల్దేరనే లేదు. అది వెళ్లేదారిలో గోతులు తవ్వడానికీ, మందుపాతర్లు పెట్టే వ్యూహం పన్నడానికీ తోడేలు మందలు, నక్కల గుంపులు సమావేశమవుతున్నాయట. అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇంకా విస్తృత జనయాత్రలకు శ్రీకారం చుట్టనేలేదు. గద్దెనెక్కిన వారు ఏడాది పండుగ జరుపుకొనేదాకా ఊపిరిపీల్చుకునే అవకాశం ఇవ్వడానికి ఈ తాత్సారం కావచ్చు. ఇప్పుడు అడపాదడపా పర్యటనలు మాత్రమే జరుగుతున్నాయి. కష్టాల్లో ఉన్న ప్రజాశ్రేణులను కలవడానికీ, నిర్బంధాలకు గురవుతున్న కార్యకర్తలకూ, నేతలకూ అండగా నిలవడానికీ మాత్రమే ఈ పర్యటనలు పరిమితం. గడిచిన వారం ఇటువంటి మూడు యాత్రలు జరిగాయి.

రెడ్‌బుక్ స్కీము కింద అరెస్టయిన సహచరుడు వంశీని కలవడానికి జగన్ విజయవాడ జైలుకు వెళ్లారు. దగా పడుతున్న రైతన్నకు దన్నుగా గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లారు. కన్నుమూసిన పార్టీ నాయకుని కుటుంబాన్ని పలకరించడానికి పాలకొండకు వెళ్లారు. ప్రదేశం ఏదైనా, సందర్భం ఏదైనా ప్రజాస్పందన సుస్పష్టం. జనప్రభంజనపు అడుగుల చప్పుడు విస్పష్టం. ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఓడిపోయిందని నమ్మడానికి పేదవర్గాల ప్రజలు సిద్ధంగా లేరు. ఏదో 'మాయ' జరిగిందని వారు బలంగా నమ్ముతున్నారు. పేదల అభ్యున్నతి కోసం పని చేసినందుకే బడా బాబులంతా కలిసి కుట్ర చేశారన్న అభిప్రాయం వారి మనసుల్లో బలంగా నాటుకొని పోయింది. ఫలితంగా జగన్‌పై వారికున్న అభిమానం మరింత బలపడుతున్నది.

ప్రజలే ఇవ్వని ప్రతిపక్ష హోదాను తామెట్లా ఇస్తామని ఇటీవలనే ప్రవచించిన ముఖ్యనాయకుడికి ప్రజలు మూడ్ బాగానే తెలుసు. జగన్‌మోహన్‌రెడ్డి జనంలోకి వెళ్తే పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసు. జనంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డితో తాము తలపడలేమని కూడా తెలుసు. అందుకే ఆయన జనంలోకి రాకూడదని ముఖ్యమంత్రీ, ఆయన శిబిరం భావిస్తుండవచ్చు. ఒక వేళ జనంలోకి వస్తే ఏం చేయాలన్న పథకంపై మొన్నటి పర్యటనల్లో రిహార్సళ్లు, రెక్కీలు జరిగి ఉండవచ్చన్న అనుమానాలు బలపడుతున్నాయి. జడ్ ప్లస్ కేటగిరీ భద్రతా కవచాలలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డికి ఆ స్థాయి భద్రతను కల్పించవలసి ఉన్నది. కానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ఆ సిబ్బందిని భారీగా కుదించినప్పుడే అనుమానాలకు బీజం పడింది.

తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి నివాసం దగ్గర ఉన్న సెక్యూరిటీ టెంట్లనూ, బారికేడ్లనూ, సిబ్బందినీ తొలగించినప్పుడే ప్రభుత్వ పెద్దల దురుద్దేశం బట్టబయలైంది. వినుకొండ పట్టణ నడివీధిలో జరిగిన రెడ్‌బుక్ ఘాతుకానికి బలైన రషీద్ కుటుంబ పరామర్శకు బయల్దేరినప్పుడు కూడా డొక్కు బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కేటాయించి జగన్ భద్రతను ప్రమాదంలోకి నెట్టారు. ఆయన నివాసానికి సమీపంలోనే మంటలు చెలరేగడం భద్రతా వైఫల్యం కాక మరేమంటారు? ప్రొటోకాల్ ప్రకారం జడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉండే నాయకుడు పర్యటనలో ఉన్నప్పుడు రోడ్డు క్లియర్ చేసే టీమ్, కాన్వాయ్, రోప్ పార్టీ, ఎస్కార్ట్ విధిగా ఉండి తీరాలి. కానీ జగన్ పర్యటనల్లో వేళ్ల మీద లెక్కించగలిగేంత మంది కానిస్టేబుళ్లు తప్ప ఇవేమీ కనిపించడం

ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఓడిపోయిందని నమ్మడానికి పేదవర్గాల ప్రజలు సిద్ధంగా లేరు. ఏదో 'మాయ' జరిగిందని వారు బలంగా నమ్ముతున్నారు. పేదల అభ్యున్నతి కోసం పని చేసినందుకే బడా బాబులంతా కలిసి కుట్ర చేశారన్న అభిప్రాయం వారి మనసుల్లో బలంగా నాటుకొని పోయింది.ఫలితంగా జగన్‌పై వారికున్న అభిమానం మరింత బలపడుతున్నది.

ప్రజలే ఇవ్వని ప్రతిపక్ష హోదాను తామెట్లా ఇస్తామని ఇటీవలనే ప్రవచించిన ముఖ్యనాయకుడికి ప్రజలు మూడ్ బాగానే తెలుసు. జగన్‌మోహన్‌రెడ్డి జనంలోకి వెళ్తే పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసు. జనంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డితో తాము తలపడలేమని కూడా తెలుసు. అందుకే ఆయన జనంలోకి రాకూడదని ముఖ్యమంత్రీ, ఆయన శిబిరం భావిస్తుండవచ్చు. ఒక వేళ జనంలోకి వస్తే ఏం చేయాలన్న పథకంపై మొన్నటి పర్యటనల్లో రిహార్సళ్లు, రెక్కీలు జరిగి ఉండవచ్చన్న అనుమానాలు బలపడుతున్నాయి. జడ్ ప్లస్ కేటగిరీ భద్రతా కవచాలలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డికి ఆ స్థాయి భద్రతను కల్పించవలసి ఉన్నది. కానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నాయుడు ఆ సిబ్బందిని భారీగా కుదించినప్పుడే అనుమానాలకు బీజం పడింది.

లేదు.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు భద్రతకు ఎటువంటి లోటూ జరగలేదు. రూల్‌బుక్ స్థానాన్ని రెడ్‌బుక్ ఆక్రమించలేదు. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు చంద్రబాబు తెలంగాణ రాష్ట్రంలోనే స్థిరనివాసం ఉండేవారు. జడ్ ప్లస్ కేటగిరీ కనుక ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రొటోకాల్ ప్రకారం తీసుకోవలసిన భద్రతా చర్యల్ని తీసుకున్నది. అది ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. జగన్ విషయంలో ఈ బాధ్యతను రాష్ట్రప్రభుత్వం విస్మరించడం వెనుక భయంకరమైన కుట్ర ఉండవచ్చనే అనుమానాలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. అవి కేవలం అనుమానాలు మాత్రమే కావని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇది మరింత ఆందోళన కలిగించే విషయం.

జగన్ భద్రత విషయంలో కుట్రపూరితమైన ఆలోచనలు చేయవలసిన అవసరం ప్రభుత్వ పెద్దలకు తప్ప ఇంకెవరికీ లేదు. చంద్రబాబు కూటమి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. తాము అమలు చేయలేమని తెలిసినప్పటికీ అనేక హామీలను గుప్పించి ఓటర్లను వంచించింది. ఇప్పుడా హామీలన్నింటినీ చాప చుట్టేసి అటకెక్కించింది. అంతకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన 'నవరత్న' పథకాలు కూడా ఆగిపోయాయి.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో జగన్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాస్వామికీకరణ కార్యక్రమాన్ని నిలిపి వేసి ప్రైవేట్ దోపిడీకి బాటలు వేస్తున్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసిన గృహనిర్మాణ విప్లవానికి క్లాం వేశారు. 'అమ్మ ఒడి'ని ఆపేశారు. 'చేయూత'ను వదిలేశారు. 'కాపు నేస్తం' కనిపించడం లేదు. ఈ బీసీ నేస్తం పత్తా లేదు. జాతీయ స్థాయిలో బహుళ ప్రశంసలు అందుకున్న వలంటీర్ వ్యవస్థను పూర్తిగా ఎత్తేశారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల గౌరవ వేతనాన్ని రెట్టింపు చేస్తానని ప్రతి ఎన్నికల సభలోనూ బాబు ఘంటాపథంగా చెప్పుకొచ్చారు. అధికారంలోకి రాగానే ఆ వ్యవస్థనే గిరాటేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఇటువంటి పచ్చి మోసాన్ని అనుమతించవచ్చునా? ఇటువంటి మోసగాళ్ల పాలకులు కావడం వాంఛనీయమేనా? ఇదొక్క అంశమే కాదు. అన్ని హామీలకూ ఇదే గతి పట్టింది. వీటిపై ప్రజల్లోనూ, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే వారిలోనూ విస్తృతమైన చర్చ జరగవలసిన అవసరం ఉన్నది.

ప్రజానాయకుడైన జగన్‌మోహన్‌రెడ్డి ఒకసారి రాష్ట్రవ్యాప్త పర్యటనలకు శ్రీకారం చుడితే కూటమి మోసాల గుట్టురట్టవుతుంది. విస్తృత స్థాయిలో చర్చ మొదలవుతుంది. ఈ పరిణామం కూటమి మనుగడకే ప్రమాదం. కనుక జగన్‌మోహన్‌రెడ్డి జనంలోకి రాకూడదు. గతంలోనే ఆయనపై రెండు మార్లు హత్యాప్రయత్నాలు జరిగి ఉన్నాయి గనుక భద్రతా చర్యలను నిలిపివేస్తే ఆయన యాత్రలు ఆగిపోతాయన్న వెర్రి ఆలోచన ఏమైనా ఉండవచ్చు. భద్రతా సిబ్బందిని తొలగించినా, కార్యకర్తలే రోప్ పార్టీగా మారి నడుస్తున్న పరిణామాన్ని చూసిన తర్వాత మరింత తీవ్రమైన వ్యూహాలకు కూటమి సర్కార్ పదును పెట్టే అవకాశం ఉన్నది. ఎందుకంటే జగన్ వంటి ప్రజానాయకుడు రంగంలో ఉండగా తన వారసుడు రాజకీయంగా నిలదొక్కుకోవడం కష్టమనే సంగతి చంద్రబాబుకు స్పష్టంగా తెలుసు. ఆదిలో బాబు నిలదొక్కుకోవడానికి కూడా ఎన్టీఆర్‌ను వెన్నుపోటు ద్వారా రంగం నుంచి తప్పించడానికి ఎటువంటి వ్యూహాలు అమలు చేశారనేది తెలిసిన సంగతే!


రాజశేఖర్‌రెడ్డిని గద్దెదించడానికి కూడా బాబుకూటమి చేయని ప్రయత్నం లేదు. తెలంగాణ రాష్ట్రం కోసమే పుట్టిన ఉద్యమ పార్టీ టీఆర్ఎస్‌నూ, సమైక్య రాష్ట్రానికి కట్టుబడివున్న సీపీఎంనూ ఒక్కచోటకు చేర్చి 'మహాకూటమి'ని కట్టిన సంగతి కూడా తాజా జ్ఞాపకమే! ఆయన మీద ఎంత దుష్ప్రచారం చేసినా, 'మహాకూటమి'ని నిర్మించినా, సంప్రదాయ కాంగ్రెస్ ఓటును చిరంజీవి పార్టీ బలంగా చీల్చినా బాబు ముఠా ప్రయత్నాలు ఫలించలేదు. కాకపోతే దురదృష్టవశాత్తు ఆ మహానేత మరో విధంగా రంగం నుంచి నిష్క్రమించారు.

జగన్‌మోహన్‌రెడ్డి మరో బలమైన మాస్ లీడర్‌గా ఆవిర్భవిస్తారని చంద్రబాబు - యెల్లో మీడియా వారు ఆదిలోనే గుర్తించారు. ఆయన్ను మొగ్గలోనే తుంచేయడానికి చేసిన ప్రయత్నాలను తెలుగు ప్రజలందరూ గమనించారు. గడిచిన పదిహేనేళ్లుగా జగన్ మోహన్ రెడ్డి మీద జరుగుతున్న వ్యక్తిత్వ హనన కార్యక్రమం న భూతో న భవిష్యతి. ప్రపంచ చరిత్రలోనే ఈ స్థాయిలో వ్యక్తిత్వ హనన గోబెల్స్ ప్రచారం ఎవరి మీదా జరిగి ఉండదు. ప్రజానాయకులను దూరం చేసి చంద్రబాబుకు మార్గం సుగమం చేసే కార్యక్రమంలో యెల్లో మీడియా, దాని రింగ్ లీడర్ రామోజీరావు పోషించినది దుర్మార్గమైన పాత్ర. చట్టాన్ని ధిక్కరించి ఫైనాన్షియర్స్ పేరుతో నిధులు పోగేసిన వ్యక్తి రామోజీ. చిట్‌ఫండ్స్ పేరుతో జనం సొమ్మును సొంత వ్యాపారాలకు వాడుకున్న వ్యక్తి రామోజీ. ఒకరికొకరు తోడు నీడగా బాబు–రామోజీలు ముప్పయ్యేళ్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను భ్రష్టు పట్టించారు. అయినా సరే, జనం మాత్రం జగన్ వెంట నిలబడుతున్నారు. ఈ పరిణామం కూటమి నేతలకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలోంచి చూసినప్పుడు జగన్‌కు భద్రత కల్పించడంలో విఫలం కావడమనేది కేవలం పొరపాటు కాదు. వట్టి నిర్లక్ష్యం కాదు. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం, కుట్రపూరిత నిర్లక్ష్యం! ఇటువంటి ధోరణిని ఎండగట్టకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలు మరింత బలహీనపడతాయి.

vardhelli1959@gmail.com

మాట్లాడే స్వేచ్ఛ

అభిప్రాయం



గోపాలకృష్ణ గాంధీ

మీరు ప్రభుత్వం చేసిన ఒక మంచి పనిని మెచ్చుకున్నంత మాత్రాన ప్రభుత్వ అనుకూలవాది కాబోరు. అలాగే అది చేసిన తప్పును విమర్శిస్తే ప్రభుత్వ వ్యతిరేకి అవ్వరు. ప్రధాని నరేంద్ర మోదీ, యూఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో జరిపిన సంప్రదింపులను మెచ్చుకున్న తిరువనంతపురం కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు శశి థరూర్‌ను నేను పూర్తిగా సమర్థిస్తున్నాను. ఉభయ నేతల వాణిజ్య చర్చలను, వాటి ప్రయోజనకర ఫలితాలను... విషయపరంగా మదింపు వేసి ఆయన తన భావాన్ని వ్యక్తీకరించారు. వెనువెంటనే, వేరొక అంశంలో మోదీ వైఖరి పట్ల ఆందోళనా ప్రకటించారు. ఎంత మాత్రం ఆమోదం కాని రీతిలో అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారులైన భారతీయులను వెనక్కు పంపిన (డిపోర్టేషన్) తీరును ట్రంప్ వద్ద ప్రస్తావించారో లేదో... మోదీ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇది థరూర్‌కు నచ్చలేదు. ఆ అసంతృప్తిని ఆయన నిర్మొహమాటంగా వ్యక్తపరిచారు. వాణిజ్య చర్చలకు ప్రశంస, భారతీయుల బహిష్కరణ ప్రక్రియ పట్ల వ్యాకులత... ఈ రెండు వ్యక్తీకరణలూ పర్యవసానాలకు భయపడని, పక్షపాత రహితమైన రాజకీయాలకు ప్రతీకలు.

మెరుగైన జీవితం కోసం భారతీయులు అక్రమంగా అమెరికా వలస పోవటం పట్ల తన అసమ్మతిని కూడా థరూర్ దాచుకోలేదు. ఈ చట్టవ్యతిరేక చర్యను ప్రభుత్వం క్షమించరాదు. వారిని సాటి పౌరులు వెనుకేసుకు రాకూడదు. దీనిపై అమెరికా ప్రభుత్వానికి అభ్యంతరం చెప్పకూడదు. మోదీని ప్రశంసించడంలోనూ, వలస చట్టాల ఉల్లంఘనలను, అమెరికా ప్రభుత్వం అనుసరించిన డిపోర్టేషన్ పద్ధతులను విమర్శించడంలోనూ ఆయన నిజాయితీ కనబడుతుంది. ఇలా మాట్లాడి థరూర్ రిస్కు తీసుకున్నారు. ఒకటి కాదు మూడు రిస్కులు... అవీ ఆషామాషీవి కావు.

మొదటిది – ఆయన మనసులో ఏదో కుటిలపు ఎత్తుగడ ఉందని జనం అనుకునే ప్రమాదం. రాజకీయ వార్తలు ఫాలో అయ్యే ప్రతి భారతీయుడూ ఒక రకమైన రంధ్రాన్వేషణ తత్వం ఒంటబట్టించుకుంటాడు. దీని వెనుక పెద్ద ప్లానే ఉండి ఉంటుంది... ఇదీ అలాంటి వారి నుంచి వచ్చే తక్షణ స్పందన. థరూర్ ఉన్నపళంగా మోదీని ఎందుకు పొగిడారు? 'జాబ్ అప్లికేషనా'? ప్రధాని నుంచి ఏదో ఆశిస్తున్నారు... విదేశంలోనో, స్వదేశంలోనో అత్యున్నత పదవి కోరుకుంటున్నారేమో? ప్రభుత్వ ఏజెన్సీల బెదిరింపుల నుంచి తప్పించుకునే ప్రయత్నమేమో? కనీసంలో కనీసంగా... ప్రధాని దయ కోసం ప్రాకులాట ఏమో! విదేశాంగ మంత్రిని మంచి చేసుకోవాలనా, ఆర్థిక మంత్రితో ఓకే అనిపించుకోవాలా? ఎందుకు పొగడ్తలు కురిపించినట్లు? ఇలాంటి అనుమానాలు సవాలక్ష ఉత్పన్నమవుతాయి.

> ఎంపీలందరికీ వాక్ స్వాతంత్ర్యం ఉంటే? స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తీకరించే ఆ ఎంపీల పట్ల ప్రతి పార్టీకీ సహనం ఉంటే? ప్రజలు తమ రంధ్రాన్వేషణ గుణాన్ని పక్కన పెట్టి వారిలో నిజమైన చేతల ప్రజాస్వామ్యాన్ని చూడగలిగితే? అప్పుడు గణతంత్రం మనకు గర్వ కారణం అవుతుంది.



కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్

రెండోది – పార్టీ కఠిన నిబంధనలను ఉల్లంఘిస్తున్నాడంటూ సొంత పార్టీలోని 'మంచి బాలురు, బాలికలు' ఆగ్రహిస్తారు. ఇక అధికార పార్టీకీ అవకాశం ఇచ్చినట్లూ అవుతుంది. ''చూడండి, కాంగ్రెస్ సీనియర్లు సైతం మన నాయకుడి ఆధిపత్యాన్ని అంగీకరించడానికి ముందుకు వస్తున్నారు'' అనుకోవడానికి ఆయన ఆస్కారం కల్పించారు. అంతే కాదు, ''నిజమైన కాంగ్రెస్' కానటువంటి తన 'నిజ' రూపం బయటపెట్టుకున్నారు' అంటూ ఇతరులు చెవులు కొరుక్కుంటారు. ఆయన డీఎన్ఏ 'అంటు గట్టింది' అనీ, 'వెలుపలి వాడు' అనీ పార్టీ విధేయులు చెప్పుకొంటారు. డీఎన్ఏ అంటే పూర్తి రూపం తెలియని విధేయులు దాన్ని 'డు నాట్ ఎప్రీషియేట్ (ఎనీథింగ్ ఔట్ సైడ్ ద పార్టీ)' అనుకుంటారు. మూడోది – దేశం నుంచి వెనక్కు పంపించి వేయడానికీ, పంపించి వేసే ప్రక్రియకూ మధ్య తేడా విడమరచి... బహిష్కరణల వ్యతిరేకులను ఆయన దూరం పెట్టారు. ఏమైనా, థరూర్ ఆందోళన చెందనక్కర్లేదు. ఆయన తన ప్రసంగంతో మూడు రిస్కులను కొనితెచ్చుకున్నా... భారత ప్రజాస్వామ్యానికి మూడు విశిష్ట సేవలు అందించారు.

మొదటిది– తగిన ప్రశంసలతో పాటు సద్విమర్శలు కూడా చేయడం ద్వారా, తాను వారి వాద్య బృందంతో గొంతు కలిపినట్లు భారతీయ జనతా పార్టీ భ్రమ పడకుండా అడ్డుకోగలిగారు. రెండోది – కాంగ్రెస్ పార్టీలోని భావప్రకటన స్వేచ్ఛపై పార్టీ కమ్యూనికేషన్స్ చీఫ్ జైరాం రమేశ్ ప్రకటనకు అనుగుణంగానే థరూర్ వ్యాఖ్యలు ఉన్నాయి: ''పరిపూర్ణ భావప్రకటన స్వేచ్ఛ, భావ ప్రకటన అనంతర స్వేచ్ఛ ఉన్న రాజకీయ పార్టీ దేశంలో భారత జాతీయ కాంగ్రెస్ ఒక్కటే'' అని జైరాం పేర్కొన్నారు. అంతిమంగా పార్టీ అభిప్రాయమే శిరోధార్యం అయినా, సభ్యులకు వాక్ స్వతంత్రం ఉంటుందని ఆయన సరిగ్గానే చెప్పారు. మూడోది– ఎంతో ముఖ్యమైంది, థరూర్ ప్రకటనను సోషల్ మీడియాలో ఒక వ్యక్తి 'సహీ' అనే ఒక్క మాటతో అభివర్ణించారు. సింపుల్‌గానే ఉన్నా ఇది అర్థవంతమైన గొప్ప హిందీ పదం. ఏ రాజకీయ నాయకుడికైనా సరే హిందీలో ఇది గొప్ప ప్రశంస.

సహీ అంటే నేరుగా ధ్వనించే అర్థం 'సరైనది' (రైట్) అని. కరెక్ట్, నిజం (ట్రూ) అని కూడా ఈ పదానికి అర్థం వస్తుంది. వస్తుగతమైన (ఆబ్జెక్టివ్), న్యాయమైన (ఫెయిర్), భయం లేదా పక్షపాతంతో మలినం కానిదైన ఒక దృక్పథం అని మరింత విస్తృతార్థాన్ని అది సూచిస్తుంది. దురుద్దేశాలు లేని, విలువల్లో సమతుల్యత కలిగిన, పక్షపాతాలకు తావు లేని, వ్యక్తిగత అజెండా లేని అని కూడా భావించాలి. 'మెటా ఏఐ' ప్రకారం, సహీ అనేది పారశీక మూలాలు కలిగిన పదం. ఇది ఎంత వరకు వాస్తవమో తెలీదు. కానీ సంస్కృతంలోని సహ పదానికి దీనికి సంబంధం ఉంది. సహ అంటే సహనం, సహించుట.

జైరాం చెప్పినట్లు... ఎంపీలందరికీ వాక్ స్వాతంత్ర్యం ఉంటే? స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తీకరించే ఆ ఎంపీల పట్ల ప్రతి పార్టీకీ సహనం ఉంటే? ప్రజలు తమ రంధ్రాన్వేషణ గుణాన్ని పక్కన పెట్టి వారిలో నిజమైన చేతల ప్రజాస్వామ్యాన్ని చూడగలిగితే? అప్పుడు గణతంత్రం మనకు గర్వకారణం అవుతుంది. సరే, శశి థరూర్ వ్యాఖ్యల గురించి ఈ ఒక్క మాటతో ముగిస్తాను. ఆయన ప్రశంస, విమర్శ 'సహీ'. ఆయన్ను 'సహీ' అంటున్నారు. ఆయన పొలిటికల్ గ్రాఫ్ గుంతలమయంగా ఉండే వాస్తవిక రాజకీయాల్లో చిక్కుకుపోకుండా 'సహీ'గా దూసుకుపోవాలి. సహీ ఎంపీ మార్గం రాళ్లురప్పలు నిండి అడ్డదిడ్డంగా ఉంటుంది. మనసంతా గమ్యం మీదే పెట్టి ప్రయాణం సాగించాలి. ఆ గమ్యం కూడా సహీగా ఉండాలి.

వ్యాసకర్త ఆధునిక భారత చరిత్ర వ్యాఖ్యాత, పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

కార్మిక హక్కుల సాధనలో...

నూట ఐదు సంవత్సరాల చరిత్రగల సింగరేణిలో ఎర్రజెండా నూరేళ్లుగా రెపరెపలాడుతోంది. ఎంతో మంది అమరుల త్యాగాలతో మరింత సమున్నతంగా దాన్ని ఎగరేస్తూ 2025, ఫిబ్రవరి 23న గోదావరిఖనిలో 'అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం జరుగుతుంది. భారత కార్మిక వర్గం ఆశాజ్యోతిగా 1978లో గౌహతిలో పుట్టి పెరిగిన ఇఫ్టూ 1993లో 'వర్కర్స్ సాలిడారిటీ'తో ఐక్యమై బొంబాయి మహానగరంలో ఏఐఎఫ్‌టీయూగా ఆవిర్భవించింది. ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఈ సంస్థ రాష్ట్ర మహాసభలు జరిగాయి. అప్పటి నుంచి సింగరేణి, బీడీ, భవన నిర్మాణ, రవాణా తదితర రంగాల్లో తన పనిని సమీక్షించుకుని నూతన కర్తవ్యాలను రచించుకుంటోంది.

కాంట్రాక్టు కార్మిక వ్యవస్థ ద్వారా కార్మిక హక్కులను హరిస్తూ... నిలువు దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్లపై పోరాటాలను తీవ్రం చేద్దాం. భారత ప్రజల సంపూర్ణ విముక్తికి కార్మిక–కర్షక ఐక్యత సాధిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవమే శరణ్యమని చాటిచెబుదాం. రైతులే అధికంగా ఉన్న మనదేశంలో దున్నేవారికే భూమి లభించి, విదేశీ సామ్రాజ్యవాద దోపిడీని అరికట్టి, దళారీ–పెట్టుబడిదారుల స్థానంలో స్వతంత్ర పారిశ్రామిక విధానం కోసం ... నిజమైన దేశభక్తియుత ప్రజాస్వామ్య విప్లవ కార్మికోద్యమం లక్ష్యంగా ఏఐఎఫ్‌టీయూ పోరాడుతుంది.

చీలికలూ, పేలికలతో వెనకపడిపోతూ... నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించాల్సిన భారత కార్మిక వర్గం చాలా వెనుకబడి ఉంది. దీనిని అధిగమిస్తూ విప్లవ కార్మిక సంఘాల ఐక్యతకు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ తన వంతు కృషిని కొనసాగిస్తుంది.

– అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, తెలంగాణ
(నేడు ఏఐఎఫ్‌టీయూ జనరల్ కౌన్సిల్ సమావేశం)

మల్లికార్జున్ ఖర్గే (ఏఐసీసీ ప్రెసిడెంట్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇందిరా భవన్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కూర్చొని ఉన్నాం అందరం. అంతా ఆలిండియా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీలు, స్టేట్ ఇంఛార్జిలు, కొత్త సీడబ్ల్యూసీ సభ్యులు, పార్టీలోని ఇతర మహామహులు.

'చెప్పండి' అన్నట్లు వారి వైపు చూశాను. ఎప్పటిలా, 'మీరే చెప్పండి ఖర్గేజీ' అన్నట్లేమీ వారు నా వైపు చూడలేదు. ఎవరి వైపు వాళ్లు చూసుకుంటూ ఉన్నారు! బహుశా అది ఆత్మ పరిశీలనావస్థ కావచ్చు.

పార్టీ లీడర్ రాహుల్, జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ నా పక్కనే ఇటొకరు, అటొకరు కూర్చొని ఉన్నారు.

"ఎవరైనా హ్యాట్రిక్ కొట్టి హీరోలు అవుతారు. మనం 'జీరో'లు కొట్టి హ్యాట్రిక్ సాధించాం!" అన్నాను అందర్నీ యాక్టివేషన్ మోడ్‌లోకి తీసుకొస్తూ.

వెంటనే రాహుల్ స్పందించారు. "ఖర్గేజీ, ఐపీఎల్‌లో ఆర్సీబీ ఎంత గొప్పగా ఆడుతుందో మీకూ తెలుసు. కానీ ఒక్కసారైనా ఆ జట్టు గెలిచిందా?" అన్నారు మెల్లగా నా చెవిలో.

ఆర్సీబీ జట్టుది కర్ణాటకే, కాంగ్రెస్ అధ్యక్షుడిదీ కర్ణాటకే అనే భావన నాలో కలిగించటం ద్వారా ఆయన నాకు ఊరటనివ్వ దలిచారా!

"గొప్పగా ఆడటం గెలుపౌతుందా రాహుల్ బాబు. గెలిస్తేనే కదా గొప్పగా ఆడినట్లౌతుంది" అన్నాను రాహుల్ చెవిలో.

ఇలా చెవుల్లో మాట్లాడుకునే సంప్రదాయం కాంగ్రెస్‌లో గాంధీ, నెహ్రూ, పటేల్‌ల కాలం నుంచే ఉన్నా, నలుగురి ముందు చెవుల్లో చెవులు పెట్టటం



నాకు ఇష్టం ఉండదు. రాహుల్ నా చెవిలో మాట్లాడారు కాబట్టి ఆయన్ని రెస్పెక్ట్ చెయ్యటం కోసం నేనూ ఆయన చెవిలో మాట్లాడానంతే.

"అంకుల్..." అని చెయ్యి లేపారు ప్రియాంక.

"చెప్పమ్మా ప్రియాంకా..." అన్నాను.

"అంకుల్... మనమూ కొట్టాం కదా హ్యాట్రిక్. షీలా దీక్షిత్ ఆంటీ వరుసగా మూడుసార్లు ఢిల్లీ సీఎంగా ఉండలేదా?" అన్నారు.

కానీ సీఎంగా హ్యాట్రిక్ కొట్టటం వేరు, వరుసగా ఒక్క సీటైనా గెలవకుండా హ్యాట్రిక్ కొట్టటం వేరు కదా తల్లీ' అని నేను ప్రియాంకతో అనలేదు. ఈలోపు – జైరాం రమేశ్ యాక్టివేట్ అయ్యారు!

"హ్యాట్రిక్‌గా మనం ఎందుకు ఓడిపోతూ వచ్చామో ఎంతగా అంతర్మథనం చేసుకున్నా అర్థం కావటం లేదు ఖర్గేజీ. ఢిల్లీకి షీలా దీక్షిత్ ఎన్నెన్ని చేశారు! అసలు ఈ ప్రజలు ఏం కోరుకుంటున్నారో అంతు చిక్కటం లేదు" అన్నారు జైరాం రమేశ్. సహనం కోల్పోయిన సాధువులా!

"అంతా బాగున్నా ఎందుకీ ప్రజలు మార్పు కోరుకుంటారో!" అన్నారు వేణుగోపాల్, తనూ ఆశ్చర్యపోతూ.

"అంతా బాగుండబట్టే మార్పును కోరుకుంటారు వేణూజీ. అన్ని పార్టీలూ అన్నీ ఇస్తున్నప్పుడు అన్నీ ఇచ్చే అవకాశాన్ని ఎప్పుడూ ఒకే పార్టీకి ఎందుకివ్వాలి అని ప్రజలు అనుకుంటారు. ఢిల్లీ ప్రజలు 26 ఏళ్ల తర్వాత మళ్లీ బీజేపీని ఎన్నుకున్నారు. ఏమో, వచ్చే ఎన్నికల్లో బీజేపీని మార్చి మనల్ని గెలిపించినా గెలిపించవచ్చు" అని వెనుక సీట్లోంచి ఎవరో అన్నారు!

"ఎవరతను గోపాల్‌జీ... ఆశలు చిగురించేలా మాట్లాడాడు" అని అడిగాను... సాయంత్రం కాన్ఫరెన్స్ ముగిశాక వేణుగోపాల్‌తో పాటుగా ఇందిరా భవన్ నుంచి బయటికి నడుస్తూ.

"కుర్రాడు కమిటీలోకి కొత్తగా వచ్చాడు ఖర్గేజీ. గ్రాస్‌రూట్స్ నుంచి తెచ్చాం" అన్నారు వేణుగోపాల్.

ఒక్క క్షణం అలా నిలబడి పోయాను.

"ఏంటి ఖర్గేజీ?" అని అడిగారు వేణుగోపాల్.

"ఏం లేదు గోపాల్‌జీ. మన లీడర్స్ అందరినీ వెంటనే ఏ ఫ్లయిట్ దొరికితే ఆ ఫ్లైట్‌లో గ్రాస్‌రూట్స్‌కి పంపించండి" అని చెప్పి, వచ్చేశాను.

నివేదనను ఆరగిస్తాడా?

మనం దేవుడి కోసం చేసే నైవేద్యాన్ని ఆయన ఆరగిస్తాడా అనే సందేహం మనలో పలువురికి ఉంటుంది. అదే సందేహం ఒక శిష్యుడికి కూడా వచ్చి తన గురువుగారిని అడిగాడు. అందుకు గురువుగారు తాను ఒక అద్భుత మంత్రం గురించి చెబుతాను, ఆ తరువాత సందేహం తీరుస్తానన్నారు. సదరు మంత్రాన్ని చదివి తాళపత్రంపై దాన్ని రాయమని చెప్పారు గురువుగారు. కొంత సేపు తాళపత్రంపై రాసిన మంత్రాన్ని వల్లెవేయించిన పిదప 'శిష్యా! మంత్రాన్ని చెప్పింది చెప్పినట్లుగా మనసులోకి తీసుకున్నావా' అని అడిగారు గురువుగారు. తీసుకున్నానన్నాడు శిష్యుడు. 'ఏదీ ఒక్కసారి మంత్రాన్ని చెప్పు చూద్దాం' అన్నారు గురువు. శిష్యుడు చెప్పడం పూర్తయిన తర్వాత 'నాయనా! నువ్వు మంత్రాన్ని సంపూర్ణంగా మనసులోకి తీసుకున్నట్టు అనిపించడం లేదే... నీ పుస్తకాన్ని చూపించు' అన్నారు గురువుగారు. గురువుగారి మాటతో అయోమయంలో పడిన శిష్యుడు వెంటనే తన పుస్తకాన్ని తీసుకొచ్చి చూపించాడు. 'ఈ పుస్తకంలో ఉన్నది ఉన్నట్టు మనసులోకి తీసుకున్నావా' అని అడిగారు గురువుగారు.

జ్యోతిర్మయం

'ఔనండీ గురువుగారూ' అన్నాడు బాలుడు. 'నువ్వు మనసు లోకి తీసుకున్న తర్వాత కూడా ఈ పుస్తకంలో మంత్రం అలానే ఉంది. అదేంటీ నువ్వు బుర్రలోకి ఎక్కించుకున్న తర్వాత పుస్తకంలో ఇక ఉండకూడదు కదా' అని అడిగారు గురువుగారు. శిష్యుడు అయోమయంలో పడ్డాడు. 'నువ్వు మనసులోకి తీసుకున్నది సూక్ష్మ స్థితిలో ఉంది. పుస్తకంలో ఉన్న మంత్రం స్థూలరూపం. దేవుడు సూక్ష్మ స్థితిలో ఉండేవాడు. ఆయనకు మనం స్థూల రూపంలో చేసిన నైవేద్యాన్ని నివేదిస్తున్నాం కాబట్టి దాన్ని సూక్ష్మంగానే స్వీకరిస్తాడు. అందువల్ల దాని కొలత తగ్గదు. ఉదాహరణకు, పుస్తకంలోని మంత్రాన్ని ఇప్పుడు నువ్వు మనసులోకి తీసుకున్నా... మంత్రం పుస్తకం నుంచి మాయం కాకుండా అలాగే ఉంది చూడు. అలాంటిదే నైవేద్యం సంగతి కూడా' అని గురువుగారు ముగించారు. ఈ వివరణ అద్భుతంగా ఉందని శిష్యుడు గురువుగారికి నమస్కరించాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.దశమి ఉ.10.30 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మూల ప.3.51 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.2.11 నుండి 3.51 వరకు, తదుపరి రా.1.46 నుండి 3.22 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.32 నుండి 5.20 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.00 నుండి 10.43 వరకు; **రాహుకాలం:** సా.4.30 నుంచి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుంచి 1.30 వరకు, **సూర్యోదయం:** 6.27, **సూర్యాస్తమయం:** 6.00.

హిందూసమాజంలో అంటరానితనాన్ని దూరం చేయాలి

- వీహెచ్‌పీ అఖిలభారత సంఘటన కార్యదర్శి వినాయకరావు



సాక్షి, హైదరాబాద్: హిందూ సమాజంలో అంటరానితనాన్ని దూరం చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అఖిలభారత సహ సంఘటన కార్యదర్శి వినాయకరావు దేశ్‌పాండే పిలుపునిచ్చారు. కులాలు, జాతులుగా విడిపోయిన హిందూ సమాజమంతా సంఘటితం కావాలన్నారు. కులాలు, పేదరికం, అనారోగ్యాన్ని ఆసరా చేసుకుని మతమార్పిడికి పాల్పడుతున్న దుష్టశక్తులను తరిమికొట్టాలని సూచించారు. శనివారం మేడ్చల్ జిల్లాలోని అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యాకేంద్రంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఆపై స్థాయి బాధ్యతగల వ్యక్తులు సమావేశానికి హాజరైనట్టుగా వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్ర ముఖ్ పగుడాకుల బాలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఆరెస్సెస్ తెలంగాణ ప్రచారక్ లింగం శ్రీధర్, వీహెచ్‌పీ నాయకులు స్తాను మలయన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకుంటున్న మంద కృష్ణ

- మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక చైర్మన్ పాపయ్య మాదిగ



కాచిగూడ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణ కాకుండా మంద కృష్ణ మాదిగ అడ్డుకుంటున్నారని మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక చైర్మన్ మేడి పాపయ్య మాదిగ ఆరోపించారు. బేడ, బుడగ జంగాల హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. మంత్రి దామోదర రాజనర్సింహది మాదిగ కులం కాదని.. మంద కృష్ణ వ్యాఖ్యానించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అసలు మంద కృష్ణది మాదిగ కులం కాదని, ఆయన బీసీ సీ గ్రూపులోని క్రైస్తవ మతస్తుడని వెల్లడించారు. మంద కృష్ణ కుమారుడు వైఎంసీఏలో పాస్టర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణలో మంత్రి దామోదర కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు. సమావేశంలో ఐక్యవేదిక వైస్ చైర్మన్లు జున్ను కనకరాజు మాదిగ, ఐటికె రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై టీచర్ లైంగిక వేధింపులు

- పోక్సో కేసు నమోదు



దేవయ్య

కొండపాక (గజ్వేల్): విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు కేసుగాని దేవయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం ఖమ్మంపల్లి హైస్కూల్లో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా దేవయ్య విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా విద్యార్థినులను ప్రాక్టికల్స్ పేరిట సైన్స్ ల్యాబ్‌లోకి తీసుకెళ్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ప్రతిఘటించిన విద్యార్థినులను పరీక్షల్లో ఫె యిల్ చేస్తానంటూ బెదిరిస్తున్నాడు. ఉపాధ్యాయుడి చేష్టలు భరించలేక ఆరుగురు విద్యార్థినులు పాఠశాల నుంచి వెళ్లిపోయారు. వారం రోజుల నుంచి దేవయ్య లైంగిక వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం బాధితులు ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. అ యితే ఈ ఫిర్యాదు విషయం తమకు ఎందుకు చెప్పలేదంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు హెచ్‌ఎంను నిలదీశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిపై పోక్సో కేసును నమోదు చేశారు.

నేడు మహాకుంభాభిషేక సంప్రోక్షణ

- ఉదయం 11.54 గంటలకు ముహూర్తం
- ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి
- దేశంలోనే ఎత్తయిన దివ్యవిమాన బంగారు గోపురం
- మహోత్సవానికి ముస్తాబైన యాదగిరిగుట్ట క్షేత్రం



యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ దివ్య స్వర్ణ విమాన గోపురం (తెర లోపల)

సాక్షి, యాదాద్రి/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య స్వర్ణ విమాన గోపుర కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి యాదగిరిగుట్ట క్షేత్రం ముస్తాబైంది. ఆదివారం జరిగే స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. వానమామలై మఠం పీఠాధిపతి మధుర కవి రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగనుంది. గుట్టలో ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న పంచ కుండాత్మక నారసింహ యాగం పూర్ణాహుతి అనంతరం ఆదివారం ఉదయం 11.54 గంటలకు దివ్య స్వర్ణ విమాన గోపురం కుంభాభిషేక కార్యక్రమం జరుగుతుంది.

68 కిలోల బంగారంతో తాపడం..

యాదగిరిగుట్ట స్వర్ణ విమాన గోపురం దేశంలోనే ఎత్తయినదని చెపుతున్నారు. పంచతల రాజగోపురానికి సుమారు 68 కిలోల బంగారంతో తాపడం చేయించారు. రూ.5.10 కోట్ల ఖర్చుతో భక్తులు, దాతలు ఇచ్చిన బంగారం, నగదుతోపాటు, దేవస్థానం హుండీలో భక్తులు వేసిన కానుకలతో స్వర్ణ తాపడం చేపట్టారు. గోపురంపై సింహ, గరుడ విగ్రహాలు, నారసింహ రూపాలు చెక్కారు.

దాతల కోటాలో కేసీఆర్‌కు ఆహ్వానం

స్వర్ణ తాపడం కోసం బంగారం విరాళం ఇచ్చిన మాజీ సీఎం కేసీఆర్, త్రిదండి చినజీయర్‌స్వామిలను దాతల కేటగిరీలో దేవస్థానం అధికారులు ఈ మహోత్సవానికి ఆహ్వానించారు. మహా కుంభ సంప్రోక్షణ, పంచకుండాత్మక నారసింహ యాగం జరుగుతున్న తీరును కేసీఆర్ ఆరా తీశారని సమాచారం. త్వరలో ఆయన యాదాద్రీశుని దర్శనానికి వస్తానని చెప్పినట్లు తెలిసింది.

హాజరుకానున్న మంత్రులు

యాదగిరిగుట్ట ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురం మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమానికి సీఎంతో పాటు మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హాజరుకానున్నారు.

ఆర్జిత సేవలు రద్దు: మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయంలో నిత్య కల్యాణం, పుష్పార్చనతో పాటు ఆయా ఆర్జిత సేవలను రద్దుచేశారు. అంతే కాకుండా ఉదయం, సాయంత్రం ఆలయంలో బ్రేక్ దర్శనాలను సైతం నిలిపివేశారు. ఉదయం 10 గంటల నుంచి ఉచిత, వీఐపీ, ఇతర టికెట్ దర్శనాలను రద్దు చేశారు. ఉదయం సమయంలో స్వామి వారి దర్శనాలకు వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో రావాలని ఆలయ ఈవో భాస్కర్‌రావు పేర్కొన్నారు.

నేడు పంచకుండాత్మక యాగం ముగింపు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వర్ణ విమాన గోపురానికి కుంభాభిషేకం, సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న పంచకుండాత్మక యాగం ఆదివారంతో ముగియనుంది. శనివారం ఉదయం ప్రధాన ఆలయంలో నిత్య పూజలు నిర్వహించిన అనంతరం, యాగశాలలో చతుస్థానార్చన, విమాన అధిష్టాన పరివార విశేష హోమాన్ని రుత్వికులు నిర్వహించారు. తర్వాత ఏకాశీతి కలశ స్నపనము, చాతుమరై నిర్వహించి నిత్య పూర్ణాహుతి చేశారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణాన్ని పఠించారు. ఆయా వేడుకల్లో వానమామలై మఠం మధుర కవి రామానుజ జీయర్ స్వామి, భువనగిరి కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, ఇతర అర్చకులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

ప్రాధాన్య ప్రాజెక్టులకు | బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు!

- ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణకు కేటాయించే అవకాశం
- మున్సిపల్ శాఖ పంపిన ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ ఆమోదం
- కేంద్ర సాయం కోసం డీపీఆర్‌లు ఢిల్లీకి పంపాలని సీఎం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య ప్రాజెక్టులకు రానున్న బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నట్లు తెలిసింది. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులతోపాటు మెట్రో రైలు విస్తరణకు అధిక నిధులు కేటాయించే అవకాశాలున్నాయని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అందే ఆర్థిక సాయం, వివిధ సంస్థల నుంచి తెచ్చుకొనే రుణాలు కాకుండా దాదాపు రూ. 20 వేల కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించొచ్చని చెబుతున్నాయి. ఇప్పటికే మున్సిపల్ శాఖ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ ఆమోదం లభించిందని.. కేంద్ర ఆర్థిక సాయం కోసం ఆయా ప్రాజెక్టుల (డీపీఆర్) సమగ్ర నివేదికలను కేంద్రానికి పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

'మూసీ'కి రూ. 2 వేల కోట్లు!

హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా 2030 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని భావిస్తున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్ల వరకు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం రూ. 4,100 కోట్లను ప్రపంచ బ్యాంకు ద్వారా రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికితోడు కేంద్రం కూడా ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందిస్తుందని, మిగిలిన నిధులను ప్రైవేటు రంగం ద్వారా పెట్టుబడుల రూపంలో తీసుకోవాలనేది ప్రభుత్వ ప్రణాళికగా కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యే సమయానికి రూ. లక్షన్నర కోట్లు ఖర్చవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందులో ఎక్కువగా ప్రైవేటు పెట్టుబడుల ద్వారా నిధులు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ప్రాజెక్టు తొలివిడతలో భాగంగా ఇబ్బందిలేని ప్రాంతాల్లో ఈ ఏడాది మూసీ పునరుజ్జీవ పనులను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అందుకోసం బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు కేటాయించొచ్చని తెలుస్తోంది.



మెట్రో విస్తరణకు రూ. 7 వేల కోట్లపైనే?

రూ. 24,369 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులో 30 శాతం మేర రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ మేరకు రూ. 7,200 కోట్లను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించే అవకాశాలున్నాయి. దీంతోపాటు మరో రూ. 4 వేల కోట్లకుపైగా కేంద్రం ఇవ్వాల్సి ఉంది. ఇవి పోను రూ. 12 వేల కోట్లలో రూ. 1,000 కోట్లను పీపీపీ పద్ధతిలో సమకూర్చుకోవాలనుకుంటోంది. మిగతా నిధులను జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ లాంటి సంస్థల ద్వారా రుణాల రూపంలో తీసుకోనుంది. అదేవిధంగా హైదరాబాద్ శివార్లలో దాదాపు 800 చదరపు కిలోమీటర్లకుపైగా విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్న ఫ్యూచర్ సిటీ భూసేకరణ కోసం తొలిదశలో భాగంగా రూ. 10 వేల కోట్లను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నట్లు సమాచారం.



తహసీల్దార్ సునీత కాళ్లపై పడిన ట్రాక్టర్ యజమాని భార్య

కాళ్లు పట్టుకుంటా.. కేసు పెట్టొద్దు

- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న తహసీల్దార్
- కాళ్లు పట్టుకున్న ట్రాక్టర్ యజమాని భార్య

ముదిగొండ: మేడమ్ దండం పెడతా.. ఈసారికి క్షమించండి.. మీ కాళ్లు పట్టుకుంటా.. అంటూ ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్ యజమాని భార్య తహసీల్దార్‌ను వేడుకుంది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తహసీల్దార్ సునీత ఎలిజబెత్ పట్టుకున్నారు. దీంతో ఒక ట్రాక్టర్ యజమాని భార్య అక్కడికి చేరుకుని తహసీల్దార్‌ను బతిమిలాడుతూ కాళ్లపై పడింది. అయితే, అనుమతి లేకుండా ఇసుక తరలించడం సరికాదంటూ తహసీల్దార్ రెండు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కాగా, తహసీల్దార్ తనిఖీలను గమనించిన మరికొందరు ఇసుక రవాణాదారులు అక్కడి నుంచి పరారయ్యారు.



విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్

ప్రభుత్వ బడిలో చదువుకుని హైకోర్టు జడ్జినయ్యా

- రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్

జగిత్యాల జోన్: తాను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకుని హైకోర్టు జడ్జిని అయ్యానని హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ (ప్రభుత్వ) డిగ్రీ కళాశాలలో శనివారం క్రీడా, సాంస్కృతిక దినోత్సవంతోపాటు ఉత్తమ విద్యార్థులకు కాసుగంటి స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో, ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్న వారికే పెద్ద ఉద్యోగాలు వస్తాయనేది భ్రమ అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చినవారూ ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్–1 పోస్టులకు ఎంపికవుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురికి రూ.40 వేల చొప్పున అందిస్తున్నామని తెలిపారు. ఫిజికల్ సైన్స్ విభాగంలో నాగుల పూజ, లైఫ్‌సైన్స్ విభాగంలో దర్శనాల హారిక, కామర్స్ విభాగంలో ముద్దమల్ల కిషన్, ఆర్ట్స్ గ్రూపులో జున్ను సందీప్‌కు రూ.40 వేల చొప్పున జడ్జి చేతుల మీదుగా అందించారు. తన తల్లిదండ్రుల పేరిట ఏటా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందిస్తానని జడ్జి ప్రకటించారు. అనంతరం క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందించారు. జస్టిస్ పుల్లా కార్తీక్ ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం. దీంతో జడ్జిని చిన్నప్పటి మిత్రులు పలకరించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తదితరులు ప్రసంగించారు. కాగా, హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా మొదటి అదనపు జడ్జి సుగలి నారాయణ తదితరులు కూడా కలిశారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

- వసతిగృహంలో విద్యార్థుల చాకిరీపై..
- సంగారెడ్డి కలెక్టర్ ఉత్తర్వులు జారీ



కలెక్టర్ క్రాంతి

కంగ్టి(నారాయణఖేడ్): సంగారెడ్డి జిల్లా కంగ్టిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల కళాశాల వసతిగృహంలో గురువారం విద్యార్థులతో అల్పాహారం తయారు చేయించిన ఘటనలో ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ క్రాంతి శనివారం ఆదేశాలు జారీ చేశారు. నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడిన అనంతరం నివేదికను శుక్రవారం కలెక్టర్‌కు అందజేశారు. నివేదిక ఆధారంగా కళాశాలలో టీజీటీ గణితం ఉపాధ్యాయుడు కె.శివకుమార్, ఫిజికల్ డైరెక్టర్ జి.మహేశ్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. సస్పెండైన ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం కళాశాలలో అందుబాటులో ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పీఈటీ కొట్టారని విద్యార్థి ఆత్మహత్య

- పాఠశాల నాలుగో అంతస్తు పైనుంచి దూకి బలవన్మరణం
- 'సారీ మదర్.. ఐ విల్ డై టుడే' అని రాసిన ఎనిమిదో తరగతి విద్యార్థి
- పాఠశాలను సీజ్ చేసిన డీఈఓ



సంగారెడ్డి



విలపిస్తున్న తల్లి

ఉప్పల్ (హైదరాబాద్): నగరంలోని ఓ పాఠశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్కూల్ పీఈటీ కొట్టడమే కాకుండా తోటి విద్యార్థుల ముందు అవమానించాడంటూ ఎనిమిదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్కూల్ భవనం నాల్గో అంతస్తు నుంచి కిందికి దూకి బలవన్మరణం పొందిన ఘటన శనివారం ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని సిద్ధ హంగిర్గా గ్రామానికి చెందిన ముంగ ధర్మారెడ్డి, సంగీత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు లింగారెడ్డి, చిన్న కుమారుడు సంగారెడ్డి(14). వీరి కుటుంబం 15 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి బోడుప్పల్ పరిధిలోని ద్వారకా నగర్‌లో నివాసముంటోంది. తోపుడు బండిపై వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. సంగారెడ్డి.. ఉప్పల్‌లోని న్యూ భరత్‌నగర్‌లోని సాగర్ గ్రామర్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం స్టడీ అవర్ సమయంలో సంగారెడ్డి స్కూల్లో సీసీ కెమెరాలను కదిలించాడంటూ క్లాస్ టీచర్.. పీఈటీ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆంజనేయులు కొట్టడంతోపాటు మందలించారు. శనివారం ఉదయాన్నే స్కూల్‌కు వచ్చిన సంగారెడ్డిని పీఈటీ పనిష్మెంట్ పేరిట మరోసారి తరగతి గదిలో కొట్టడంతోపాటు అరగంటపాటు నిలబెట్టారు. తల్లిదండ్రులను పిలిపిస్తానని, టీసీ ఇచ్చి పంపిస్తానని బెదిరించారు. తోటి విద్యార్థుల ముందు దీన్ని అవమానంగా భావించిన సంగారెడ్డి.. ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నాడు. ముందుగా తన నోట్ బుక్‌లో 'సారీ మదర్– ఐ విల్ డై టుడే' అని రాసి వాష్‌రూంకు వెళ్తున్నానని చెప్పి తరగతి బయటకు వచ్చాడు. వస్తూ వస్తూ స్నేహితులకు బైబై అని చెప్పాడు. మూడవ అంతస్తులో ఉన్న తరగతి గది నుంచి నాల్గో అంతస్తుకు చేరుకుని అక్కడినుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి, మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి సంగారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్కూల్ యాజమాన్యం, పీఈటీ ఆంజనేయులు, క్లాస్ టీచర్‌పై కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ డీఈవో పాఠశాలను సీజ్ చేశారు.

కన్నీరు మున్నీరైన తల్లి

'ప్రయోజకుడు కావాలని రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లలను ప్రైవేట్ బడిలో చదివిస్తున్నా. ఎంతకష్టమొచ్చినా ఫీజును ఆపే వాళ్లం కాదు. నా కొడుకు ఏ పాపం చేశాడని చంపేశారు? అంటూ సంగారెడ్డి తల్లి కన్నీరు మున్నీరైంది. బాధ్యులను కఠినంగా శిక్షించాలని పోలీసులను వేడుకుంది. ఆమె ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్ ఆవరణలో కూర్చుని రోదించడం స్థానికులను కలచివేసింది.

చేతబడి అనుమానంతో స్నేహితుడి హత్య

- చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన



నసీరుద్దీన్

చందానగర్: చేతబడి చేశాడనే అనుమానంతో ఓ వ్యక్తిని తోటి స్నేహితుడే హత్య చేశాడు. ఈ సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పాలవెల్లి తెలిపిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లి నెహ్రూనగర్‌కు చెందిన రషీద్ కుమారుడు నసీరుద్దీన్, ఫక్రుద్దీన్ స్నేహితులు. డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్న నసీరుద్దీన్ (38)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఫక్రుద్దీన్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా, కొన్ని నెలలుగా నసీరుద్దీన్ తన కుటుంబంపై చేతబడి చేస్తున్నాడని ఫక్రుద్దీన్ అనుమానించాడు. తన తండ్రి పక్షవాతంతో మంచంపై ఉండడానికి, తన చెల్లి పెళ్లి సంబంధం తెగిపోవడానికి, తన ఆరోగ్య సమస్యలకు నసీరుద్దీన్ కారణమని రగిలిపోయాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో నసీరుద్దీన్ ఇంటి వద్ద ఉన్న మైదానానికి వెళ్లాడు. రాత్రి 8.30 గంటలకు ఫక్రుద్దీన్ మైదానం వద్దకు చేరుకుని, మాట్లాడుకుందామని చెప్పి నసీరుద్దీన్‌ను హైటెక్ బావర్చి హోటల్ వద్దకు తీసుకువెళ్లాడు. అప్పటికే అక్కడ ఫక్రుద్దీన్ స్నేహితులు అజీజ్, తాహెర్, ఖదీర్, ఖాలీద్, ఇబ్రహీం ఉన్నారు. ఈ క్రమంలో ఏకాంతంగా మాట్లాడాల్సి ఉందని చెప్పి నసీరుద్దీన్‌ను గోపీనగర్ చెరువు వద్దకు తన బైక్‌పై ఫక్రుద్దీన్ తీసుకువెళ్లాడు. మిగతా స్నేహితులు వారిని అనుసరించారు. అక్కడే అందరూ మద్యం సేవించారు. రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరి స్నేహితుల మధ్య చేతబడి విషయంపై వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికి గురైన స్నేహితులందరూ కలిసి నసీరుద్దీన్‌పై దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దుతూ, కర్రతో తలపై బాదడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో తీవ్ర రక్తస్రావానికి గురైన నసీరుద్దీన్‌ను వారు వెంటనే కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు తెలుపడంతో ఫక్రుద్దీన్ అక్కడి నుంచి జారుకున్నాడు. మధ్య రాత్రి నసీరుద్దీన్ తండ్రికి సమాచారం అందడంతో ఆస్పత్రిలో కుమారుడిని చూసి రషీద్ కన్నీరుమున్నీరయ్యాడు. అనంతరం తన కొడుకుని ఫక్రుద్దీన్ హత్య చేశాడని చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీం చేరుకొని హత్య ఆధారాలను సేకరించింది.

నడిరోడ్డుపై తండ్రిని చంపేశాడు

- వేధింపులు భరించలేక కుమారుడి దారుణం

కుషాయిగూడ (హైదరాబాద్): పట్టపగలు నడిరోడ్డుపై దారుణం చోటు చేసుకుంది. నిత్యం వేధిస్తున్నాడంటూ కన్నతండ్రిని కొడుకే కడతేర్చాడు. వందల మంది చూస్తుండగానే కసితీరా కత్తితో పొడిచి చంపాడు. ఈ దా రుణం శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా, వేంపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి మొగిలి, లావణ్య దంపతులు కొద్ది రోజుల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి లాలాపేట్ ఇందిరానగర్ లో ఉంటున్నారు. వారికి సాయికుమార్, శ్రావణి సంతానం. సాయికుమార్ (23) శివశక్తి ప్యాకర్స్ అండ్ మూవర్స్ నిర్వహిస్తుండగా కూతురు ఇంటి వద్దే ఉంటుంది. మద్యానికి బానిసైన మొగిలి నిత్యం మద్యం సేవించి భార్యను, కుమార్తెను హింసించేవాడు. తండ్రి తీరుపై సాయికుమార్ తరచుగా మండిపడేవాడు. అయినప్పటికీ మొగిలి తీరుమార్చుకోలేదు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం కూడా మొగిలి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో కొడుకుపై కత్తెరతో దాడి చేసేందుకు యత్నించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి మొగిలిని మందలించి వెళ్లారు. దీంతో ఆగ్రహించిన మొగిలి.. కొడుకు అంతు చూస్తానంటూ బెదిరించి ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. తండ్రి తీరుతో ఆందోళన చెందిన సాయికుమార్ ఇంట్లోంచి వెళ్లిన తండ్రిని అనుసరించాడు. లాలాపేట్‌లో ఈసీఐఎల్ వైపుగా వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కడాన్ని గమనించి బస్సు వెనుకే బైక్‌తో అనుసరించాడు. బస్సు ఈసీఐఎల్ టెర్మినల్‌లోకి వెళ్తున్న సమయంలో బస్సులోంచి దిగిన తండ్రిని తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. తండ్రితో తనకు ప్రాణహాని జరుగుతుందన్న భయంతోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రక్తం మడుగులో పడి ఉన్న మొగిలిని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కాగా, హత్య విషయం తెలుసుకున్న మల్కాజిగిరి డీసీపీ పద్మజ, కుషాయిగూడ ఏసీపీ మహేశ్‌కుమార్‌గౌడ్‌లు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.



కత్తితో తండ్రిని పొడుస్తున్న సాయికుమార్

యుద్ధం @ మూడేళ్లు



ఉక్రెయిన్‌లోని మరియుపోల్‌లో తీవ్రంగా ధ్వంసమైన బహుళ అంతస్తుల భవన సముదాయం

36 నెలలు గడిచినా ఆగని రష్యా, ఉక్రెయిన్ పోరు

ఇరువైపులా లక్షలాది మంది సైనికుల మృతి

ఆధునిక రణతంత్రంతో కొనసాగుతున్న యుద్ధం

ట్రంప్ రాకతో యుద్ధ ముగింపుపై చిగురించిన కొత్త ఆశలు



రష్యా దాడిలో బఖ్‌ముత్‌లో మంటల్లో బుగ్గిగా మారిన అపార్ట్‌మెంట్ భవనం

ఉక్రెయిన్. రష్యా దురాక్రమణ జెండా ఎగరేసి దూసుకురావడంతో అస్థిత్వమే లక్ష్యంగా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్న పొరుగుదేశం. అణ్వస్త్ర సామర్థ్యం, అమేయ సైన్యంతో కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ వస్తున్న రష్యాను నిలువరించేందుకు ఉక్రెయిన్ యుద్ధంచేస్తూ శతథా ప్రయత్నాలు చేయబట్టి రేపటికి సరిగ్గా మూడేళ్లు. ఈ మూడేళ్లలో రష్యా కన్నెర్రజేసి వేలాది సైన్యంతో చేస్తున్న భీకర గగనతల, భూతల దాడుల్లో ఉక్రెయిన్‌లో సాధారణ ప్రజల వేలాది కలల సౌధాలు పేకమేడల్లా కూలి నేలమట్టమయ్యాయి. వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. శివారు గ్రామాలు, పట్టణాలన్నీ మరుభూములుగా మారిపోయాయి. ఎక్కడ చూసినా మరణమృదంగం నిరాటంకంగా వినిపిస్తోంది. సైనికులు పిట్టల్లా రాలిపోయారు. మార్షల్ లా ప్రయోగించి జెలెన్‌స్కీ ప్రభుత్వం యువత మొదలు నడివయసు వారిదాకా దమ్మున్న వారందరినీ రణక్షేత్రంలోకి దింపి పోరాటం చేయిస్తోంది. దశాబ్దాల నాటి దౌత్య ఒప్పందాలను ఉల్లంఘించిందని, నాటోలో చేరాలనుకుంటోందని పలు సాకులు చూపి రష్యా సమరశంఖం పూరించింది. దీంతో హఠాత్తుగా యుద్ధంలో కూరుకుపోయినా ఉక్రెయిన్ తన మిత్రబృందం నుంచి అందుతున్న అధునాతన ఆయుధాలతో రష్యాను సైతం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ లక్షలాది మంది రష్యన్ సైనికులను నేలకూల్చింది. దీంతో అణ్వస్త్ర బూచి చూపించి భయపెడుతున్న పుతిన్‌కు యుద్ధాన్ని ఆపడమే ఉత్తమమని అగ్రరాజ్య నయా నాయకుడు డొనాల్డ్ ట్రంప్ టెలీఫోన్ మంతనాలు చేయడంతో యుద్ధం మొదలైన మూడేళ్ల తర్వాత తొలిసారిగా కీలక మలుపు తీసుకుంది. వాస్తవానికి ఈ మలుపు తుది మలుపు అని, ట్రంప్ పట్టుదలతో యుద్ధాన్ని ఆపబోతున్నారని అంతర్జాతీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. 36 నెలల తర్వాత అయినా ఉక్రెయిన్ ఊపిరి పీల్చుకుంటుందో లేదోనని, యుద్ధప్రభావిత విపరిణామాలతో తిప్పలుపడుతున్న ఎన్నో ప్రపంచదేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

అత్యంత భీకర ఘర్షణ

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో వెలుగుచూసిన అతిపెద్ద వైరం ఇదే. వాస్తవానికి తాజా యుద్ధానికి పునాదులు పదేళ్ల క్రితమే పడ్డాయి. 2014లో ఉక్రెయిన్‌లోని క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా ఉన్నపళంగా ఆక్రమించుకుంది. ఆనాటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఉక్రెయిన్‌పైకి రష్యా దండయాత్ర మొదలెట్టింది. వందల కొద్దీ చిన్నపాటి క్షిపణులు ప్రయోగిస్తూ వేలాది సైనికులను కదనరంగంలోకి దింపింది. తొలిరోజుల్లో రాజధాని కీవ్‌దాకా దూసుకొచ్చి భీకర దాడులు చేసిన రష్యా ఆ తర్వాత ఆక్రమణ వేగాన్ని అనూహ్యంగా తగ్గించింది. ఉక్రెయిన్ వైపు నుంచి ప్రతిఘటన కూడా దీనికి ఒక కారణం. ఉక్రెయిన్ తొలినాళ్లలో యుద్ధంలో తడబడినా ఆ తర్వాత అగ్రరాజ్యం, యూరప్ దేశాల ఆర్థిక, ఆయుధ, నిఘా బలంతో చెలరేగిపోయింది. ధాటిగా దాడులు చేస్తూ పుతిన్ పటాలానికి ముచ్చెమటలు పట్టించింది. దీంతో మరింత శక్తివంతమైన ఆయుధాలను రష్యా బయటకుతీయక తప్పలేదు. దీంతో డ్రోన్లకు ఉక్రెయిన్ పనిచెప్పింది. దృఢత్వానికి చిరునామా అయిన అత్యంత ఖరీదైన వేలాది రష్యన్ యుద్ధట్యాంక్‌లను సైతం సులువుగా చవకైన డ్రోన్లతో పేల్చేసి జెలెన్‌స్కీ సేన పలు యుద్ధక్షేత్రాల్లో పైచేయి సాధించింది.

18 శాతం ఆక్రమణ

అంతర్జాతీయ మీడియా కథనాలు, రష్యా, ఉక్రెయిన్ ఉన్నతాధికారులు పలు సందర్భాల్లో వెల్లడించిన గణాంకాలను బట్టి చూస్తే ఇప్పటిదాకా రష్యా ఉక్రెయిన్‌లోని కేవలం 18 శాతం భూభాగాన్ని మాత్రమే ఆక్రమించుకోగలిగింది. కీవ్, లివివ్, డినిప్రో, ఒడెసా వంటి ప్రధాన నగరాలపై దాడి ప్రభావం లేదు. అమెరికా, ఇతర మిత్ర దేశాల నుంచి ఉక్రెయిన్‌కు అందుతున్న భారీ ఆయుధాలే ఇందుకు ప్రధాన కారణం. ఎప్పటికప్పుడు ఆయుధాలు, మందుగుండు, సైనిక ఉపకరణాలు, ఆర్థిక సాయం అందడంతోపాటు అంతర్జాతీయంగా లభిస్తున్న నైతిక మద్దతుతో రెట్టించిన ఉత్సాహంతో ఉక్రెయిన్ సైనికులు కదనరంగంలో ధైర్యంగా ముందడుగు వేయగల్గుతున్నారు. యుద్ధంలో రష్యా దాదాపు ఏకాకిగా మారింది. రహస్యంగా ఉత్తరకొరియా, చైనా, ఇరాన్ వంటి దేశాల నుంచి ఆయుధాలు, డ్రోన్లు తదితర ఆయుధాలు, కిరాయి సైనికులు తప్పితే రష్యాకు బయటి దేశాల నుంచి ఎలాంటి సాయం అందట్లేదు. అమెరికా తదితర దేశాలు రష్యాపై ఆర్థిక ఆంక్షల కత్తి గుచ్చాయి. సొంత దేశంలోనూ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న రష్యన్లు కోట్లలో ఉన్నారు. యుద్ధం కారణంగా విదేశీ వస్తువుల లభ్యత తగ్గి, డిమాండ్ పెరిగింది. దీంతో ద్రవ్యోల్బణం పెరిగి రష్యన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయుధం చేతికిచ్చి యుద్ధానికి పుతిన్ పంపిస్తాడన్న ముందస్తు అంచనాతో తొలినాళ్లలోనే వేలాది మంది యువ రష్యన్లు దేశం నుంచి పారిపోయారు. చివరకు ఖైదీలు, నిందితులను సైతం పుతిన్ సైన్యంలో చేర్పించుకుని ఉక్రెయిన్‌తో పోరాటం చేయిస్తున్నారు.

యుద్ధంలో రక్తమోడుతున్న రష్యా

అణ్వస్త్రాలు లేకున్నా ఉక్రెయిన్‌తో యుద్ధం అంత తేలిక కాదని పుతిన్‌కు రానురాను అర్థమైంది. రష్యాకు తగ్గట్లు ఉక్రెయిన్ సైతం అధునాతన యుద్ధవ్యూహాలను అమలుచేస్తుండటంతో రష్యా వైపు నష్టం భారీగానే ఉంది. అంతర్జాతీయ యుద్ధ పరిశీలనా బృందాలు, సంస్థలు, వార్తాసంస్థల నివేదికలు, అంచనాల ప్రకారం యుద్ధంలో ఏకంగా 8,66,000 మంది రష్యా సైనికులు చనిపోయారు. ఉక్రెయిన్ విషయంలో చూస్తే కేవలం లక్షకుపైగా సైనికులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఏకంగా 10,161 రష్యన్ యుద్ధ ట్యాంకులను ఉక్రెయిన్ ధ్వంసంచేసింది.

ఉక్రెయిన్‌లో ఎన్నికలొచ్చేనా?

రష్యా దాడులు మొదలెట్టగానే జెలెన్‌స్కీ తమ దేశంలో మార్షల్ లా ప్రయోగించారు. సైనికపాలన వంటి అత్యయిక స్థితి అమల్లో ఉన్న కారణంగా ఉక్రెయిన్‌లో ఇప్పట్లో ఎన్నికలు సాధ్యంకాదు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించాలంటే పార్లమెంట్‌లో ఏకాభిప్రాయ నిర్ణయం ద్వారా మార్షల్ లాను తొలగించాలి. యుద్ధం జరుగుతుండగా మార్షల్ లాను చట్టప్రకారం తొలగించడం అసాధ్యం. దీంతో ఇప్పట్లో ఎన్నికలు కష్టమని భావిస్తున్నారు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించినా జెలెన్‌స్కీ జాతీయభావం, యుద్ధంలో రష్యాను దీటుగా ఎదుర్కొంటున్నానని చెప్పి మళ్లీ అధికారం కైవసం చేసుకుంటారని విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి.

యుద్ధం అంకెల్లో..

చనిపోయిన రష్యా సైనికులు	8,66,000కుపైగా
చనిపోయిన ఉక్రెయిన్ సైనికులు	1,00,000కుపైగా
ఇప్పటిదాకా రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ ప్రాంతం	18 శాతం
సగటున రోజుకు రష్యా ఆక్రమణ రేటు	16.1 చదరపు కిలోమీటర్లు
ఉక్రెయిన్‌కు యూరప్ దేశాల నుంచి అందిన ఆర్థిక సాయం	రూ. 14 లక్షల కోట్లు
యూరోపియన్ యూనియన్ ఉక్రెయిన్‌కు ఇచ్చిన రుణాలు	రూ. 2 లక్షల కోట్లు

అన్ని రంగాలు తిరోగమనం

నష్టాలు చెప్పకపోయినా అంతర్జాతీయంగా తగ్గిన వాణిజ్యంతో ఉక్రెయిన్ నష్టాలు చరిత్రలో ఎన్నడూ చూడని స్థాయికి చేరుకున్నాయని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. బాంబు దాడుల్లో ఆనకట్టలు, రహదారులు, భవనాలు, వ్యవసాయ క్షేత్రాలు, పాఠశాలలు, కర్మాగారాలు ఇలా మౌలికవసతుల వ్యవస్థ బాగా దెబ్బతింది. వ్యవసాయం తగ్గిపోయింది. నిరుద్యోగం పెరిగింది. ఇలా ఎన్నో రంగాలు తిరోగమన పథంలో పయనిస్తున్నాయి. దేశ జీడీపీకి వందల బిలియన్ డాలర్ల నష్టం చేకూరింది. వాణిజ్య, పరిశ్రమ రంగానికి సంబంధించి దాదాపు రూ.15 లక్షల కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.5.8 లక్షల కోట్ల నష్టాలు వాటిల్లాయి. రవాణా, వాణిజ్యం, ఎగుమతులు, వ్యవసాయం, విద్యుత్, పరిశ్రమల రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉక్రెయిన్ పునర్‌నిర్మాణానికి వందల బిలియన్ డాలర్ల నిధులు అవసరమవుతాయని ఓ అంచనా. ఉక్రెయిన్‌కు మిత్ర దేశాల నుంచి భారీ స్థాయిలో సాయం అందుతున్నా అది ఎక్కువగా సైనిక, రక్షణపర సాయమే తప్పితే సాధారణ ప్రజల జీవితాలను బాగుచేసేది కాదు. దీంతో యుద్ధంలో ఉక్రెయిన్ తన భూభాగాలను మాత్రమే కాదు భవిష్యత్తును కొంత కోల్పోతోందనేది వాస్తవం.

ఉక్రెయిన్‌కు అపార ఆస్తినష్టం

రష్యా వైపు సైనికులు, ఆయుధాల రూపంలో నష్టం కనిపిస్తుంటే ఉక్రెయిన్ వైపు అంతకుమించి ఆస్తినష్టం సంభవించింది. లక్షల కోట్ల రూపాయల విలువైన భవనాలు నేలమట్టమయ్యాయి. పెద్ద సంఖ్యలో జనావాసాలపై దాడులతో పెద్దసంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇక దాదాపు లక్షకుపైగా ఉక్రెయిన్ సైనికులు చనిపోయినట్లు తెలుస్తోంది. దాదాపు 4 లక్షల మంది సైనికులు గాయాలపాలయ్యారు. ఇక స్వస్థలాలు సమరక్షేత్రాలుగా మారడంతో లక్షలాది మంది స్వదేశంలోనే యుద్ధంజాడలేని సుదూర ప్రాంతాలకు తరలిపోయారు. పక్కనే ఉన్న పోలండ్, రొమేనియా దేశాలుసహా అరడజనుకుపైగా దేశాలకు దాదాపు 60 లక్షల మంది శరణార్థులుగా వలసవెళ్లారు. దాదాపు ఉక్రెయిన్ వైపు యుద్ధంలో ఎంత నష్టం జరిగిందనేది స్పష్టంగా తెలీడం లేదు. అమెరికా సహా యూరప్ దేశాల ప్రభుత్వాలు, ఆయా దేశాల్లోని ప్రధాన మీడియా సంస్థలు సైతం ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్నాయి. దీంతో ఉక్రెయిన్ సైన్యం, పౌరుల్లో నైతిక స్థైర్యం సడలకూడదనే ఉద్దేశంతో యుద్ధ నష్టాలను తక్కువ చేసి చూపిస్తున్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

యుద్ధంలో ట్రంప్‌కార్డ్

జెలెన్‌స్కీ మొండిపట్టుదలతో యుద్ధాన్ని ఇక్కడిదాకా తెచ్చారని సంచలన ఆరోపణలు చేసిన అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ వడివడిగా తీసుకుంటున్న నిర్ణయాలు యుద్ధమేఘాలను శాశ్వతంగా తరిమేస్తాయన్న ఆశలు ఒక్కసారిగా చిగురించాయి. తొలిసారిగా రష్యా విదేశాంగ మంత్రి స్థాయి కీలక నేతలతో ఇటీవల మొదలైన చర్చల ప్రక్రియను ఇప్పుడు యుద్ధంలో కీలకదశగా చెప్పొచ్చు. మంతనాలు మరింత విస్తృతస్థాయిలో జరిగితే మూడేళ్ల యుద్ధానికి ముగింపు ఖాయమనే విశ్లేషణలు పెరిగాయి. ఇప్పటిదాకా ఆక్రమించిన ప్రాంతం రష్యాకే చెందుతుందని, ఇప్పటి 'వాస్తవాధీన రేఖ'నే అంగీకరిస్తూ జెలెన్‌స్కీని ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డీల్‌కు ఒప్పుకోకపోతే మిత్రదేశాల నుంచి ఎలాంటి సాయం అందకుండా అడ్డుకుంటానని ట్రంప్ హెచ్చరించి జెలెన్‌స్కీని దారికి తెస్తారని భావిస్తున్నారు. అధునాతన ఆయుధాలతో దూసుకొస్తున్న రష్యా సేనలను అడ్డుకోవాలంటే ఉక్రెయిన్‌కు విదేశీ ఆయుధసాయం తప్పనిసరి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో జెలెన్‌స్కీ అమెరికా పెట్టే షరతులకు ఒప్పుకోక తప్పదని, యుద్ధం ఒక రకంగా ముగింపు దిశలో పయనిస్తోందని వార్తలొచ్చాయి.



గర్ల్‌ఫ్రెండ్ అలెక్సిస్ విల్కిన్స్ చేతిలోని భగవద్గీతపై ప్రమాణం చేస్తున్న కాశ్ పటేల్

భగవద్గీతపై కాశ్ పటేల్ ప్రమాణం

వాషింగ్టన్: అమెరికా నిఘా విభాగం ఎఫ్‌బీఐ 9వ డైరెక్టర్‌గా భారత సంతతికి చెందిన కాశ్ పటేల్(44) శుక్రవారం భగవద్గీతపై ప్రమాణం చేశారు. యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండి ప్రమాణం చేయించారు. వైట్ హౌస్ క్యాంపస్‌లోని ఐసన్‌హోవర్ భవనంలోని ఇండియన్ ట్రీటీ రూంలో జరిగిన కార్యక్రమానికి పటేల్ కుటుంబసభ్యులతోపాటు గర్ల్‌ఫ్రెండ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాశ్ పటేల్ భగవద్గీత సాక్షిగా ప్రమాణం చేశారు. కశ్యప్ పటేల్ కుటుంబం మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. ఈయన తల్లి టాంజానియా, తండ్రి ఉగాండాకు చెందిన వారు. 1970ల్లో వీరి కుటుంబం కెనడా నుంచి అమెరికాకు వలస వెళ్లింది. అప్పట్లో లిటిల్ ఇండియాగా పేరున్న న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో ఈ కుటుంబం స్థిరపడింది. పటేల్ అక్కడే పుట్టి, పెరిగారు. ఉద్యోగ విరమణ చేసిన పటేల్ తల్లిదండ్రులు గుజరాత్‌కు కూడా తరచుగా వస్తుంటారు. గురువారం సెనేట్ 51–49 ఓట్ల తేడాతో పటేల్ నియామకంపై ఆమోదముద్ర వేయడం తెల్సిందే. ప్రమాణ స్వీకారం అనంతరం పటేల్ మాట్లాడారు. తనపై నమ్మకముంచిన అధ్యక్షుడు ట్రంప్‌నకు, కుటుంబసభ్యులతోపాటు సెనేట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు, ఎఫ్‌బీఐ అత్యుత్తమ డైరెక్టర్‌గా నిలుస్తారంటూ కాశ్ పటేల్‌పై అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఎఫ్‌బీఐ ఏజెంట్లకు పటేల్ అంటే ఎంతో ఇష్టమన్నారు.


1,500 మందికి స్థాన చలనం

ఎఫ్‌బీఐ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే కాశ్ పటేల్ కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. వాషింగ్టన్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో పనిచేసే వెయ్యి మంది ఉద్యోగులను దేశ వ్యాప్తంగా ఉన్న కార్యాలయాలకు బదిలీ చేయనున్నట్లు ప్రకటించారు. మరో 500 మంది హంట్స్‌విల్లెలోని బ్యూరో కార్యాలయానికి పంపుతామన్నారు. వాషింగ్టన్‌లో కంటే ఎఫ్‌బీఐ అవసరం ఇతర నగరాల్లోనే ఎక్కువగా ఉందని ఆయన తెలిపారని ఓ అధికారి వెల్లడించారు. నిఘా సమాచార సేకరణ కంటే నేరాల కట్టడికి చెందిన బాధ్యతలపైనే దృష్టి పెట్టాలని కూడా ఆయన కోరినట్లు చెప్పారు.

అమెరికాలో ముగ్గురు సైనికాధికారులపై వేటు

- జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్‌తో పాటు మరో ఇద్దరి తొలగింపు
- యూనిఫామ్ సర్వీసు మినహా ఇతర విభాగాల్లో సిబ్బందిని తగ్గించాలని నిర్ణయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముగ్గురు కీలక సైనాధికారులకు ఉద్వాసన పలికారు. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ చార్లెస్ సీక్యూ బ్రౌన్(ఛార్లెస్ క్వింటన్ బ్రౌన్) జూనియర్‌పై హఠాత్తుగా వేటువేశారు. ఎయిర్‌ఫోర్స్ జనరల్ అయిన బ్రౌన్ గత 16 నెలలుగా ఈ పదవిలో కొనసాగుతున్నారు. అత్యంత కీలకమైన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ పదవిని అధిరోహించిన రెండో నల్లజాతి అధికారిని ఉన్నట్టుండి పదవి నుంచి తొలగించడం అమెరికా సైనిక వర్గాల్లో సంచలనాత్మకంగా మారింది. ''అమెరికాకు 40 ఏళ్లకుపైగా సేవలందిస్తున్న జనరల్ చార్లెస్ సీక్యూ బ్రౌన్ జూనియర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఆయన ఒక గొప్ప అధికారి. సైన్యాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపించిన నాయకుడు. బ్రౌన్‌తోపాటు ఆయన కుటుంబం భవిష్యత్తు ఉజ్వలంగా వెలిగిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా''అని సోషల్ మీడియాలో డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం పోస్టు చేశారు. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ నూతన చైర్మన్‌గా రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ లెఫ్టినెంట్ జనరల్ డాన్ రజీన్ కెయిన్‌ను నామినేట్ చేయబోతున్నట్లు ప్రకటించారు. అమెరికాలో జార్జి ఫ్లాయిడ్ అనే నల్లజాతి వ్యక్తిని పోలీసులు హత్య చేసినప్పుడు ప్రజలు వీధుల్లోకి వచ్చి ఉద్యమించారు. వర్ణవివక్ష పూర్తిగా అంతం కావాలని డిమాండ్ చేశారు. 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్'పేరిట జరిగిన ఉద్యమానికి చార్లెస్ సీక్యూ బ్రౌన్ జూనియర్ బహిరంగంగా మద్దతు ప్రకటించారు. నల్లజాతి ప్రజల పట్ల ఆయన సానుభూతి చూపుతుంటారు. అమెరికా సైన్యంలో బ్రౌన్ వ్యతిరేకులు చాలామందే తయారయ్యారు. సైనిక వ్యయాన్ని గణనీయంగా తగ్గించాలని, అవసరం లేదని సిబ్బందిని ఇంటికి సాగనంపాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలోనే బ్రౌన్‌కు ఉద్వాసన పలికినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మరో ఇద్దరు సీనియర్ సైనిధికారులను పదవి నుంచి తొలగిస్తున్నట్లు అమెరికా రక్షణ శాఖ మంత్రి హెగ్సెత్ వెల్లడించారు. నావల్ ఆపరేషన్స్ చీఫ్ అడ్మిరల్ లీసా ఫ్రాంచెట్టీ, స్టాఫ్ ఆఫ్ ద ఎయిర్ ఫోర్స్ వైస్ చీఫ్ జనరల్ జిమ్ స్లైఫ్‌ను పదవుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.



పదవి కోల్పోయిన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ చార్లెస్ బ్రౌన్ జూనియర్

5,400 మంది ప్రొబేషనరీ సిబ్బందికి ఉద్వాసనే

సైన్యంలో పనిచేస్తున్న 5,400 మంది ప్రొబేషనరీ వర్కర్స్‌కు ఉద్వాసన పలకబోతున్నట్లు అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. వచ్చేవారం నుంచే వారిని తొలగించే ప్రక్రియ ప్రారంభమవుతుందని స్పష్టంచేసింది. నూతన నియామకాలను నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. ఏడాది కంటే తక్కువ కాలం పని చేసిన వారిని తొలగించాలని ట్రంప్ సర్కారు నిర్ణయించింది. ఇలాంటి వారికి సివిల్ సర్వీసు ప్రొటెక్షన్ ఉండదు. సైన్యంలో యూనిఫామ్ సర్వీసు మినహా ఇతర విభాగాల్లో 5 నుంచి 8 శాతం సిబ్బందిని తగ్గించుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు యూఎస్ ఫారెస్టు సర్వీసు నుంచి దాదాపు 2 వేల మంది ఉద్యోగులను ఇప్పటికే తొలగించింది. ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసులో పనిచేస్తున్న 7 వేల మందిపై త్వరలో వేటు వేయబోతున్నట్లు తెలిసింది. ఉద్యోగుల తొలగింపుపై రక్షణ మంత్రి హెగ్సెత్ గతవారం సోషల్ మీడియాలో నర్మగర్భమైన పోస్టు చేశారు. ''శరీరం నుంచి అనవసరమైన కొవ్వును తొలగించుకుంటే కండరాలు బలపడతాయి''అని పేర్కొన్నారు. సైన్యంలో కొన్ని కార్యక్రమాలకు కత్తెర వేసి 50 బిలియన్ డాలర్లు ఆదా చేయాలని ఆదేశించారు. ఈ సొమ్మును అధ్యక్షుడు ట్రంప్ ప్రాధాన్యతల జాబితాలో ఉన్న కార్యక్రమాలకు మళ్లించాలని పేర్కొన్నారు. 50 బిలియన్ డాలర్లు అంటే అమెరికా సైనిక బడ్జెట్‌లో 8 శాతం.


పంజాబ్‌లో ఉనికిలో లేని శాఖకు మంత్రి

- 21 నెలలపాటు మంత్రిగా పనిచేసిన కుల్దీప్‌సింగ్ ధలీవాల్
- పొరపాటును గుర్తించిన ప్రభుత్వం



చండీగఢ్: ప్రభుత్వంలో శాఖలకు మంత్రులుంటారు. అసలు ఉనికిలోనే లేని శాఖకు మంత్రులుంటారా? ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఏలుబడిలో ఉన్న పంజాబ్‌లో ఈ విచిత్రం చోటుచేసుకుంది. కుల్దీప్‌సింగ్ ధలీవాల్ పంజాబ్ పరిపాలన సంస్కరణల శాఖతోపాటు ప్రవాస భారతీయుల(ఎన్‌ఆర్‌ఐ) వ్యవహారాల శాఖ మంత్రిగా కూడా 21 నెలలు పనిచేశారు. నిజానికి పరిపాలన సంస్కరణల శాఖ అనేది లేనే లేదు. కానీ, ఆయన ఆ శాఖ మంత్రిగా చెలామణి అయ్యారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ సందర్భంగా ధలీవాల్‌కు 2023 మే నెలలో ఈ శాఖ అప్పగించారు. అయితే, పరిపాలన సంస్కరణల శాఖ మంత్రిగా ఆయనకు సిబ్బందిని కేటాయించలేదు. ఈ శాఖపై కనీసం ఒక్కసారి కూడా సమావేశం జరగలేదు. 21 నెలల తర్వాత పంజాబ్ సర్కారు అసలు విషయం గుర్తించింది. పరిపాలన సంస్కరణల శాఖ అనేది ఉనికిలో లేదని చెబుతూ ఒక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం కుల్దీప్‌సింగ్ ధలీవాల్ వద్ద ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ ఒక్కటే మిగిలి ఉంది. ఈ మొత్తం వ్యవహారంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. భగవంత్ మాన్ ప్రభుత్వ పాలన ఎలా ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నాయి. భగవంత్ మాన్‌కు పరిపాలన రాదని బీజేపీ సీనియర్ నేత సుభాష్ శర్మ, శిరోమణి అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ విమర్శించారు.

ప్రధాని రెండో ప్రిన్సిపల్ సెక్రటరీగా శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ)మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ–2 గా నియమించింది. ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రస్తుతం గుజరాత్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ పీకే మిశ్రా పనిచేస్తున్నారు. తమిళనాడు కేడర్‌కు చెందిన దాస్ ప్రధాని మోదీ పదవిలో కొనసాగినంత కాలం లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బాధ్యతల్లో కొనసాగుతారని ప్రభుత్వం తన ఆదేశాల్లో తెలిపింది. దాస్ నియామకంపై కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని, విధుల్లో చేరినప్పటి నుంచి నియామకం అమల్లోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో వివరించింది. ఆర్‌బీఐకి 25వ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్‌కు పాలనాపరమైన 42 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ఆర్థిక, పన్నులు, పెట్టుబడులు, మౌలికరంగాలకు సంబంధించిన బాధ్యతల్లో ఆయన ఎక్కువ కాలం పనిచేశారు.



నిరశన దీక్ష సాగిస్తూనే చర్చల్లో పాల్గొన్న దలేవాల్‌తో మంత్రి శివరాజ్

రైతు నేతలతో సుహృద్భావ వాతావరణంలో చర్చలు

వచ్చే నెల 19న మరో భేటీ: శివరాజ్‌సింగ్ చౌహాన్

చండీగఢ్: రైతు సంఘాల నేతలతో సుహృద్భావ వాతవరణంలో చర్చలు జరిగాయని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ చౌహాన్ చెప్పారు. తదుపరి సమావేశం మార్చి 19న జరగబోతోందని అన్నారు. రైతాంగం సమస్యలపై రైతుల సంఘాల నాయకులు, కేంద్ర బృందం మధ్య శనివారం చండీగఢ్‌లో చర్చలు జరిగాయి. కేంద్ర బృందానికి చౌహాన్ నేతృత్వం వహించారు. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషీ, పీయూష్ గోయల్ సైతం పాల్గొన్నారు. దాదాపు మూడు గంటలపాటు చర్చలు కొనసాగాయి. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు నాయకులు పట్టుబట్టారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించేదాకా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు తేల్చిచెప్పినట్లు సమాచారం. రైతుల తరఫున జగ్జీత్ సింగ్ దలేవాల్, సర్వాన్‌సింగ్ హాజరయ్యారు.

పోప్ ఆరోగ్యం విషమం



రోమ్: క్రైస్తవుల మత గురువు పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం విషమించింది. వైరస్, బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లు మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్ర శ్వాస సంబంధ వ్యాధిలో బాధపడుతున్న పోప్ గత కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 88 ఏళ్ల పోప్ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. రక్తహీనత సమస్య మరింత ఎక్కువైంది. దీంతో తాజాగా ఆయనకు రక్తం ఎక్కించారు. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోయింది. పూర్తిస్థాయిలో శ్వాస తీసుకోలేని కారణంగా అధిక పీడనంతో ఆయనకు ఆక్సిజన్ సరఫరాను కొనసాగిస్తున్నారు. బ్రాంకైటిస్, న్యుమోనియాలతో కూడా పోప్ బాధపడుతున్నారు.

ప్రయాణికులను మోసం చేస్తున్నారు

- ఎయిర్ ఇండియాపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆగ్రహం
- విమానంలో విరిగిన సీటు కేటాయించడంపై మండిపాటు
- కేంద్ర మంత్రికి క్షమాపణ తెలిపిన ఎయిర్ ఇండియా

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ 'ఎయిర్ ఇండియా'పై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ చౌహాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానంలో తనకు విరిగిన సీటును కేటాయించారని మండిపడ్డారు. తనకు ఎదురైన చేదు అనుభవం గురించి ఆయన శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''భోపాల్ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు ఎయిర్ ఇండియా ఏఐ–436 విమానంలో టికెట్ బుక్ చేసుకున్నా. 8సీ సీటు కేటాయించారు. లోపలికి వెళ్లి చూడగా ఆ సీటు విరిగిపోయి, లోపలికి కుంగిపోయి ఉంది. సిబ్బందిని ప్రశ్నించగా.. ఈ సీటు సరిగ్గా లేదని, దీనిని కేటాయించొద్దని యాజమాన్యానికి ముందే తెలియజేశామని నాకు చెప్పారు. నాతోటి ప్రయాణికులు నాకు సాయం చేయడానికి ముందుకొచ్చారు. వారి సీట్లో కూర్చోమని నన్ను కోరారు. ఇతరుల సీట్లో కూర్చొని వారిని ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదు కదా! విరిగిపోయిన సీటును అసలు ఎందుకు కేటాయించారు? విమానంలో మరికొన్ని సీట్ల పరిస్థితి కూడా దాదాపు అలాగే ఉంది'' అంటూ ఎయిర్ ఇండియా తీరుపై ధ్వజమెత్తారు. టాటా గ్రూప్ చేతుల్లోకి వెళ్లిన తర్వాత ఎయిర్ ఇండియా సంస్థ పనితీరు మెరుగవుతుందని ఆశించా. కానీ అది పొరపాటు అని అర్థమైందని పేర్కొన్నారు. ప్రయాణికులు పూర్తిస్థాయిలో టికెట్ సొమ్ము చెల్లిస్తున్నప్పుడు వారికి పాడైన సీటిస్తే ఎలా? ఇది మోసం కాదా? అని నిలదీశారు. మంత్రి పోస్టుపై ఎయిర్ ఇండియా స్పందించింది. ఆయనకు అసౌకర్యం కల్పించినందుకు క్షమాపణ కోరుతున్నట్లు పేర్కొంది. అసలేం జరిగిందో తెలుసుకోవడానికి దర్యాప్తు ప్రారంభిస్తామని, పరిస్థితి చక్కదిద్దుతామని హామీ ఇచ్చింది. చౌహాన్ ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విరిగిన సీటు కేటాయించడంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ స్పందించింది. ఈ అంశంపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

మారిషస్ స్వాతంత్య్ర వేడుకలకు ప్రధాని మోదీ

పోర్ట్ లూయిస్/న్యూఢిల్లీ: మార్చి 12వ తేదీన జరిగే మారిషస్ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ప్రధాని మోదీ గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. మారిషస్ ప్రధానమంత్రి రాం గులామ్ శుక్రవారం జాతీయ అసెంబ్లీలో ఈ విషయం ప్రకటించారు. ద్వైపాక్షిక సన్నిహిత సంబంధాలకిది నిదర్శనమన్నారు. 'నా ఆహ్వానం మేరకు మన దేశ 57వ స్వాతంత్య్ర దినం సందర్భంగా జరిగే జాతీయ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ సహృదయంతో అంగీకరించారని తెలిపేందుకు ఎంతో సంతోషిస్తున్నాను'అని ఆయన తెలిపారు. ఇటీవలే ఫ్రాన్స్, అమెరికాల్లో పర్యటనలు ముగించుకుని వచ్చిన మోదీ బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ తన ఆహ్వానాన్ని మన్నించారన్నారు.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



బకాయి.. పేరుకుపోయి

విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. బిల్లులు వసూలు చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. -8లో



మా బీటే.. సపరేటు

నగరంలో తెలుగు లైవ్ మ్యూజిక్‌కు క్లాప్ కొట్టింది కాప్రిసియో. పేరొందిన ట్రాక్‌ల మాషప్‌లతో వీరు తెలుగు శ్రోతల మనసులు గెలుచుకున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/20.0

నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 20 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.



భారత్, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ వీక్షణకు సిటీ రెడీ

నగర వ్యాప్తంగా భారీ స్క్రీన్స్, స్పెషల్ ట్రీట్స్..

ఆదివారం.. 'ఆట'విడుపు

సాక్షి, సిటీబ్యూరో:


హాలిడే బద్ధకం ఎగిరిపోనుంది. రోజంతా కళ్లార్పనివ్వని ఉద్వేగం దరి చేరనుంది. నగర వాసులకు ఈ సన్‌డే.. అసలు సిసలు హాట్ హాట్ విందును వడ్డించనుంది. ఆదివారం జరగనున్న భారత్, పాకిస్తాన్ క్రికెట్ పోరును వీక్షించేందుకు ఎవరి స్థాయిలో వారు ఏర్పాట్లు చేసుకున్నారు.

సిద్ధమైన వేదికలు...

పాక్- ఇండియా క్రికెట్ మ్యాచ్ అంటే ఎక్కడ లేని సందడి. పైగా ఆదివారం సెలవు రోజు కూడా కావడంతో క్రికెట్ ఫీవర్ రెండింతలైంది. దీంతో యువత, చిన్నా, పెద్దా, క్రికెట్ అభిమానులందరి వారాంతపు రొటీన్ మారిపోయింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగే డేఅండ్ నైట్ మ్యాచ్‌ను మిస్ కాకూడదు అదొకటే ప్లాన్. మధ్యాహ్నం 2 గంటలకే పనులన్నీ పూర్తి చేసుకుని టీవీల ముందు కూర్చోవడం మాత్రమే లక్ష్యం.

రివెంజ్ తీరేనా?

గత 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఎదురైన పరాభవాన్ని ఈసారి టీం ఇండియా తిప్పికొడుతుందనే నమ్మకం ధీమా నగర వాసుల్లో కనిపిస్తోంది. రెండు జట్లూ శాయశక్తులా పోరాడతాయి కాబట్టి.. ఉత్కంఠభరిత మ్యాచ్ తప్పదని నమ్ముతున్న సిటిజనులు ఆ థ్రిల్‌ని తనివితీరా ఆస్వాదించాలనుకుంటున్నారు. అలాంటి వారి కోసం రెస్టారెంట్, హోటల్స్, పబ్స్, క్లబ్స్, ఓపెన్ థియేటర్స్, ఇతర ప్రదేశాల్లో స్క్రీన్స్ ఏర్పాటు చేసి స్పెషల్ మెనూలు సిద్ధం చేశారు. ఫ్రెండ్స్‌తో కొందరు, ఫ్యామిలీస్‌తో కలిసి కొందరు.. ఎవరికివారు తమకు అనువైన వేదికలను వెతికే పనిలో నిమగ్నమయ్యారు.. ఏదేమైనా.. అందరి నోటా ఒకటే మాట 'జయహో ఇండియా'.





'బిల్డ్ నౌ'పై శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన జారీ చేసేందుకు త్వరలో అమల్లోకి రానున్న ఏఐ ఆధారిత 'బిల్డ్ నౌ' సింగిల్ విండో సిస్టమ్ గురించి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ఆర్కిటెక్టులు, ఇంజినీర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ విధానం వల్ల భవన నిర్మాణ అనుమతులు వేగంగా, పారదర్శకంగా ఉంటాయని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.దేవేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ సీసీపీ కె.శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణ ప్రాజెక్టులు, డ్రాయింగ్‌లు రూపొందించేందుకు ఆర్కిటెక్టులు, ఇంజినీర్లకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఆర్కిటెక్టుల సందేహాలకు సమాధానాలిచ్చారు.

అపార్టుమెంట్లలో భోరుమంటున్న బోర్లు

పెను భారంగా నీటి ట్యాంకర్ల ధరలు

- నీళ్లకే నెలకు రూ.250 నుంచి రూ.500 కోట్లు
- గ్రేటర్‌లో సుమారు 10 లక్షలకు పైగా కుటుంబాలపై ప్రభావం
- ఒక్కో ఫ్లాట్‌కు నెలవారీ ఖర్చు రూ.2,500- రూ 5,000 పైనే
- తాగునీటితో పాటు నిత్యావసరాలకూ కష్టమే
- జలమండలి అరకొర నీటి సరఫరా అంతంతే
- పెరిగిపోయిన ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీ
- ఈసారి మరింత పెరగనున్న చార్జీల మోత
- నగరంలో 72 వేల అపార్టుమెంట్లపై ప్రభావం

మహా నగరానికి 'జల'దరింపు మొదలైంది. అపార్టుమెంట్లకు నీటి ట్యాంకరే దిక్కయింది. వేసవి వచ్చిందంటే చాలు నిలువెల్లా నీటి కష్టాలు చుట్టుముడుతున్నాయి. వాటర్ ట్యాంకర్ల భారం భారీగా పెరిగింది. సుమారు 10 లక్షలకు పైగా కుటుంబాలు నెలవారీగా నగటున రూ.2,500 నుంచి రూ.5,000 వరకు అదనంగా భరిస్తున్నాయి. ఈ లెక్కన నెలవారీగా నీటి ట్యాంకర్లకు రూ.250 కోట్ల నుంచి రూ.500 కోట్లకు పైగా వెచ్చించాల్సిన దారుణమైన పరిస్థితి నెలకొంది. ప్రతీ వేసవిలో వాటర్ ట్యాంకర్ల భారం షరామామూలే అయినా.. ఈసారి మాత్రం కొంత ముందస్తుగానే చార్జీల మోత మోగుతోంది. - సాక్షి, సిటీబ్యూరో



బిగ్ స్టోరీ

జల ఘోష!

మహా నగర పరిధిలో..	
అపార్టుమెంట్లు	2,84,829
పెద్ద అపార్టుమెంట్లు	36,827
ఓఆర్ఆర్ పరిధిలో	7,893

జలమండలి ట్యాంకర్ల బుకింగ్‌లు ఇలా..

నెల	2024	2025
జనవరి	85,769	1,22,427
ఫిబ్రవరి 22 వరకు	82,654	1,32,797

ప్రస్తుతం జలమండలి ట్యాంకర్ల పరిస్థితి	
ప్రస్తుతం రోజువారీగా వాటర్ ట్యాంకుల బుకింగ్	6,324
ట్యాంకర్ల డెలివరీ సమయం	24 గంటలు
ట్యాంకర్ల సంఖ్య	955
ఫిల్లింగ్ స్టేషన్లు	80
ఫిల్లింగ్ పాయింట్లు	127



గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఓఆర్ఆర్ పరిధిలో ఎండలు ముదరక ముందే భూగర్భ జలాల పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతోంది. బహుళ అంతస్తుల భవన సముదాయాల్లో బోరుబావులు బావురుమంటున్నాయి. గ్రేటర్ పరిధిలో సుమారు 3.29 లక్షల వరకు చిన్న, పెద్ద అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలుండగా అందులో సుమారు 72 వేల బహుళ అంతస్తు భవన సముదాయాల్లో నీటి ఎద్దడి నెలకొంది. జలమండలి నిత్యం నీటిని సరఫరా చేస్తున్నా.. నల్లాలకు మోటార్లు బిగించడం, లోప్రెషర్ తదితర సమస్యలతో ఏ మూలకూ సరిపోవడం లేదు. దీంతో ప్రతీ వేసవి తరహాలోనే ఈసారి కూడా ట్యాంకర్ల నీటిపై ఆధారపడక తప్పని పరిస్థితి. ఫలితంగా గత నెల రోజులుగా జలమండలి ట్యాంకర్ల బుకింగ్ బాగా ఎగబాగుతోంది. అదే స్థాయిలో ప్రైవేట్ ట్యాంకర్లకు కూడా డిమాండ్ పెరిగింది. దీంతో పలు ప్రాంతాల్లో ట్యాంకర్ల హడావుడి మొదలైంది. ఓఆర్ఆర్ పరిధిలో వేలాది బహుళ అంతస్తుల భవంతులకు వాటర్ బోర్డు నల్లా కనెక్షన్లు లేవంటే అతిశయోక్తి కాదు. వీరంతా బోరు బావులను, ప్రైవేట్ ట్యాంకర్ల నీళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

నీటి ఖర్చులు తడిసి మోపెడు..

బోర్లు ఎండిపోతుండటంతో రోజువారీగా వాటర్ ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్థికంగా అపార్టమెంట్‌వాసులపై భారం తడిసి మోపెడవుతోంది. ఉదాహరణకు 12 ఫ్లాట్లున్న చిన్న అపార్ట్‌మెంట్ నిత్యం ఐదువేల లీటర్లు కలిగిన ఒక ట్యాంకర్ కొనుగోలు చేస్తే.. రోజుకు వెయ్యి రూపాయలు.. సగటున నెలకు రూ.30 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అంటే ఒక్కో ఫ్లాటు యజమానికి నెలకు నీటి కోసమే రూ.2,500 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందన్న మాట. పెద్ద అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలైతే మరింత భారం తప్పదు. ముఖ్యంగా శేరిలింగంపల్లి, మణికొండ, పుప్పాలగూడ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, నిజాంపేట్, మదీనాగూడ, చందానగర్, సిక్ విలేజ్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, కూకట్‌పల్లి, ఉప్పల్, నాగోల్ తదితర ప్రాంతాల్లో ట్యాంకర్లకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోంది.

ప్రైవేట్ ట్యాంకర్లకు కాసుల పంటే..

జలమండలి ఉదాసీనత ప్రైవేట్ నీటి వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. వాటర్‌బోర్డు ట్యాంకర్ల ధర తక్కువగా ఉన్నప్పటికి సరఫరాలో బుకింగ్ నుంచి డెలివరీ వరకు 24 గంటలు పడుతుండటం ప్రైవేట్ ట్యాంకర్ల ఆపరేటర్లకు కలిసి వస్తోంది. నగర శివారులోని ఖాళీ ప్లాట్లతో పాటు చెరువుల పక్కన ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. స్థానిక నేతల అండదండలతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా నీటి దందా కొనసాగిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో తాగడానికే కాదు.. కనీసం ఇతర అవసరాలకు అల్లాడుతున్న అపార్టుమెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఐటీ కంపెనీలు, ఇతర వ్యాపార సంస్థల నీటి డిమాండ్‌తో ట్యాంకర్ల రేట్లను పెంచేస్తున్నారు.

అడ్డగోలు రేట్లు..

ప్రైవేట్ ట్యాంకర్లపై నియంత్రణ కొరవడటంతో చార్జీలు అడ్డగోలుగా బాదేస్తున్నారు. సాధారణంగా 5000 లీటర్ల వాటర్ ట్యాంకర్‌ను వాటర్‌బోర్డు కస్టమర్ అకౌంట్ నంబర్ (సీఏఎన్) ద్వారా బుక్ చేసినవారికి రూ.500కు లభిస్తుంది. సీఏఎన్ లేనివారికి అదే ట్యాంకర్‌ను రూ.850కు సరఫరా చేస్తుంది. కానీ.. అదే ట్యాంకర్‌ను ప్రైవేటులో తెప్పించుకోవాలంటే ప్రాంతాన్ని బట్టి, కొనుగోలుదారుల అవసరాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తుండటం గమనార్హం.

పెండెన్సీ లేకుండా ట్యాంకర్ల సరఫరా..



వాటర్ ట్యాంకర్ల బుకింగ్ పెండెన్సీ లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాం. బుకింగ్ నుంచి డెలివరీ వరకు రియల్ టైమ్‌ను పర్యవేక్షిస్తున్నాం. ఫిల్లింగ్ స్టేషన్లలో ఫిల్లింగ్ టైమ్ తగ్గించేవిధంగా కసరత్తు చేస్తున్నాం. ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లను పెంచాం. ట్యాంకర్ల కోసం వేచి చూసే పరిస్థితి లేకుండా సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

జలమండలి చర్యలు..

వేసవి కంటే ముందే బుకింగ్ పెరుగుతుండటంతో ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి సరఫరాలో జాప్యం, వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గించేలా జలమండలి చర్యలు చేపట్టింది. మెట్రో కస్టమర్ కేర్ (ఎంసీసీ) ద్వారా జరిగే బుకింగ్‌లకు మొదటి ప్రాధాన్యమిస్తోంది. ట్యాంకర్ మేనేజ్‌మెంట్ సెల్ ఏర్పాటు చేసి వివిధ సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ల నుంచి సమన్వయంతో ట్యాంకర్ల సరఫరా జరిగే విధంగా ఆదేశాలు జారీ చేసింది. వాటర్ ఫిల్లింగ్ పాయింట్లకు డీజీఎం స్థాయి అధికారికి పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. ట్యాంకర్ బుకింగ్ మొదలు.. డెలివరీ వరకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వాటర్‌బోర్డు ప్రత్యేక యాప్‌ను అందుబాటులో తెచ్చింది. డిమాండ్‌ను అధిగమించేందుకు ట్యాంకర్ల సంఖ్య, ఫిల్లింగ్ స్టేషన్ల, ఫిల్లింగ్ పాయింట్లు సంఖ్యను పెంచింది.





మెయింటెనెన్స్‌పై అదనపు భారం

అపార్ట్‌మెంట్‌లో బోరు ఎండిపోతుండటంతో ట్యాంకర్ నీటిపై ఆధారపడక తప్పడం లేదు. జలమండలి ట్యాంకర్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా వస్తుందనే నమ్మకం లేదు. ప్రైవేటు ట్యాంకర్ బుక్ చేస్తే ధర అధికంగా ఉంటోంది. గత నెలలో అపార్ట్‌మెంట్ మెయింటెనెన్స్ అదనంగా రూ.1500 భారం పడింది. ఈసారి రెట్టింపు చెల్లింపు తప్పదు. జలమండలి సకాలంలో ట్యాంకర్లను సరఫరా చేయాలి. - మీర్జా ఇక్బాల్ అహ్మద్, షేక్‌పేట్

వేసవి వచ్చిందంటే బెంబేలే..



వేసవి వచ్చిందంటే అపార్టుమెంట్‌లో బోరు ఎండిపోతోంది. జలమండలి ట్యాంకర్ బుక్ చేస్తే రెండు మూడు రోజుల సమయం పడుతోంది. అత్యవసరం కావడంతో ప్రైవేటు ట్యాంకర్ బుక్ చేయక తప్పడంలేదు. 5 వేల లీటర్ల ట్యాంక్‌కు రూ.1,100 చెల్లించాల్సి వస్తోంది. నాలుగు నెలల పాటు అదనపు భారం తప్పదు. - రాజేశ్, మాదాపూర్

అరుణవ్ చిరునవ్వులు.. ఇక కానరావు

ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం

- ఒక్కగానొక్క కుమారుడి మృతితో కన్నీరు మున్నీరు
- లిఫ్టులో ఇరుక్కుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి మృతి



అరుణవ్ (ఫైల్)

నాంపల్లి: చిరునవ్వుల అరుణవ్ ఊపిరాగింది. ఇరు కుటుంబాల ఆశల కిరణం ఆరిపోయింది. లిఫ్టులో ఇరుక్కుని చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతూ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరేళ్ల బాలుడు అరుణవ్ శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో మృతి చెందాడు. అరుణవ్‌ను బతికించడానికి నిలోఫర్ వైద్యులు శత విధాలా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. మెదడుకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడంతో బాలుడు మృతి చెందినట్లు నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ ప్రకటించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి బంధువులకు అప్పగించారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడు ఆరేళ్లకే కన్నుమూయడంతో అజయ్‌కుమార్ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

అత్తను చూసేందుకు వచ్చి..

గోడేఖీ ఖబర్ ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ దంపతులకు ఒకే ఒక సంతానం. మగ పిల్లాడు పుట్టడంతో ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. అజయ్‌కుమార్ సోదరి, అరుణవ్ మేనత్త జయశ్రీ అలియాస్ ఆయేషా శాంతినగర్‌లో నివాసం ఉంటున్న ఇమ్రాన్‌తో ప్రేమ వివాహం చేసుకున్నారు. సోదరి ప్రేమ వివాహం చేసుకోవడంతో చాలా రోజులు అజయ్‌కుమార్ కుటుంబం జయశ్రీ అలియాస్ ఆయేషాతో దూరంగా ఉంటోంది. ఆయేషాకు ఇటీవల తన పుట్టింటితో బంధం మళ్లీ చిగురించింది. మాట్లాడుకోవడాలు, వచ్చిపోవడాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే బాలుడు అరుణవ్ శుక్రవారం తన తాతయ్యతో కలిసి శాంతినగర్‌లోని మేనత్త ఇంటికి వచ్చి లిఫ్టులో ఇరుక్కుపోయాడు. అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. రెండు కుటుంబాల మధ్య చిగురించిన బంధంలో బాలుడి మరణం విషాదాన్ని నింపింది.

నవ్వుతూనే కేన్సర్‌ను జయించా


'కోపింగ్ విత్ కేన్సర్' పుస్తకావిష్కరణలో రచయిత రమేంద్ర కుమార్



కోపింగ్ విత్ కేన్సర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కంటోన్మెంట్: నవ్వుతూనే కేన్సర్‌ను జయించానని ప్రముఖ రచయిత, స్టోరీ టెల్లర్, ఇన్‌స్పిరేషనల్ స్పీకర్ రమేంద్ర కుమార్ అన్నారు. కేన్సర్ బారిన పడి..తన స్వీయ అనుభవాలతో రచించిన 'కోపింగ్ విత్ కేన్సర్ ' అనే పుస్తకాన్ని శనివారం సికింద్రాబాద్‌లోని గురుస్వామి సెంటర్‌లో ఆవిష్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ క్లాసికల్ డ్యాన్సర్ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ చేతుల మీదుగా జరిగిన పుస్తకావిష్కరణలో, ది హిందూ మాజీ అసోసియేటివ్ ఎడిటర్ సోమశేఖర్‌తో పాటు రమేంద్ర కుమార్ కుటుంబ సభ్యులు, వివిధ రంగాల్లో ప్రముఖులైన వ్యక్తులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేంద్ర కుమార్ మాట్లాడుతూ 2021 నవంబర్ 29న తాను కేన్సర్ బారిన పడినట్లు తేలిందన్నారు. ఒక్కసారిగా తన కాళ్ల కింద భూమి కదిలినట్లయిందన్నారు. అయితే తన సతీమణి మాధురి, కుమార్తె అంకిత ఇతర కుటుంబ సభ్యులు ఇచ్చిన మనో ధైర్యంతో చికిత్స తీసుకున్నానని అన్నారు. తాను బతకడం కష్టమని డాక్టర్లు నిర్ధారణకు వచ్చిన సమయంలో, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం డాక్టర్లను సైతం ఆశ్చర్యపరిచిందన్నారు. ముఖ్యంగా తన కుమార్తె అంకిత తనకు ఎంతో ధైర్యాన్ని అందించిందన్నారు. అంతకు ముందు ఎందరికో మనోధైర్యాన్ని ఇచ్చేలా స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఇచ్చిన తాను, వ్యక్తిగతంగా తనకు తాను నిభాయించుకున్నానని అన్నారు. షోలే సినిమాలోని గబ్బర్ సింగ్ చెప్పిన 'జో డర్ గయా...వో మర్ గయా' డైలాగ్‌తో పాటు పుష్ప సినిమాలోని 'జుఖేగా నహీ' డైలాగ్ తనకు స్ఫూర్తినిచ్చాయన్నారు. దాదాపు ఆరు నెలల చికిత్స అనంతరం తాను కేన్సర్‌ను జయించగలిగానన్నారు. 'మేనేజింగ్ ఎవ్రీ ట్యూమర్ విత్ హ్యూమర్' అనే వ్యాక్యాన్ని నమ్ముతూ తనలాంటి వారికి స్ఫూర్తి కలిగించేందుకే పుస్తకం రాశానన్నారు.


'తెలంగాణ కమల దళం' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: సీనియర్ జర్నలిస్టు, రచయిత్రి షేక్ హసీనా రాసిన 'తెలంగాణ కమల దళం' పుస్తకాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పుస్తక రచయిత్రిని అభినందించారు. ఎంతో మంచి పుస్తకాన్ని సమాజానికి అందించారని పేర్కొన్నారు. మరిన్ని మంచి పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బకాయి.. పేరుకుపోయి!

- భారీగా విద్యుత్ బిల్లుల పెండింగ్
- మెట్రోజోన్‌లో రూ.72.32 కోట్లు
- రంగారెడ్డి జోన్‌లో రూ.38.28 కోట్లు
- మేడ్చల్ జోన్‌లో రూ.12 కోట్లు
- వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఎప్పటికప్పుడు బిల్లులు జారీ చేసి, రెవెన్యూ కలెక్షన్ చేయాల్సిన ఇంజనీర్లు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో పెండింగ్ బిల్లులు పెరిగిపోతున్నాయి. గ్రేటర్ సర్కిళ్ల పరిధిలో 62 లక్షలకుపైగా గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు ఉండగా, వీటిలో ప్రస్తుతం మెట్రో జోన్ పరిధిలో 3,94,763 సర్వీసులు, మేడ్చల్ జోన్‌లో 2,24,816 సర్వీ సులు, రంగారెడ్డి జోన్‌లో 2,84,902 సర్వీసులు సంస్థకు విద్యుత్ బిల్లు బకాయిపడ్డాయి. ఈ మేరకు అకౌంట్స్ విభాగం వందశాతం రెవెన్యూ కలెక్షన్స్ లక్ష్యంగా ప్రతి నెలా 'డి' లిస్ట్ (డిస్‌కనెక్షన్) తయారు చేసి, క్షేత్రస్థాయి ఇంజనీర్లకు అందజేస్తోంది. వీరు ఎప్పటికప్పుడు ఆయా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా బకాయిలు భారీగా పేరుకుపోయి సంస్థ ఆర్థిక సంక్షోభానికి కారణమవుతున్నారు.

ఆదేశాలు పట్టని సిబ్బంది

అత్యధికంగా మెట్రో జోన్ నుంచి రూ.72.32 కోట్లు రావాల్సి ఉంది. ఆ తర్వాత రంగారెడ్డిజోన్ నుంచి రూ.38.28 కోట్లు, మేడ్చల్ జోన్ నుంచి రూ.12 కోట్లకుపైగా బకాయి వసూలు కావాల్సి ఉంది. ఒక్క హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధి నుంచే రూ.51.06 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ బిల్లుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆదేశించినప్పటికీ రంగారెడ్డి జోన్ ఇంజనీర్లు తప్ప మిగిలిన జోన్ ఇంజనీర్లు ఇప్పటి వరకు అటువైపు దృష్టి సారించలేదు. కేవలం మీటర్ రీడింగ్‌కే పరిమితం అవుతున్నారు. వందశాతం బిల్లులు వసూలు చేయాలనే డిస్కం ఆదేశాలను వారు సీరియస్‌గా తీసుకోకపోవడంతో ప్రతి నెలా బకాయిదారుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

మూడు జోన్ల పరిధిలో బకాయిలు (రూ.కోట్లలో)

సర్కిల్	బకాయిలు
హైదరాబాద్ సౌత్	51.06
రాజేంద్రనగర్	22.58
హైదరాబాద్ సెంట్రల్	16.16
సైబర్‌సిటీ	7.70
వికారాబాద్	5.45
సంగారెడ్డి	4.28
హబ్సిగూడ	4.04
మేడ్చల్	3.73
సరూర్‌నగర్	2.55
సికింద్రాబాద్	2.05

భార్యను వేధించిన జాయింట్ కమిషనర్‌కు రిమాండ్

బౌద్ధనగర్: కట్టుకున్న భార్యను వేధింపులకు గురి చేసి..వేరే మహిళతో అక్రమంగా కాపురం చేస్తున్న జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్‌ను వారాసిగూడ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన ప్రకారం..జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జానకిరామ్ తన భార్యను విడిచిపెట్టి..కొద్ది నెలలుగా వేరే మహిళతో కాపురం పెట్టాడు. విషయం తెలుసుకున్న భార్య కల్యాణి శుక్రవారం మరో మహిళతో కలిసి ఉన్న భర్త జానకిరామ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని దేహశుద్ధి చేసింది. అనంతరం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం జానకిరామ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉద్యోగం కోసం నగరానికి వచ్చి..

కేపీహెచ్‌బీకాలనీ: ఉద్యోగం కోసం నగరానికి వచ్చి..మానసిక వేదనకు గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కర్నూలు జిల్లా కొత్తకోట మండలం సుంకేశులకు చెందిన మల్లికార్జున (26) ఉద్యోగ నిమిత్తం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నగరానికి వచ్చాడు. పనికి వెళ్లి ఉంటాడని, తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు భావించి మిన్నకుండిపోయారు. శనివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో మల్లికార్జున సోదరి సువర్ణ అతనికి ఫోన్ చేయగా..గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌ను లిఫ్ట్ చేసి ప్రగతినగర్ రోడ్డులోని అంబీర్ చెరువు వద్ద ఒక వ్యక్తి కేబుల్ వైరుతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపాడు. అతని దగ్గర ఉన్న ఫోన్ మోగితే తాను తీసినట్లు తెలిపాడు. వెంటనే ఆమె విషయాన్ని తండ్రి బీరప్పకు తెలుపగా హుటాహుటిన తరలివచ్చాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రిప్టో కరెన్సీ మోసగాడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక రాబడి ఆర్జించవచ్చని అమాయకులను మోసం చేస్తున్న కేటుగాణ్ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. చెన్నైకి చెందిన ఎస్.రామకృష్ణారెడ్డి తన సోదరుడితో కలిసి క్రిప్టో కరెన్సీ వ్యాపారులను మోసం చేసి, సులభంగా డబ్బు సంపాదించడానికి పథకం వేశాడు. ఈక్రమంలో బిట్‌కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ పేరిట సంస్థను ప్రారంభించాడు. ట్రేడింగ్ కష్టమర్లు తన ప్లాట్‌ఫామ్ ద్వారా క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేస్తే అధికంగా సంపాదించవచ్చని ఆశ పెడుతూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేశాడు. ఈ ప్రకటనకు ఆకర్షితుడైన జూబ్లీహిల్స్‌కు చెందిన 35 ఏళ్ల బాధితుడు రూ.8.49 లక్షల విలువైన క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేశాడు. కొంతకాలం తర్వాత ఇన్వెస్టర్ మొత్తం సొమ్మును నిర్వహణ రుసుము పేరుతో స్వాహా చేయడంతో జీరో బ్యాలెన్స్‌గా కనిపించింది. పైగా గడువు ముగిసినట్లు కనిపించింది. దీంతో బాధితుడు వెంటనే ఈ-మెయిల్ ద్వారా బిట్‌కాయిన్ ఇండియా వాలెట్ సపోర్ట్‌ను సంప్రదించగా..ఎలాంటి స్పందన లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు నమోదైన కేసులో సాంకేతిక ఆధారాలతో రామకృష్ణా రెడ్డిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీ దేవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ మాధవీ దేవి

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర చాలా కీలకమైనదని హైకోర్టు జడ్జి జస్టిస్ టి.మాధవీ దేవి అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలోని కళాశాలలో 'విమెన్ అండ్ క్లైమేట్ యాక్షన్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీ దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇళ్లల్లో గాని, బయటగాని మహిళలు ఎక్కువ నష్టాన్ని భరిస్తున్నారని, ఎక్కువ కష్టాన్ని అనుభవిస్తున్నారని అన్నారు. ప్రకృతి పరంగా ఎదురయ్యే విపత్తులను ఎదుర్కొనే సందర్భంలో గానీ, ప్రకృతిని రక్షించే బాధ్యతలను తీసుకునే గొప్పతనంలో కాని మహిళలు ఎల్లప్పుడు ముందుంటారని అన్నారు. పర్యావరణవేత్త ప్రొఫెసర్ ముత్యం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే అందరూ క్లైమేట్ యాక్షన్ అనే అంశాన్ని ఒక సబ్జెక్టుగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతా దేవి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, సీనియర్ అడ్వొకేట్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి స్థల ఆక్రమణకు యత్నిస్తున్న కబ్జాదారుడిపై కేసు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెం.10లోని తట్టిఖానా వాటర్ సెక్షన్ కార్యాలయం పక్కన ఉన్న జలమండలికి చెందిన స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తూ బోర్డులు తొలగించిన కబ్జాదారుడు పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నెం.10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా సర్వేనెంబర్-403/పిలో జలమండలికి ఇటీవల ప్రభుత్వం రెండెకరాల ఇరవై గుంటల స్థలాన్ని కేటాయించి పంచనామా చేసి అప్పగించింది. జలమండలి అధికారులు చుట్టూ ప్రహరీ కూడా నిర్మించారు. ఇది జలమండలికి చెందిన స్థలమంటూ బోర్డులు ఏర్పాటుచేశారు. అయితే పార్థసారథి అనే కరడుగట్టిన భూకబ్జాదారుడు బౌన్సర్లు, రౌడీలతో కలిసి ఈ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా జలమండలికి చెందిన బోర్డులు కూడా తొలగించాడు. సమాచారం అందుకున్న తట్టిఖానా వాటర్ సెక్షన్ మేనేజర్ రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు పార్థసారథిపై బీఎన్ఎస్ సెక్షన్ 329 (2), 303 (2), 351 (4), రెడ్ విత్ 61 (2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ స్థలాన్ని తరచూ పార్థసారథి కబ్జా చేసేందుకు యత్నిస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నా వినిపించుకోకుండా స్థల కబ్జాకు యత్నిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న వ్యాపారులపై కేసు

బంజారాహిల్స్: మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న వ్యాపారిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10లోని వెంకటగిరి ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా కె.వెంకటేశ్వరరావు అనే వ్యాపారి గత కొంత కాలంగా తన కుమారుడితో కలిసి మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఇక్కడ దాడులు చేసి మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తుండగా వెంకటేశ్వరరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక్కడ సిగరెట్లు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో పోలీసులు మాటు వేశారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థి (15) ఇక్కడ సిగరెట్లు కొనుగోలు చేసి పట్టుబడ్డారు. వెంటనే పోలీసులు సోదాలు నిర్వహించి ఖరీదైన సిగరెట్లను పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంధం ప్రమీల కూడా ఇదే ప్రాంతంలో సిగరెట్లు మైనర్లకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. సుమారు రూ.6 వేలు విలువ చేసే ఈ సిగరెట్లను సీజ్ చేశారు. ఇదిలా ఉండగా యాంటీ నార్కోటిక్ బ్యూరోకు ఇటీవలనే ఫిర్యాదు కూడా అందింది. దీంతో సీఐ లాల్‌మదార్, ఎస్ఐ వెంకటరమణ తదితరులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి వీరిపై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహమైన నెలకే.. భార్య దూరమైందని యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: వివాహమైన నెల రోజులకే భార్యతో మనస్పర్థలు వచ్చి విడిపోవడంతో..జీవితంపై విరక్తి చెందిన ఒక యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాదౌర గ్రామానికి చెందిన నీలేశ్ సింగ్ (25) తన సోదరుడు ముఖేశ్ సింగ్ ఇతర స్నేహితులతో కలిసి ఉపాధి కోసం నగరానికి వచ్చారు. మేడ్చల్ ప్రాంతంలో ఉంటూ రాయల్‌పూర్ క్వారీలో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మేడ్చల్ ప్రాంతంలో వీరందరి పని పూర్తవడంతో కడపలోని క్వారీలో పని చూసుకున్నారు. కడపకు వెళ్లేందుకు నీలేశ్ తన సోదరుడు ముఖేష్, మిత్రులతో కలిసి శనివారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు టికెట్ తీసుకున్న వారంతా రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాలులో కూర్చున్నారు. అదే సమయంలో తన పాకెట్‌లోంచి సెల్‌ఫోన్, పర్సు తీసిన నీలేశ్ తన బ్యాగులో పెట్టి ఇప్పుడే వస్తానని సోదరుడికి చెప్పి బయటకు వెళ్లాడు. రైలు వచ్చే సమయం అవుతున్నా నీలేశ్ రాకపోవడంతో అతడి సోదరుడు, మిత్రులు స్టేషన్ అంతటా గాలించినా ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్టు స్టేషన్ డిప్యూటీ మేనేజర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల దర్యాప్తులో నీలేశ్ ఆత్మహత్యకు పాల్పడినట్టు తేలింది. ఇదిలా ఉండగా ఇటీవలే నీలేశ్‌కు వివాహం జరిగిందని, వ్యక్తిగత కారణాలతో నెల రోజుల కాపురం అనంతరం వారిద్దరు విడిపోయారని మృతుడి సోదరుడు ముఖేష్ పోలీసులకు వివరించాడు. అప్పటి నుంచి నీలేశ్ ముభావంగా ఉంటున్నాడని, అదే కారణంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు నీలేష్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

ఆశ పెట్టేసి..నిలువెల్లా దోచేసి!

గ్రేటర్‌లో పెరుగుతున్న ఆర్థిక నేరాలు

సాక్షి, సిటీబ్యూరో: 'రాత్రికి రాత్రే లక్షాధికారి అయిపోవాలి..కష్టపడకుండానే జేబు నిండిపోవాలి..తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే' ఆలోచనా ధోరణితో ఉన్నవారు నిలువెల్లా మోసపోతున్నారు. ఇటీవల కాలంలో గ్రేటర్‌లో ఆర్థిక నేరాలు పెరిగిపోవడానికి ఇలాంటి ధోరణులే కారణమని తేలింది. అధిక సంపాదనకు ఆశ పడి నగరవాసులు జేబు గుల్ల చేసుకుంటున్నారు.

రూటు మార్చిన నేరగాళ్లు..

నేరస్తులు రూటు మార్చారు. గతంలో మాదిరిగా ఇళ్లలో దోపిడీలకు బదులుగా ఆర్థిక నేరాలతో సులువుగా కోట్లు సంపాదించేయాలని భావిస్తున్నారు. ఖరీదైన కార్లలో ప్రయాణం, లగ్జరీ లైఫ్ స్టయిల్, అందమైన బ్రోచర్లు, తీయని మాటలతో మోసాలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో ఆర్థిక నేరాలు, నమ్మకద్రోహం, చీటీల పేరుతో వసూళ్ల వంటి నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతిమంగా మధ్యతరగతి ప్రజలు బలైపోతున్నారు. రూ.లక్షకు నెలకు రూ.10 వేలు వడ్డీ ఇస్తామని ప్రకటించినప్పుడు..ఇలాంటి వడ్డీ బ్యాంకులు ఎందుకు ఇవ్వలేకపోతున్నాయో గమనించాలి. ఇంటి పక్కవారు, స్నేహితులు కూడా అధిక వడ్డీ ఇస్తామంటే మోసమేనని గ్రహించాలి. లేకుంటే మీరిచ్చిన అసలు మొత్తం కూడా మీకు రాదు. ఇక భూములపై పెట్టుబడులు పెడితే మూడితంలు వస్తుందని చెప్పే వారినీ నమ్మకుండా..ముందస్తు నిర్ధారణ చేసుకోవాలి. లేకుంటే మోసపోక తప్పదు.

ఏటా 10 శాతం పెరుగుదల..

నగరంలో ఏటా సగటున 10 శాతం కంటే ఎక్కువగా ఆర్థిక నేరాలు, చీటింగ్ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చీటీలు, పెట్టుబడులకు సంబంధించిన మోసాలు మూడింతలు పెరుగుతున్నాయి. ముందు డిపాజిట్లు కడితే తర్వాత వడ్డీతో కలిపి చెల్లింపులు, భూములపై పెట్టుబడులు పెట్టాలని నమ్మించి మోసం చేస్తున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గత మూడేళ్లలో నగరంలోని మూడు కమిషనరేట్లలో దోపిడీలు, దొంగతనాలు, సొత్తుకోసం హత్య వంటి అన్ని రకాల చోరీల కంటే ఆర్థిక నేరాలే అధికంగా నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

విద్యుత్ అంతరాయం లేకుండా..

వేసవిలో డిమాండ్‌కు సరిపడా సరఫరాకు చర్యలు



వినియోదారులతో మాట్లాడుతున్న విద్యుత్ సిబ్బంది

- బంజారాహిల్స్ సర్కిల్‌లో అధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- అదనపు ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబర్

బంజారాహిల్స్: వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సర్కిల్ ఎస్ఈ కరుణాకర్‌బాబు వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో పర్యటించారు. వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటూనే వారికి పలు సూచనలు చేస్తున్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో లోపాలు ఉంటే సత్వరమే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలో..

టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సర్కిల్ పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, గ్రీన్‌ల్యాండ్స్, ఎస్సార్‌నగర్, బేగంపేట డివిజన్లు వస్తుండగా, వీటన్నింటి పరిధిలో బంజారాహిల్స్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, మాదాపూర్, అమీర్‌పేట, ఎస్‌కేనగర్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, మోతీనగర్, బోరబండ, ఎర్రగడ్డ తదితర సెక్షన్లు ఉన్నాయి.

- బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలో 33/11 కేవీ 36 సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్లు 310 ఉన్నాయి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 9,900 ఉండగా అదనంగా మరో 140 ఏర్పాటు చేయనున్నారు.
- ప్రస్తుతం 11కేవీ ఫీడర్లు 310 ఉండగా అదనంగా మరో 12 ఫీడర్లు అమర్చనున్నారు.
- మొత్తం వినియోగదారులు 4,10,000 మంది ఉన్నారు.
- 1200 ఎస్‌టీ వినియోగదారులు ఉన్నారు.
- గతేడాది ఏప్రిల్ 30న ఒకేరోజు అధికంగా 14 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది.
- ప్రస్తుతం సగటున 6.5 ఎంయూ వినియోగం జరుగుతోంది.
- ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉండడంతో ఆ మేరకు అదనంగా ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రస్తుతం ఉన్న 36 సబ్‌స్టేషన్లకు అదనంగా బంజారాహిల్స్ రోడ్డునంబర్–10లోని జహీరానగర్‌లో మరో సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. ఇది 2 నెలల్లో అందుబాటులో రానున్నది.
- 11 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను 8ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏ కెపాసిటీగా మారుస్తున్నారు. అలాగే అదనంగా రెండు చోట్ల కొత్తగా 12.5 ఎంవీఏ రాబోతున్నాయి.
- ఇవేగాకుండా 45 ఫీడర్లు ఇంటర్ లింకింగ్ చేశారు.
- సర్కిల్ మొత్తానికి కలిపి ప్రతిరోజూ 120 నుంచి 130 ఫిర్యాదులు అందుతుండగా, సిబ్బంది వెంటనే వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

సమస్యలు ఉంటే 1912కు ఫిర్యాదు చేయాలి



విద్యుత్ సమస్యలు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ప్రస్తుతం ప్రతి షిఫ్టులో 30 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తూ కాల్స్‌ను స్వీకరించి వెంటనే లోకల్ సబ్‌స్టేషన్లు, సిబ్బందికి సమాచారం ఇస్తున్నారు. దీనివల్ల సమయం ఆదా అవడమే కాకుండా సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయి. వినియోగదారులు కూడా సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలి. ఫోన్‌పే, జీపేతో పాటు వెబ్‌సైట్‌లో పేమెంట్ లింక్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చు. వేసవి ప్రారంభం కావడంలో ఏసీలు, కూలర్లు మరమ్మతులతో పాటు వైరింగ్ చెక్ చేయించుకోవాలి. భద్రతా ప్రమాణాలపై దృష్టి పెట్టాలి. ఎర్తింగ్ చేయించుకుంటే మంచిది.

– కరుణాకర్‌బాబు, ఎస్ఈ, టీజీఎస్‌పీడీసీఎల్, బంజారాహిల్స్ సర్కిల్.

ఆస్తి పన్ను పరిష్కార వేదికకు ప్రత్యేక శిబిరాలు



ఆస్తి పన్ను పరిష్కార వేదికలో డీసీ ప్రశాంతి

బంజారాహిల్స్: ఆస్తి పన్ను పరిష్కార వేదికలో భాగంగా శనివారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం ఆవరణలో జీహెచ్ఎంసీ సర్కిల్–17, సర్కిల్–18 అధికారులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేశారు. మార్చి 31లోపు లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు ఇప్పటికే రెడ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు, వారెంట్లు జారీ చేసి చెల్లింపుదారులను అప్రమత్తం చేశారు. ఆస్తులను జప్తు కూడా చేస్తున్నారు. మొండి బకాయిదారులు భయపడి అప్పటికప్పుడు చెల్లింపులు కూడా చేస్తున్నారు. శనివారం ఖైరతాబాద్ సర్కిల్–17 డీసీ రజనీకాంత్‌రెడ్డి, జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీసీ ప్రశాంతి ఈ శిబిరాలను ఏర్పాటుచేసి వారి వారి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా వారికి పరిష్కార మార్గాలను చూపారు. సర్కిల్–17 పరిధిలో 5 దరఖాస్తులు, సర్కిల్–18 పరిధిలో 6 దరఖాస్తులను ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కోసం అందజేశారు.

బోర్డులు ఏర్పాటు చేసినా తీరు మారడం లేదు



నో పార్కింగ్ జోన్ బోర్డు ఏర్పాటు చేసిన ప్రాంతంలో అక్రమ పార్కింగ్

ఫిలింనగర్: ఫిలింనగర్ విగ్రహాల చౌరస్తా వెనుకాల అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా ఆ స్థలంలో వెంటనే రోడ్డు నిర్మించాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరింది. దీంతో స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా వెంటనే ఇక్కడ రోడ్డును నిర్మించింది. కానీ ఈ స్థలానికి చుట్టుపక్కల ఉన్న కొంతమంది ఈ రోడ్డు తమదేనంటూ యథేచ్ఛగా కర్రలు ఏర్పాటు చేసుకొని ఆ స్థలంలో నిత్యం వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన జూబ్లీహిల్స్ పోలీసులు ఇక్కడ వాహనాలు పార్కింగ్‌చేయవద్దంటూ రోడ్డును బ్లాక్ చేయవద్దంటూ బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. ఇవేవి పట్టని సదరు స్థానికులు యథేచ్ఛగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్ చేస్తున్న వాహనదారులకు భారీగా జరిమానాలు విధిస్తే తప్ప వారిలో మార్పు వచ్చే అవకాశం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

కుబేర సినిమా టైటిల్ మాదే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సినీ నిర్మాతలు

పంజగుట్ట: కుబేర సినిమా టైటిల్ తనదే అని తాను 2023 నవంబర్ 29వ తేదీనే తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లో టైటిల్ రిజిస్ట్రేషన్ చేయించానని త్రిశక్తి ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుడు, సినీ నిర్మాత నరేందర్ తెలిపారు. 2024 మార్చి 5 నుంచి దర్శకుడు శేఖర్ కమ్ముల కుబేర అనే సినిమా టైటిల్‌కు కాపీ చేసుకుని టైటిల్‌కు ముందు శేఖర్ కమ్ముల అని పెట్టి తమ సినిమాకు ఇబ్బంది కలిగిస్తున్నాడని ఆయన ఆవేదనవ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శేఖర్ కుమ్ముల కుబేర టైటిల్ కాపీ చెయ్యగానే తాను ప్రొడ్యూసర్ కౌన్సిల్‌లో సంప్రదిస్తే వారు పెద్దవారితో ఎందుకు పెట్టుకుంటున్నారు అంటూ తమనే బెదిరిస్తున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. న్యాయం జరుగకపోతే న్యాయపోరాటం చేస్తామన్నారు.

కూరగాయల ధరలు



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 40, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 40, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 19, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సీసీ రోడ్డు ప్రారంభించిన మేయర్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్–12లోని బోళానగర్‌లో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. 130 మీటర్ల పొడవులో ఈ రోడ్డు ను నిర్మించారు. ఈ కార్యక్రమంలో డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ హోటళ్లలో తనిఖీలు



హోటళ్లలో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–36లోని శ్రీరాఘవేంద్ర ఉడిపి హోటల్‌తో పాటు మెక్‌డోనాల్డ్స్, ఖైరతాబాద్‌లోని క్షేత్ర, శివ టిఫిన్ సెంటర్లలో జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ వింగ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు లోపాలను గుర్తించారు. పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని వెల్లడించారు. అనారోగ్యకర వాతావరణం ఉందని కూడా వెల్లడించారు. పలు శాంపిళ్లను సేకరించి నోటీసులు అందజేశారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు



బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్



రహమ్మత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజక వర్గానికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో చోటు దక్కింది. బోరబండ, రహమత్‌నగర్ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు బాబా ఫసియుద్దిన్, సీఎన్‌రెడ్డిల సేవలకు గుర్తింపుగా వారికి జీహెచ్ఎంసీ స్టాడింగ్ కమిటీలో స్థానం లభించింది. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి రెండవ సారి స్టాడింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులు కాగా.. బాబా ఫసియుద్దిన్ తొలిసారిగా నియమితులయ్యారు. దీంతో ఆయా డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీనగర్ వాంబే ఇళ్లలో కూలిన మెట్లు



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీలో 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం వాంబే స్కీం కింద బలహీన వర్గాలకు పక్కా ఇళ్లు నిర్మించింది. రోజురోజుకు ఈ పక్కా ఇళ్లు శిథిలావస్థకు చేరుతూ ప్రమాదకరంగా మారుతున్నాయి. మూడు రోజుల క్రితం ఓ బ్లాక్‌లో మూడంతస్తుల మెట్లు కూలిపోయాయి. దీంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మెట్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని జీహెచ్ఎంసీ సర్కిల్–18 అధికారులను స్థానికులు కోరుతున్నారు.

లవకుశ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

పంజగుట్ట: లవకుశ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా నంబూరి విజయశ్రీ చౌదరి, ప్రధానకార్యదర్శిగా ఎ.సదానందం నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు సి.చంద్రశేఖర్ శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. కర్నాటకలో లవకుశలు జన్మించిన స్థలంవద్ద 500 ఎకరాల్లో పెద్ద లవకుశ, శ్రీరామచంద్రుల దేవాలయం ట్రస్ట్ నిర్వహణలో సాగుతుందన్నారు.

యువతిపై దాడి

వెంగళరావునగర్: కట్నం తీసుకువచ్చి పెళ్లి చేసుకోవాలంటూ తనను వేధిస్తున్నాడని ఓ యువతి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఓ యువతి ఎల్లారెడ్డిగూడలోని హాస్టల్‌లో ఉంటూ బంజారాహిల్స్‌లోని ఒక హెల్త్‌కేర్ సెంటర్‌లో పనిచేస్తోంది. తన బావ అయిన శశివంత్ కూడా అక్కడే పని చేస్తున్నాడు. తనను పెళ్లిచేసుకోవాలని వేధించసాగాడు. హాస్టల్ వద్దకు వచ్చి దాడి కూడా చేశాడు. దీంతో బాధితురాలు శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

అబ్బురపరిచిన సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు..

ఫిలింనగర్: ఫిలింనగర్ బీజేఆర్ నగర్ బస్తీలోని ఎస్ఎల్ఎన్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన భిన్న రకాల నమూనాలు ఆలోచింపజేశాయి. 300 మందికి పైగా విద్యార్థులు 120కి పైగా వివిధ అంశాల్లో నమూనాలు ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.మధు తెలిపారు. వాతావరణ కాలుష్యం, రొబోటిక్ వ్యవస్థ, వ్యవసాయం, స్మార్ట్ సిటీలు, సోలార్ సిస్టమ్, మానవ జీవావరణ వ్యవస్థ, మంచినీటి ప్రాజెక్టులు ఇలా వివిధ అంశాల్లో విద్యార్థులు నమూనాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మిదేవి, అంజుమ్, వరలక్ష్మి, పుష్ప, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్‌లోనిఎస్‌వీఎస్ రెడ్ రోజ్ హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. పాఠశాలల చైర్మన్ నీల రమేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల ప్రతినిధులు వాణిశ్రీ, పార్వతి, మంజుల పాల్గొన్నారు.

కులగణనలో పేరు నమోదుకు మరో అవకాశం



కుల గణనపై అవగాహన కల్పించేలా రూపొందించిన టీషర్ట్స్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన మేధావులు, బీసీ వర్గాల నాయకులతో పాటు పలు వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కులగణనలో పేరు నమోదుకు మరో అవకాశం ఇచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కుల గణనపై అవగాహనకు జాతీయ బీసీదళ్ ఆధ్వర్యంలో రూపొందించిన టీ షర్ట్స్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటివరకు కుల గణనలో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు నమోదు చేసుకోవాలన్నారు. మూడు పద్ధతుల్లో కుల సర్వేలో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇచ్చామన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

లిబర్టీ: అన్ని వర్గాల విద్యార్థులు ఒకే ప్రాంగణంలో విద్యాభ్యాసం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం మంచి పరిణామం అని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు.

రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ జనరల్ పదవీ కాలం పొడిగింపు

బంజారాహిల్స్: కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లోని రిపబ్లిక్ రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ జనరల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ పదవీ కాలాన్ని ఐదేళ్లు పొడిగించింది. దీంతో 2030 జనవరి వరకు ఈ పదవిలో ఉండనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కజకిస్తాన్ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ పొడిగింపు భారత్–కజకిస్తాన్ సంబంధాల బలోపేతంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా వచ్చింది.



జీతాల కోసం ఆందోళన



పీఎస్ ముందు ఆందోళన చేస్తున్న బాధితులు

రహమత్‌నగర్: రెండు నెలలుగా జీతాలివ్వకపోవడంతో ఉద్యోగులు రోడ్డెక్కారు.. అర్ధరాత్రి వేళ ఆందోళన చేశారు. సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. సంతోష్ అనే వ్యక్తి ఆరు నెలల క్రితం శ్రీరాంనగర్‌లో మై ఫ్రూట్ బాక్స్ అనే పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశాడు. ఫ్రూట్ కటింగ్ కోసం 60 మహిళలను, 120 మంది డెలివరీ బాయ్స్‌ను నియమించుకున్నాడు. అయితే రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారు శుక్రవారం కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేశారు. అయితే బోరబండ పోలీసులు సంతోష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడికి కూడా చేరుకున్న బాధితులు అర్ధరాత్రి వరకు ఆందోళన చేశారు. అయితే పోలీసులు సర్ది చెప్పడంతో ఆందళన విరమించారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

వెంగళరావునగర్: ప్రభుత్వ పాఠశాలకు ఎలాంటి వసతులు కావాలన్నా తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని సుప్రీంకోర్టు న్యాయవాది నేరెళ్ల మాల్యాద్రి తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఇందులో భాగంగా స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు టాపర్స్ రోహిత్‌రెడ్డి (10వ తరగతి), సుమంత్ (9వ తరగతి)లకు రూ.7వేలు నగదును అందజేశారు. అలాగే చిత్రలేఖన పోటీల్లో విజయంసాధించిన దుర్గాభవానీ,అశ్విత, మెహరాజ్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పరమేశ్వరమ్మ, ఇన్‌చార్జి నరసింహా పాల్గొన్నారు.

టూర్ పంపిస్తానని ముఖం చాటేశాడు

బంజారాహిల్స్: యూరప్ టూర్‌కు పంపిస్తానని డబ్బు వసూలు చేసి ముఖం చాటేసిన వ్యాపారిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. కేంద్ర ప్రభుత్వ ఐఐసీటీలో ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కాప్రా నివాసి విష్ణువర్ధన్ తన స్నేహితుడు వెంకటనారాయణతో కలిసి యూరప్ టూర్ కోసం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఐడియా మంత్రా హాలిడేస్ డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డిని 2019 అక్టోబర్‌లో సంప్రదించారు. టూర్‌కు సంబంధించి ఒక్కొక్కరికి ప్యాకేజీ నిమిత్తం రూ.60 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షలు చెల్లించారు. అయితే ఎంతకూ ఈ టూర్‌కు పంపించకపోగా మధ్యలో కోవిడ్ అంటూ విమానాలు నడవడం లేదంటూ దాటవేశాడు. అయితే 2021లో దుబాయ్ మాల్దీవులకు పంపిస్తానని నమ్మించాడు. అందుకు కూడా వీరు ఒప్పుకున్నారు. ఈ టూర్‌కు సంబంధించి ఎన్నిసార్లు సంప్రదించినా శివప్రసాద్‌రెడ్డి సరైన సమాధానం చెప్పకపోగా దాటవేస్తూ వచ్చాడు. 2023 ఆగస్టులో జూబ్లీహిల్స్‌లోని ఆయన కార్యాలయానికి నేరుగా వెళ్లి చూడగా అక్కడి నుంచి ఆఫీసు ఎత్తేసినట్లు తేలింది. దురుద్దేశపూర్వకంగా తమ వద్ద డబ్బులు వసూలు చేసి నమ్మక ద్రోహానికి పాల్పడిన శివప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా వర్గీకరణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేమన ..

పంజగుట్ట: సామాజిక వెనుకబాటు ఆధారంగానే ఎస్సీ వర్గీకరణ చేయాలని సామాజిక న్యాయ సాధన వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ ఎస్.ఆర్.వేమన అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెనుకబాటు తనం ఆధారిత ఎంపిక ప్రక్రియ తీరును చార్ట్ రూపంలో డాక్టర్ పట్టా వెంకటేశ్వర్లు, పెరియార్ అంబేద్కర్, బడుగు భాస్కర్ జోగేష్, భూపతిరావు, కాగిత రమేష్ బాబుతో కలిసి వివరించారు. మందకృష్ణ మాదిగ సూచించినట్లు జనాభా ఆధారంగా రిజర్వేషన్ ఫలాలు ఇస్తే తిరిగి ఇప్పటివరకు రిజర్వేషన్ ఫలాలు పొందిన వారే తిరిగి ఫలాలు పొందుతారన్నారు.

ఆస్తిపన్ను పరిష్కార వేదిక



ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

వెంగళరావునగర్: ఆస్తిపన్నుల్లో చెల్లింపులో ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణమే వాటిని పరిష్కరించుకోవాలని జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలియజేశారు. యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో శనివారం ఆస్తి పన్ను పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంసీ జకియా సుల్తానా మాట్లాడుతూ మొండి బకాయిదారులు వేదిక వద్దకు వస్తే సలహాలు, సూచనలు అందజేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

సనత్‌నగర్: కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జిజ్ఞాస' స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల్లో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఇంగ్లీష్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, కామర్స్, జువాలజీ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మాథ్స్, హిందీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో విద్యార్థినుల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది విభాగాల్లోనూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందేలా విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు ఆయా సబ్జెక్టుల సూపర్‌వైజర్లను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



హెల్మట్‌ను అందజేస్తున్న డీసీపీ రాహూల్‌హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్

రహమత్‌నగర్: హెల్మెట్ వాడకపోవడం వల్ల అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని నార్త్, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ బీకే రాహూల్ హెగ్డే పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, యంగ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రహమత్‌నగర్‌లో హెల్మెట్ల పంపిణీ, అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నా చాల మంది వాహనదారులు హెల్మెట్లను వాడక పోవడం విచారకమన్నారు. వెస్ట్‌జోన్ ఏసీపీ హరిప్రసాద్,ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు,కార్పొరేటర్ సీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రేటర్‌పై కాషాయ జెండా ఎగురవేయాలి

సనత్‌నగర్: గ్రేటర్‌పై కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భరత్‌గౌడ్‌ను సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు శనివారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ బీజేపీ పటిష్టత కోసం శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మహేష్, వై.శ్రీనివాసరావు, సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025

నగరంలో నేడు

- తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో మహాకవుల శతజయంతి సందర్భంగా దాశరథి - ఆరుద్ర సాహిత్య సమాలోచన కార్యక్రమం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఉదయం 10 నుంచి ఉదయం 11.30గంటల వరకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వద్ద తనీరా ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు శారీ రన్ కార్యక్రమం జరుగుతుంది.
- నృత్య సేవ ఆధ్వర్యంలో వివేక చూడామణి విద్యార్థుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన సాయంత్రం 5 గంటలకు శేరిలింగంపల్లిలోని ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీలో జరుగుతుంది.
- లాలాగూడలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో కళాసిల్క్ మెగా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని హైటెక్‌సిటీ యశోద హాస్పిటల్‌లో బ్లడ్ కేన్సర్‌పై అంతర్జాతీయ సదస్సు మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.



డీసిల్టింగ్.. ఇంకెప్పుడు?

ఇంకా ప్రారంభం కాని పనులు | ఈసారి ముంపు తిప్పలు తప్పవా? | ఆందోళనలో పలు కాలనీల ప్రజలు

ప్రతి సంవత్సరం జనవరి నుంచే ప్రారంభమయ్యే డీసిల్టింగ్(పూడికతీత) పనులు ఈ సంవత్సరం ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. జనవరి నుంచి పనులు ప్రారంభించి మే వరకు పూర్తి చేయాలనేది లక్ష్యం. అందుకుగాను గతంలో డిసెంబర్‌లోనే టెండర్లు పిలిచేవారు. మేలోగా పనులు పూర్తిచేసి ఆ తర్వాత సైతం పేరుకుపోయే పూడికను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏడాది పొడవునా పనులు చేసేలా కార్యాచరణ రూపొందించుకున్నారు. మరో వారం రోజులులోపే ఫిబ్రవరి ముగియవస్తున్నా ఈ సంవత్సరం ఇప్పటి వరకు టెండర్లు పూర్తి కాలేదు. పనులెప్పుడు మొదలవుతాయో తెలియని పరిస్థితి.

– సాక్షి, సిటీబ్యూరో

పూడికతీత మాత్రమే కాకుండా వర్షాకాలపు సమస్యలు లేకుండా ఉండేందుకు నాలాల ఆధునీకరణ, అభివృద్ధి పనులు సైతం వర్షాకాలంలోపే పూర్తి చేయాలనేది లక్ష్యం. ఎస్ఎన్‌డీపీ(వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) రెండో దశ కింద కొన్ని టెండర్లు పిలిచినప్పటికీ, ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఎస్ఎన్‌డీపీకి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఈ పనులు ప్రారంభం కాలేదని తెలుస్తోంది.

రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లదీ అదే వరుస

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా వర్షాకాలం వచ్చేలోపు దాదాపు 140 సమస్యాత్మక నీటి నిల్వ ప్రాంతాల్లోనూ భూగర్భంలో వాన నీటి సంపులు(రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్) నిర్మిస్తామన్న అధికారులు.. వాటి గురించి మరిచినట్లు ఉన్నారు. కొత్తగా పనులు చేపట్టడం అటుంచి ఇప్పటికే ప్రారంభమైనవి సైతం అన్నీ పూర్తికాలేదు. గత సంవత్సరమే 50 ప్రాంతాల్లో చేపట్టాలనుకున్నా దాదాపు డజను ప్రాంతాల్లో మాత్రమే చేపట్టారు. అవీ పూర్తికాలేదు. వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా ఇప్పుడే పనులు చేయాల్సి ఉండగా జరగడం లేవు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం సైతం ముంపు కష్టాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

అధికారుల మార్పుతో..

ఉన్నతాధికారులు మార్పుతో డీసిల్టింగ్ పనుల తీరు కూడా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో డీసిల్టింగ్ పనుల్ని చిన్నవిగా విభజించి వార్డుస్థాయిల్లో చేసేవారు. దాంతో చిన్న కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా చేస్తున్నారని, పనులు చిన్నవైనందున నాణ్యతను పట్టించుకోవడం లేదని భావించి రెండేళ్ల క్రితం సర్కిల్ మొత్తానికి పనులను ఒకే ప్యాకేజీగా చేపట్టారు. ఉన్నతాధికారులు మారినందువల్లో, మరో కారణమో కానీ.. ఈసారి ఆ పద్ధతి మార్చి మళ్లీ గతంలో మాదిరిగానే వార్డు స్థాయిల్లో పనులకు సిద్ధమయ్యారు. టెండర్లు ఇంకా పూర్తికాలేదు. డీసిల్టింగ్ పనుల కోసం ఏటా దాదాపు రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

దివ్యాంగుల విజయాలు స్ఫూర్తిదాయకం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



దేవనార్ అంధుల పాఠశాల వార్షిక వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సనత్‌నగర్: ఆత్మవిశ్వాసమే ఆయుధంగా చేసుకుని దివ్యాంగులు అనేక విజయాలను సాధించి స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నారని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. దివ్యాంగులు తమకున్న వైకల్యాన్ని జయించి దేశాభివృద్ధిలో భాగస్వాములు నిలవాలని ఆకాంక్షించారు. బేగంపేట మయూరి మార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాల 33వ వార్షిక వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ సకలాంగులు, దివ్యాంగులు అన్న తేడాను చెరిపేసే విధంగా దివ్యాంగులు అద్భుత విజయాలను నమోదు చేసుకుంటున్నారన్నారు. వారు తలచుకుంటే ఏదైనా సాధించగలరని నిరూపిస్తున్నారన్నారు. పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం మెండుగా ఉంటే లక్ష్యం దరి చేరుతుందన్నారు. దేవనార్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఉన్నతంగా చదువుకుని దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఎన్నో ఏళ్లుగా దేవనార్ ఫౌండేషన్ ఎదుగుదలలో భాగస్వాములైన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టాటా సంస్థ సేవలు అభినందనీయం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సుల్తాన్‌బజార్‌లో స్కూల్ భవనం ప్రారంభం



సుల్తాన్‌బజార్ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీన్ దురిశెట్టి

సుల్తాన్‌బజార్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ లక్ష్యంగా టాటా సంస్థ అద్భుతమైన భవనాలు నిర్మించి అందించడం ఎంతో అభినందనీయమని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సుల్తాన్‌బజార్‌లోని టాటా సంస్థ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, క్లస్టర్ హెడ్ శ్రీరంగ్ దాప్లేతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టాటా సంస్థ నగరంలో పాఠశాల భవనాల నిర్మాణాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్, మాజీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, అంజయ్య, మాజీ ఎంపీ కేశవరావు మరెందరో పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, ఉన్నతాధికారులు తదితరులను అందించిన ఈ పాఠశాలకు గొప్ప పేరుందన్నారు. టాటా సంస్థ పాఠశాల పునర్నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా రెండంతస్తులలో పాఠశాల గదులతో పాటు సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్ హాల్స్, కాన్ఫరెన్స్ హాల్, మౌలిక సదుపాయాలు కల్పించి అద్భుతంగా చేపట్టడం సంతోషకరం అన్నారు. టాటా సంస్థ ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ఎంతో సేవలందిస్తోందని, యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న మాట్లాడుతూ.. సుల్తాన్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో చేపట్టామని తెలిపారు. పేద పిల్లల విద్యా వికాసంలో టాటా సంస్థ ముందుంటుందన్నారు. ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం.ఆదిత్య వర్ధన్‌రాజు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

740 చెట్లు.. ఎట్లా నాటుదాం..

- ట్రీ ట్రాన్స్ లొకేషన్ కోసం సర్వే చేస్తున్న అధికారులు
- కేబీఆర్ పార్కు చుట్టూ ఖాళీ స్థలాల కోసం అన్వేషణ



కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో సర్వే చేస్తున్న ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం కసరత్తు శరవేగంగా జరుగుతుండగా నిర్మాణాలకు అడ్డుగా ఉన్న చెట్లను రీ లొకేట్ చేసే దిశగా జీహెచ్‌ఎంసీ అధికారులు సర్వే ప్రారంభించారు. కేబీఆర్ పార్కు చౌరస్తాతో పాటు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 బాలకృష్ణ చౌరస్తా, సీవీఆర్ న్యూస్ చౌరస్తా, అగ్రసేన్ చౌరస్తా, బసవతారకం కేన్సర్ ఆస్పత్రి చౌరస్తా, సాగర్ సొసైటీ చౌరస్తాల్లో ఏడే చోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణంతో పాటు ఆరుచోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు రూ.1,260 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చారు. అయితే ఫ్లై ఓవర్ల నిర్మాణంతో పాటు అండర్‌పాస్ తవ్వకాల్లో కేబీఆర్ పార్కు చుట్టూ భారీ చెట్లు అడ్డుగా ఉన్నాయి. సెంట్రల్ మీడియన్లతో పాటు రోడ్ల పక్కన చెట్లను మార్పిడి చేసి మరో చోట నాటాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ నిర్మాణాల్లో ఎన్ని చెట్లు కోల్పోతున్నారో సర్వే కూడా పూర్తి కాగా ఆ చెట్లకు మార్కింగ్ కూడా వేశారు. పార్కు చుట్టూ 740 చెట్లను తొలగించాల్సి ఉంటుందని ఈ సర్వేలో గుర్తించడం జరిగింది. అయితే ఒక్క చెట్టును కూడా కొట్టి వేయవద్దని ప్రతి చెట్టూ తిరిగి పునరుజ్జీవం పోసుకునే విధంగా 'ట్రీ ట్రాన్స్ లొకేటింగ్' చేయాలని జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం నిర్ణయించింది. ఈ మేరకు ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో అక్కడ ఈ చెట్లను నాటాలని ప్రస్తుతం సర్వేలు జరుగుతున్నాయి. చెట్ల మార్పిడి కోసం ఉన్న ఖాళీ స్థలాలను సంబంధిత అధికారులు గుర్తించే పనిలో పడ్డారు. మొత్తం 740 చెట్లు ఎక్కడెక్కడ నాటాలన్న దానిపై ఈ సర్వే జరుగుతుంది. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో సాధ్యమైనన్ని చెట్లు నాటాలని నిర్ణయించారు. ఈ వాక్‌వేలో ఐదు కిలో మీటర్ల మేర ఖాళీ బాటలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నారు. వాక్‌వేలో సుమారుగా 200 చెట్లను నాటేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మిగతా వాటిని కూడా పార్కుల్లోను, పాఠశాలలల ఆవరణల్లోను, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ, రోడ్లకు మరోవైపు నాటాలని, ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నిమ్స్‌కు కరెంటు కష్టాలు

లక్డీకాపూల్: ప్రతిష్టాత్మకమైన నిమ్స్ ఆస్పత్రికి కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో రోగులకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రెండు గంటల పాటు కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నిమ్స్ ఓపీడీ బ్లాక్, ఓల్డ్ బిల్డింగ్‌లలో శనివారం ఈ సమస్య తలెత్తింది. దీంతో రోగులు అవస్థలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ముఖ్యంగా ఐసీయూ విభాగాలలోని అత్యవసర వైద్య సేవలు పొందుతున్న రోగులకు ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆయా రోగుల సహాయకులు ఆవేదన చెందారు. ఏఎంసీ, వెల్‌నెస్ సెంటర్, మెట్టు రంగారెడ్డి వార్డులలో కరెంట్ సరఫరా లేక ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఎంఆర్ఐ, డీఎస్ఏ ల్యాబ్ వంటి పలు వైద్య పరీక్షలు నిలిచిపోయాయి. ఎండలు మండుతున్న సమయంలో సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడం పట్ల రోగులు, వారి సహాయకులు తీవ్ర ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు. కాగా కరెంట్ సరఫరాలో సమస్య తలెత్తిన సందర్భాల్లో వెంటనే డీజిల్, పెట్రోల్ సహాయంతో పనిచేసే జనరేటర్ల ద్వారా కరెంట్ సరఫరా అందిస్తారు. ఆ దిశగా కూడా నిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు తలెత్తాయి.

అవగాహనా రాహిత్యంతోనే ప్రమాదాలు

కుషాయిగూడ: కెమికల్ అండ్ పెట్రో కెమికల్ పరిశ్రమల నిర్వాహకుల అవగాహనా రాహిత్యంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాలరావు అభిప్రాయపడ్డారు. పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్, పెట్రో కెమికల్ ఆధ్వర్యంలో చర్లపల్లి పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సిపెట్‌లో మేజర్ కెమికల్, పెట్రో కెమికల్ ఇండస్ట్రీయల్ సేఫ్టీపై నిర్వహించిన రెండు రోజుల సెమినార్‌కు శనివారం ఆయన హాజరై మాట్లాడారు. ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయన్నారు. ఆ దిశగా పరిశ్రమల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి వారికి అవగాహన పెంచుతున్నారన్నారు. ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, సేకరణ, హ్యాండింగ్, పారవేయడం, పునర్వినియోగించుకోవడం వంటి అంశాల పట్ల పాటించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలను వివరించారు. సెమినార్‌లో 64 పరిశ్రమలకు చెందిన 134 మంది ప్రతినిధులు పాలుపంచుకున్నారు. బాల్క్‌డ్రగ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రోజరాణి, సిపెట్ డైరెక్టర్ విశాల్‌వర్మ, సిపెట్ చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు



మాట్లాడుతున్న అడిషనల్ పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ విశ్వప్రసాద్

కాచిగూడ: వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు వ్యాపారులు అన్ని చట్టపరమైన నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అడిషనల్ పోలీస్ కమిషనర్(ట్రాఫిక్) పి.విశ్వప్రసాద్ అన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు బషీర్‌బాగ్ సీసీఎస్‌లో బ్లాక్ ఫిల్మ్‌లు, సైరన్‌లు, మ్యూజికల్, మల్టీ-టోన్ హారన్స్, మోడిఫైడ్ సైలెన్సర్లు, నంబర్‌పేట్లు, వాహనాల మార్పులు తదితర వాటికి సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వ్యాపారులు తమ వద్దకు వచ్చే వినియోగదారులకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రూల్స్ ఉల్లంఘించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలతో రహదారి భద్రత మరింత పెరుగుతుందని, ప్రమాదాలను తగ్గిస్తుందన్నారు. బాధ్యతను, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. డీసీపీ ట్రాఫిక్-1 బికె.రాహుల్ హెగ్డే, డీసీపీ ట్రాఫిక్ -2 ఎస్.అశోక్ కుమార్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'అన్నపూర్ణ' కేంద్రాలను సందర్శించిన అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో రూ.5లకే భోజనం అందజేస్తున్న అన్నపూర్ణ కేంద్రాలు ఎందరి ఆకలినో తీరుస్తున్నప్పటికీ, పలు ప్రాంతాల్లో అవి అధ్వాన్న పరిస్థితుల్లో, అశుభ్రవాతావరణంలో ఉండటంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటి పరిశీలనకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, వేణుగోపాల్‌రెడ్డితో కమిటీని ఏర్పాటు చేశారు. అన్నపూర్ణ కేంద్రాల వద్ద పరిస్థితులు, భోజనం నాణ్యత తదితరమైనవి పరిశీలించాల్సిందిగా వారికి సూచించారు. ఈ నేపథ్యంలో వారు శనివారం మింట్ కాంపౌండ్, లక్డీకాపూల్ ప్రాంతాల్లోని అన్నపూర్ణ కేంద్రాలను పరిశీలించారు. లక్డీకాపూల్ కేంద్రంలో భోజనం చేశారు. భోజనం నాణ్యత బాగున్నా, పరిసరాలు అధ్వాన్నంగా ఉండటాన్ని గుర్తించి వాటిని ఆధునీకరించాలని నిర్ణయించారు. నగరవ్యాప్తంగా అన్ని కేంద్రాలను పరిశీలించి స్థితిగతులు నివేదించేందుకు ఇంజినీర్ల బృందాన్ని నియమించనున్నట్లు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నపూర్ణ కేంద్రాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఆదేశించిన నేపథ్యంలో త్వరలో చర్యలు చేపట్టనున్నారు.

నిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



సాక్షి, సిటీబ్యూరో: నిమ్స్ ఆస్పత్రిలో వెన్నుపూసకు అరుదైన స్పైనల్ కార్డ్ స్టిమ్యులేటర్ శస్త్రచికిత్సను శనివారం నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రిలో ఒక ఉద్యోగి రెండున్నరేళ్ల క్రితం ప్రమాదానికి గురవడంతో వెన్నుపూసకు గాయమైంది. రోగి పక్షవాతంతో వీల్‌ఛైర్‌కే పరిమితమయ్యాడు. ఫిజియోథెరపీ చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ప్రొఫెసర్లు సుచందన, శ్రీలత, డా.రాంనాథరెడ్డి, స్వప్న, అవినాష్ బృందం చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఇటువంటి చికిత్సలు రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇదే ప్రథమమని వైద్యులు పేర్కొన్నారు. క్లిష్టమైన చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినందుకు నిమ్స్ సంచాలకుడు ప్రొ.బీరప్ప అభినందించారు.

కాలుష్య నియంత్రణపై క్విజ్ పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఎలాన్, ఎన్ విజన్ సంయుక్తంగా ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యంపై అవగాహన కల్పించడానికి ఐఐటీహెచ్‌లో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించింది. తెలంగాణ పీసీబీ ప్రాజెక్ట్ అధికారి(ఇంజనీర్) బోడ నాగేశ్వరరావుకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నిర్వాహక బృందం, పాల్గొనే విద్యార్థులతో కలిసి పర్యావరణాన్ని కాపాడతామని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఈ-వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

సామల వేణుకు ఐఎంఏ జీవన సాఫల్య పురస్కారం



సామల వేణు

నాంపల్లి: మ్యాజిక్ రంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నగరానికి చెందిన సామల వేణు ప్రతిష్టాత్మక ఐఎంఏ జీవన సాఫల్య పురస్కారం, గోల్డెన్ మెజీషియన్ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వ్యవస్థాపకులు బీఎస్.రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 23న విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో జరిగే అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవం వేడుకల్లో మ్యాజిక్ అవార్డ్స్ నైట్-2025 పేరిట అవార్డులను ప్రదానోత్సవం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అవార్డును ప్రకటించడం పట్ల ప్రముఖ కళాకారుడు సామల వేణు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అవార్డుకు ఎంపిక చేసిన ఐఎంఏ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ ప్రక్రియ చేపట్టండి

హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్



వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి త్వరితగతిన భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఎస్‌డీసీ అపర్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. భూసేకరణలో భాగంగా ఇప్పటి వరకు అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను కోరారు. ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్ వరకు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ ఇప్పటికే కార్యాచరణ చేపట్టింది. ఈ రెండు కారిడార్లలో మొత్తం 1730 నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుందని హెచ్‌ఎండీఏ అధికారులు నిర్ణయించారు. డెయిరీ ఫామ్ కారిడార్‌లో 452, శామీర్‌పేట్ వైపు 1248 నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుంది. ఈ మేరకు వాటి యజమానులకు పరిహారం చెల్లించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు ఆస్తులను ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారి దరఖాస్తులను పరిశీలించిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ డెయిరీ ఫాం కారిడార్‌లో 405 కుటుంబాల సామాజిక సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే శామీర్‌పేట్ కారిడార్ వైపు త్వరలో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. హనుమాన్ టెంపుల్, టివోలీ థియేటర్, బోయిన్‌పల్లిలోని ముస్లిం శ్మశానవాటికలపై ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి హెచ్‌ఎండీఏకు అందజేశామన్నారు. అలాగే రెండు కారిడార్లలో ఆస్తులపై మరోసారి సర్వే చేపట్టాలని భూసేకరణ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

చర్మవ్యాధులపై అవగాహన అవసరం

రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాన్‌సింగ్



సాక్షి, సిటీబ్యూరో: రైల్వే ఉద్యోగులకు వచ్చే చర్మవ్యాధులకు అందజేసే వైద్య చికిత్సలపై వైద్య నిపుణులకు ప్రత్యేకమైన అవగాహన అవసరమని రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాన్‌సింగ్ అన్నారు. లోకో పైలెట్‌లు, సహాయ లోకో పైలెట్‌లు, ట్రాక్‌మెన్‌లు, పాయింట్‌మెన్ తదితర విభాగాలకు చెందిన సిబ్బంది కాలుష్యకారకమైన వాతావరణంలో పనిచేయాల్సి వస్తుందని, ఈ క్రమంలో వారు వివిధ రకాల చర్మవ్యాధులకు గురవుతారని చెప్పారు. అన్ని రైల్వే జోన్లకు చెందిన ఆస్పత్రుల్లోని చర్మవ్యాధి నిపుణుల మొదటి సమావేశం (రైల్ డెర్మ్‌కాన్-2025) జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జోన్లకు చెందిన రైల్వే ఆస్పత్రుల చర్మవ్యాధి నిపుణులు తమ అనుభవాలు, అవగాహన పరస్పరం తెలుసుకునేందుకు ఇలాంటి సమావేశాలు దోహదం చేస్తాయన్నారు. తద్వారా రైల్వే సిబ్బందికి మెరుగైన వైద్యసేవలను అందజేయవచ్చని అన్నారు. సమావేశం భారతీయ రైల్వేల్లో ఒక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ఆధునిక జీవన శైలిలో చర్మవ్యాధి మాత్రమే కాకుండా, కాస్మోటాలజీ కూడా ముఖ్యమైందన్నారు. లాలాగూడలోని రైల్వే కేంద్ర ఆస్పత్రిలో డెర్మటాలజీ విభాగం అత్యాధునిక రోగ నిర్ధారణ, అధునాతన చికిత్సా సౌకర్యాలను కలిగి ఉందని పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ మన దైనందిన జీవితంలో చర్మాన్ని రక్షించుకోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్, లాలాగూడ రైల్వే ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.శివనాగప్రసాద్, రైల్ డెర్మ్ కాన్- 2025 నిర్వాహక కమిటీ సభ్యులు, చైర్మన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.రమేష్, శాస్త్రీయ కార్యదర్శి డాక్టర్ రాజా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ నారాయణస్వామి, చీఫ్ స్టాఫ్ సర్జన్ డాక్టర్ సాయి, చీఫ్ కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ జబ్బే.. ప్రాణాంతకమైంది కాదు

- దేశంలో ఏటా 1.3 మిలియన్ కేన్సర్ కేసులు
- 95 శాతం తగ్గుతున్నాయి
- అపోహలు తొలగి అవగాహనతో ముందుకు రావాలి
- యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.జీఎస్ రావు



మాట్లాడుతున్న జీఎస్ రావు

సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్ అనేది జబ్బే.. కానీ ప్రాణాంతకమైంది కాదు. నా ప్రకటనకు నేను కట్టుబడి ఉన్నానని యశోద ఆస్పత్రుల ఎండీ డా.జీఎస్ రావు పేర్కొన్నారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో బ్లడ్ కేన్సర్‌పై 'డెక్కన్ హెమటోలింక్ 2.0' అంతర్జాతీయ సదస్సును శనివారం ప్రారంభించారు. ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేన్సర్‌కు వివిధ రకాల చికిత్సా పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి.. ఎమ్మార్లిన్ అనే కొత్త పరికరం సౌత్ ఇండియాలో తొలిసారి హైటెక్స్ యశోదలో అందుబాటులో ఉందన్నారు. రేడియేషన్ కూడా చాలా అభివృద్ధి చెందిందని, బ్లడ్ కేన్సర్ వస్తే ఇది వరకు తాము కూడా ఆలోచన చేసే వాళ్లం అన్నారు. లంగ్ కేన్సర్ సర్వేలెన్సా కాదా అనే పరిస్థితి ఉండేది.. ప్రస్తుతం రకరకాల మందులు, కొత్త పద్ధతులు వచ్చాయని వివరించారు. కేన్సర్ అనేది వైద్య చికిత్సకు మాత్రమే సంబంధించింది కాదు మానసికంగా కూడా బలంగా ఉండాలి. కుటుంబ సభ్యులు, దాతలు అవగాహనతో మెలగాలని ఆకాంక్షించారు. దేశంలో నానాటికీ బ్లడ్ కేన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని, గ్లోబోకాన్-2020 నివేదిక ప్రకారం భారత్‌లో ఏటా 1.3 మిలియన్ల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. అందులో బ్లడ్ కేన్సర్ల సంఖ్య గణనీయంగానే ఉంటోందని తెలిపారు. నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రాం నివేదిక ప్రకారం లుకేమియా, లింఫోమా, మైలోమా వంటి కేసులు హైదరాబాద్‌లో తరచూ వస్తున్నాయని, కేన్సర్లు వైద్యులు, రోగులకు ఒకే విధమైన సవాళ్లను విసురుతున్నాయని అన్నారు. ఎముక మజ్జ మార్పిడి నుంచి సీఏఆర్-టీ వంటి అత్యాధునిక ఇమ్యూనోథెరపీల వరకు విప్లవాత్మకమైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అనంతరం సీనియర్ హెమటాలజిస్ట్ డా.గణేష్ మాట్లాడుతూ 12 ఏళ్లలో 500పైగా ఎముక మజ్జ మార్పిడి, వేలాది బ్లడ్ కేన్సర్ రోగులకు చికిత్సలు అందించి, కొత్త జీవితాలను అందించడం సంతోషానిచ్చిందన్నారు. బీపీ, షుగర్ మాదిరిగానే మాత్రతో కేన్సర్ తగ్గించే అత్యాధునిక టార్గెటెడ్ ట్రీట్‌మెంట్లు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన క్రీడాకారిణి 2019 బ్లడ్ కేన్సర్‌కు గురైందని, ఆరు నెలల్లో చికిత్స తీసుకుని ఒలింపిక్స్‌లో మెడల్ సాధించిందని తెలిపారు. సీనియర్ హెమటో అంకాలజిస్ట్ ఎంబి అగర్వాల్, అంకాలజీ, హెమటో-అంకాలజీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులైన 210 మంది వైద్యులు పాల్గొన్నారు.

సాక్షి 11
హైదరాబాద్, ఆదివారం, 23 ఫిబ్రవరి 2025
సిటీ ప్లస్

'హాయ్ తెలుగు ట్రాక్ ప్లీజ్..' కొన్నేళ్ల క్రితం ఈవెంట్స్, కేఫ్స్‌లో లైవ్ బ్యాండ్‌ని ఇలా అభ్యర్థించిన వ్యక్తిని.. మిగిలిన వాళ్లంతా ఎవరీ ఎర్రబస్సు అన్నట్టు చూసేవాళ్లు, బ్యాండ్ సభ్యులు నోటితో నవ్వేసి నొసటితో వెక్కిరించేవాళ్లు.. ఇదంతా గతం ఇప్పుడు క్లబ్‌లలో అత్యంత క్రేజీగా ఉండేనైట్స్ అంటే టాలీవుడ్ నైట్స్. బ్యాండ్ ఏదైనా సరే, ప్లేస్ ఏదైనా సరే ఏఆర్ రెహమాన్, ఇళయరాజా, డీఎస్పీ.. మ్యూజిక్‌ని వినిపించాల్సిందే.. తెలుగు ట్రాక్స్‌కి పేరొందిన కొన్ని నగర సంగీత బృందాల విశేషాలివి..

- సాక్షి, సిటీబ్యూరో





మా బీటే సపరేటు..

సిటీ బ్యాండ్స్‌తో కదం తొక్కుతున్న తెలుగు సంగీతం

- భిన్న శైలితో దేనికదే ప్రత్యేక గుర్తింపు
- టాలీవుడ్ ట్రాక్స్‌కు క్రేజీ బ్యాండ్స్ పెద్దపీట
- కేఫ్స్, రెస్టారెంట్స్, ఈవెంట్స్‌లో సందడే సందడి

నగరంలో తెలుగు లైవ్ మ్యూజిక్‌కు క్లాప్ కొట్టింది కాప్రిషియో. పేరొందిన ట్రాక్‌ల మాషప్‌లతో వీరు తెలుగు శ్రోతల మనసులు గెలుచుకున్నారు. నేటికీ సిటీ లైవ్ మ్యూజిక్‌ని ఈ బ్యాండ్ శాసిస్తోందని చెప్పొచ్చు. తరచూ తెలుగు సినీ ప్రముఖుల ప్రైవేట్ పార్టీస్‌లో వీరు కనిపిస్తారు. దేశ విదేశాల్లోనూ ప్రదర్శనలిచ్చిన ఈ బ్యాండ్ ఉరుములు నీ నవ్వులై, యమహానగరి కలకత్తా పురి, మధుర మీనాక్షి.. తదితర తెలుగు పాటలతో పాటు సొంత ట్యూన్స్‌తో ఎనిమిదేళ్లుగా నగర సంగీతాభిమానులను ఉర్రూతలూగిస్తోంది.



మ్యూజిక్ మంచి ఎంపిక. ఐఎన్‌సీపీ నుంచి బెస్ట్ లైవ్ యాక్ట్ బ్యాండ్ అవార్డును గెలుచుకోవడంతో పాటు 2018లో నగరంలో జరిగిన బ్రయాన్ ఆడమ్స్ ఈవెంట్లో వేదిక పంచుకోవడం, ఆస్ట్రేలియాలో సంగీత పర్యటన.. వంటివెన్నో వీరిని టాప్ బ్యాండ్స్‌లో ఒకటిగా మార్చాయి.

మా థియరీయే వేరు..

తొమ్మిది మంది సభ్యుల బ్యాండ్ థియరీ, సితార్, తబలా వయోలిన్‌లతో రాక్ సంగీతానికి భారతీయ హంగులను జోడించడం ద్వారా ప్రత్యేకంగా ప్రసిద్ధి చెందింది. వీరి నుంచి రోజా, బొంబాయి వంటి సినిమాల్లో ప్రసిద్ధ వయోలిన్ ట్రాక్‌లను వినొచ్చు. పదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ బ్యాండ్ తొలుత హిందీ, ఆంగ్ల సంగీతానికి పెద్ద పీట వేసినా.. ఇటీవలే తెలుగు, తమిళ సంగీతాన్ని కూడా అందిస్తోంది. ఫ్యూజన్ సంగీతాన్ని ఇష్టపడేవారికి థియరీ లైవ్





పల్లె మసాలా.. రామ్ మిరియాల..

తెలుగు సినీ గీతాభిమానులకు చిరపరిచితమైన పేరు రామ్ మిరియాల. ఆయన తొలుత బ్యాండ్ చౌరాస్తాలో ప్రధాన గాయకుడిగా పేరొందారు. సూపర్ హిట్ ప్రైవేట్ సాంగ్స్ అందించారు. అనంతరం సినిమాల్లోనూ రాణిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సొంత బ్యాండ్ ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు ప్రతి వారం నగరంలో ఎక్కడో ఒక చోట ఆయన బృందం ప్రదర్శన ఉంటుంది. డీజే టిల్లూ పేరు.. వీని స్టైలే వేరు.. దండ కడియాల్.. వంటి ఆయన ట్రాక్‌లతో పాటు పల్లెదనానికి పట్టం గట్టే అనేక సొంత పాటలను కూడా వినిపిస్తారు.

జానపదమిస్తా.. చౌరాస్తా..

గ్రామీణ, తెలుగు జానపదాలతో చౌరాస్తా ధ్వని చాలా ప్రత్యేకమైనది. వీరి సంగీత శైలి హృదయాన్ని తాకుతుంది. రెగె, జానపద, రెట్రో బ్లూస్ రాగాలను వీరి ద్వారా వినొచ్చు. మాయ, ఊరెళ్లిపోతా మామా, లక్ష్మమ్మో తదితర హిట్ సాంగ్స్ వీరి సొంతం. తమ రెగె స్టైల్ ట్రాక్‌లలో గోరేటి వెంకన్న పాటలు సహా ఉత్తేజపరిచే సంగీతానికి జీవం పోస్తారు. ముఖ్యంగా 80ల జానపద సంగీతాన్ని ఇష్టపడే వారికి నచ్చే, నచ్చే బ్యాండ్ ఇది

పార్టీస్‌కి డెక్కన్..

'హైదరాబాద్స్ పార్టీ బ్యాండ్' అని పేరు తెచ్చుకుంది. డెక్కన్ ప్రాజెక్ట్ ఫంక్, బ్లూస్, రాక్, స్వింగ్ ప్రభావాలను మిక్స్ చేస్తుంది. ఈ బ్యాండ్ సభ్యులు కళాశాల చదువుల నుంచి స్నేహితుల బృందంగా కొనసాగుతున్నారు. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూనే తమ సంగీత కలలను సాకారం చేసుకుంటున్నారు. పెత్తరప్, కుర్రలు, హమ్మా హమ్మా.. ఇంకా ఎన్నో పాటలు వీరు అందిస్తారు. ఏడేళ్ల వయసున్న ఈ బ్యాండ్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక ప్రదర్శన ఇవ్వడం విశేషం. అలాగే రామ్‌చరణ్ ఆస్కార్ పార్టీలోనూ వీరు మ్యూజిక్ అందించారు.

మ్యూజిక్ థీమ్.. ఎలీజియమ్

బోటనీ పాఠముంది.. మ్యాటినీ ఆట ఉంది.. దేనికో ఓటు చెప్పరా.. సామజవరగమనా నిను చూసి ఆగగలనా.. వంటి టాలీవుడ్‌లోని అనేక హిట్ ప్లేబ్యాక్ నంబర్‌లను వినిపించే బ్యాండ్ ఎలీజియం. దీని ప్రధాన గాయకుడు డింకర్ కల్వాలా సినీ నేపథ్య గాయకుడు కూడా. కాప్రిషియో నుంచి విడివడిన సభ్యులు స్థాపించిన ఈ బ్యాండ్. ఇప్పుడు నగరంలో క్రేజీగా మారింది. తెలుగు, హిందీలో పాటలతో పాటు, ఒరిజినల్ కంపోజిషన్‌లకు వీరు పెద్ద పీట వేస్తారు. వాటిలో 'ప్రెట్టీ పాన్నే' 'ప్రేమ' నగర సంగీతాభిమానులు ఎక్కువగా ఇష్టపడేవి. నగరంలోని అత్యంత ఇంటరాక్టివ్ సంగీత బృందాలలో ఈ బ్యాండ్ కూడా ఒకటి. సో మన లక్‌ని బట్టి మనం కోరిన పాటను వీరు ప్లే చేయవచ్చు.

'నెస్ట్' విజేతలకు నగదు పురస్కారం



సాక్షి, సిటీబ్యూరో : ఆరోగ్య రంగంలో అత్యాధునిక పరిష్కారాలను అన్వేషించేందుకు వైద్య సేవల సంస్థ నోవార్టిస్ ఇండియా ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణల పోటీ నెస్ట్ (నర్చరింగ్ ఎక్సలెన్స్, స్ట్రెంథనింగ్ టాలెంట్) గ్రాండ్ ఫినాలే నగరంలో జరిగింది. నెలల తరబడి కొనసాగిన ఈ కఠినమైన పోటీలో పాల్గొన్న జట్లు.. డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లినికల్ డెవలప్మెంట్ సమ్మేళనంతో, రోగి సంరక్షణను మెరుగుపరిచే ఔషధాన్ని పునఃరూపకల్పన చేయడం ద్వారా తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించాయి. ప్రతిభ చూపిన నాలుగు జట్లు, విజేతలుగా నిలిచి రూ.8 లక్షల విలువైన నగదు బహుమతులు అందుకున్నాయి. అంతేకాక నోవార్టిస్ డెవలప్‌మెంట్ హబ్‌లో ప్రీ-ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూ అవకాశాలను పొందాయి. విద్యాసంస్థలు, స్టార్టప్స్ పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్య సంరక్షణలో తదుపరి తరం ఆవిష్కర్తలను తయారు చేయడానికి రూపొందించిన డైనమిక్ ప్లాట్‌ఫామ్ నెస్ట్ అని నోవార్టిస్ డెవలప్మెంట్ హబ్ హెడ్ సాధన జోగలేకర్ పేర్కొన్నారు.




శిలలే.. శిల్పాలై..

- ఫీనిక్స్ ఎరీనాలో 'స్కల్ప్టింగ్ వాయిడ్స్' ప్రదర్శన
- మంత్రముగ్ధులను చేస్తున్న రాబిన్ డేవిడ్ ఆర్ట్



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆర్టిస్టు, శిల్పి రాబిన్ డేవిడ్ చెక్కిన రాతి శిల్పాలు నగరంలోని ఫీనిక్స్ ఎరీనా వేదికగా మంత్రముగ్ధులను చేస్తున్నాయి. 'స్కల్ప్టింగ్ వాయిడ్స్' పేరుతో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఫీనిక్స్ ఎరీనా వ్యవస్థాపకులు సురేష్ చుక్కపల్లి, అనురాధ టింబర్స్ వ్యవస్థాపకులు శరత్ చదిలవాడ ప్రారంభించారు. జర్మన్ ఆర్ట్ క్యూరేటర్ మాథ్యూ, ఆన్‌లైన్ ఆర్ట్ గ్యాలరీ నుంచి అమ్రిష్, సీనియర్ ఆర్టిస్ట్ చిప్పా సుధాకర్ వంటి ప్రముఖులు అద్భుతమైన కళాకృతులను ప్రశంసించారు. ఈ ప్రదర్శన మార్చి 16 వరకూ కొనసాగనుందని షో క్యూరేటర్ అమన్ ప్రీత్ కౌర్ తెలిపారు.



శూన్యం నుంచి ఆలోచనలు..

కళాత్మకతకు అంతర్గత అర్థాన్ని, భావాన్ని నింపుతూ చెక్కిన శిల్పాలు నగరంలో ప్రదర్శిస్తున్నాను. భారతీయ శిల్పకళ, ప్రకృతి పారవశ్యాన్ని సమ్మిళితంగా ప్రదర్శించే విధంగా బ్లాక్ అండ్ వైట్ రూపకంలో ఈ శిల్పాలను చెక్కాను. శూన్యం నుంచి జీవిత పరమార్థాలను వెతికే ఆలోచనలతో 30 శిల్పాలను ప్రదర్శిస్తున్నాను. మనకు కనిపించే, కనిపించని వాస్తవిక అంశాలను అనుసంధానం చేసే శక్తి శిల్పకళ సొంతం. ఈ కళను కళాప్రేమికుల నిలయమైన హైదరాబాద్‌లో ప్రదర్శించడం సంతోషంగా ఉంది.
– రాబిన్ డేవిడ్, ప్రముఖ భారతీయ శిల్పకారుడు.



స్వీయ శిక్షణ.. ఆత్మరక్షణ..!

- కరాటేలో అక్కా చెల్లెళ్ల అద్భుత ప్రతిభ
- అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు
- ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా సాధన

ఆడపిల్లలు అన్నింటా పోటీపడుతున్నారు. ఒకప్పుడు ఎదుర్కొన్న వివక్షను తరిమికొడుతూ.. ముందుకు కదులుతున్నారు. మగపిల్లలతో సమానంగా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. విద్య, ఉద్యోగం, రాజకీయం అన్న తేడాలేకుండా తమ ప్రతిభను చూపుతున్నారు. ఆటల్లోనూ మేటి నైపుణ్యాన్ని కనబరుస్తున్నారు. అలాంటి వారే నగరంలోని కాచిగూడకు చెందిన అమృతా రెడ్డి, ఘన సంతోషిణి రెడ్డి. స్వీయ శిక్షణతో ఆత్మరక్షణ క్రీడ అయిన కరాటేలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వారి గురించిన మరిన్ని విశేషాలు..

- కాచిగూడ







నగరానికి చెందిన డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి–మాధవి దంపతుల పిల్లలైన జి.అమృత రెడ్డి, జి.ఘన సంతోషిణి రెడ్డి కరాటేలో తమ ప్రావీణ్యాన్ని కనబరుస్తున్నారు. కరాటే మాస్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి కాచిగూడలో జీవీఆర్ కరాటే అకాడమీని స్థాపించి శిక్షణ ఇస్తున్నారు. కరాటే విలువ తెలిసిన ఆయన తన పిల్లలకు చిన్ననాటి నుంచే శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. వారు కూడా ఓ వైపు చదువు కొనసాగిస్తూ.. మరో వైపు కరాటేలో శిక్షణ పొందారు. అంతటితో ఆగకుండా బ్లాక్‌బెల్ట్స్ సాధించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వందకు పైగా స్వర్ణ, రజత పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో రికార్డులను నెలకొల్పి పలు రివార్డులు, అవార్డులను అందుకున్నారు.

ఒలింపిక్స్ లక్ష్యంగా..

ఒలింపిక్స్‌లో పాల్గొనడమే మా లక్ష్యం. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠను పెంచాలి. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాం. కరాటేతో పాటు సంగీతం, ఇతర కళల్లోనూ రాణిస్తున్నాం. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మా ప్రతిభను గుర్తించి మమ్మల్ని ప్రోత్సహించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒలింపిక్స్ లక్ష్యాన్ని చేరుకుంటాం. పతకాల సాధనే మా ఆకాంక్ష.

మరికొందరికి ఊతం..

తాము నేర్చుకున్న విద్యను మరికొందరికి నేర్పించాలనే ఉత్సాహంతో తండ్రితో కలిసి శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఇప్పటికే వందలాది మంది పిల్లలకు శిక్షణ ఇచ్చి కరాటే గురువులుగా మారి అందరి ప్రశంసలూ అందుకుంటున్నారు ఈ అక్కా చెల్లెళ్లు. అమృతారెడ్డి డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుండగా ఘన సంతోషిణి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..

అమృతారెడ్డి 2015లో బ్లాక్‌బెల్ట్, 2017లో ఫస్ట్‌డాన్ బ్లాక్ బెల్ట్, 2023లో 2వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా 2015 మే 31న కరాటేలో అద్భుత ప్రదర్శన ఇచ్చి వరల్డ్ రికార్డును సాధించారు. 365 టైల్స్‌ని 365 సెకన్లలో తలతో పగులగొట్టి రికార్డు నెలకొల్పింది. 36 గ్రనైట్ రాళ్లను, 1096 మేకులపై పడుకుని పొట్టపై పగులగొట్టించుకుని రికార్డు నెలకొల్పింది. గిన్నిస్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వంటి అనేక రికార్డులను నెలకొల్పింది. 2013లో ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా గోల్డెన్ ఎలిఫెంట్ అవార్డుతో పాటు వందకు పైగా అవార్డులు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో 2018లో వైజాగ్‌లో జరిగిన పోటీల్లో స్వర్ణపతకం, 2019లో మలేషియాలో గోల్డ్‌మెడల్, 2019లో సింగపూర్‌లో గోల్డ్‌మెడల్, 2022లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ అందుకున్నారు. అలాగే జాతీయ స్థాయిలో 13 గోల్డ్ మెడల్స్, 30కిపైగా సిల్వర్ మెడల్స్ సాధించారు.

వయసు చిన్నది.. గోల్ పెద్దది..

- ఫుట్‌బాల్ ఆటలో నగర చిన్నారుల ప్రతిభ
- సబ్ జూనియర్స్ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు





గోల్కొండ: జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాలన్నదే మహ్మద్ రేహాన్ ఆశయం. అందుకుగానూ ఐదేళ్ల వయసు నుంచే ఫుట్ బాల్ ఆడడం ప్రారంభించాడు. ఈ ఐదేళ్లల్లో 11 సంవత్సరాల వయసు గల మహ్మద్ రేహాన్ మొత్తం తాను ఆడిన మ్యాచ్‌లన్నిటిలోనూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించారు. 13 ఏళ్ల శ్రీదేవి సైతం ఫుట్‌బాల్‌లో వేగంగా దూసుకుపోతోంది. గోల్కొండకు చెందిన మహ్మద్ రేహాన్, శ్రీదేవి తాము చదువుతున్న పాఠశాలకే గర్వకారణంగా నిలుస్తున్నారు. ఆడిన ప్రతి టోర్నమెంట్‌లోనూ ఇరువురూ టీమ్‌ను గెలిపించడమే కాకుండా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలుస్తున్నారు. మహ్మద్ రేహాన్‌కు తెలంగాణ ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్ పాషా శిక్షణ ఇస్తుండగా శ్రీదేవికి మహ్మద్ ఇస్మాయిల్ శిక్షణ ఇస్తున్నారు.

ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ..

మహ్మద్ రేహాన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గత రెండు సంవత్సరాలుగా ఆడిన ప్రతి మ్యాచ్‌లో గోల్స్ కొట్టి టోర్నమెంట్‌లోనే అత్యధిక గోల్స్ సాధించిన క్రీడాకారుడిగా నిలిచారు. ఇటీవల బెంగళూరులో జరిగిన అండర్ 12 టోర్నమెంట్‌లో హైదరాబాద్ టీమ్‌తో పాల్గొని విజేతగా నిలిపాడు. అదే విధంగా శ్రీదేవి సైతం అండర్ 14 ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆడుతూ తన వేగంతో అందరినీ ఆకట్టుకుంటుంది. ఆడిన ప్రతి మ్యాచ్‌లో కనీసం ఒక గోలైనా శ్రీదేవి చేసిందని కోచ్ మహ్మద్ ఇస్మాయిల్ చెబుతున్నారు. జిల్లా స్థాయి టోర్నమెంట్‌లలో శ్రీదేవి అత్యుత్తమంగా రాణించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిందని అంటున్నారు. అయితే వీరిద్దరూ చదువులోనూ విశేషంగా రాణిస్తున్నారు.



ముగ్ధ మనోహరం.. లక్ష్య అరంగేట్రం

అలరించిన నృత్య రీతులు

గన్‌ఫౌండ్రీ : ప్రముఖ నృత్య శిక్షణాలయం త్రిష్ఠ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ అలేఖ్య పుంజాల శిష్యురాలు రాచప్రోలు లక్ష్య కూచిపూడి నాట్య అరంగేట్రం రవీంద్రభారతిలో శనివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మ నంద దాయని, భామా కలాపం, తక్కువేమి మనకు, బృందావని, థిల్లాన వంటి పలు అంశాల్లో చక్కటి హావభావాలను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆమె ప్రదర్శనను కొనియాడారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి ప్రస్తుతం స్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో ఎంటెక్ చేస్తున్న లక్ష్య శాస్త్రీయ సంగీత నృత్య కళలను నేర్చుకోవడం అభినందనీయమన్నారు. నేటి యువత శాస్త్రీయ సంగీత కళలను అభ్యసించాలని, అందుకు తగినట్లు తల్లిదండ్రులు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ జే.గీతారెడ్డి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ ప్రతిభా ప్రహ్లాద్, రోడ్లు, భవనాలు శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, తల్లిదండ్రులు ప్రొఫెసర్ ఇ.సుధారాణి, ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

మఖానా... మా ఖానా!



పేరేమో బ్లాక్ డైమండ్స్..

లోపలున్నది వైట్ గోల్డ్! అవునండీ.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సూపర్ ఫుడ్ 'మఖానా'సంగతే ఇది. పుష్కలమైన పోషకాలతో ఆరోగ్య వరప్రదాయినిగా అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఫూల్ మఖానా క్రేజ్ కేక పుట్టిస్తోంది. బిహారీ రైతులకు కాసుల పంటగా మారింది. మఖానాకు తాజా కేంద్ర బడ్జెట్లో కూడా పెద్దపీట వేయడంతో దీని పేరు మరింత మార్మోగుతోంది. మఖానా బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్లో మోదీ సర్కారు ప్రకటించింది. దీని వల్ల మార్కెటింగ్ సదుపాయాలు పెరగడంతో పాటు రైతులకు కూడా మరింత చేయూత లభించనుంది.

ఈ సూపర్ ఫుడ్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

- మార్కెట్లో కేజీ ధర రూ.2,000 పైమాటే...
- అద్భుత ఆరోగ్య సుగుణాలతో పెరుగుతున్న ప్రాచుర్యం
- బడ్జెట్లో మఖానా బోర్డు ఏర్పాటు ప్రకటనతో మరింత దన్ను
- గతేడాది దేశంలో మొత్తం ఉత్పత్తి 1.2 లక్షల టన్నులు
- ఇందులో బిహార్ వాటానే 90,000 టన్నులు

ప్రపంచ ఉత్పత్తిలో 90 శాతం మనదే...

సాక్షి, బిజినెస్ డెస్క్: రుచిలోనే కాదు.. పోషకాల్లోనూ రారాజుగా నిలుస్తున్న మఖానా.. ప్రపంచ సూపర్ ఫుడ్స్ మార్కెట్‌ను షేక్ చేస్తోంది. ఫూల్ మఖానా, లోటస్ సీడ్స్, పఫ్డ్ వాటర్ లిల్లీ సీడ్స్, ఫాక్స్ నట్స్ వంటి పేర్లతో ప్రాచుర్యం పొందిన వీటిని అచ్చ తెలుగులో చెప్పాలంటే తామర గింజలు. సహజమైన, సమతుల్య ఆహారంతో శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవాలనుకునే వారికి ఈ బ్లాక్ డైమండ్స్ వరంలా మారుతున్నాయి. ఇతర చిరుతిళ్లకు బదులు పోషకాల ఖజానా.. మఖానాను డైట్‌లో చేర్చుకుంటున్నారు. మిలీనియల్స్‌తో పాటు జెన్ జీ యువతరం కూడా ఇప్పుడు దీని వెంట పడుతున్నారు. విదేశాలకు ఎగుమతులు జోరందుకోవడంతో 'వైట్ గోల్డ్'రేటు కూడా బంగారంలా దూసుకెళ్తోంది. మార్కెట్లో కేజీ ధర రూ.2,000 పైనే పలుకుతోంది. పెళ్లిళ్లతో పాటు ఏ ఫంక్షన్‌లో చూసినా మఖానా వంటకం ట్రెండింగ్ ఫుడ్‌గా నిలుస్తోంది! ఇక హోటళ్లు, కేఫ్‌లు, రెస్టారెంట్లు, బేకరీల్లో ఈ హెల్దీ స్నాక్ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది. సోషల్ మీడియాలో ఫుడ్ వ్లాగింగ్ చానెల్స్ కూడా వీటి ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రచారం చేస్తుండటంతో మఖానాకు మాంచి డిమాండ్ నెలకొంది.

ప్రపంచవ్యాప్తంగా మఖానా ఉత్పత్తిలో 90 శాతం వాటా భారత్‌దే. అందులో 85 శాతం ఒక్క బిహార్ నుంచే వస్తుండటం విశేషం! అంతర్జాతీయంగా ఈ సూపర్ ఫుడ్‌కు ఫుల్ డిమాండ్‌తో బిహార్ రైతులు పండగ చేసుకుంటున్నారు.

బిహార్ హబ్..

ముఖ్యంగా మిథిలాంచల్ ప్రాంతం ఈ పంటకు ప్రధాన కేంద్రం. ఇక్కడి ప్రత్యేక వాతావరణ పరిస్థితులతో పాటు పుష్కలంగా చిత్తడి నేలలు (వెట్ ల్యాండ్స్) ఉండటం తామర పంట సాగుకు సానుకూలంగా నిలుస్తోంది. 200 ఏళ్లుగా ఇక్కడ మఖానా సాగు కొనసాగుతూనే ఉంది. మధుబనీ దీనికి పుట్టినిల్లుగా చెబుతారు. 2020లో బిహార్ మఖానాకు భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) కూడా లభించడంతో ప్రపంచవ్యాప్తంగా మరింత ఖ్యాతి పొందింది.

ఫూల్ మఖానా ఒక ప్రత్యేకమైన తామర పూల రకానికి చెందినది. సాధారణంగా ప్రిక్లీ వాటర్ లిల్లీగా పిలిచే దీని శాస్త్రీయ నామం యూరేల్ ఫెరాక్స్. ఇవి ఎక్కువగా ఆసియా ప్రాంతంలో చెరువుల్లో, చిత్తడి నేలల్లో పెరుగుతాయి. తామర పూల రెక్కలన్నీ రాలిపోయాక.. నల్లటి విత్తనాలు నీటి అడుగుకు (4–12 అడుగుల లోతు) చేరుకుంటాయి.

ఎందుకింత రేటు?

రైతులు వీటిని వలలు, బుట్టలతో సేకరించాక, ఎండలో బాగా ఆరబెడతారు. తర్వాత ప్రత్యేకంగా వేయించి, జాగ్రత్తగా గింజల్ని పగలగొడితే తెల్లగా.. పఫీగా ఉండే ఫాక్స్ నట్స్ విక్రయానికి సిద్ధమవుతాయి. ఇదంతా ఎంతో శ్రమతో కూడిన ప్రక్రియ. ఇది కొన్ని ప్రాంతాల్లోనే, అది కూడా చాలా తక్కువ విస్తీర్ణంలో మాత్రమే ఈ పంట సాగవుతోంది. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో తక్కువ మొత్తంలో ఉత్పత్తి అవుతోంది. సరఫరా పరిమితంగా ఉండటం.. దేశ, విదేశాల్లో గిరాకీ భారీగా పెరిగిపోవడంతో రేటు అ'ధర'హో అనిపిస్తోంది!

మార్కెట్ రయ్...

2023లో భారత్ మఖానా మార్కెట్ పరిమాణం రూ.780 కోట్లుగా నమోదైంది. 2032 నాటికి ఇది రూ.1,890 కోట్లకు వృద్ధి చెందుతుందని ఐమార్క్ గ్రూప్ అంచనా వేసింది. ఏటా ఈ మార్కెట్ 9.7 శాతం వృద్ధి చెందనుందని లెక్కగట్టింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి 25,130 టన్నుల మఖానా ఎగుమతులు జరిగాయి. భారత్ నుంచి ఫూల్ మఖానా ఎగుమతికి అతిపెద్ద మార్కెట్‌గా అమెరికా ఉంది. కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, యూరప్ దేశాల ప్రజలు కూడా మన మఖానాను లొట్టలేసుకుంటూ లాగించేస్తున్నారు. అంతర్జాతీయంగా చూస్తే, 2024లో 15 కోట్ల డాలర్లుగా ఉన్న ఫూల్ మఖానా మార్కెట్.. 2031 నాటికి 8.5 శాతం వార్షిక వృద్ధితో 26.6 కోట్ల డాలర్లకు చేరవచ్చని కాగ్నిటివ్ మార్కెట్ రీసెర్చ్ నివేదిక పేర్కొంది.

ఆరోగ్యమే 'మఖానా'భాగ్యం..

- మఖానాలో ప్రొటీన్లు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, కీలకమైన ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండటం వల్లే ఇది గ్లోబల్ సూపర్ ఫుడ్‌గా పేరుగాంచింది.
- ప్రతి 100 గ్రాముల గింజల్లో 9.7 గ్రాముల ప్రొటీన్, 14 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇది శాఖాహారులకు అద్భుతమైన ప్రొటీన్ సోర్స్‌గా మారింది.
- 25 గ్రాముల మఖానాలో 89 క్యాలరీలు మాత్రమే ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునేవారు మఖానా మంత్రం జపిస్తున్నారు.
- గ్లూటెన్ అస్సలు లేకపోవడం, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, అధిక పీచు పదార్థం (ఫైబర్) ఉండటం వల్ల మధుమేహం, కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుంది.
- ఇక అధిక మెగ్నీషియం, తక్కువ సోడియం కారణంగా రక్తపోటును నియంత్రించి, హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

ప్రస్తుతం మఖానా సాగు, ఉత్పత్తి ఇలా..

రాష్ట్రం	సాగు (హెక్టార్లలో)	ఉత్పత్తి (టన్నుల్లో)
బిహార్	12,000	96,000
జార్ఖండ్	1,000	8,000
ఉత్తరప్రదేశ్	500	4,000
ఇతర రాష్ట్రాలు	500	4,000
మొత్తం	14,000	1,12,000

క్లుప్తంగా...

తక్కువ నిర్మాణ వ్యయంతో ఇందిరమ్మ ఇళ్లు

- గృహనిర్మాణ కార్పొరేషన్ ఎండీ గౌతమ్



మేస్త్రీలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎండీ గౌతమ్, చీఫ్ ఇంజనీర్ చైతన్య

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తక్కువ నిర్మాణ వ్యయం అయ్యే విధానాల్లో ఇళ్లు నిర్మించుకునేలా వారిలో అవగాహన తెస్తున్నట్టు గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. శనివారం మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో ఆ ఇళ్ల నిర్మాణంలో శిక్షణ పొందిన మేస్త్రీలకు ఆ విభాగం చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్‌తో కలిసి గౌతమ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ వ్యయం బాగా తక్కువయ్యే నాలుగు విధానాలను లబ్ధిదారుల ముందుంచుతున్నామని చెప్పారు. వాటిలో అనుకూలమైన విధానంలో ఇళ్లను కట్టుకోవచ్చని, ఇలాంటి పద్ధతులతో నమూనా ఇళ్లను మండలానికి ఒకటి చొప్పున నిర్మిస్తున్నామని వెల్లడించారు. ప్రత్యక్షంగా మేస్త్రీలకు ఈ పద్ధతులపై శిక్షణ ప్రారంభించామని, 12,672 గ్రామాల్లో కనీసం ఒక్క మేస్త్రీకైనా ఈ తరహా నిర్మాణాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. యాదాద్రి, జనగామ, మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, మల్కాజిగిరి జిల్లాలకు సంబంధించి తొలిదశ శిక్షణ పూర్తయిందని గౌతమ్ వెల్లడించారు.

ఉచిత చేప పిల్లల పంపిణీకి ముందస్తు చర్యలు

- మే నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి.. జూన్ నుంచి చెరువుల్లో వదిలేందుకు ప్రణాళిక

సాక్షి,హైదరాబాద్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మత్స్యశాఖ అడుగులేస్తోంది. రాష్ట్రంలోని చెరువులు, రిజర్వాయర్లలో చేపల సంఖ్యను భారీగా పెంచాలనే యోచనతో ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా ఉచిత చేప పిల్లల పంపిణీకి ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే చేప పిల్లల పంపిణీ పనులపై సన్నాహాలు మొదలు పెట్టింది. గత ఏడాది రూ.90 కోట్లతో 80 కోట్ల చేప పిల్లలను రాష్ట్రవ్యాప్తంగా వదలాలని ప్రణాళికలు రూపొందించినా, చివరకు లక్ష్యం చేరుకోలేదు. ఈ ఏడాది రూ.100 కోట్లతో 90 కోట్ల చేప పిల్లలను రిజర్వాయర్లలో వదలాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం మే నెల చివరిలోగా ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్లు పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది.

28న అసెంబ్లీలో ఏపీ బడ్జెట్

- 24న గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

సాక్షి, అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) బడ్జెట్‌ను ఈ నెల 28న ఏపీలోని కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. అదేరోజు ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపనుంది. అనంతరం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2025–26 వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. గత బడ్జెట్‌లో సూపర్ సిక్స్ వంటి పథకాలకు కేటాయింపులు చేయకుండా ఎగనామం పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా సూపర్ సిక్స్ పథకాలకు పూర్తి స్థాయి కేటాయింపులు చేస్తుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. కాగా, శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి .ఆరోజు ఉదయం 10 గంటలకు సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు.

పిల్లర్లు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు!

- స్టీల్, సిమెంటు ఖర్చు తగ్గించేలా అడుగులు
- బడ్జెట్ సరిపోక అసంపూర్తిగా వదిలేస్తారన్న ఉద్దేశంతో గృహనిర్మాణ శాఖ కసరత్తు
- నాలుగు పద్ధతులపై లబ్ధిదారులకు అవగాహన
- నిర్మాణ తీరుపై లబ్ధిదారులకు స్వేచ్ఛ ఉంటుందన్న యంత్రాంగం



సాక్షి, హైదరాబాద్: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను రూ.లక్షల్లో వెచ్చించి పూర్తి చేసుకోగలరా? పిల్లర్లతో కూడిన నిర్మాణంలో వ్యయం పెరిగి ఇళ్లను అసంపూర్తిగా ఆపేస్తే ఎలా? ఇది ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం ముంగిట ప్రభుత్వానికి వచ్చిన సందేహాలు. నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో లబ్ధిదారులు అవసరానికి మించిన విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టి నిధులు చాలక అసంపూర్తిగా ఆపేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్న ఆందోళనే దీనికి కారణం.

మండలానికొక మోడల్ ఇల్లు

ప్రస్తుతం భవనాలను నిర్మిస్తున్నట్టుగా పిల్లర్లు, బీములతో కూడిన నిర్మాణ పద్ధతి కాకుండా, ఖర్చు తక్కువయ్యే ఇతర పద్ధతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మండలానికి ఒకటి చొప్పున, వేర్వేరు పద్ధతుల్లో మోడల్ ఇళ్లను నిర్మిస్తోంది. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వీలైనంత ఎక్కువ మంది మేస్త్రీలకు ఆయా పద్ధతుల్లో ఇళ్ల నిర్మాణంపై శిక్షణ ఇప్పించాలని నిర్ణయించింది. తొలుత హైదరాబాద్ చుట్టూ ఉన్న ఏడు జిల్లాలకు చెందిన 113 మంది మేస్త్రీలకు నగరంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో శిక్షణ ఇచ్చింది. వీరు జిల్లాల్లోని మరికొందరు మేస్త్రీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 28 నుంచి జిల్లాల్లోని న్యాక్ సెంటర్లలో నిపుణుల ఆధ్వర్యంలో కూడా మేస్త్రీలకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. వారం రోజులపాటు జరిగే శిక్షణ తరగతులకు ఒక్కో మేస్త్రీకి రూ.8 వేల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

లబ్ధిదారు ఇష్టం ప్రకారమే!

ప్రభుత్వం ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయనుంది. ఆ మొత్తంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోలేని ఆర్థిక పరిస్థితి ఉన్నవారికి ఉపయుక్తంగా ఉండేలా నాలుగు నిర్మాణ పద్ధతులను అందుబాటులోకి తెచ్చింది. కానీ, ఆ నాలుగింటిలో కచ్చితంగా ఒకదాన్ని అనుసరించాలన్న నిర్బంధం లేదని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారు సాధారణ పద్ధతిలో అయినా ఇంటిని నిర్మించుకోవచ్చని, ఆర్థిక పరిస్థితి సహకరించని పక్షంలో, నమూనా ఇంటిని చూసి ఆ పద్ధతిలో ఇంటిని నిర్మించుకోవచ్చని అంటున్నారు. ఇంటి విస్తీర్ణం 400 చ.అ.కు తగ్గకుండా ఉండాలని ఇంతకాలం చెబుతూ వచ్చిన అధికారులు, ఇప్పుడు ఆ విస్తీర్ణం 600 చ.అ.కు మించరాదని కూడా బలంగా చెబుతున్నారు. విస్తీర్ణం పెరిగితే ఖర్చు తడిసిమోపెడై, ఇంటిని అసంపూర్తిగా వదిలేస్తారన్న ఉద్దేశంతో ఇలా చెబుతుంటారని అంటున్నారు.

నాలుగు డిజైన్ల ఖరారు..

1. **షార్ట్ కాలమ్ కన్‌స్ట్రక్షన్:** ఇళ్ల నిర్మాణంలో స్టీల్ వ్యయం చాలా ఎక్కువ. దీన్ని పరిహరించేలా ఈ డిజైన్‌ను అనుసరిస్తారు. పునాదిస్థాయి వరకు మాత్రమే కాలమ్స్ ఉంటాయి. పైన ప్లింథ్ బీమ్స్ ఉంటాయి. మధ్యలో పిల్లర్లు లేకుండా కాంక్రీట్ గోడ ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్లలో పై అంతస్తులు ఉండే అవకాశం లేనందున ఈ నమూనా బాగుంటుందని అధికారులు చెబుతున్నారు.
2. **షియర్ వాల్ పద్ధతి:** ఇందులో ప్రీఫ్యాబ్రికేటెడ్ గోడలను నిర్మాణ స్థలంలోనే ముందుగా సాంచాల ద్వారా కాంక్రీట్‌తో సిద్ధం చేస్తారు. పునాదులపై రంధ్రం డ్రిల్ చేసి రాడ్స్‌తో ఆ గోడలను అనుసంధానిస్తారు. వాటి మీద పైకప్పు వేస్తారు. ఇందులో ఇటుక, స్టీల్ వ్యయం ఉండదు.
3. **స్టోన్ రూఫింగ్ విధానం:** కాంక్రీటు గోడలు నిర్మించిన తర్వాత పైన పూర్వకాలపు దూలాల తరహాలో ఆర్‌సీసీ రాఫ్టర్స్ ఏర్పాటు చేస్తారు. వాటి మీద షాబాద్ బండలు పరుస్తారు. ఆ బండల మీద తక్కువ మందంతో కాంక్రీట్ పొర వేస్తారు. షాబాద్ బండల లభ్యత అధికంగా ఉండే ప్రాంతాలకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. తాండూరు లాంటి ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామంది ఇళ్ల కప్పులుగా తాండూరు బండలనే వాడుతున్నారు.
4. **పిల్లర్ రూఫింగ్ నిర్మాణం:** గోడలపై ఆర్‌సీసీ రాఫ్టర్లు అమర్చి వాటి మీద పూర్వ కాలం తరహాలో బెంగళూరు పెంకులు పరుస్తారు. పెంకుల మీద రెండున్నర అంగుళాల మందంతో శ్లాబ్ వేస్తారు. దీనిలో ఇటుక, స్టీల్ వ్యయాన్ని పరిహరించొచ్చు.

సీఎం సవాల్ హాస్యాస్పదం

- బీఆర్‌ఎస్‌తో కలిసే ప్రసక్తే లేదు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వ 14 నెలల పనితీరుపై బహిరంగ చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసరడం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలపై కార్యాచరణ ప్రకటించి చర్చకు రమ్మంటే బాగుంటుందని హితవు పలికారు. శనివారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళిక పుస్తకం ఇంకా తెరవనే లేదని, అయినప్పటికీ వారి పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసురుతున్నారని విమర్శించారు. 100 రోజుల్లో గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి.. 400 రోజులు గడుస్తున్నా.. ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలో ప్రజా సమస్యలు లేవనెత్తి మంత్రులకు చెమటలు పట్టించాలంటే బీజేపీ అభ్యర్థులను ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కులగణనకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని, ముస్లింలను బీసీల్లో చేర్చడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏడు నెలలుగా బీజేపీ సంస్థాగత ఎన్నికలపై దృష్టి పెట్టిందని, నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. ఏ ఎన్నికల్లోనైనా బీజేపీ ఒంటరిగానే ముందుకెళ్తుందని, బీఆర్‌ఎస్‌తో కలిసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన వెంటనే ప్రభుత్వంపై యుద్ధం

- కేంద్రమంత్రి సంజయ్



కరీంనగర్ టౌన్: నమ్మకద్రోహం, నయవంచనకు, పోరాటాలు, ధర్మరక్షణకు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గ పచ్చీస్ ప్రభారీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని గ్రాడ్యుయేట్స్, టీచర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు గెలిచిన వారం రోజుల్లోనే దీక్షలు, ఉద్యమాలతో కాంగ్రెస్ సర్కార్‌పై యుద్ధం ప్రారంభిస్తామని ప్రకటించారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీసీ జపం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీకి అభ్యర్థులే లేక పోటీ నుంచి తప్పుకుందని సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కూడా అభ్యర్థులు దొరకక బయటి వాళ్లను అరువు తెచ్చుకుందన్నారు. రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలిచారని, వీరిద్దరూ ఆర్‌ఎస్ బ్రదర్సేనంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సంజయ్ తీవ్రస్థాయిలో స్పందించారు. బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌కు లోపాయికారీగా మద్దతిస్తోందని ఆరోపించారు. అందుకే కాళేశ్వరంలో, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ కేసు, ఫార్ములా ఈ రేసు స్కాంలో కచ్చితమైన ఆధారాలున్నా అరెస్ట్ చేయడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నామని, డేట్, టైం, వేదిక ఫిక్స్ చేయమని సంజయ్ కోరారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కూలిన దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, గోపి పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- నాలుగు డీఏలు తక్షణమే విడుదల చేయాలి
- ఈహెచ్‌ఎస్‌పై నిర్ణయం తీసుకోవాలి
- టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు పేరుకుపోయిన బకాయిలను, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఈసీఈ ఆడిటోరియంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలు విడుదల కావాల్సి ఉందని, పీఆర్‌సీ కూడా విడుదల చేయాలని చెప్పారు. హెల్త్‌కార్డుల అంశాన్ని కూడా వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమల్లో ఉన్న సీపీఎస్‌ను రద్దు చేసి ఆ స్థానంలో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పదోన్నతి కమిటీలను వీలైనంత వేగంగా పూర్తి చేసి పదోన్నతులు ఇవ్వాలని, పీఆర్‌సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో ఉమ్మడి జిల్లాల ప్రకారం అన్ని విభాగాలలో అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరిపి 13 అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ తీర్మాన ప్రతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రివర్గ ఉపసంఘానికి అందించనున్నట్లు ఆయన వివరించారు.

బాబుకు గురుదక్షిణగా 'గోదావరి'

- సీఎంపై ఎమ్మెల్సీ కవిత విమర్శ



మాట్లాడుతున్న కవిత

సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడికి గురుదక్షిణగా కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను సీఎం రేవంత్‌రెడ్డి సమర్పిస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ప్రజాభవన్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశం తర్వాతే బనకచర్ల ప్రాజెక్టు చేపడతామని చంద్రబాబు ప్రకటించారని, ఏపీ సీఎంకు రేవంత్‌రెడ్డి బ్రీఫ్ చేసిన అనంతరం ఆయన ప్రకటన చేశారని అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డును ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. తక్షణమే కోర్టుకు వెళ్లి బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని డిమాండ్ చేశారు. తనపై మాట్లాడవద్దని సుప్రీంకోర్టు చివాట్లు, మొట్టికాయలు వేసినా రేవంత్‌రెడ్డి తీరు మార్చుకోకుండా కామెంట్లు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పసుపు రైతులకు మార్చి 1లోపు మద్దతు ధర, బోనస్ ప్రకటించాలని, లేకుంటే కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

చెక్కులు సిద్ధమే.. చేతికే అందడం లేదు..

- పరిశ్రమలకు ప్రోత్సాహకాల చెల్లింపుల్లో వింత పరిస్థితి
- గత డిసెంబర్ నాటికి ఇవ్వాల్సిన నిధులు రూ.4,236 కోట్లు
- ఎస్‌ఎల్‌సీ సిఫారసులు కాగితాలకే పరిమితం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల కోసం యాజమాన్యాలకు ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రోత్సాహకాలకు సంబంధించి రూ.వేల కోట్ల రూపాయలు పేరుకు పోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు పరిశ్రమల శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి. గత ప్రభుత్వం ఏళ్ల తరబడి పెండింగులో పెట్టిన నిధులను తమ ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తుందని గత ఏడాది ఎంఎస్‌ఎంఈ పాలసీ విడుదల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. 2024–25 బడ్జెట్‌లో పారిశ్రామిక రంగానికి రూ.2,762 కోట్లు కేటాయించారు. ఇందులో సుమారు రూ.1,500 కోట్లతో ప్రోత్సాహకాలకు సంబంధించిన నిధులు చెల్లిస్తామని ప్రకటించారు. కాగా, తమ పేరిట చెక్కులు సిద్ధమైనా నిధులు లేవనే కారణంతో అధికారులు వాటిని ఇవ్వడం లేదని పరిశ్రమల యజమానులు వాపోతున్నారు.

ఏళ్ల తరబడి ఎదురు చూపులు

రాష్ట్ర పారిశ్రామిక విధానం (టీజీ ఐపాస్)లో భాగంగా పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులతో ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ప్రకటించింది. జనరల్ కేటగిరీకి టీ -ఐడియా (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ అంత్రప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్) ఇన్సెంటివ్ స్కీమ్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కోసం టీ-ప్రైడ్ (తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత్ అంత్రప్రెన్యూర్స్) ఇన్సెంటివ్ స్కీమ్ పేరిట 2014లో ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఐడీఎఫ్), పెట్టుబడి రాయితీ, బొగ్గు, భూమి, స్టాంప్ డ్యూటీ, జీఎస్టీ, రవాణా సుంకం, విద్యుత్, పావలావడ్డీ తదితర రూపాల్లో ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేస్తుంది. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా 2015 నుంచి పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని ప్రోత్సాహకాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు.

ఇప్పటికి 94 సార్లు ఎస్‌ఎల్‌సీ సమావేశాలు..

ప్రతీ మూడు నెలలకోసారి సమావేశమయ్యే ప్రోత్సాహకాల రాష్ట్రస్థాయి కమిటీ (ఎస్‌ఎల్‌సీ) వివిధ కేటగిరీల కింద ప్రోత్సాహకాల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి, చెల్లింపుల కోసం ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. 2014లో తెలంగాణ ఏర్పాటు అనంతరం ఇప్పటి వరకు 94 సార్లు ఎస్‌ఎల్‌సీ సమావేశాలు జరిగాయి. పరిశ్రమల శాఖ డైరెక్టర్.. చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో వివిధ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. గత ఏడాది నవంబర్ 27న జరిగిన 94వ ఎస్‌ఎల్‌సీ సమావేశంలో పలు దరఖాస్తులను పరిశీలించి, చెల్లించాల్సిన మొత్తాన్ని కమిటీ ఖరారు చేసింది. ఈ భేటీలో జనరల్ కేటగిరీకి సంబంధించి రూ.330 కోట్లు, ఎస్సీ కేటగిరీలో రూ.272.5 కోట్లు, ఎస్టీ కేటగిరీకి సంబంధించి రూ.80.86 కోట్లకు సంబంధించిన చెక్కులు సిద్ధం చేసినట్లు ప్రకటించినా, నేటికీ చెల్లింపులు మాత్రం పూర్తి స్థాయిలో జరగలేదని చెపుతున్నారు. ఇదిలా ఉండగా పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన ప్రోత్సాహక నిధులపై వివరాలు వెల్లడించేందుకు పరిశ్రమల శాఖ అధికారులు సుముఖత చూపడం లేదు.

డిసెంబర్ నాటికి పెండింగులో ఉన్న ప్రోత్సాహక నిధులు

కేటగిరీ	లబ్ధిదారులు	ఇవ్వాల్సిన నిధులు (రూ.కోట్లలో)
జనరల్	18,125	2,169.56
పీహెచ్‌సీ	1,511	64.501
ఎస్సీ	12,231	759
ఎస్టీ	24,060	1,243.36
మొత్తం	55,927	4,236.42

దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించారు

▶ మొదటి పేజీ తరువాయి

పోల్చిన దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోకుండా ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తూ తెలంగాణ పరువు తీస్తున్నాడు. రేవంత్‌రెడ్డి అబద్ధాలను బట్టబయలు చేస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్‌ను విడుదల చేశారు. సీఎం చెబుతున్న అబద్ధాలను తిప్పికొడుతూ సమగ్ర నివేదిక ద్వారా వాస్తవాలు బయట పెట్టారు. మాజీ సీఎం కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందనే భయంతో వెబ్‌సైట్ నుంచి ఈ నివేదికను ప్రభుత్వం తొలగించింది'అని కేటీఆర్ ఆరోపించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేసిన చోటే కాంగ్రెస్ పోటీ చేయాలి

సీఎం రేవంత్ రంకెలు వేయడం మాని పాలనపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని కేటీఆర్ హితవు పలికారు. ఆరు గ్యారంటీలు అమలు చేసిన చోటే కాంగ్రెస్ పోటీ చేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామన్న చోటే సీఎం ఓట్లు అడగాలని సూచించారు. 'రాబోయే రోజుల్లో రేవంత్ ఆడబిడ్డల పుస్తెల తాడు కూడా ఎత్తుకుపోతాడు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రక్షణలో రేవంత్ ఉన్నాడు. రేవంత్, బండి సంజయ్‌ను ఆర్‌ఎస్ బ్రదర్స్ అనుకుంటున్నారు. బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు రూ.150 వసూలు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం 'ఆర్‌ఆర్ ట్యాక్స్'విధిస్తోందని గతంలో ప్రధాని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందో చెప్పాలి. బీజేపీలో చేరేందుకు రేవంత్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారా? సుంకిశాల ప్రమాదంలో రేవంత్ ఎవరిని కాపాడుతున్నారో తెలుసు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా కోసం డిమాండ్ చేస్తే ఉద్యోగం పోతుందని సీఎం భయపడుతున్నాడు. కృష్ణా జలాల దోపిడీ జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును అసెంబ్లీ వేదికగా ఎండగడతాం. తెలంగాణను ఎవరు తక్కువ చేసి దూషించినా అదే స్థాయిలో సమాధానం ఇస్తాం'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 23-2-2025

న్యూస్‌మేకర్ - కరిబసమ్మ



ఆమె మరణించదలుచుకుంది.
'సగౌరవంగా మరణించే హక్కును ప్రసాదించండి' అని 24 ఏళ్ల పాటు పోరాడి ఆ హక్కును సాధించుకుంది.
'రైట్ టు డై విత్ డిగ్నిటీ' అనే డిమాండ్‌తో 'యుథనేసియా' ద్వారా ప్రాణం విడువనున్న 85 ఏళ్ల కరిబసమ్మ కొత్త చర్చను లేవనెత్తే అవకాశం ఉంది.
'మన దేశంలో పేదరికం వల్ల వైద్యం చేయించుకోలేక, వైద్యం లేని జబ్బుల వల్ల కోట్ల మంది బాధపడుతున్నారు. వారికి సగౌరవంగా మరణించే హక్కు ఉంది' అంటోంది కరిబసమ్మ.
వివరాలు....

సగౌరవ మరణం నా ప్రాథమిక హక్కు

'రాజ్యాంగం జీవించే హక్కు ఇచ్చినట్టుగానే మరణించే హక్కు కూడా ఇచ్చింది. నేనెందుకు గౌరవంగా మరణించకూడదు? నేను మరణించేందుకు ప్రభుత్వం ఎందుకు సాయపడకూడదు? యుథనేసియా (మెర్సీ కిల్లింగ్) నెదర్లాండ్స్, నార్వే వంటి దేశాల్లో ఉంది. అది ఎక్కువ అవసరమైనది మన దేశంలోనే' అంటుంది 85 ఏళ్ల కరిబసమ్మ. 'మెర్సీ కిల్లింగ్' కోసం 24 ఏళ్లుగా పోరాడుతోందామె. ఇప్పుడు ఆమెకు కర్ణాటక ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఈ మేరకు జనవరి 30న ప్రభుత్వం ఒక సర్క్యులర్ జారీ చేస్తూ రాష్ట్రంలో అనివార్యమైన పరిస్థితుల్లో ఉన్న 70 ఏళ్లకు పైబడిన వారు 'రైట్ టు డై' హక్కును ఉపయోగించవచ్చని పేర్కొంది. అయితే ఇతర అనుమతులు కూడా ఓకే అయితేనే రెండు వారాల్లో కరిబసమ్మకు దయామరణం ప్రాప్తించవచ్చు.

ఎవరు ఈ కరిబసమ్మ?

కర్నాటకలోని దావణగెరెకు చెందిన కరిబసమ్మ రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్. ఇప్పుడు వయసు 85 ఏళ్లు. 30 ఏళ్ల క్రితం ఆమెకు డిస్క్ స్లిప్ అయ్యింది. దాంతో నడవడం ఆమెకు పెద్ద సమస్య అయ్యింది. నొప్పికి తట్టుకోలేక చావే నయం అని నిశ్చయించుకుంది. దాదాపుగా 24 ఏళ్లుగా ఆమె ఇందుకై పోరాడుతోంది. 2010లో పదివేల సంతకాలతో ప్రభుత్వానికి మెమొరాండం సమర్పించింది. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఎందరో అధికారులకు, మంత్రులకు, రాష్ట్రపతికి ఆమె లేఖలు రాసింది. రాష్ట్రపతికి లేఖ రాశాక పోలీసులు వచ్చి ఇందుకు మన దేశంలో అనుమతి లేదని, కనుక పిటిషన్లు పంపవద్దని కోరారు. దాంతో కరిబసమ్మ కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ నువ్వు జైలుకెళితే మా మర్యాద ఏం కాను అని వారు ఆమెను నిలదీశారు. దాంతో ఆమె కేర్ హోమ్‌కు మారింది. తన పోరాటం కోసం ఇంటిని అమ్మి అందులో ఆరు లక్షలు బి.ఎస్.ఎఫ్ జవాన్ల సంక్షేమానికి ఇచ్చింది. మిగిలిన డబ్బుతో తన పోరాటం సాగించింది. ఇప్పుడు ఆమె కేన్సర్‌తో బాధ పడుతోంది.

ప్రాణం తీసుకోవడం పాపం కాదా?

'ఆత్మహత్య, మరణాన్ని కోరుకోవడం ఏ మతమూ అంగీకరించదు. దీనిపై మీరేమంటారు?' అని కరిబసమ్మను అడిగితే 'అలా మతాచారాలు, విశ్వాసాలు మాట్లాడేవారు రోడ్డు మీద దిక్కు లేక అనారోగ్యంతో బాధపడే వృద్ధులను తీసుకెళ్లి వాళ్ల ఇళ్లల్లో పెట్టుకోవాలి. అప్పుడు మాట్లాడాలి. అనుభవించేవారికి తెలుస్తుంది బాధ. మన దేశంలో పేదరికంలో ఉన్న వృద్ధులు జబ్బున పడితే చూసే దిక్కు ఉండదు. వాళ్లు మలమూత్రాలలో పడి దొర్లుతుండాలా? వారు సగౌరవంగా మరణించాలని కోరుకుంటే మనం ఆ కోరికను ఎందుకు గౌరవించకూడదు? అన్నారామె.

2018లో సుప్రీంకోర్టు

రైట్ టు డై హక్కును సుప్రీం కోర్టు 2018లో అంగీకరించింది. 'రాజ్యాంగపరంగా మరణించే హక్కు పౌరులకు లభిస్తుంది' అని చెప్పింది. 2023లో ఎవరు ఏ వయసు, పరిస్థితుల్లో ఉంటే ఇటువంటి విన్నపాన్ని కోరవచ్చో మార్గదర్శకాలను సూచించింది. అయితే కర్నాటక ప్రభుత్వం ఇప్పటి వరకూ సుప్రీంకోర్టు డైరెక్షన్ గురించి దృష్టి పెట్టలేదు. అంటే మెర్సీ కిల్లింగ్ పట్ల సంశయ మౌనం దాల్చింది. కాని కరిబసమ్మ పట్టుదల వల్ల ఇన్నాళ్లకు అనుమతినిచ్చింది.

70 ఏళ్లు పైబడి

'70 ఏళ్లు పైబడి, వైద్యపరంగా మందులకు స్పందించని స్థితిలో, సపోర్ట్ సిస్టమ్ మీద ఉంటే అటువంటి వారికి మెర్సీ కిల్లింగ్ గురించి ప్రభుత్వం అనుమతిని పరిశీలిస్తుంది. మనది సభ్య సమాజం. బాధితులను ఎన్నో విధాలుగా ఆదుకోవచ్చు. కాబట్టి అడిగిన వెంటనే మరణించే హక్కుకు అనుమతి లభిస్తుందని ఆశించవద్దు. కరిబసమ్మ విషయంలో కూడా ఆరోగ్య శాఖ ఆమెను పరిశీలించి ఆరోగ్యపరంగా దుర్భర స్థితిలో ఉందని తేల్చితేనే ఆమెకు రైట్ టు డై అనుమతి లభిస్తుంది' అని కర్నాటక ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.


ట్రెండ్ పేరెంటింగ్

ఫాఫో

సోషల్ మీడియాలో 'ఫాఫో పేరెంటింగ్' వైరల్ ట్రెండ్‌గా మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే 'అనుభవమైతేగానీ తత్వం బోధపడదు' అనే మాటకు అద్దం పట్టే పేరెంటింగ్ ట్రెండ్ ఇది.

ఉదాహరణకు: 'బయట బాగా చలిగా ఉంది... కోటు వేసుకొని వెళ్లు' అన్నది తల్లి.

తల్లి మాటను పట్టించుకోకుండా ఆ పిల్లాడు బయటకు పరుగెత్తాడు. అయితే కొద్దిసేపట్లోనే ఇంట్లోకి వచ్చి...'మమ్మీ... కోటు కావాలి... బాగా చలిగా ఉంది' అన్నాడు.



'కోటు వేసుకుంటేగానీ నువ్వు బయటకు వెళ్లడానికి వీలు లేదు' అనలేదు తల్లి.

'వాడే తెలుసుకుంటాడు లే' అనుకుంది... ఇదే 'ఫాఫో' పేరెంటింగ్ సారాంశం. ఈ పేరెంటింగ్ అనేది పిల్లలకు ఏది మంచి, ఏది చెడు అని ఆలోచించేలా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది.

అయితే అన్ని విషయాలకూ 'ఫాఫో' పేరెంటింగ్ సరిపోదు.

ఉదాహరణకు భద్రతకు సంబంధించిన విషయాలు. నిర్లక్ష్యంగా రోడ్డు దాటడం, వేడి పొయ్యిని తాకడం... మొదలైనవి.

మాంటిస్సోరీ ఫిలాసఫీ ప్రకారం కఠినమైన ఆదేశాల కంటే నిజజీవిత అనుభవాల నుండి నేర్చుకోవడానికి పిల్లలను తల్లిదండ్రులు అనుమతించినప్పుడు అభివృద్ధి చెందుతారు. 'ఫాఫో'లో మాంటిస్సోరీ ఫిలాసఫీ ప్రతిఫలిస్తుంది.

గిన్నిస్ రికార్డ్



సమకోణాసనంలో వసంతలక్ష్మి. ఈ ఆసనంలోనే ఆమె రికార్డులకెక్కింది.

వసంత యోగం

ఒత్తిడి సమస్యతో యోగాకు దగ్గరైన వసంత లక్ష్మి ఆ విద్యలో ప్రావీణ్యం సాధించి రికార్డులు బ్రేక్ చేస్తోంది. తాజాగా... సమకోణాసనంలో 3.22 గంటలుగా నమోదైన గత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును బ్రేక్ చేసింది. 3.42 గంటల పాటు సమకోణాసనం వేసి సరికొత్త రికార్డు సృష్టించింది తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన వసంతలక్ష్మి.



'నేర్చుకోవాలి-చదువుకోవాలి' అనేది వసంతలక్ష్మి తారకమంత్రం. పెళ్లి అయిన తరువాత చదువుకు దూరం అయింది. 'ఇక ఇంటి బాధ్యతలు చాలు' అనుకునేలోపే తారక మంత్రం తనను అప్రమత్తం చేసింది.'చదువుకోవాలి-నేర్చుకోవాలి'

అంతే...ఆమె మళ్లీ చదువుకు దగ్గర అయింది. తిరుపతిలో డిగ్రీ, హిందీ పండిట్ కోర్సు పూర్తి చేసింది. ఆ తరువాత భర్త ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌కు చేరుకుంది. అక్కడ ఓ ప్రైవేట్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేది. మొదట్లో బాగానే ఉండేది కాని ఆ తరువాత కుటుంబ నిర్వహణ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ పనుల వల్ల తీవ్ర ఒత్తిడికి గురయ్యేది. ఆ సమయంలో తనకు యోగా గుర్తుకు వచ్చింది. యోగా అనేది ఒత్తిడిని చిత్తు చేసే తారకమంత్రం అనే విషయం చాలాసార్లు విని ఉన్నది వసంతలక్ష్మి.

హైదరాబాద్ అమీర్‌పేటలోని 'స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్'లో యోగా క్లాస్‌లో చేరింది. ఇది తన జీవితానికి మేలి మలుపుగా చెప్పుకోవాలి. క్రమం తప్పకుండా సాధన చేసి యోగాలో కేంద్రప్రభుత్వం నుంచి క్వాలిటీ కౌన్సెలర్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) సర్టిఫికెట్ అందుకుంది. ఆ తరువాత నిజామాబాద్‌లోని యోగా ఇన్‌స్టిట్యూట్‌లో గురువు రామచంద్ర దగ్గర అడ్వాన్స్‌డ్ యోగాలో ఆరు నెలలపాటు శిక్షణ తీసుకుంది. తనలోని క్రమశిక్షణ, ప్రతిభను గుర్తించిన గురువు రామచంద్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా వసంతలక్ష్మిని ప్రోత్సహించాడు.

తెలుగు రాష్ట్రాలతో సహా బెంగళూరు, గుజరాత్, హరియాణా, ఢిల్లీ, తమిళనాడులో నిర్వహించిన వివిధ పోటీల్లో సత్తా చాటి 25 స్వర్ణ, రజత పతకాలు సాధించింది. ఒకవైపు యోగా సాధన చేస్తూనే మరోవైపు ఎమ్మెస్సీ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసింది. 'యోగా అకాడమి'కి శ్రీకారం చుట్టింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఎంతోమందికి యోగా నేర్పిస్తోంది. చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలో అపోలో హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల పాటు పిల్లలకు యోగాలో శిక్షణ ఇచ్చింది. గతంలో 45 మందితో 108 సూర్య నమస్కారాలను కేవలం 28 నిముషాల్లో పూర్తి చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, నోబెల్ వరల్డ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. తాజాగా గత రికార్డ్‌ను బ్రేక్ చేసి సమకోణాసనంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు సాధించింది.

ఆరోగ్య భారత్ కోసం....

రికార్డ్‌లు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి. గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ఆరోగ్య భారత్ కోసం ఒక ఆశ్రమం ఏర్పాటు చేయాలని ఉంది. ప్రజల అనారోగ్య సమస్యలకు యోగా ద్వారా పరిష్కారం చూపాలనేదే నా లక్ష్యం.

– వసంతలక్ష్మి

– నిడిగింటి విజయకుమార్, సాక్షి, తిరుపతి డెస్క్/
కలపాటి భాస్కర్, వెంకటగిరి రూరల్

హెల్త్

● గుడ్ ఫర్ స్కిన్

మేనిగనిగలకు...



ఒక మహిళ తాలూకు ఆరోగ్యం ఎలా ఉందన్నది ఆమె మేని ఛాయ, నిగారింపు లాంటి అంశాలు పట్టి చూపుతాయి. ఆమె వయసుకూ, హార్మోన్ల సమతౌల్యతకూ, ఆరోగ్యకరమైన జీవనశైలికీ ఆమె చర్మం ప్రతిబింబం. కౌమార దశ నుంచి మెనోపాజ్ వచ్చేవరకు ప్రతి దశనూ ఆమె చర్మం ఓ అద్దంలా చూపిస్తూ ఉంటుంది. ప్రతి వాళ్ల చర్మమూ ప్రధానంగా (బ్రాడ్‌గా) జిడ్డు చర్మం, నార్మల్ లేదా పొడి చర్మం అనే మూడింట్లో ఏదో ఒకటిగా ఉంటుంది. ఓ మహిళది ఆయిలీ స్కిన్ అయితే... వయసు పెరుగుతున్న కొద్దీ అది క్రమంగా ఆయిలీ నుంచి నార్మల్‌కు మారవచ్చు. అదే... మరొకరి విషయంలో నార్మల్ స్కిన్ అయితే... అది నార్మల్ నుంచి పొడి చర్మానికి మారవచ్చు. ఆయా వయసుల్లో చర్మంలో వచ్చే మార్పులేమిటి, ప్రతికూల మార్పుల నుంచి రక్షణ పొందడమెలా, సుదీర్ఘకాలం పాటు చర్మ రక్షణ ఎలాగో తెలుసుకుందాం.

వేర్వేరు వయసుల్లో చర్మంలో వచ్చే మార్పులెలా ఉంటాయో, వాటిని అధిగమించి మేనిని ఆరోగ్యంగా ఉంచుకునే రక్షణ చర్యలేమిటో చూద్దాం.

టీనేజ్‌లో (అంటే 13 నుంచి 19 ఏళ్ల వయసు వరకు)...

ఈ వయసులోనే అమ్మాయిల్లో రుతుక్రమం మొదలవుతుంది. ఈ టైమ్‌లో వాళ్లలో ఈస్ట్రోజెన్, యాండ్రోజెన్ హార్మోన్ల మోతాదులు మారిపోతాయి. దాంతో చర్మం కాస్తంత జిడ్డుగా (ఆయిలీగా) మారుతుంది. ఫలితంగా మొటిమలు, బ్లాక్‌హెడ్స్ కనిపిస్తాయి. కొందరిలో ఆ మొటిమలు పగిలిపోతాయి. ఇవి ముఖ్యంగా ముఖంలోని నుదురు, ముక్కు, చుబుకం వంటి టీ-జోన్‌లో ఇవి వస్తుంటాయి.

రక్షణ ఇలా: ఇలాంటి మొటిమల నుంచి చర్మాన్ని రక్షించుకోవడం కోసం... జిడ్డు తొలగిపోయేలా మైల్డ్ సోప్‌తో ముఖం కడుక్కుంటూ ఉండటం, అన్ని పోషకాలు అందేలా సమతులాహారం తీసుకోవడం, కొవ్వులు, నూనెలు ఉన్న ఆహారాన్ని తక్కువగా తీసుకుంటుండటం, వీలైతే డాక్టర్ సలహాతో జిడ్డు తొలగేందుకు తగిన క్లెన్సింగ్ ఉత్పాదనలు వాడటం చేయాలి.

20 నుంచి 30 ఏళ్ల వయసు వరకు...

హార్మోన్లలో సమతౌల్యత ఏర్పడే వయసు ఇది. ఈ సమయంలో జిడ్డు చర్మం చాలా వరకు నార్మల్ అయ్యే అవకాశముంది. అయితే ఈ వయసులో కొన్ని రకాల ఒత్తిడులు పెరగడం జరుగుతుంది. మొదట్లో అంతగా క్రమబద్ధంగా లేని రుతుక్రమం కాస్త ఓ గాడిన పడి, క్రమం తప్పకుండా రావడం మొదలవుతున్నప్పటికీ అయితే అప్పుడప్పుడూ కొన్నిసార్లు క్రమం తప్పడమూ కనిపిస్తుంది. ఈ వయసులోనే మహిళల గర్భధారణ జరగడం మామూలు. అలాంటి సందర్భాల్లో కొందరిలో ముఖం మీద నల్లమచ్చల్లా వచ్చే 'క్లోయాస్మా' అనే పిగ్మెంటేషన్ (మెలాస్మా లాంటిదే) గోధుమరంగులో ముఖం మీద కనిపిస్తుంది.

రక్షణ ఇలా: ప్రధానంగా ఈ వయసులో ఉండే ఒత్తిడిని రిలాక్సేషన్ టెక్నిక్స్‌తో అధిగమించి ప్రశాంతంగా ఉండాలి. ఇక గర్భధారణ సమయంలో కనిపించే పిగ్మెంటేషన్ గురించి అంతగా ఆందోళన కూడా అక్కర్లేదు. ప్రసవం తర్వాత దానంతట అదే తగ్గిపోయే అవకాశాలే ఎక్కువ. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే సమతులాహారం తీసుకుంటూ ఉండాలి. ఒంటికి తగినంత ద్రవాహారం అందేలా మంచి నీళ్లు, కొబ్బరినీళ్ల వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఎండలోకి వెళ్లేప్పుడు తప్పనిసరిగా ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ ప్రతి రెండు మూడు గంటలకోమారు రాసుకుంటూ ఉండాలి.

40వ పడిలో...

మహిళల్లో తమ నలభైల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్రవించే మోతాదు క్రమంగా తగ్గడం మొదలవుతుంది. దాంతో చర్మాన్ని బిగుతుగా ఉంచే కొలాజెన్ అనే ప్రోటీన్ తగ్గడం వల్ల చర్మం తమ బిగువు కోల్పోవడం మొదలై వదులుగా కనిపించడం ప్రారంభమవుతుంటుంది. ఈ కొలాజెన్, అలాగే దేహంలో ఉండే తేమ తగ్గుతుండటం వల్ల ముఖంలో, చర్మం ముడతలు పడే ప్రాంతాల్లో సన్నటి గీతలుగా కనిపించడం మొదలవుతుంది. ఆ గీతలు క్రమంగా లోతుగా మారడం, చర్మం బాగా వదులయ్యాక ముడతలుగా కనిపిస్తుంది.



రక్షణ ఇలా: అందుకే ఇలా చర్మం డల్‌గా, వేలాడటం మొదలవ్వడానికి ముందే దేహానికి కొలాజెన్ అందించే మంచి ఆహారం, వేలడకుండా మంచి వ్యాయామం అందించాలి. తాము తీసుకునే పోషకాల్లో కొలాజెన్ అందించే ఆహారాలైన చేపలు, నట్స్, విటమిన్-సి పుష్కలంగా ఉండే తాజాపండ్లు తీసుకోవాలి. దీంతో చర్మం ఈ వయసులోనూ బిగుతుగా, మేనిలో మంచి మెరుపుతో ఉంటుంది. మరికొంతకాలం చర్మం యౌవనంతో కనిపిస్తుంటుంది.

50వ పడి మొదలుకొని... ఆ పైన...

ఈ వయసులో మెనోపాజ్ వచ్చేందుకు అవకాశాలెక్కువ. దాంతో దేహంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ మోతాదు తగ్గుతుంది. చర్మం పలుచబారడం, పారదర్శకంగా మారుతుండటం దాంతో లోపలి రక్తనాళాలు కనిపిస్తున్నట్లుగా ఉండటం, చర్మం పొడిబారడం జరుగుతుంది. చర్మంపైన గీతలు మరింత లోతుగా మారుతూ, క్రమంగా ముడుతలు కనిపిస్తుంటాయి. ఫలితంగా ఏజింగ్ వల్ల వచ్చే మార్పులు మరింత స్పష్టమవుతుంటాయి. వయసు పైబడటం వల్ల కనిపించే అన్ని మార్పులూ వ్యక్తమవుతుంటాయి. ఈ వయసు రాగానే చర్మం తనంతట తాను రిపేర్ చేసుకునే సామర్థ్యం క్రమంగా తగ్గడం మొదలువుతుంది.

రక్షణ ఇలా: ఈ ముడతలు కనిపించడం మరింత ఆలస్యమయ్యేలా చేసుకునేందుకు అవసరమైన కొన్ని ప్రక్రియలను అనుసరించాలి. ఇందులో భాగంగా... ఒమెగా- 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా దొరికే చేపల వంటి ఆహారాలు, అన్ని పోషకాలు అందే సమతులాహారం అవసరం. ఈ వయసులో తేమ తగ్గి చర్మం పొడిగా మారడం వల్ల గీతలు మరింత లోతుగా మారడం, ముడుతలు స్పష్టంగా కనిపించడం జరుగుతుంటాయి కాబట్టి దేహానికి అవసరమైన తేమను అందించేలా మాయిశ్చరైజర్ క్రీములు వాడాలి.

ఇక చర్మం బిగుతుగా మారడానికీ, కొలాజెన్ తగ్గే ప్రక్రియ చాలా ఆలస్యంగా జరగడానికి బాగా తోడ్పడేది తగినంత వ్యాయామం. ఈ అన్ని వయసుల్లోనూ... ఆ వయసుకు తగినంత తీవ్రతతో శరీరానికి తగనంత శ్రమ తెలిసేలా వ్యాయామం చేయడం వల్ల చర్మం మరింత కాలం నిగారింపుతో, మరింత మెరుపుతో కనిపిస్తుంటుంది.

వీటితో పాటు కాస్త ఏజింగ్ ఛాయలు కనిపిస్తుండగానే వాటిని ఆలస్యం చేయడానికి, చర్మం ఆరోగ్యంగా మంచి నిగారింపుతో కనిపించడానికి డర్మటాలజిస్టుల సలహా మేరకు వారికి సరిపడే కెమికల్ పీల్స్, మైక్రోనీడిలింగ్స్, ఆర్ఎఫ్, బొటాక్స్, ఫిల్లర్స్ వంటి పలు చికిత్సలు చేయించుకోవచ్చు.



డా. విజయశ్రీ,
సీనియర్ కన్సల్టెంట్ డర్మటాలజిస్ట్

● ఫుడ్ ఫర్ కిడ్

పోతపాలు పోషకాలు



బిడ్డకు సరిపడా పాలు తల్లికి పడనప్పుడు లేదా ఏదైనా అనారోగ్య కారణంగా తల్లి తన బిడ్డకు పాలు ఇవ్వలేనప్పుడు చిన్నారికి పోతపాలు పట్టాల్సి వస్తుంది. అయితే ఈ పోతపాలను ఆరోగ్యకరంగా రూపొందించుకోవడం ఎలా, ఆవు లేదా గేదె పాలను ఎలా కలుపుకోవాలి, వాటిల్లో ఉండే పోషకాలేమిటి, నీళ్లు కలపాల్సి వస్తే వాటిని ఎంతెంత మోతాదులో కలపాలి... కొత్త తల్లులకు ఇవన్నీ సందేహాలే. ఇలాంటి ఆందోళనలు తొలగేందుకు పోతపాలపై సరైన అవగాహన కోసమే ఈ కథనం.



పోతపాలు ఇచ్చేటప్పుడు వాటి ద్వారా తగినన్ని పోషకాలు అందకపోతే శిశువుల్లో రోగ నిరోధక శక్తి తక్కువై త్వరగా ఇన్ఫెక్షన్స్ సోకే అవకాశం ఉండవచ్చు. అలాగే శాచురేటెడ్ పాలు వాడితే బిడ్డల్లో కరోనరీ హార్ట్ డిసీజ్, సెరెబ్రోవాస్క్యులర్ డిసీజ్, ఐరన్ లోపాలు వచ్చే అవకాశం ఉంది. అందుకని పోతపాలు పట్టే తల్లులకు ఈ విషయంలో సరైన అవగాహన ఉండాలి.

పోతపాల్లో ముఖ్యంగా మార్కెట్‌లో దొరికే ఫార్ములా పాలనే చాలామంది వాడుతుంటారు. వాటితో పాటు మరికొందరు ఆవు లేదా గేదె పాలు పట్టిస్తుంటారు. ఫార్ములా పాలు పౌడర్ రూపంలో వస్తాయి. వాటికి నీళ్ల కలపాలి. అలాగే ఆవు పాలు కాస్తంత పలుచగా ఉంటాయిగానీ గేదె పాలు చాలా చిక్కగా ఉంటాయి. అంత చిక్కటి పాలు పట్టడం వల్ల బిడ్డకు అవి అరగడంలో సమస్య రావచ్చు. అందుకే అవి ఎలా కలపాలో తెలుసుకుందాం.

ఫార్ములా పాలు...

పోతపాలు పట్టాల్సిన చిన్నారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని డాక్టర్లు ఆయా ఫార్ములా పాలను సూచిస్తుంటారు. ఇక కొందరు పిల్లలకు చాలా త్వరగా అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారికి హైపోఅలెర్జెనిక్ ఫార్ములా పాలను సిఫార్సు చేస్తారు. ఈ తరహా పాలు అలర్జీ రాకుండా చూడటంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయి గానీ వీటి ఖరీదు ఎక్కువ.

బిడ్డ ఆరోగ్య స్థితిని బట్టి డాక్టర్ సూచించిన ఫార్ములా పౌడర్‌ను ఔన్స్‌కి 30ఎం.ఎల్ నీళ్లను గానీ లేదా డాక్టరు సూచించిన విధంగా గానీ కలపాలి. శుభ్రపరిచిన కప్పు, స్పూన్ ద్వారా లేదా గోకర్ణం లేదా బాటిల్‌తో పాలు పట్టవచ్చు. వీటిని రోజుకు 150 నుంచి 165 ఎం.ఎల్ చొప్పున రోజుకు 6 నుంచి 8 సార్లు పట్టాల్సి ఉంటుంది. సోయా మిల్క్ ఫార్ములాలో లాక్టోజ్ తక్కువగా ఉంటుంది.

ఆవు, గేదె పాల విషయానికి వస్తే...

ఆవు పాలలో తన దూడ ఎదగడానికి కావల్సిన పోషకాలు ఉంటాయి. గేదె పాలలో కూడా ఇలా తన దూడకు కావల్సిన మేరకు పోషకాలు ఉంటాయి. వాటిని అలాగే హ్యూమన్ బేబీకి తాపితే వాటిలో ఉండే అధిక ప్రొటీన్లు బిడ్డకు సులభంగా జీర్ణం కావు. ఇక ఆవుపాలలో సోడియం చాలా తక్కువగా ఉంటుంది. గేదెపాలలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. మేక, గొర్రె పాలలో ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ (ఈఎఫ్ఏ) ఉన్నప్పటికీ పోటాషియమ్, అలెర్జీలను కలిగించే పదార్థాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వాటిని అందరూ సిఫార్సు చేయరు.

ఫార్ములా పాలు అందుబాటులో లేనప్పుడు ఆవుపాలు పట్టచ్చు. అయితే పూర్తిగా తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఇవి అంతగా ఆమోదయోగ్యం కాదు. ఇందులో కేలరీలు తక్కువగా, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. సరిగ్గా పాలు కాచకపోయినా, తగినన్ని నీళ్లు కలపకపోయినా బిడ్డకు అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే తగినన్ని నీళ్లు కలిపి బిడ్డకు పట్టించాలి. వీలైతే ఆర్నెల్ల వరకు ఆవు, గేదె, మేక ఎలాంటి యానిమల్ ఇవ్వకపోవడమే మంచిది.

పోతపాలు వాడటానికి ముందుగా...

తల్లికి ఏదైనా పరిస్థితుల్లో బిడ్డకు సరిపోయినన్ని పాలు పడకపోతే మెటక్లోప్రామైడ్ వంటి మందుల్ని డాక్టర్లు సూచిస్తుంటారు. ఇలాంటివి డాక్టర్ల సూచన మేరకే వాడాలి. అయితే వీటిని వాడటం వల్ల భవిష్యత్తులో ఆరోగ్యసమస్యలు వస్తాయనే దురభిప్రాయం కొందరిలో ఉంటుంది. అది కేవలం అపోహ మాత్రమే.



డా. కళ్యాణ్ చక్రవర్తి కొండా,
కన్సల్టెంట్ నియోనేటాలజిస్ట్



మూత్రంలో రక్తపు చార కనిపిస్తోందా?

మూత్రవిసర్జన సమయంలో రక్తపు చార కనిపించడం ఎవరిలోనైనా ఆందోళన కలిగించే అంశమే. అయితే అంతగా బెంబేలు పడాల్సిన అవసరం లేదు. సాధారణంగా మూత్రంలో ఇన్ఫెక్షన్ (యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్), కిడ్నీలో రాళ్లు ఉండటం వల్ల ఇలా జరగవచ్చు. కాకపోతే మూత్రవిసర్జన సమయంలో రక్తం కనిపిస్తున్నవారు మాత్రం ఒకసారి ఫిజీషియన్ లేదా యూరాలజిస్ట్‌ను సంప్రదించి... మూత్రపరీక్షలు, అబ్డామిన్ స్కానింగ్ తప్పక చేయించుకోవాలి. అవసరమైతే ఐవీపీ (ఇంట్రావీనస్ పైలోగ్రామ్) వంటి పరీక్షలూ చేయించాల్సిరావచ్చు. ఆ పరీక్షల్లో నిర్ధారణ (డయాగ్నోజిస్) అయిన జబ్బును బట్టి చికిత్స ఉంటుంది. కాకపోతే మరీ భయాందోళనలు అక్కర్లేదుగానీ... తక్షణం డాక్టర్‌ను సంప్రదించడం మాత్రం అవసరమని గుర్తించాలి.

ఇన్‌గ్లిస్ ధనాధన్ షో


ఇన్‌గ్లిస్

- రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన ఆసీస్
- 5 వికెట్ల తేడాతో స్మిత్ సేన జయభేరి
- టోర్నీ చరిత్రలో భారీ స్కోరు చేసినా ఓటమి పాలైన ఇంగ్లండ్
- డకెట్ శతకం వృథా

లాహోర్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పలు రికార్డుల్ని చెరిపేసిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. గ్రూప్ 'బి'లో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 351 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ బెన్ డకెట్ (143 బంతుల్లో 165; 17 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ సెంచరీతో ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేశాడు. మిడిలార్డర్ బ్యాటర్ జో రూట్ (78 బంతుల్లో 68; 4 ఫోర్లు) అర్ధ శతకం సాధించాడు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 47.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 356 పరుగులు చేసి గెలిచింది. 136/4 స్కోరు వద్ద ఓటమి వెంటాడుతున్న దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోష్ ఇన్‌గ్లిస్ (86 బంతుల్లో 120 నాటౌట్; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో జట్టును గెలిపించే దాకా క్రీజులో నిలిచాడు. ఓపెనర్ మాథ్యూ షార్ట్ (66 బంతుల్లో 63; 9 ఫోర్లు, 1 సిక్స్), అలెక్స్ కేరీ (63 బంతుల్లో 69; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా, లబుషేన్ (45 బంతుల్లో 47; 5 ఫోర్లు) రాణించాడు. చివర్లో గ్లెన్ మ్యాక్స్‌వెల్ (15 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండగా నిలిచాడు. 2009 తర్వాత ఆసీస్ చాంపియన్స్ ట్రోఫీలో గెలవడం ఇదే తొలిసారి. 2013 ఈవెంట్‌లో రెండింట ఓడిపోగా, ఓ మ్యాచ్ రద్దయ్యింది. 2017లో రెండు మ్యాచ్‌లు రద్దవగా, ఓ మ్యాచ్‌లో ఓడింది. చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగుల ఛేదన చేసిన జట్టుగా ఆసీస్ నిలిచింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) కేరీ (బి) డ్వార్షుయిస్ 10; డకెట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లబుషేన్ 165; జేమీ స్మిత్ (సి) కేరీ (బి) డ్వార్షుయిస్ 15; రూట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 68; హ్యారీ బ్రూక్ (సి) కేరీ (బి) జంపా 3; బట్లర్ (సి) ఎలిస్ (బి) మ్యాక్స్‌వెల్ 23; లివింగ్‌స్టోన్ (సి) ఎలిస్ (బి) డ్వార్షుయిస్ 14; కార్స్ (సి) అండ్ (బి) లబుషేన్ 8; ఆర్చర్ నాటౌట్ 21; రషీద్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 351. వికెట్ల పతనం:** 1-13, 2-43, 3-201, 4-219, 5-280, 6-316, 7-322, 8-338. **బౌలింగ్:** జాన్సన్ 7-0-54-0, డ్వార్షుయిస్ 10-0-66-3, నాథన్ ఎలిస్ 10-0-51-0, మ్యాక్స్‌వెల్ 7-0-58-1, జంపా 10-0-64-2, షార్ట్ 1-0-7-0, లబుషేన్ 5-0-41-2.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: షార్ట్ (సి) అండ్ (బి) లివింగ్‌స్టోన్ 63; హెడ్ (సి) అండ్ (బి) ఆర్చర్ 6; స్మిత్ (సి) డకెట్ (బి) వుడ్ 5; లబుషేన్ (సి) బట్లర్ (బి) రషీద్ 47; ఇంగ్లిస్ నాటౌట్ 120; కేరీ (సి) బట్లర్ (బి) కార్స్ 69; మ్యాక్స్‌వెల్ నాటౌట్ 32; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి) 356. వికెట్ల పతనం:** 1-21, 2-27, 3-122, 4-136, 5-282. **బౌలింగ్:** మార్క్‌వుడ్ 9.3-0-75-1, జోఫ్రా ఆర్చర్ 10-0-82-1, కార్స్ 7-0-69-1, రషీద్ 10-1-47-1, లివింగ్‌స్టోన్ 7-0-47-1, రూట్ 4-0-26-0.

లాహోర్‌లో 'భారత భాగ్య విధాత'

భారత జట్టు పాకిస్తాన్‌కు వెళ్లలేదు... ఆ దేశంలో మ్యాచ్ ఆడటం లేదు... అయినా సరే మన జనగణమన... అక్కడ మోగింది. నిర్వాహకులు చేసిన పొరపాటు వల్ల ఇది చోటు చేసుకుంది. ఏదైనా మ్యాచ్‌కు ముందు ఇరు జట్ల జాతీయ గీతాలు వినిపించడం రివాజు. శనివారం కూడా ముందుగా ఇంగ్లండ్ జాతీయ గీతం 'గాడ్ సేవ్ ద కింగ్' వినిపించింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా 'అడ్వాన్స్ ఆస్ట్రేలియా ఫెయిర్' రావాల్సి ఉంది. అయితే ఆసీస్ జెండా కనిపిస్తుండగా సాంకేతిక పొరపాటు జరిగింది. భారత జాతీయ గీతంలోని పదం 'భారత భాగ్య విధాత' వినిపించింది. ఒక్కసారిగా షాక్‌కు గురైన సిబ్బంది దానిని వెంటనే నిలిపివేశారు. అయితే అప్పటికే అది ప్రసారం అయిపోయింది. దీనిపై పాక్ బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసింది. మైదానంలో నిర్వహణా బాధ్యతలు చూస్తున్న ఐసీసీ వివరణ ఇవ్వాలని కోరింది.

దాయాదుల సమరానికి సమయం


రోహిత్


రిజ్వాన్

నేడు భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్

అమితోత్సాహంతో టీమిండియా • ఒత్తిడిలో పాక్ బృందం
మ.గం.2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

గత పద్నాలుగేళ్ల కాలంలో వన్డేలు, టి20లు కలిపి భారత్, పాకిస్తాన్ మధ్య 13 మ్యాచ్‌లు జరిగితే భారత్ 11 గెలిచి 2 మ్యాచ్‌లలో మాత్రమే ఓటమి పాలైంది... ఇరు జట్ల మధ్య జరిగిన గత 11 వన్డేల్లో భారత్ 9 గెలిచి 2 ఓడింది... ఇది చాలు దాయాదిపై టీమిండియా ఆధిపత్యం ఎలా సాగుతోందో చెప్పడానికి...

అయినా సరే...అంతర్జాతీయ క్రికెట్‌లో ఇరు జట్ల మధ్య మ్యాచ్ ప్రతీ సారి అంతే ఉత్సుకత రేపుతుంది... ఆటగాళ్లు, అభిమానులు, ప్రసారకర్తలు, విశ్లేషకులు... ఇలా అందరి దృష్టిలో ఇది ఎంతో ప్రత్యేకమైన సమరం. తుది ఫలితంతో సంబంధం లేకుండా దాయాదుల మధ్య పోరు అంటే ఒక్కసారిగా ఆసక్తి పెరిగిపోతుంది.

ఆదివారం ఆటవిడుపు వేళ మరో సారి భారత్, పాకిస్తాన్ అంతర్జాతీయ వేదికపై తలపడేందుకు సిద్ధమయ్యాయి. ఆతిథ్య జట్టే అయినా... ఈ మ్యాచ్ కోసం పాక్ దుబాయ్ చేరగా, ఇప్పటికే ఈ వేదికపై ఒక మ్యాచ్ గెలిచిన టీమిండియా ఉత్సాహంగా సిద్ధమైంది. భారత్ గెలిస్తే దాదాపు సెమీస్ చేరుకుంటుంది. పాక్‌కు మాత్రం టోర్నీనుంచి నిష్క్రమించకుండా ఉండాలంటే ఈ మ్యాచ్ జీవన్మరణ సమస్య.

దుబాయ్: వన్డే వరల్డ్ కప్‌లో తలపడిన దాదాపు 16 నెలల తర్వాత మరో ఐసీసీ టోర్నీలో భారత్, పాకిస్తాన్ వన్డే సమరానికి సై అంటున్నాయి. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గ్రూప్ 'ఎ'లో జరిగే మ్యాచ్‌లో ఇరు జట్లు నేడు తలపడతాయి. భారత్ తొలి తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేయగా... పాక్ స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో పరాజయంపాలైంది. బలాబలాలు, ఫామ్‌పరంగా చూస్తే అన్ని విధాలా రోహిత్ సేనదే పైచేయిగా ఉన్నా... అనూహ్య ప్రదర్శనతో చెలరేగాలని పాకిస్తాన్ భావిస్తోంది.

మార్పుల్లేకుండా...

గత మ్యాచ్‌లో టీమిండియా ప్రదర్శన చూస్తే తుది జట్టులో ఎలాంటి మార్పూ చేయాల్సిన అవసరం కనిపించడం లేదు. వన్డేల్లో వరుసగా రెండు సెంచరీలతో గిల్ తన ఫామ్‌ను చాటి చెప్పగా, రోహిత్ శర్మ అందించే శుభారంభాలు జట్టును ముందంజలో నిలుపుతున్నాయి. విరాట్ కోహ్లి మాత్రమే కాస్త తడబడినట్లు కనిపిస్తున్నాడు. ఇంకా తనదైన స్థాయి ఆటను విరాట్ ప్రదర్శించలేదు. దాని కోసం ఇంతకంటే మంచి వేదిక ఉండదు. రాహుల్ బంగ్లాతో ఆకట్టుకున్నాడు. అయ్యర్ కూడా చెలరేగితే భారీ స్కోరు ఖాయం. పాండ్యా, జడేజా బ్యాటింగ్ అవసరం రాకుండానే మన జట్టు గత మ్యాచ్‌ను ముగించింది. అక్షర్ బ్యాటింగ్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ మరోసారి నమ్మకం ఉంచుతోంది. బౌలింగ్‌లో షమీ అద్భుత పునరాగమనం భారత్ బలాన్ని ఒక్కసారిగా పెంచింది. బంగ్లాపై ఐదు వికెట్ల ప్రదర్శనతో అతను తనలో ఇంకా సత్తా తగ్గలేదని నిరూపించుకున్నాడు. షమీకి తోడుగా హర్షిత్ రాణా ఆకట్టుకున్నాడు. ముగ్గురు స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్, జడేజాలను ఎదుర్కొని పాక్ బ్యాటర్లు పరుగులు సాధించడం అంత సులువు కాదు. మొత్తంగా టీమిండియా ఆటగాళ్లంతా సమష్టి ప్రదర్శన చేస్తే తిరుగుండకపోవచ్చు.

గెలిపించేదెవరు!

పాకిస్తాన్ జట్టు పరిస్థితి మాత్రం చాలా ఇబ్బందికరంగా ఉంది. స్వదేశంలో జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీలో రెండుసార్లు న్యూజిలాండ్ చేతిలో ఓడిన ఆ జట్టు ఇప్పుడు ఈ మెగా టోర్నీ తొలి పోరులోనూ ఓటమిపాలైంది. పైగా భారీ తేడాతో ఓడటం వల్ల రన్‌రేట్‌పై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో కచ్చితంగా భారత్‌తో మ్యాచ్‌లో గెలిస్తేనే ఆ జట్టు టోర్నీలో నిలుస్తుంది. లేదంటే ఆతిథ్య జట్టుగా సొంతగడ్డపై చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో ఆడే సమయానికి పాక్ ఆట ముగిసిపోతుంది. జట్టు బ్యాటింగ్ బలహీనంగా కనిపిస్తోంది. ఎన్ని వైఫల్యాలున్నా ఇప్పటికీ టీమ్ నంబర్‌వన్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌పైనే ప్రధానంగా ఆధారపడుతోంది. కానీ గత మ్యాచ్‌లో కూడా అతను చాలా నెమ్మదిగా బ్యాటింగ్ చేశాడు. ఈ సారి అతని ప్రదర్శన మెరుగవుతుందేమో చూడాలి. ఫఖర్ గాయంతో దూరం కావడంతో టీమ్‌లోకి వచ్చిన ఇమామ్ కూడా దూకుడుగా ఆడలేడు. రిజ్వాన్, షకీల్ గత మ్యాచ్‌లో విఫలమయ్యారు. సల్మాన్, ఖుష్‌దిల్ ప్రదర్శన సానుకూలాంశం. మరో వైపు బౌలింగ్ అయితే మరీ పేలవంగా ఉంది. పాక్ ఎంతో నమ్ముకున్న ముగ్గురు పేసర్లు పోటీ పడి భారీగా పరుగులిస్తున్నారు. ఇటీవలి రికార్డు చూసినా...షాహిన్ అఫ్రిది, రవూఫ్, నసీమ్‌లను భారత బ్యాటర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. పైగా ఒక్క నాణ్యమైన స్పిన్నర్ కూడా జట్టులో లేడు. ఈ నేపథ్యంలో పాక్ గెలవాలంటే అసాధారణ పోరాటం చేయాల్సి ఉంది.

పిచ్, వాతావరణం

గత మ్యాచ్ తరహాలోనే నెమ్మదైన పిచ్. కానీ బ్యాటర్లు పట్టుదలగా ఆడితే భారీ స్కోరు సాధించవచ్చు. వర్ష సమస్య లేదు. మంచు ప్రభావం కూడా లేదు కాబట్టి టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, అక్షర్, పాండ్యా, జడేజా, కుల్దీప్, షమీ, రాణా. **పాకిస్తాన్:** రిజ్వాన్ (కెప్టెన్), ఇమామ్, షకీల్, బాబర్, సల్మాన్, తాహిర్, ఖుష్‌దిల్, అఫ్రిది, నసీమ్, రవూఫ్, అబ్రార్.

2-3 వన్డే వరల్డ్ కప్, టి20 వరల్డ్ కప్‌లలో పాక్‌పై భారత్ ఆధిపత్యం ఉన్నా... చాంపియన్స్ ట్రోఫీలో పాక్ రికార్డు మెరుగ్గా ఉంది. ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌లు జరిగితే భారత్ 2 గెలిచి 3 ఓడింది.

57-73 ఓవరాల్‌గా భారత్, పాకిస్తాన్ మధ్య 135 వన్డేలు జరగ్గా... భారత్ 57 గెలిచి 73 ఓడింది. మరో 5 మ్యాచ్‌లలో ఫలితం తేలలేదు.

మహిళల ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌తో పాటు
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



"నేను చేసిన ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మజాకా'. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ పేరు కృష్ణ. నేను, నాన్న (రావు రమేశ్) ఒకే ఇంట్లో ఉండే బ్యాచిలర్స్‌లా బతుకుతుంటాము. మమ్మల్ని ఎవరూ పండగలకు, వేడుకలకు పిలవరు. మా ఇంట్లో మహిళలు పని చేయాలనుకోరు. ఇలా చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి" అని సందీప్ కిషన్ అన్నారు. సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. రావు రమేశ్, అన్షు ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సందీప్ కిషన్ పంచుకున్న విశేషాలు.

నంబర్స్‌కే మర్యాద - సందీప్ కిషన్

- నాకు నచ్చిన కథతో సినిమా చేశాను. నిర్మాతకు డబ్బులొచ్చాయి. డిస్ట్రిబ్యూటర్స్ సేఫ్ అయిపోయారు... ఇలాంటి ఉద్దేశ్యంతోనే నేను సినిమాలు చేసుకుంటూ నా కెరీర్‌లో పరిగెత్తాను. నా తర్వాతి సినిమాల నంబర్స్ (వసూళ్లను ఉద్దేశించి..) ఇంత ఉండాలనే నాలెడ్జ్ నాకు అప్పట్లో లేదు. ఈ నాలెడ్జ్ వచ్చే సమయానికి అంటే... 2019లో నేను క్లిష్ట పరిస్థితిలో ఉన్నాను. 'మైఖేల్' నుంచి మళ్లీ పుంజుకున్నాను. నంబర్స్ గురించి ఆలోచించాను. 'మైఖేల్'కు పెద్ద నంబర్స్ రాలేదు. కానీ నాకు మంచి క్రేజ్ వచ్చింది. ప్రేక్షకుల్లో నాకు గుర్తింపు పెరిగింది. 'భైరవ కోన' మూవీ పెద్ద నంబర్స్ రాగలవనే నమ్మకాన్ని నాకు ఇచ్చింది. రాయన్ (ఇందులో సందీప్ ఓ లీడ్ రోల్ చేశారు) హిట్‌గా నిలిచింది. కానీ ఇది ధనుష్ అన్న చిత్రం. ఇప్పుడు 'మజాకా'కు పెద్ద నంబర్స్ వస్తాయి. చెప్పాలంటే... నంబర్స్ గురించి నాకు పెద్ద ఆసక్తి లేదు. కానీ నంబర్స్ వస్తేనే మర్యాద. కళకో, కృషికో దక్కని మర్యాద నంబర్స్‌కు లభిస్తోంది. గత ఐదేళ్లలో నా మార్కెట్ పది రెట్లు పెరిగింది.
- 'మజాకా'లో ఇప్పటివరకు ఎవరూ చెప్పని మంచి పాయింట్‌ను టచ్ చేశాం. రావు రమేశ్‌గారికి, నాకు మధ్య వచ్చే సీన్స్ బాగుంటాయి. ఆడియన్స్‌కు నచ్చేలా సినిమాలు తీస్తారు త్రినాథరావుగారు. ప్రసన్నగారు మంచి కథ రాశారు. అనిల్, రాజేశ్‌గార్లంటే నాకు హోమ్ ప్రొడక్షన్. ఒకరు నాకు అన్న లాంటివారు. రాజేశ్ మంచి ఫ్రెండ్.
- నా పదిహేనేళ్ల కెరీర్లో ముప్పై సినిమాలు చేశాను. నా జర్నీలో కొత్త కథలను, దర్శకులను, ప్రతిభావంతులను ఇండస్ట్రీకి పరిచయం చేశాననే ఆనందం ఉంది. రాబిన్‌హుడ్ లాంటి క్యారెక్టర్‌తో పీరియాడికల్ ఫిల్మ్ చేయాలని ఉంది. అయితే ఖాళీగా అయినా ఉంటాను కానీ, కమర్షియల్ సినిమాల్లో విలన్‌గా చేయను. ఇక తమిళంలో నాకు మంచి ఆదరణ లభిస్తుండటం హ్యాపీ. ప్రస్తుతం సంజయ్ (ప్రముఖ తమిళ హీరో విజయ్ తనయుడు) డైరెక్షన్‌లో మూవీ చేస్తున్నాను. 'ఫ్యామిలీ మేన్' థర్డ్ సీజన్‌లో నటించాను. నెట్‌ఫ్లిక్స్‌కి ఓ ప్రాజెక్ట్ చేస్తున్నాను.


• సంపత్ నంది, తమన్నా, అశోక్ తేజ, వశిష్ఠ

జీవితంలో ఒక్కసారే ఇలాంటి చాన్స్ వస్తుంది - తమన్నా

"మహా కుంభమేళా జీవితంలో ఒక్కసారే వస్తుంది. అలాగే 'ఓదెల 2' లాంటి సినిమాలో నటించే అవకాశం కూడా జీవితంలో ఒక్కసారే వస్తుంది" అని తమన్నా అన్నారు. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓదెల 2'. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా, యువ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. సంపత్ నంది పర్యవేక్షణలో అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ పతాకాలపై డి. మధు నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది. ప్రయాగ్ రాజ్‌లోని మహా కుంభ మేళాలో త్రివేణి సంగమం వద్ద నాగ సాధువుల సమక్షంలో 'ఓదెల 2' టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ– "సంపత్ నంది విజన్‌ని దర్శకుడు అశోక్ తేజ అద్భుతంగా తెరపైకి తీసుకువచ్చాడు. సంపత్ నందిగారితో నాలుగు సినిమాలు సైన్ చేశాను. కానీ ఈ సినిమా ఎవరూ ఊహించని విధంగా ఉంటుంది" అని తెలిపారు. సంపత్ నంది మాట్లాడుతూ– "ఈ సినిమా ఒప్పుకున్న తర్వాత తమన్నా మాంసాహారం తినడాన్ని మానేశారు. 'అమ్మోరు'లో సౌందర్యగారిని, 'అరుంధతి' మూవీలో అనుష్కగారిని ఎంత ఆరాధించామో... అలా ఈ సినిమాతో తమన్నా కూడా ఆదరణ పొందాలని కోరుకుంటున్నాను" అన్నారు. "అవకాశం ఇచ్చిన సంపత్ నందిగారికి, తమన్నా, డి. మధుగార్లకు ధన్యవాదాలు" అని తెలిపారు అశోక్‌తేజ. "ఇది థియేటర్స్‌లో చూడాల్సిన చిత్రం" అన్నారు డి. మధు.

హారర్ చిత్రానికీ కన్నీళ్లొస్తాయనుకోలేదు - నాని


• అరివళగన్, నాని, ఆది

"'శబ్దం' సినిమాని ఎంజాయ్ చేశాను. ఎమోషనల్‌గా చాలా హై ఇస్తుంది. హారర్ సినిమాకీ కన్నీళ్లొస్తాయని ఎప్పుడూ అనుకోలేదు. మంచి కథ, భావోద్వేగాలున్న హారర్ సినిమా ఇది. హారర్ మూవీస్‌ని ఇష్టపడే వారైతే పది మంది ఫ్రెండ్స్‌తో కలసి వెళ్లండి... చాలా ఎంజాయ్ చేస్తారు" అని హీరో నాని తెలిపారు. ఆది పినిశెట్టి హీరోగా అరివళగన్ దర్శకత్వం వహించిన తెలుగు–తమిళ చిత్రం 'శబ్దం'. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. శివ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఎన్ సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో, మైత్రీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా నైజాంలో రిలీజవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– "'నిన్ను కోరి' సినిమా నుంచి ఆది, నేను ఫ్రెండ్స్. 'శబ్దం' సినిమాపై తను ఎందుకు అంత నమ్మకంగా ఉన్నాడో నాకు తెలుసు. సౌండ్ ఒక ఆయుధం అని ఒక రకమైన కొత్త యాంగిల్‌ని సినిమాలో చూపించారు. థియేటర్స్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా ఇది. అందరూ థియేటర్స్‌లో చూసి ఆదికి, 'శబ్దం' టీమ్‌కి మంచి బ్లాక్ బస్టర్ ఇవ్వాలి" అన్నారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ– "'శబ్దం' ప్రయాణం 16 ఏళ్ల క్రితం మొదలైంది. 'వైశాలి' లేకపోతే 'శబ్దం' ఉండేది కాదు. మా డైరెక్టర్ అరివళగన్‌కి ధన్యవాదాలు. హారర్ ఫ్యాన్స్‌కి ఈ సినిమా చాలా బాగా నచ్చుతుంది" అని చెప్పారు. అరివళగన్ మాట్లాడుతూ– "'వైశాలి' తర్వాత ఆది, నేను మళ్లీ సినిమా చేయాలనుకున్నప్పుడు సౌండ్‌ని హారర్ థీమ్‌గా తీసుకోవాలనుకున్నాం. సౌండ్‌ని విజువలైజ్ చేసి, హారర్ క్రియేట్ చేయడం సవాల్‌గా అనిపించింది. తమన్ పది రెట్లు ఎక్కువ ఇంపాక్ట్ ఉన్న సంగీతం ఇచ్చారు" అన్నారు.

ఎనిమిది భాషల్లో మిరాయ్


• తేజా సజ్జా

తేజా సజ్జా హీరోగా, రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. మంచు మనోజ్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 1న రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. "ఈ పాన్ ఇండియా యాక్షన్ ఫిల్మ్‌లో తేజా సూపర్ యోధ పాత్ర చేస్తున్నాడు. మనోజ్ విలన్ రోల్ చేస్తున్నాడు. స్క్రీన్‌పై ఆడియన్స్ సరికొత్త ప్రపంచాన్ని చూస్తారు. 8 వేర్వేరు భాషల్లో 2డీ, 3డీ ఫార్మాట్స్‌లో మూవీని రిలీజ్ చేస్తాం" అని యూనిట్ పేర్కొంది.



శివుడి నేపథ్యంలో రూపొందుతున్న చిత్రాలపై 'హరోం హర' కథనం, 'చావా', 'సారంగపాణి', 'బరాబర్ ప్రేమిస్తా...' తదితర చిత్రాల విశేషాల కోసం సాక్షి ఫ్లస్ ఈపేపర్‌ని చూడండి.

వినోదాల జిగేల్


• త్రిగుణ్, మేఘా

త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా నటించిన చిత్రం 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డి.వై. జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. ఈ సినిమాని మార్చి 7న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. డి. వై. జగన్‌మోహన్, నాగార్జున అల్లం మాట్లాడుతూ– "కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'జిగేల్'. ప్రముఖ హాస్యనటులు నటించిన ఈ చిత్రాన్ని మాస్, క్లాస్ ఆడియన్స్ అంతా రెండున్నర గంటల పాటు ఎంజాయ్ చేస్తారు. ఆనంద్ మంత్ర సంగీతం అందించిన ఈ మూవీలోని పాటలకు కూడా చక్కని ఆదరణ దక్కింది" అన్నారు.

భరతనాట్యం నేపథ్యంలో...


• ఇంద్రాణి

ఇంద్రాణి దావులూరి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'అందెల రవమిది'. విక్రమ్ కొల్లూరు, తనికెళ్ల భరణి, ఆదిత్యా మీనన్, జయలలిత, ఆది లోకేశ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శివ భట్టిప్రోలు సమర్పిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేసిన దర్శకుడు హరీశ్ శంకర్ మాట్లాడుతూ– "మన కళలు, సంస్కృతీ సంప్రదాయాలపై ఇంద్రాణిగారికి ఎంతో మక్కువ. హద్దులు దాటుతున్న కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సినిమాలు వస్తున్న ఈ ట్రెండ్‌లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా మన కల్చర్‌ను తెలియజెప్పాలనే ప్రయత్నంతో 'అందెల రవమిది' సినిమా తీశారు. ఇలాంటి సినిమాను సపోర్ట్ చేయాలి" అన్నారు. "భరతనాట్యం నేపథ్యంలో వస్తున్న 'అందెల రవమిది'కి మన వంతు సహకారం అందించడం మన బాధ్యత" అన్నారు తనికెళ్ల భరణి. "రెండువేల ఏళ్ల నాటి నృత్య కళ భరతనాట్యం. ఈ కళను బతికించుకోవాలి. వెస్ట్రన్ డ్యాన్స్‌లను 30 సంవత్సరాల తర్వాత మనం చేయలేం. కానీ భరతనాట్యాన్ని చనిపోయేవరకూ చేయవచ్చు. ఇప్పటివరకూ మా సినిమాకి డీసీ సౌత్ ఫిలిం ఫెస్టివల్లో బెస్ట్ డెబ్యూ ఫిలిం, ఇండియా ఇండిపెండెంట్ ఫిలిం ఫెస్టివల్లో బెస్ట్ ఉమెన్ మేడ్ మూవీ, గ్లోబల్ ఇండియా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్లో బెస్ట్ డైరెక్టర్‌గా పలు పురస్కారాలు దక్కాయి" అని తెలిపారు ఇంద్రాణి.

ప్రశ్నించే నారి


• ఆమని

మహిళలకు పుట్టినప్పట్నుంచి అన్నీ కష్టాలే. అది అర్థం చేసుకున్న వాళ్లు కొద్దిమందే ఉంటారు. ఈ రోజు సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాల్ని ప్రశ్నించే చిత్రంగా 'నారి' ఉంటుంది. ఈ సినిమాలోని క్యారెక్టర్‌లో నేనెంతో ఇన్‌వాల్వ్ అయి, నటించాను. ప్రతి మహిళా చూడాల్సిన చిత్రం ఇది" అని ఆమని అన్నారు. ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనికా రెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదిని కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'నారి'. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించిన ఈ చిత్రం మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– "ట్రైలర్ బాగుంది. కొత్త దర్శక–నిర్మాతలు ఇలాంటి మంచి ప్రయత్నం చేయడం సంతోషం. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలి" అన్నారు. "మహిళల గొప్పదనం చాటి చెప్పేలా 'నారి' సినిమా ఉంటుంది" అని తెలిపారు ఆమని. "మహిళలకు రక్షణ కావాలి. మహిళల్ని గౌరవించాలి అనే కాన్సెప్ట్‌తో 'నారి' మూవీ తీశాం. 'నారి' లాంటి గొప్ప సినిమా తీశానని గర్వంగా చెప్పుకోగలను" అన్నారు సూర్య వంటిపల్లి. "మహిళల కోసం మేం చేసిన చిత్రం ఇది. సకుటుంబంగా చూసేలా ఉంటుంది" అని వెల్లడించారు శశి. మౌనికా రెడ్డి మాట్లాడారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



ఓం గం గణపతయే నమః C.N.B 50 సం॥లు బ్రాహ్మణ పెళ్ళికాని M.Sc 2 కోట్లు 41K వరుడుకు 2వ పిల్లలు ఉన్న వధువు కావలెను. సెల్:9912736916 [J-1086275]

కుల పట్టింపు లేదు/ 50yrs2వ మ్యారేజ్ ప్రైవేట్ జాబ్ మంచి జీతం కలిగిన వరునికి 40 సం॥ పైబడిన విడో & డైవర్సీ గల వధువు కావలెను (మధ్యతరగతి వారికి ప్రాధాన్యత) డైరెక్ట్ సంప్ర : 9492373784 [H-783661]

క్రిస్టియన్ మాల/ కట్నం ప్రసక్తి లేదు / B.Tech, IIT / C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్ / ఇస్రో/ 1,20,000/-PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15470]

క్రిస్టియన్ మాదిగ/ కట్నం ప్రసక్తి లేదు/ M.Sc/ Agri/C.Govt. A.A.O/LIC of India/15 Lakhs P.A/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15470]

కట్నం ప్రసక్తి లేదు/ కుల పట్టింపు లేదు. 30Yrs, గుడ్ లుకింగ్, B.Tech, MS/Job in Hyd, 1 Lakh. PM, 10Cr ఆస్తి గుడ్ ఫ్యామిలీ గల వరుడికి వధువు కావలెను. Ph: 8367619529 [HA-15470]

కుల పట్టింపు లేదు: Ag 58, సెంట్రల్ గవర్నమెంట్ జాబ్, సొంత ఇల్లు కలిగిన వరునికి మంచి సాంప్రదాయమైన, విడో, పిల్లలు ఉన్న ఏ బాదర బందీ లేని వధువు కావలెను. సంప్ర॥ 94999 47658. [MH-13081]

★

డైరెక్ట్, నో బ్రోకర్స్, Age & CNB, 50Y, B.Tech, 5'9", Hydలో జాబ్ చేస్తున్న హెల్తీ, ఒంటరి వరునికి ఫ్రెండ్లీ,ఆర్థిక స్తోమత గల లేటు, విడో, డైవర్సీ, ఒంటరి వధువు కావలెను ✆ 73827 98005 [B-1170390]

ఆర్యవైశ్య అబ్బాయి 36yrs, PG, పార్ట్ టైం లెక్చరర్, 26 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ. 9121325068 కోమట్ల అమ్మాయి కావలెను. [SCA25001818]

★★

A.P. SMP Settled in Hyd. invite alliance for their son 2nd marriage 32y, 5'.9" B.Tech, MBA, working in MNC as Manager req. fair, well educated below 30y can ✆ Shariff 9869223554 [B-7846]

వరుడు కావలెను



రెడ్డి/ 2nd విడో/ కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ, Age: 32/సొంత బిజినెస్సులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) 1st, 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9515673252 [H-783614]

కుల పట్టింపు లేదు/ 45yr Govt. టీచర్/1లక్ష pm, డైవర్సీ నో పిల్లలు, 10ఎ॥ ల్యాండ్ వెల్ సెటిల్డ్ గల వధువుకి 1వ, 2వ లేట్ వరుడు కావలెను. పిల్లలు ఉన్నా OK. అర్జెంట్ (ఫీజు 1000/- మాత్రమే) సంప్ర : 7286031653 [H-783661]

రెడ్డి/ కుల పట్టింపు లేదు/ఏజ్ : 50yrs/ లేట్ & 2nd Mach/5'4"/ఫెయిర్/Govt జాబ్ 80K (pm)/ప్రాపర్టీ గల వధువుకి ఇల్లరికం వరుడు కావలెను. # 9581120134 [H-783661]

బ్రాహ్మణ/ 27yrs/1st మ్యారేజ్/Qly: 10 th Class Pvt Job Father & Mother లేట్, పౌరోహితం also OK, 2nd మ్యారేజ్ also OKవరుడు కావలెను. 9347422789 [H-783661]

రెడ్డి/ విడో/50Y/Hyd lo Own Hostels Rents/ సొంత ఫ్లాట్ షో రూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (మనీ సపోర్ట్) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-783661]

SC హిందూ మాల/ MBBS/PG/ Govt. మెడికల్ ఆఫీసర్/85000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15470]

SC హిందూ మాదిగ/ B.Tech / Govt. Asst. ఇంజనీర్/ SPDCL/ 80,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15470]

పద్మశాలి/ B.Sc.Agri / Govt.టెక్నికల్ Asst./ FCI/52000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 8297439565 [HA-15470]

కమ్మ/ ఆస్తి, కుల పట్టింపు లేదు/25Y/B.Tech/పెద్ద స్థిరాస్తి కలిగి యాక్సిడెంట్‌లో పేరెంట్స్‌ను కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు, వాట్సాప్ లో పంపించండి. Ph: 8142060040 [HA-15470]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 2", Engineer, 120 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt Officer, BE (IIIT), 28, 5' 11", Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6', Sr. SWE, 400 K, 20 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 10", SWE, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 27, 5' 5", Hyderabad, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS (USA), 26, 5' 7", 100 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (IIM), 28, 5' 7", Sr. Associate, 28 L P/A, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 27, 5' 6", Rich Family, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి Business, MCA, 28, 6' 1", 45 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 30, 5' 8", Lead Analyst, 30 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE(BITS), MS, 27, SWE, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 6, SWE, Amazon, 200 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 27, 5' 3", PG Doctor, 20 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MDS, 29, 5' 6", Dental Doctor, 2 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి/ 2nd మ్యారేజ్ (కుల/ఆస్తి) పట్టింపు లేదు/31Y/ Q:B.Com/Own Business & Lands వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి 1వ, 2వ సంబంధాలు కలవు. Ph: 9515579827 [H-783614]

SC మాల & క్రిస్టియన్/ B.Tech (EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 85000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15470]

SC మాల/ 25 / 5'5"/B.Tech (CSE), SWE, Infosys, 60,000/-PM వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9346675639 [HA-15470]

SC మాదిగ & క్రిస్టియన్/ B.Tech (సివిల్) / C.Govt. Asst. మేనేజర్/SBI/65000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15470]

2వ పెళ్ళి, 4,00,000pm, Govt.Emp, బాగా స్థిరపడి, కోట్ల ప్రాపర్టీ కల్గిన అమ్మాయికి అందమైన వరుడు కావలెను. కుల, వృత్తితో పని లేదు, ఒంటరి అబ్బాయి అయినా పర్వాలేదు, ఇల్లరికం, పిల్లలు ఉన్నా OK, 9381696641 [H-783614]

రెడ్డి/ విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age:34/డిగ్రీ/ Pvt.Job, అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఐనా OK) అన్ని కులాల వారికి Intercaste వివాహాలు చూడబడును. Ph: 8121347478 [H-783614]

రెండో పెళ్లి/విడో / 50y /Fair/ఆంధ్ర / Govt.జాబ్ /1 Lakh PM /Own House (Rents), Lands/Well settledపిల్లలు లేని ఏ బాదరబందీలేని అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-783614]

యాదవ/ కురుమ 1) 29/ 5'5/ MS USA H1B Job, 2) 29/ 5'3/MBBS, PG/ సంపన్నకుటుంబం, 3) 28/ 5'6/ B.Tech/ SW/ 20 L Hyd, 4) 32/ 5'3/ B.Tech/ Govt Job/ విజయవాడ.K.K Yadav 98493 06274 [G-820187]

పద్మశాలి/ 49y / విడో / 5'3"/సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/80,000/-pm/2 సొంత ఇల్లు & రెంట్స్/50K/-PM/ ఆస్తి, కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. 9573060401 [H-783524]

OC/ 50y /విడో / MRO / Own Shopping Mall/68 Acres Lan/10 Lac Income గల వధువుకి FC/BC వరుడు కావలెను. 9515324063 [H-783524]

రెండో పెళ్లి/ విడో/45/District Legal Metrology Dept/1 L. PM/సొంత విల్లాలు 16 acres ల్యాండ్స్/కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. 9701174357 [H-783524]

FC/ విడో/5'4"/V.Fair/Own Play School /సొంత ఇల్లు 8 ఎకరాల పంట పొలం వెల్ సెటిల్డ్ గల వధువుకి స్నేహపూర్వకమైన వరుడు కావలెను. 9985020249 [H-783524]

రెడ్డి/ 49/విడో/B.Ed/ప్రైవేట్ జాబ్/ సొంత ఇల్లు 9 Acres Land గల వధువుకి కుల ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. 9705499686 [H-783524]

★

భీమవరం రాజుల/ 48 సం॥లు/ విడో/ పిల్లలు లేని స్త్రీకి బాగా స్థిరపడిన వరుడు కావలెను. డైరెక్ట్. సంప్ర : 6300243611 [H-788641]

★★

తెలగ / 28 / రెండవ వివాహం (పిల్లలు లేరు) అందమైన వధువుకి వరుడు కావలెను. కులం పట్టింపు లేదు. (Govt.) జాబ్ ఉండాలి. ఫోన్ : 97046 54583 [V- 12351]

వేదికలు



మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15399]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7702272594 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15469]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15469]

Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15469]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15469]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7702272594 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15469]

పెళ్లి సంబంధాలు & ప్రయత్నిస్తున్న వారందరికి 'ఓం నమో వెంకటేశాయ'. All Caste సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, NRI, Group 1, 2 వారికి చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, ✆ 7093722724. [T-3255]

ఫ్రీ రిజిస్ట్రేషన్: 16 రో॥ అన్ని కులాల వారికి తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి మ్యారేజీ లైన్స్. ✆ 94418 29644, 98490 58673, 9493 661 288. వాట్సప్ [B-621]

★

బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం Free Register 13/April/2025న Kamala Nagar Welfare Office, ECIL, Hyd. Ph: 9704656103/9533608887 Whatsapp. No. [HA-1314]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1326]

★★

మాల (క్రైస్తవ, హిందూ) B.Tech, M.Tech, MS, MBA, MBBS చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్ చేస్తున్న వధూవరుల వివరాలకు kalyanamala.org ✆ 9440545049 [B-1268407]

మావోల కీలక సమాచారం బలగాల చేతికి..

స్వాధీనం చేసుకున్న డంప్‌లో డైరీలు లభ్యం



డంప్‌లోని ఆయుధాలు, డైరీలతో భద్రతా బలగాలు

దుమ్ముగూడెం: మావోయిస్టుల కీలక సమాచారం భద్రతా బలగాలకు చిక్కింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా అడవుల్లో శనివారం కూంబింగ్ నిర్వహిస్తున్న 203 కోబ్రా, 131 సీఆర్‌పీఎఫ్ బలగాలకు భారీ డంప్ లభ్యమైంది. ఎప్పుడు డంప్‌లను స్వాధీనం చేసుకున్నా.. ఆయుధాలు, మందు గుండు సామగ్రి మాత్రమే దొరికేవి. కానీ గుర్రాజ్ గుడాం, పెడచంద మధ్య అటవీ ప్రాంతంలో లభించిన ఈ డంప్‌లో ఆయుధాలే కాక మావోయిస్టు పార్టీ కీలక వివరాలు కలిగిన 15 డైరీలు బలగాలకు దొరికినట్లు సమాచారం. అత్యాధునిక టెలిస్కోప్ లు, స్వదేశీ ఆయుధాలు, మందులు, విప్లవ సాహిత్యంతో పాటు మావోయిస్టులు తమ ప్రణాళికలను నిక్షిప్తం చేసిన అత్యంత కీలకమైన డైరీలు లభించినట్లు చెబుతున్నారు. ఈ డైరీలను పరిశీలించిన బలగాలు అందులో మావోయిస్టుల ప్రణాళికలు చూసి నివ్వెరపోయినట్లు తెలిసింది. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఎలా పోరాడాలి, భద్రతా బలగాలను మట్టుపెట్టడానికి తమ వద్ద ఉన్న ఆయుధాలను ఎలా ఉపయోగించాలి, మావోయిస్టు పార్టీలోకి కొత్తగా రిక్రూట్‌మెంట్ ఎలా.. అన్న అంశాలే కాక పార్టీకి ద్రోహం చేస్తున్న వారి వివరాలు కూడా డైరీల్లో ఉన్నట్లు సమాచారం. ఈ డైరీల ఆధారంగా భద్రతా బలగాలు తమ ప్రణాళికలను మార్చుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

ములుగు జిల్లా అడవిలో మంటలు

ఫారెస్ట్ అధికారులు శ్రమిస్తున్నా, అదుపులోకి రాని వైనం



చల్వాయి, బుస్సాపూర్ మధ్య తగలబడుతున్న అటవీ ప్రాంతం

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని చల్వాయి, బుస్సాపూర్ గ్రామాల మధ్యన ఉన్న అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం మంటలు అంటుకున్నాయి. అటవీ ప్రాంతంలోని 5వ బెటాలియన్ వెనకాల నుంచి బుస్సాపూర్ గ్రామం మధ్యలోని అడవిలో మంటలు ఎగిసిపడుతున్నాయి. ఫారెస్ట్ అధికారులు సకాలంలో స్పందించి రక్షణ చర్యలు చేపట్టినా మంటలు అదుపులోకి రావడం లేదని పస్రా రేంజర్ మాధవీ శీతల్ తెలిపారు. ప్రమాద తీవ్రత నిమిష నిమిషానికి పెరుగుతుండటంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంటల కారణంగా అనేక చెట్లు కాలిపోయి ఆ ప్రాంతమంతా దట్టంగా పొగ కమ్ముకుంది. అయితే మంటలు ప్రమాదవశాత్తు అంటుకున్నాయా? లేదా ఎవరైనా కావాలనే నిప్పు పెట్టారా? అన్నది తెలియడంలేదు.

సాగర్ అటవీప్రాంతంలో మరోసారి మంటలు



పెద్దవూర/నాగార్జునసాగర్: నాగార్జున సాగర్ అటవీ డివిజన్ పరిధిలో తరచుగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం కూడా నాగార్జునసాగర్ అటవీ డివిజన్ నెల్లికల్లు అటవీ విభాగంలో సమ్మక్క-సారలమ్మ సమీపంలో నుంచి దయ్యాలగండి ప్రాంతం వరకు మంటలు వ్యాపించాయి. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అటవీ ప్రాంతానికి పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలో చెత్తను తగలబెట్టడంతో గాలికి ఎగిరి వచ్చిన నిప్పు రవ్వలు అటవీప్రాంతంలో పడటంతో అవి రాజుకుని మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఫైరింజన్‌లను రప్పించి 3 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు.

మరుగుజ్జు గెలాక్సీల్లోనూ భారీగా బ్లాక్‌హోల్స్!

1,15,000 మరుగుజ్జు గెలాక్సీలలో 2 శాతం బ్లాక్ హోల్స్ గుర్తింపు

భారతీయ ఖగోళ శాస్త్రవేత్త రాగదీపిక అద్భుత ఆవిష్కరణ

గెలాక్సీలు, బ్లాక్ హోల్స్‌లలో ఏవి ముందన్న అంశంలో కీలక ముందడుగు

తన పరిశోధన వివరాలను 'సాక్షి'తో పంచుకున్న గుంటూరు జిల్లా తెనాలి వాసి

తెనాలి: అమెరికాలోని సాల్ట్‌లేక్ సిటీలోని ఉటా విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టోరల్ పరిశోధన చేస్తున్న గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ రాగదీపిక పుచ్చా బ్లాక్‌హోల్స్‌కు సంబంధించిన అద్భుతమైన అంశాన్ని ఆవిష్కరించారు. దాదాపు అన్ని భారీ గెలాక్సీల కేంద్రాల్లోనూ సూపర్ మాసివ్ బ్లాక్‌హోల్స్ ఉన్నట్టు ఇప్పటికే కనుగొనడం జరిగింది. అయితే మరుగుజ్జు గెలాక్సీల్లోనూ పెద్దసంఖ్యలో 2,500 బ్లాక్‌హోల్స్‌ను కనుగొని, వాటిల్లోనూ బ్లాక్‌హోల్స్ సర్వసాధారణమని రాగదీపిక తేల్చారు. 'గెలాక్సీలు ముందా? బ్లాక్‌హోల్స్ ముందా?' అనే శాస్త్ర ప్రపంచం ఎదుట ఉన్న పెద్ద పజిల్ అన్వేషణలో ఇదో పెద్ద ముందడుగని రాగదీపిక చెప్పారు. తన పరిశోధన అంశాలను ఇటీవల అమెరికాలో విడుదల చేసిన ఆమె, ఈ సందర్భంగా ఆయా వివరాలను 'సాక్షి'కి పంపారు. కొన్ని వివరాలను పరిశీలిస్తే..





క్రియాశీల బ్లాక్‌హోల్‌తో కూడిన మరుగుజ్జు గెలాక్సీ

ఆరిజోనా, మాయల్ టెలిస్కోపీలోని 'డార్క్ ఎనర్జీ స్పెక్ట్రాస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్' (దేశీ) ప్రాజెక్టు 30 మిలియన్ గెలాక్సీలను పరిశీలిస్తోంది.	ఈ క్రమంలో ఎప్పటికప్పుడు డేటాను భద్ర పరుస్తోంది.	'మరుగుజ్జు గెలాక్సీలు' వ్యవస్థల్లో బ్లాక్‌హోల్స్ (కృష్ణబిలాలు) అన్వేషణలో ఉన్న డాక్టర్ రాగదీపిక నేతృత్వంలోని బృందం 'దేశీ' సేకరణలోని అంశాలను పరిశోధించింది.	ఆ అధ్యయనంలో భాగంగా దాదాపు 1,15,000 మరుగుజ్జు గెలాక్సీల్లో దాదాపు రెండు శాతం క్రియాశీల బ్లాక్‌హోల్స్‌ను కనుగొంది.	భారతదేశానికి చెందిన నోబెల్ బహుమతి గ్రహీత ఎస్.చంద్రశేఖర్ 50 ఏళ్ల క్రితం తొలిసారి బ్లాక్‌హోల్స్ సమాచారాన్ని అందించారు.

దేశం తరఫున ఏకైక తెలుగమ్మాయి...

మరుగుజ్జు నక్షత్ర మండలాల (డ్వార్ఫ్ గెలాక్సీస్)పై భారతదేశం నుంచి పరిశోధన చేస్తున్న ఏకైక తెలుగమ్మాయి రాగదీపిక పుచ్చా. సొంతూరు తెనాలి. తండ్రి రాజగోపాల్ కేంద్ర సర్వీసులో విశ్రాంత సివిల్ ఇంజినీరు. తల్లి కనకదుర్గ శాస్త్రీయ సంగీతం (వీణ) గురువు. పశ్చిమబెంగాల్‌లోని శాంతినికేతన్ విశ్వవిద్యాలయం విశ్వభారతిలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్‌లో టాపర్‌గా నిలిచారు రాగదీపిక. అహ్మదాబాద్, నైనిటాల్, ముంబైలోని ప్రసిద్ధ పరిశోధన సంస్థల్లో సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసి, చివరి ఏడాది బెంగళూరులోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్'లో 'సూర్యుడి మచ్చలు'పై థీసిస్ చేశారు. జర్మనీలోని 'మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోలార్ సిస్టమ్ రీసెర్చ్'లో గెస్ట్ సైంటిస్ట్‌గా సూర్యుడిపై పరిశోధనలు కొనసాగించారు. యూనివర్శిటీ ఆఫ్ ఆరిజోనాలో 'ఆస్ట్రానమి అండ్ ఆస్ట్రో ఫిజిక్స్'లో ఎంఎస్ చేశారు. 2023లో అదే యూనివర్శిటీ నుంచి 'మరుగుజ్జు గెలాక్సీలు-బ్లాక్‌హోల్స్'పై డాక్టర్ స్టెఫానీ జునో, డాక్టర్ అర్జున్ డే మార్గదర్శకత్వంలో సమర్పించిన థీసిస్‌కు పీహెచ్‌డీ స్వీకరించారు.

శాస్త్ర ప్రపంచంలో ఇదే తొలిసారి

"మరుగుజ్జు గెలాక్సీల్లో బ్లాక్‌హోల్స్‌ను ఇంత భారీ సంఖ్యలో కనుగొనటం శాస్త్ర ప్రపంచంలో ఇదే ప్రథమం. మా బృందం నాలుగు వేలకన్నా ఎక్కువ గెలాక్సీల్లోని బ్లాక్ హోల్స్ ద్రవ్యరాశిని కూడా నిర్ణయించింది. సూర్యుడి కంటే దాదాపు 1,000 నుంచి మిలియన్ రెట్ల ద్రవ్యరాశి కలిగిన ఇంటర్మీడియట్ బ్లాక్‌హోల్స్‌నూ శోధించింది. 'దేశీ' డేటాతో మా బృందం దాదాపు 300 డిటెన్షన్లను ఆవిష్కరించింది. దీని ఫలితంగా విశ్వంలో మొదటి బ్లాక్‌హోల్స్ సాపేక్షికంగా తేలికైనవని తెలుస్తోంది. 'దేశీ'తో ఇప్పటివరకు గెలాక్సీలలో అతి తక్కువ ద్రవ్యరాశి గల 2,500 బ్లాక్‌హోల్స్‌ను మేం కనుగొన్నాం. ఇది ఉత్తేజకరమైన ఫలితం. గెలాక్సీలు...బ్లాక్‌హోల్...వీటిలో ఏది ముందు? అనేది శాస్త్ర ప్రపంచానికి పెద్ద ప్రశ్న. గెలాక్సీలు, బ్లాక్‌హోల్స్ పరిణామ క్రమాన్ని విశ్లేషించటానికి, విశ్వంలో తొలి బ్లాక్‌హోల్స్ ఎలా ఏర్పడ్డాయనేది తెలుసుకునేందుకు మా అధ్యయనం ఉపకరిస్తుంది."

– డాక్టర్ రాగదీపిక పుచ్చా, ఖగోళ శాస్త్రవేత్త

ఎరువుల కోసం ఎన్ని కష్టాలో..

200 బస్తాల కోసం 420 మంది రైతుల నిరీక్షణ



ఇందుర్తిలో క్యూలైన్‌లో రైతుల చెప్పులు

చిగురుమామిడి: కరీంనగర్ జిల్లాలో యూరియా కొరత వేధిస్తోంది. జిల్లాలోని చిగురుమామిడి మండలం ఇందుర్తి గోదాం వద్దకు శనివారం ఉదయం ఆరు గంటలకే రైతులు చేరుకున్నారు. గోదాంకు 200 బస్తాల యూరియా రాగా.. 420 మంది రైతులు బారులు తీరారు. కాసేపటికి వారి చెప్పులను క్యూలైన్లో ఉంచి.. యూరియా కోసం ఎదురుచూశారు. ఒకరికి రెండు బస్తాల చొప్పున వందమందికి పంపిణీ చేశారు. మిగిలిన 320 మంది రైతులు.. తమకూ యూరియా ఇవ్వాలని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి.. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడారు. స్పందించిన మంత్రి ఇందుర్తి, చిగురుమామిడి, రేకొండ గ్రామాలకు మరో మూడు లారీల చొప్పున యూరియాను పంపించారు.

బీఎస్‌ఈలో వేగా జ్యువెల్లర్స్ లిస్టింగ్



ముంబై: వేగా జ్యువెల్లర్స్ లిమిటెడ్ షేర్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ)లో లిస్టయ్యాయి. ఈ సందర్భంగా ఎండీ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. '20 ఏళ్ల కల సాఫల్యం. వేగా సంస్థ అభివృద్ధి, విజయాలకు తోడ్పడిన డైరెక్టర్లు, పెట్టుబడిదారులు, ఉద్యోగులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. బీఎస్‌ఈ సారథ్యంలో మరింత ప్రగతి సాధిస్తాం'అని పేర్కొన్నారు. లిస్టింగ్ కార్యక్రమంలో ఎండీతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమా, చైర్మన్ రామ్ మోహన్, ఇతర డైరెక్టర్లు, మేనేజింగ్ పార్ట్‌నర్లు, ఇన్వెస్టర్లు, ఉద్యోగులు, బీఎస్‌ఈ అధికారులు పాల్గొన్నారు. వేగా జ్యువెల్లర్స్‌కి విజయవాడ, హైదరాబాద్, కాకినాడలో స్టోర్లున్నాయి.

నేలపట్లలో బర్డ్‌ఫ్లూ.. నిర్ధారించిన అధికారులు

- గ్రామంతోపాటు పరిసరాల్లోని కోళ్లఫారాల మూసివేత
- భయపడాల్సిన పనిలేదన్న భువనగిరి జిల్లా పశువైద్యాధికారి
- నిర్భయంగా చికెన్ తినవచ్చు.. వండినప్పుడు వేడికి వైరస్ చనిపోతుంది



కోళ్లఫామ్‌లో శానిటైజ్ చేస్తున్న సిబ్బంది



కోళ్లను సంచుల్లో మూటగట్టి పాతిపెడుతున్న దృశ్యం

చౌటుప్పల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని పౌల్ట్రీఫామ్‌లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకింది. ఈ నెల 15వ తేదీన పబ్బు మల్లేశ్ అనే రైతు కోళ్ల ఫామ్‌లో సుమారు 800 కోళ్లు మృతిచెందాయి. పెద్ద మొత్తంలో కోళ్లు చనిపోవడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తూ రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండల పశువైద్యాధికారి పృథ్వీరాజ్.. మల్లేశ్ కోళ్ల ఫామ్‌ను సందర్శించి చనిపోయిన కోళ్ల నుంచి శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. నేలపట్లలో చనిపోయిన కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ జరిగిందని జిల్లా పశువైద్యాధికారి జానయ్య శనివారం తెలిపారు. నేలపట్ల గ్రామంలో కోళ్లఫామ్‌లను ఆయన సందర్శించారు. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన కోళ్లఫామ్‌లోని మిగతా కోళ్లను చంపివేసి అక్కడే భూమిలో పాతిపెట్టించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గ్రామంలో పోలీస్ పికెట్‌తో పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జానయ్య చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కావడం ఇదే మొదటిసారి అని వివరించారు. నేలపట్ల గ్రామం పరిధిలోని ఐదు కోళ్ల ఫారాలను మూసివేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బర్డ్‌ఫ్లూ కేసు నమోదైనా కూడా ఈ ప్రాంత ప్రజలు భయపడాల్సిన పని లేదని, చికెన్‌ను నిర్భయంగా తినవచ్చని, కోడి మాంసం వండినప్పుడు ఆ వేడికి వైరస్ చనిపోతుందని తెలిపారు.

నేలపట్లకు ఆర్డీఓ..

నేలపట్ల గ్రామాన్ని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి సందర్శించారు. గ్రామంలోని పలు కోళ్లఫారాలను ఆయన పరిశీలించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు. చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న కోళ్ల ఫారాలను పరిశీలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ నేలపట్ల గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



సుంకాల భారం అమెరికాపైనే!

ఫార్మా ఎగుమతులపై అగ్రరాజ్యం ప్రతీకార సుంకాలు విధించకపోవచ్చంటున్న భారత కంపెనీలు

ఔషధ దిగుమతులపై ఆధారపడినందున పన్నుల వడ్డనపై వెనక్కితగ్గే అవకాశం ఉందని అంచనా

ఒకవేళ ప్రతీకార సుంకాలు విధిస్తే నష్టం ఆ దేశానికే ఉంటుందని స్పష్టీకరణ

ఔషధాలు, ఆటోమొబైల్, సెమికండక్టర్ దిగుమతులపై దాదాపు 25 శాతం లేదా అంతకంటే ఎక్కువ సుంకాలను విధించాలని యోచిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించిన సంగతి తెలిసిందే. భారత్ నుంచి ఔషధ ఎగుమతుల్లో యూఎస్ మార్కెట్ తొలి స్థానంలో ఉంది. అలాగే అమెరికా వినియోగిస్తున్న జనరిక్స్‌లో దాదాపు సగం వాటా భారత్ సమకూరుస్తోంది. దీంతో ట్రంప్ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఔషధ దిగుమతులపై ఆధారపడ్డ యూఎస్ ప్రతీకార పన్నుల విషయంలో ఒక అడుగు వెనక్కి వేసే అవకాశమే ఉందని భారతీయ ఫార్మా కంపెనీలు, నిపుణులు కుండబద్దలు కొడుతున్నారు. యూఎస్ వెలుపల అత్యధిక యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ఔషధ తయారీ ప్లాంట్లు ఉన్నది భారత్‌లోనే. పైగా ఇప్పటికిప్పుడు డిమాండ్‌కు తగ్గట్టుగా మందులను సరఫరా చేసే స్థాయిలో అక్కడి కంపెనీల సామర్థ్యం లేదు. ఇదంతా ఒక ఎత్తైతే ఒకవేళ ఔషధాలపై ప్రతీకార పన్నులు విధిస్తే తమపై ప్రభావం తక్కువేనని, దిగుమతుల భారం యూఎస్‌పైనే ఉంటుందని భారతీయ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. - సాక్షి, బిజినెస్ బ్యూరో

ప్రధాన మార్కెట్‌గా యూఎస్..

భారత్ నుంచి ఎగుమతి అవుతున్న ఔషధాల్లో తొలి స్థానంలో ఉన్న యూఎస్ వాటా ఏకంగా 30 శాతంపైనే ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి రూ.75,385 కోట్ల విలువైన ఔషధాలు యూఎస్‌కు చేరాయి. ఇక యూఎస్ నుంచి భారత్‌కు వచ్చిన మందులు కేవలం రూ.5,199 కోట్ల విలువైనవి మాత్రమే. 2023–24లో భారత్ నుంచి వివిధ దేశాలకు మొత్తం ఔషధ ఎగుమతులు రూ.2,40,887 కోట్లు. ఇందులో జనరిక్ ఫార్ములేషన్స్ (ఫినిష్డ్ డోసేజ్) రూ.1,64,635 కోట్లు. అంతర్జాతీయంగా జనరిక్స్ మార్కెట్ పరిమాణం రూ.39,85,900 కోట్లు. 2030 నాటికి ఇది రూ.68,45,350 కోట్లకు చేరుకుంటుందన్న అంచనాలు ఉన్నాయి. ఆ సమయానికి భారత మార్కెట్ ఎగుమతులతో కలుపుకుని రూ.9,53,150–10,39,800 కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది రూ.4,76,575 కోట్లు.

చవకగా నాణ్యమైన ఔషధాలు..



నాణ్యమైన ఔషధాలను చవకగా తయారు చేయడం భారతీయ జనరిక్ కంపెనీల ప్రత్యేకత. కోట్లాది రూపాయలు వెచ్చించి యూఎస్ఎఫ్‌డీఏ అప్రూవల్స్ దక్కించుకున్న కంపెనీలు.. యూఎస్‌లో ఉన్న అపార అవకాశాలను కాదనుకునేందుకు సిద్ధంగా లేరని ఓ కంపెనీ ప్రతినిధి అన్నారు. ఎఫ్‌డీఏ ఆమోదం అంటేనే ప్రతిష్టగా భావిస్తారని అన్నారు. భారతీయ మందుల కారణంగా 2013–2022 మధ్య యూఎస్ ఆరోగ్య రంగం రూ.1,12,64,500 కోట్లు ఆదా చేసిందని నివేదికలు చెబుతున్నాయని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజ భాను తెలిపారు. నూతన, వినూత్న ఔషధాలను యూఎస్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది.

సిద్ధం కావడానికి నాలుగేళ్లు..



యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం కలిగిన తయారీ ప్లాంట్లు భారత్‌లో 650 దాకా ఉన్నాయి. ఈ ధ్రువీకరణ రావాలంటే ప్రమాణాలకు తగ్గట్టుగా ప్లాంటును సిద్ధం చేయడం, ఏఎన్‌డీఏ ఆమోదం, అనుమతులకు నాలుగేళ్లు పడుతుంది. ఇప్పటికిప్పుడు మరో దేశం నుంచి ఔషధాలను దిగుమతి చేసుకుందామని అనుకున్నా యూఎస్‌కు సాధ్యం కాదు. కోవిడ్ మహమ్మారి సమయంలో చైనా, భారత్‌లో ఎఫ్‌డీఏ తనిఖీలు ఆలస్యం అయ్యాయి. దీంతో సరఫరా తగ్గి యూఎస్‌లో ఔషధాల కొరత వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో టారిఫ్‌లు విధించే అవకాశాలు లేవనే చెప్పవచ్చు. యూఎస్ నుంచి వచ్చే ఔషధాలపై దిగుమతి సుంకాన్ని భారత్ ఎత్తివేసే చాన్స్ ఉంది. యూఎస్‌లో తయారీ ప్లాంట్లు పెట్టాలన్నా అంత సులువు కాదు.

– రవి ఉదయ భాస్కర్, మాజీ డైరెక్టర్ జనరల్, ఫార్మెక్సిల్

వినియోగదారులపైనే భారం..



భారత్ నుంచి దిగుమతయ్యే ఔషధాలపై అమెరికా ప్రస్తుతం కేవలం 0.1 శాతం సుంకాన్ని విధిస్తోంది. ఇందుకు విరుద్ధంగా భారత్ 10 శాతం వసూలు చేస్తోంది. యూఎస్ వినియోగిస్తున్న జనరిక్స్‌లో సింహ భాగం భారత్ సమకూరుస్తోంది. భారత్‌లో తయారైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్‌పై (ఏపీఐ) యూఎస్ ఎక్కువగా ఆధారపడే అవకాశం ఉంది. ప్రతిపాదిత ప్రతీకార సుంకాలు కొన్ని జనరిక్స్ లాభదాయకతను ప్రభావితం చేయవచ్చు. కానీ ఆ భారాన్ని తుది వినియోగదారులకు బదిలీ చేసే అవకాశం ఉంది.

– శ్రీనివాసరెడ్డి, చైర్మన్, ఆప్టిమస్ గ్రూప్

ఏపీఐ కంపెనీలకు..



సుంకాలు విధిస్తే ఔషధాలు ప్రియం అవుతాయి. ఇదే జరిగితే యూఎస్ ప్రజలపైనే భారం పడుతుంది. అయితే దీని ప్రభావం ఫినిష్డ్ డోసేజ్ కంపెనీలపైనే ఉంటుంది. ఇక ఏపీఐ తయారీ సంస్థలకు మంచి రోజులు రానున్నాయి. భారత కంపెనీల నుంచే వీటి దిగుమతికి యూఎస్ ఆసక్తిగా ఉండడమే ఇందుకు కారణం. ప్రధానంగా ఆంకాలజీ విభాగంలో అవకాశాలు ఎక్కువ. యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం ఉన్న కంపెనీలకు ప్రయోజనం చేకూరుతుంది.

– ఆళ్ల వెంకటరెడ్డి, ఎండీ, లీ ఫార్మా

క్లుప్తంగా...

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు నేడు అర్హత పరీక్ష

తరగతి	దరఖాస్తులు
ఐదో తరగతి	88,451
ఆరో తరగతి	32,734
ఏడో తరగతి	18,964
ఎనిమిదో తరగతి	15,629
తొమ్మిదో తరగతి	11,871

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించనున్న అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదోతరగతి ప్రవేశాలతో పాటు 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈనెల 23న ప్రవేశ పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 446 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 1,67,649 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఐదో తరగతిలో 51,968 సీట్లున్నాయి. మిగిలిన తరగతుల్లో సొసైటీల వారీగా ఖాళీలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రవేశ పరీక్ష వంద మార్కులకు ఉంటుంది. రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్య రానివ్వొద్దు

మంత్రి సీతక్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వేసవి దృష్ట్యా రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల మంత్రి సీతక్క ఆదేశించారు. సచివాలయంలో శనివారం మిషన్ భగీరథపై సమీక్ష సందర్భంగా.. మంత్రి సీతక్క మాట్లాడుతూ రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలున్నందున, ఈ వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఎక్కడ సాంకేతిక సమస్యలు తలెత్తినా తక్షణం పరిష్కరించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేసుకోవాలన్నారు. రోజూ తాగునీటి సరఫరాపై జిల్లా అధికారులతో సమీక్షించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైతే కలెక్టర్లకు ప్రత్యేక నిధి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘సెల్’లో బందీలం

చిన్నారుల నుంచి పెద్దల వరకు పెరిగిన సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల వినియోగం



సాక్షి, అమరావతి: చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ సెల్ ఫోన్, ల్యాప్‌టాప్, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌తోనే పని. చదువులైనా, ఉద్యోగమైనా, వ్యాపారమైనా, వస్తువులు కొనడానికైనా అన్నిటికీ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లే ముఖ్య సాధనాలైపోయాయి. వీటి వినియోగం మితిమీరి వాటికి బానిసలుగా మారిపోతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. వీటి అతి వినియోగం మనిషి మానసిక, శారీరక ఆరోగ్యం మీద ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అతి వినియోగాన్ని నియంత్రించకపోతే తీవ్ర పరిణామాలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యం బాగుండాలి.. సంతోషంగా జీవించాలి.. అని దేవుడిని ప్రార్థిస్తూ చాలా మంది ఉపవాసం పాటిస్తుంటారు. అదేవిధంగా శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఫోన్లు, ల్యాప్ టాప్‌లు సహా ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వినియోగాన్ని కొన్ని గంటలు, రోజులు వదిలేసి డిజిటల్ డిటాక్స్ పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. డిజిటల్ డిటాక్స్ విధానంతో మానసిక ఆరోగ్యం, మెదడు పనితీరు మెరుగుపడుతుందని, శారీరక ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని, వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలు బలపడతాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. కెనడాలోని ఆల్బెర్టా విశ్వవిద్యాలయం డిజిటల్ డిటాక్స్‌పై అధ్యయనం చేయగా పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. సెల్‌ఫోన్, ఇంటర్నెట్‌ను అతిగా వినియోగించే 467 మందిని ఈ విశ్వవిద్యాలయం పరిశో. దకులు అధ్యయనం చేశారు. వీరికి రెండు వారాల పాటు సెల్‌ఫోన్, ఇంటర్నెట్ యాక్సెస్ లేకుండా చేశారు. డిజిటల్ డిటాక్స్‌కు ముందు, ఆ తర్వాత వారి మానసిక ఆరోగ్యం, శ్రద్ధ, సామర్థ్యాలను అంచనా వేశారు. 91 శాతం మందిలో డిటాక్స్ అనంతరం మెదడు పనితీరు మెరుగుపడటంతో పాటు, ఆందోళన, నిరాశ వంటి లక్షణాలు తగ్గినట్టు వెల్లడైంది. మొబైల్, ఇంటర్నెట్ యాక్సెస్ లేని వ్యక్తులు ముఖాముఖి సంభాషణలు, వ్యాయామం, చదవడం వంటి బహిరంగ కార్యకలాపాలను ఆస్వాదించడంలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియలు మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

మెదడుకు రీఛార్జ్

భారతీయులు సగటున రోజుకు 7.3 గంటలు స్క్రీన్ చూడటానికి కేటాయిస్తున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. గంటల తరబడి స్క్రీన్‌కు సమయాన్ని కేటాయించడంతో నిద్ర లేమి, ఒత్తిడి, ఆందోళన, నిరాశ తలెత్తడంతో పాటు, ఊబకాయం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ చక్రాన్ని డిజిటల్ డిటాక్స్ విచ్ఛిన్నం చేస్తుంది. మెదడుకు విశ్రాంతి లభించి, రీఛార్జ్ అవుతుంది. స్క్రీన్‌ల నుంచి వచ్చే నీలి కాంతి (బ్లూ లైట్) దుష్ప్రభావాలు తగ్గిపోయి కంటికి మంచి నిద్ర దొరుకుతుంది. ఇంట్లో భార్యాభర్త, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు, స్నేహితులతో ముఖాముఖి చర్చించుకొనే అవకాశం లభిస్తుంది. తద్వారా మనుషుల మధ్య బంధాలు బలపడి, మనస్పర్థలు తగ్గుతాయని మానసిక వైద్యులు వెల్లడిస్తున్నారు. డీటాక్స్ సమయంలో రన్నింగ్, జాగింగ్, జిమ్‌లో వ్యాయామాలు చేయడం, ఇంటి, తోట పనులు వంటి శ్రమకు కేటాయించడంతో బీపీ, షుగర్ వంటి జీవన శైలి జబ్బుల ప్రమాదం తగ్గుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

పోలీస్ శాఖకు కావాల్సినవి సమకూరుస్తాం

- పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి
- ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలి
- హోంశాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి పౌరుడి భద్రతకు పోలీసులు భరోసా కల్పించాలని, ఆ మేరకు పోలీసు శాఖ అవసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి అవకాశం ఉందో వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆయన పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. శనివారం సచివాలయంలో హోం శాఖ ప్రీబడ్జెట్ సమావేశంలో ఆయన పలు అంశాలపై పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించారు. తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని, హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న మూడు నగరాలకు తోడు నాలుగో నగరం.. ఫ్యూచర్‌సిటీ సైతం సిద్ధం అవుతోందని అన్నారు. హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున వలసలు పెరుగుతున్నాయని, ఈ మేరకు భద్రత విషయంలో హోంశాఖ సిద్ధం కావాల్సిన అవసరం ఉందని భట్టి పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం విషయంలో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని ఆయన ఉన్నతాధికారులు, సిబ్బందిని అభినందించారు. ఇదిలా ఉండగా గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటెలిజెన్స్, ఫైర్, ఎక్స్ సర్వీస్‌మెన్.. ఇలా మొత్తం ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు వారి బడ్జెట్ అవసరాలపై సమావేశంలో నివేదిక సమర్పించారు. డీజీపీ జితేందర్ మొత్తం శాఖకు సంబంధించి అవసరమైన బడ్జెట్‌పై నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవి గుప్తా, హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్, డీజీ అభిలాష బిస్త్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధం

- 3,810 మీటర్ల పొడవుతో అతి పెద్ద రన్ వే
- ఏఏఐ విమానాశ్రయాల్లోని రన్ వేలలో ఇదే పొడవైనది



సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయమూ సిద్ధమైంది. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అనువుగా రూ.153.16 కోట్లతో రన్ వేను విస్తరించి, అత్యాధునిక నావిగేషన్ వ్యవస్థలు, ఇతర సౌకర్యాలు కల్పించారు. ట్రాన్స్‌– ఇన్‌స్టాల్డ్ ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్), కొత్త డాప్లర్ వెరీ హై ఫ్రీక్వెన్సీ ఓమ్ని రేంజ్ (డీవీఓఆర్), డిస్టెన్స్ మెజరింగ్ ఎక్విప్‌మెంట్ (డీఎంఈ) ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థల ద్వారా విమానాల నిర్వహణ సామర్థ్యం రోజుకు 100 విమానాల నుంచి 200 విమానాలకు పెరుగుతుందని విమానాశ్రయం డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నె చెప్పారు. అత్యాధునిక ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ ద్వారా కనీస దృశ్యమానత (విజిబులిటీ) 1500 మీటర్ల నుండి 700 మీటర్లకు తగ్గుతుంది. వీటి ద్వారా అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ విమానాలు సజావుగా రాకపోకలు సాగిస్తాయని డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. చెన్నై, బెంగుళూరు విమానాశ్రయాల్లో ఏదైనా సమస్య తలెత్తినా అక్కడ దిగాల్సిన విమానాలు తిరుపతిలో సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. ఇప్పటివరకు 2,285 మీటర్ల పొడవు ఉన్న రన్‌వేను బలోపేతం చేసి, 3,810 మీటర్లకు విస్తరించారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్వహిస్తున్న విమానాశ్రయాలలోని రన్‌వేలలో ఇదే అతి పొడవైనది. తద్వారా బోయింగ్ 777, ఎయిర్‌బస్ 330 వంటి అతి పెద్ద, విశాలమైన విమానాలూ ఇక్కడ దిగే అవకాశం కలిగింది.

ఇద్దరు ఐపీఎస్‌లను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి హోం కేడర్ ఏపీకి బదిలీ అయిన సీనియర్ ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష బిస్త్‌లను రిలీవ్ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల మేరకు ఇద్దరు అధికారులను రిలీవ్ చేసినట్టు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌కు సూచించారు. 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ ప్రస్తుతం తెలంగాణ రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా, 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అభిలాష బిస్త్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితోపాటు ఏపీ హోం కేడర్‌కు వెళ్లాల్సిందిగా కేంద్ర హోంశాఖ సూచించిన కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతిని మాత్రం ఇంకా రిలీవ్ చేయలేదు. కరీంనగర్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి వచ్చిన తర్వాత రిలీవ్ చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కనీస పెన్షన్ పెంపునకు కేంద్రం సానుకూలత



ఈపీఎస్–95 ఆందోళన కమిటీతో కార్మిక శాఖ చర్చలు

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)లో ఈపీఎస్–95 కనీస పెన్షన్ పెంపు కోసం చేపడుతున్న ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కనీస పెన్షన్ పెంచే అంశంపై ఆందోళన కమిటీతో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చర్చలు ఫలప్రదంగా జరిగాయని, రూ.1000 కనీస పెన్షన్‌ను పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఆందోళన కమిటీ శనివారం వెల్లడించింది. కనీస పెన్షన్ రూ.7 వేలకు పెంచాలని ఈ కమిటీ డిమాండ్ చేస్తోంది. అయితే ఈ అంశంపై ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తమైనప్పటికీ, ఎలాంటి ప్రకటన రాలేదు. తాజాగా కార్మిక శాఖ మంత్రితో చర్చలసారం, ఆర్థిక శాఖ సానుకూలత, అదేవిధంగా ఈ నెలాఖరులో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశం నేపథ్యంలో కనీస పెన్షన్ పెంపుపై స్పష్టత రావొచ్చని ఆందోళన కమిటీ సభ్యులు భావిస్తున్నారు. దీనివల్ల దేశవ్యాప్తంగా 78 లక్షల మంది పెన్షనర్లకు, తెలుగు రాష్ట్రాల్లో 6.15 లక్షల మంది పెన్షనర్లకు తక్షణ లబ్ధి కలగనుంది.

మహాశివరాత్రికి 3,000 ప్రత్యేక బస్సులు

- 43 శైవక్షేత్రాలకు నడపనున్న టీఎస్ఆర్టీసీ
- శ్రీశైలానికి అత్యధికంగా 800 సర్వీసులు
- స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం



సాక్షి, హైదరాబాద్: మహా శివరాత్రి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనుంది. 43 శైవ క్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. 24వ తేదీ నుంచి 28 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా శ్రీశైల క్షేత్రానికి 800, వేములవాడకు 714, ఏడుపాయల జాతరకు 444, కీసరగుట్టకు 270, వేలాలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సుల చొప్పున నడపనున్నారు. అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప తదితర ఆలయాలకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటా యి. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయి. ఈ స్పెషల్ బస్సుల్లో 50% అదనపు చార్జీలను వసూలు చేస్తారు. రెగ్యులర్ సర్వీస్‌ల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే సమీక్ష నిర్వహించారు.

మహిళలకు ఉచితమే..: గత ఏడాది శివరాత్రికన్నా ఈసారి 809 బస్సులను అదనంగా నడపనున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచనున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అమల్లో ఉంటుందని చెప్పారు. ముందస్తు టికెట్ల బుకింగ్‌ను www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు. సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

గ్రూప్‌–2 అభ్యర్థులతో బాబు బంతాట

ఏపీలో గ్రూప్‌–2 అభ్యర్థులతో ఆడుకున్న బాబు సర్కార్

- నేటి మెయిన్స్ పరీక్షపై తీవ్ర గందరగోళం



ప్రభుత్వ తీరును నిరసిస్తూ విశాఖలోని ఇసుక తోట వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న అభ్యర్థిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు

సాక్షి, అమరావతి: గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులను అనేక రకాలుగా మభ్యపెట్టిన చంద్రబాబు సర్కార్ పరీక్షకు కొన్ని గంటల ముందు వరకు వారి భావోద్వేగాలతో ఆడుకుంది. ఆదివారం పరీక్ష ఉండనగా.. శనివారం సాయంత్రం వరకు రకరకాల విన్యాసాలతో నాటకాలాడిన తీరు విస్తుగొలుపుతోంది.. ఆదివారం ఉదయం పరీక్ష ఉండనగా, శుక్రవారం రాత్రి వాయిదాకు అనుకూలంగా మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టి అభ్యర్థుల్లో ఆశలు రేపారు. అయితే, పరీక్ష వాయిదా అంటూ ‘సోషల్ మీడియా’లో వస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దంటూ శనివారం ఉదయం ఏపీపీఎస్సీ ప్రకటించింది. తర్వాత శనివారం మధ్యాహ్నానికి పరీక్ష వాయిదాకు అనువుగా నిర్ణయం తీసుకోవాలని ఏపీపీఎస్సీకి లేఖ రాసి ప్రభుత్వం చేతులు దులుపుకొంది. వాస్తవానికి రోస్టర్ అమలులో సమస్యలున్నాయని, వాటిని సరిచేసి మెయిన్స్ నిర్వహించాలని, అప్పటిదాకా పరీక్ష వాయిదా వేయాలని కొన్ని రోజులుగా అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నారు. అయితే, కేసు హైకోర్టు పరిధిలో ఉన్నందున ఇప్పుడే నిర్ణయం తీసుకోలేమని ఎమ్మెల్సీలు హామీ ఇవ్వడంతో ఈ నెల 20వ తేదీ వరకు ఆగారు. కోర్టు గ్రూప్‌–2 మెయిన్స్ రద్దుకు అంగీకరించకపోవడంతో పరీక్ష నిర్వహణకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. పరీక్షలు నేడు యథాప్రకారం జరగనున్నాయని ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. ఈ సమయంలో పరీక్షను వాయిదా వేయడం కుదరదని ఏపీపీఎస్సీ చైర్మన్ అనూరాధ రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినట్లు సమాచారం. ప్రభుత్వ తీరుపై గ్రూప్ –2 అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత దగా చేసిన కూటమి సర్కారును వదిలిపెట్టకూడదని, ‘బాయ్‌కాట్ ఎలక్షన్’కాదు.. ఎన్నికల్లో పాల్గొని తగిన విధంగా బుద్ధిచెప్పాలని గ్రూప్ 2 అభ్యర్థులు, గ్రాడ్యుయేట్స్ తీర్మానించుకుంటున్నారని తెలుస్తోంది.

సర్కారు డ్రామాలు..: గ్రూప్‌–2 మెయిన్స్ నిర్వహిస్తే తమకు నష్టం జరుగుతుందని అభ్యర్థులు సర్కారుకు మొరపెట్టుకున్నారు. కోర్టు తీర్పు అనంతరం నిర్ణయాధికారం ప్రభుత్వ పరిధిలోకి వచ్చినందున రోస్టర్ సవరించే వరకు పరీక్షను వాయిదా వేయాలని ఈనెల 20నుంచి కోరుతున్నారు. అయినప్పటికీప్రభుత్వం స్పందించలేదు. దీంతో అభ్యర్థులు ప్రస్తుతం జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను బాయ్‌కాట్ చేయాలని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలోని ముఖ్య నాయకులు కొత్త డ్రామాకు తెర తీశారు. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి మంత్రి నారా లోకేష్ చేసిన ట్వీట్ పరీక్ష వాయిదా కోరుతున్న అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తించింది. ‘‘పరీక్షలను వాయిదా వేయమని గ్రూప్‌–2 అభ్యర్థుల నుంచి నాకు అనేక అభ్యర్థనలు వచ్చాయి. వారి ఆందోళనలను అర్థం చేసుకున్నాను. మా న్యాయ బృందాలతో సంప్రదించి, పరిష్కారాన్ని కనుగొనేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తాము’’అని ఆయన ట్వీట్ చేశారు. అయితే, శనివారం ఉదయం ఏపీపీఎస్సీ మరో ప్రకటన విడుదల చేసింది. పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని పేర్కొంది. ఒకే అంశంపై రెండు వ్యవస్థలు భిన్న అభిప్రాయాలను వెల్లడించడంతో అభ్యర్థులు గందరగోళంలో పడిపోయారు. పరీక్ష మరో 14 గంటలు ఉండనగా ఈ పరిణామాలు చోటుచేసుకోవడంతో ఏం చేయాలో తెలియక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇదే సమయంలో రోస్టర్ సమస్యను పరిష్కరించి పరీక్ష నిర్వహించాలని, అప్పటిదాకా మెయిన్స్ వాయిదా వేయాలని ప్రభుత్వ కార్యదర్శి.. ఏపీపీఎస్సీకి రాసినట్టుగా ఓ లేఖ శుక్రవారం తేదీతో శనివారం మధ్యాహ్నం బహిర్గతమైంది. దీనిపైనే ముఖ్యమంత్రి చంద్రబాబు సర్వీస్ కమిషన్ చైర్మన్ అనురాధను తప్పుబడుతూ ఉన్న ఆడియోను లీక్ చేశారు. ప్రభుత్వం పరీక్షను వాయిదా వేయమంటే ఏపీపీఎస్సీ పట్టించుకోవడం లేదన్నది ఆ ఆడియో సారాంశం.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

నీలకంఠా.. నమోనమామి!

కోరిన కోర్కెలు తీర్చే మణుగూరులోని నీలకంఠేశ్వరాలయం

ఉజ్జయిని తర్వాత ద్విలింగ దర్శనం ఇక్కడే..

- స్వయంభూగా వెలిసిన శివుడు
- ఏటా మహాశివరాత్రికి వేలాదిగా భక్తుల రాక

మణుగూరు టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన పరమశివుడు నెలవైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని నీలకంఠేశ్వర ఆలయానికి అనేక ప్రత్యేకతలున్నాయి. కాకతీయుల కాలం నాటిదిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో శివుడు ద్విలింగ రూపంలో దర్శనం ఇవ్వడం ప్రత్యేకత. మహాశివరాత్రి, కార్తీక మాసాల్లో వేలాదిగా భక్తులు నీలకంఠేశ్వరుడిని కొలిచేందుకు బారులుతీరతారు.



మణుగూరు నీలకంఠేశ్వరాలయం

దేశంలో రెండో ద్విలింగ దర్శనం

ఆలయానికి వచ్చే భక్తులకు పాతాల లింగేశ్వరుడు స్తూపాకారంలో, నీలకంఠేశ్వరుడు బాణాకారంలో దర్శనమిస్తాడు. భూగర్భంలో భక్తులకు కనిపించేలా పాతాల లింగేశ్వరుడు ఉంటాడు. ఈ లింగాకారం అందరికీ కనిపించినా అర్చకులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. అలాగే పైన నీలకంఠేశ్వరుడు ఉంటాడు. రెండు లింగాలకు రాగి తీగలతో అనుసంధానంగా ఏర్పాట్లు చేశారు. దీంతో పైన ఉన్న నీలకంఠేశ్వరుడికి భక్తులు అభిషేకం చేయడం ద్వారా.. పాతాళంలోని లింగేశ్వరుడికి కూడా పూజలు చేసినట్లేనని నమ్ముతారు. కింద, పైభాగాల్లో ద్విలింగాలు దర్శనమిచ్చే ఆలయాలు దేశంలో రెండే ఉండగా, ఒకటి ఉజ్జయినీ మహాంకాళి ఆలయమని, రెండోది మణుగూరులోనే ఉందని చెబుతారు. అంతేకాక రాగి తీగలతో అనుసంధానం చేసి రెండు లింగాలను ఒకటిగా కలిపే ప్రక్రియ దేశంలో మొదటిగా ప్రసిద్ధి చెందింది. ఏటా ఈ ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలకు ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు పోటెత్తుతారు.

ఎన్నో పురాణ కథనాలు

- శివాలయం నుంచి కర్ర, ఇనుము, రాయి, నూనె, విభూది తీసుకెళ్లరాదని శాసనాలు చెబుతున్నాయి. అయితే, మొగలాయిల కాలంలో ఓ రాజు దాడులు నిర్వహించి ఆలయాన్ని నామరూపాలు లేకుండా కూల్చివేసి ఆ శిథిలాలతో కోట నిర్మించుకున్నాడట. అనంతరకాలంలో ఆ రాజు కాలగర్భంలో కలిసిపోయాడని చెబుతారు.
- భూభాగంలోని పానవట్టంపై స్తూపాకారంలో ఉన్న లింగాన్ని మరోచోట ప్రతిష్ఠించేందుకు అనేక మంది ప్రయత్నించినా సాధ్యం కాలేదట. అంతేకాక వారు పరమపదించారని ప్రచారంలో ఉంది.
- వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు పాతాల లింగేశ్వరుడికి సహస్రఘటాభిషేకం (వెయ్యి బిందెలతో అభిషేకం) చేసి స్వామిని జలబంధం చేయడం ద్వారా వర్షాలు కురుస్తాయని భక్తులు నమ్ముతారు.



భూగర్భంలో స్తూపాకారంలో స్వయంభూగా వెలిసిన పాతాల లింగేశ్వరుడు



భూగర్భం, పైభాగాన కనిపిస్తున్న ద్విలింగాలు



శివరాత్రికి భక్తుల తాకిడి

"మణుగూరులోని ప్రాచీన నీలకంఠేశ్వరాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. కాకతీయుల కాలంలో స్వయంభూగా వెలిసిన శివుడు కావడంతో ఇక్కడికి భక్తులు శివరాత్రి ఉత్సవాల సమయంలో వేలాదిగా తరలివస్తారు. మనస్ఫూర్తిగా, నియమ నిష్ఠలతో పూజలు చేస్తే పరమశివుడు కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తులు నమ్ముతారు.

– పంచాఖ్నల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ పూజారి

హరీశ్ అరెస్టుకు డీసీపీ, ఏసీపీ కుట్ర

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వ్యతిరేకంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్ష్యాలు సృష్టించి.. ఆయన అరెస్టుకు కుట్ర పన్నిన హైదరాబాద్ సిటీ వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ మోహన్ కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డీజీపీ జితేందర్‌ను కోరారు. ఈ మేరకు డీజీపీని శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో కీలక నాయకులపై కేసులు పెట్టి అరెస్ట్ చేసే ప్రయత్నంలో భాగమే.. హరీశ్‌రావుపై కుట్ర అని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన వంశీ కృష్ణను.. హరీశ్‌రావు పేరు చెప్తావా? చస్తావా? అని డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ మోహన్ కుమార్ బెదిరించడం దుర్మార్గమన్నారు. పోలీసులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. డీజీపీని కలిసిన వారిలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, బీఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, దేవీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

8 మంది ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 8 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీగా పనిచేస్తున్న పి విశ్వ ప్రసాద్‌ను హైదరాబాద్ సిటీ క్రైమ్స్ అడిషనల్ సీపీగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్‌లు డాక్టర్ బి నవీన్ కుమార్, బి రామ్‌రెడ్డిలను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. డీఐజీ కోఆర్డినేషన్‌గా ఉన్న డాక్టర్ గజరావు భూపాల్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా బదిలీ చేశారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా ఉన్న జోయల్ డేవిస్‌ను హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ జాయింట్ సీపీగా బదిలీ చేశారు. 2020 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సిరిశెట్టి సంకీర్తనను తెలంగాణ గవర్నర్ ఏడీసీగా నియమించారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న 2020 బ్యాచ్ ఐపీఎస్‌లు సీహెచ్ శ్రీధర్‌ను ఇంటిలిజెన్స్ ఎస్పీగా, ఎస్ చైతన్యకుమార్‌ను హైదరాబాద్ సిటీ ఎస్‌బీ డీసీపీగా నియమించారు.

డైపర్ మార్కెట్ ఆన్ హైపర్..!

భారత్‌లో డైపర్ల అమ్మకాల్లో ఏటా 10.13 శాతం వృద్ధి

- 7.53 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా
- బేబీ డైపర్ మార్కెట్‌లో ముందంజలో చైనా

సాక్షి, హైదరాబాద్: ఇంట్లో చిన్న పిల్లలున్నారంటే ఎన్నో అవసరాలు తప్పనిసరి. ఒకప్పుడు ఇంట్లో ఎవరైనా ప్రసవానికి ఉంటే బామ్మల పాత కాటన్ చీరలు సిద్ధం చేసి పెట్టుకునేవాళ్లు. నవజాత శిశువు నుంచి రెండు, మూడేళ్ల వరకు పిల్లల మల, మూత్రాల కోసం ఈ మెత్తటి కాటన్ వస్త్రాలనే వాడేవారు. కానీ మారుతున్న కాలానికి తగ్గట్టుగా అవసరాలూ మారుతున్నాయి. దీంతో పిల్లలు ఉన్న ఇంట్లో డైపర్ల వాడకం పరిపాటి అయింది. గతంలో కొన్ని కుటుంబాలకే పరిమితమైన డైపర్ల వాడకం ఇప్పుడు సర్వసాధారణం అయింది. సులువుగా అందుబాటులో ఉండటం, ధరలు కూడా అందుబాటులో ఉంటుండటం.. అన్నింటికి మించి ఈ కాలం తల్లిదండ్రులకు ఇవి ఉపయోగకరంగా ఉండటంతో డైపర్ల వాడకం ఏటికేడాది పెరుగుతోంది. భారత్‌లో బేబీ డైపర్ల అమ్మకాల్లో ఏటా 10.13 శాతం వృద్ధిరేటు నమోదవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2025 చివరి నాటికి దేశంలో బేబీ డైపర్స్ మార్కెట్ 7.53 బిలియన్ డాలర్లకు చేరుతుందన్న అంచనాలున్నాయి. ప్రపంచంలో ఇతర దేశాలతో పోలిస్తే చైనాలో బేబీ డైపర్ల మార్కెట్ ఎక్కువ ఉందని నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పోల్చినప్పుడు చైనా 2025లో 13 బిలియన్ డాలర్ల ఆదాయంతో మార్కెట్‌లో ముందంజలో ఉండే అవకాశం ఉన్నట్టు అంచనాలు పేర్కొంటున్నాయి.

డైపర్ల అమ్మకాలకు సంబంధించి మరిన్ని ప్రధానాంశాలు

- తలసరి ఆదాయం పరంగా చూస్తే దేశంలోని ప్రతి వ్యక్తి 2025లో మొత్తం ఆదాయంలో రూ.447.98 (5.17 యూఎస్ డాలర్లు)ఖర్చు చేస్తారని అంచనా.
- భారత్‌లో బేబీ డైపర్స్ మార్కెట్ పరిమాణం 2029 నాటికి 1.4 బిలియన్ కిలోలకు చేరుకుంటుందని అంచనా.
- సగటున దేశంలోని ప్రతి వ్యక్తి 2025లో 0.8 కిలోల యూనిట్ల బేబీ డైపర్స్ మార్కెట్‌ను వినియోగించే అవకాశం ఉంది.

పిల్లల వయసుల వారీగా సరాసరి డైపర్ల వాడకం ఇలా..

బేబీ వయసు	రోజుకు వాడే డైపర్ల సంఖ్య	నెలకు వాడే డైపర్ల సంఖ్య
0-1 నెల వరకు	10 నుంచి 12	320
1-5 నెలల వరకు	8 నుంచి 10	240
5-9 నెలల వరకు	8 డైపర్లు	240
9-12 నెలల వరకు	8 డైపర్లు	240

ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై మంత్రి దామోదర విచారం



సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిన ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారం వ్యక్తంచేశారు. శనివారం ఉదయం ఘటన గురించి తెలిసిన వెంటనే, సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో చిక్కుకున్న 8 మంది సురక్షితంగా బయటకు రావాలని మంత్రి ఆకాంక్షించారు. వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంపై టీపీసీసీ అధ్యక్షుడి దిగ్భ్రాంతి



సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదంపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.

సొరంగ ప్రమాదంపై విచారణ జరపాలి

సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో పైభాగం కుప్పకూలిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. వారం రోజులుగా టన్నెల్‌లో సీపేజ్ జరిగి.. నీళ్ల పెద్ద ఎత్తున లీకవుతుంటే ప్రభుత్వం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా పనులు నిర్వహించడాన్ని ఒక ప్రకటనలో ఆయన తప్పు పట్టారు. జరిగిన సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారంతో పాటు అన్ని రకాలుగా ఆదుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావాలని సూచించారు.

పెడబొబ్బలతో ప్రగతిని రూపుమాపుతారా?

– మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల కేసీఆర్ పాలనలో పూర్తి చేసిన నీటి పారుదల ప్రాజెక్టులు కళ్లెదుటే కనిపిస్తున్నా.. అరుపులు, పెడబొబ్బలతో అభివృద్ధిని సీఎం రేవంత్ రెడ్డి రూపుమాపాలని భావిస్తున్నారని బీఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ పాలనలో నిర్మితమైన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పాలన సాగిస్తూ.. ఆయన పైనే విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నిరంజన్ రెడ్డి ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 1931 తర్వాత తానే కులగణన చేస్తున్నట్లు రేవంత్ చెబుతున్నారని.. 1952 తర్వాత దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలను ఆయన తప్పు పడుతున్నారా? అని ప్రశ్నించారు. పంటలకు నీళ్లు ఇవ్వలేమంటున్న వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తన పదవికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి పదవి తీసుకుంటే మంచిదని ఎద్దేవా చేశారు. పోతిరెడ్డిపాడు విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై.. నాటి కాంగ్రెస్ మంత్రివర్గం నుంచి బీఆర్ఎస్ మంత్రులు వైదొలిగారని గుర్తు చేశారు.

రేవంత్‌రెడ్డి మారిస్తే చరిత్ర మారదు: బీఆర్‌ఎస్

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మారిస్తే చరిత్ర మారదని, తక్కువ జనసంఖ్య చూపిన సర్వే తప్పు కాకుండా ఒప్పు అవుతుందా అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నేతలు శుభప్రద్ పటేల్, పల్లె రవికుమార్, కిశోర్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులగణన లోపాలపై శాస్త్రీయ ఆధారాలతో మాట్లాడుతుంటే సీఎం జీర్ణించుకోలేక పోతున్నారని, ఏ రకంగా చూసినా రాష్ట్ర జనాభా 4.30 కోట్లు దాటుతుందన్నారు. ఐఏఎస్‌లు సరిగా పనిచేయడంలేదని సీఎం అంటున్నారని, రేవంత్‌రెడ్డి లాంటి అష్ట దరిద్రపు సీఎం ఇంకెవరూ లేరని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, నాలుగు వేల పెన్షన్, వందశాతం రైతు రుణమాఫీ, తులం బంగారం ఇచ్చిన చోటే కాంగ్రెస్ పోటీ చేయాలని, కళ్యాణ లక్ష్మి ఇచ్చిన చోట బీఆర్ఎస్ పోటీ చేస్తుందని సవాల్ విసిరారు. పోతిరెడ్డిపాడు విషయంలో సీఎం పదవిలో ఉండి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాకు ప్రయత్నించాలని వారు డిమాండ్ చేశారు.

బీజేపీపై దుష్ప్రచారం..

– సీఈవోకు బీజేపీ నేత ప్రేమేందర్‌రెడ్డి ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రులు, బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి జి.అంజిరెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సహా ఒక దినపత్రిక చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి.సుదర్శన్ రెడ్డికి బీజేపీ ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్సీ టికెట్ కోసం డబ్బు చేతులు మారినట్టు.. పూర్తి నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొంది. బీజేపీ నాయకుల ప్రతిష్టకు భంగం కలిగించి.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించింది. ఈ మేరకు శనివారం సీఈవోకు బీజేపీ రాష్ట్రప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు.

గుట్టల అందాలు మూటగట్టుకునేలా..



కనకగిరి అందాలను తిలకించేందుకు ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తరించిన కనకగిరి గుట్టలను.. ఎకో టూరిజంలో భాగంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నారు. సుమారు 50 వేల ఎకరాల్లో.. 50 గుట్టలు కనకగిరి ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతం దేవాలయాలు, కోనేర్లు, కోట, వివిధ రకాల పక్షిజాతులకు నిలయం. వీటన్నింటినీ కలుపుతూ పర్యాటకులను ఆకర్షించేలా ఎకో టూరిజానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చివరి గుట్ట వద్ద సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ సైతం నిర్మించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

కలర్‌ఫుల్ స్పైడర్ వెబ్


చేపల వలల మాదిరిగా కనిపించే సాలెపురుగు తన గూడును ఎంతముద్దుగా అల్లుకుందో ఈ చిత్రాలను చూస్తే దాని మేధోశక్తి తెలుస్తుంది. నోటి నుంచి స్రవించే జిగురుదారంతో గూడు అల్లి అందులో చిక్కుకున్న కీటకాలను తిని జీవిస్తుంది సాలెపురుగు. సాయంకాల సమయంలో వివిధ వర్ణాలతో సాలెపురుగు గూళ్లు 'సాక్షి'కెమెరాకు వర్ణశోభితమై కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి











ఉషోదయాన ఉపాధి బాటలో..

బాల భానుని బంగారు కిరణాలతో కదలి మెరిసిపోతోంది. పొట్ట నింపుకునేందుకు గంగపుత్రులు రోజూమాదిరిగానే సముద్రంపై బతుకుపోరుకు సిద్ధమవుతున్నారు. మనోహరమైన ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వేసవిలో చల్లచల్లగా..

వేసవి ఆరంభమవుతుందంటే చాలు.. రోడ్లపై ఎక్కడికక్కడ పుచ్చకాయలు రాశులుపోసి అమ్ముతుంటారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం ప్రజలు పెద్ద ఎత్తున పుచ్చకాయలు కొనుగోలుచేస్తుంటారు. విశాఖలో పసుపు రంగులో మార్కెట్‌లోకి వచ్చిన పుచ్చకాయలు కొత్తగా కనిపించడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



సీజన్ మొదలైంది


ఫిబ్రవరి నెలలోనే ఎండలు చుర్రుమనిపిస్తున్నాయి. ఇకపై ప్రతి నీటి చుక్కా జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. నీటిని నిల్వచేసుకునేందుకు చాలామంది ఈ ప్లాస్టిక్ బిందెలను కొనుగోలుచేస్తుంటారు. దీంతో వీటిని అమ్మి పొట్టనింపుకునేవాళ్లు కర్నూలులో ఇలా వీధి వీధి తిరిగి బిందెలు అమ్ముకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

‘ప్రభ’వించితివా.. శివా!

కోటప్పకొండకు శివరాత్రి శోభ

- తెలుగు రాష్ట్రాల్లో ఇక్కడి తిరునాళ్లకు ప్రత్యేక గుర్తింపు
- వందల ఏళ్లుగా ప్రభలతో కొండకు తరలివస్తోన్న భక్తజనం
- 80, 90 అడుగులు భారీ విద్యుత్‌ప్రభల తయారీ
- తరలింపునకు రూ.50 లక్షల వరకు ఖర్చు





సాక్షి, నరసరావుపేట: తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి వేడుకలు జరిగే ప్రాంతాల్లో పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలో ఉండే కోటప్పకొండ ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఎక్కడాలేని విధంగా శివరాత్రి నాడు కోటప్పకొండకు 30 కి.మీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల వారు ప్రభలు కట్టుకొని కొండకు వెళ్లడం ఇక్కడి సంస్కృతిలో భాగం. కోటప్పకొండ శివరాత్రి తిరునాళ్లలో ప్రభలే ప్రత్యేక ఆకర్షణ. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ప్రభల వైభవాన్ని చూడాలే కాని వర్ణించలేము. విద్యుత్ ప్రభల ధగధగ కాంతుల నడుమ...ఆ రాత్రి సమయంలో కోటప్పకొండ మెరిసిపోతుంది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ప్రభుత్వం ఈ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించింది. అప్పటి నుంచి తిరునాళ్ల రోజున రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్వామివారికి పట్టువస్త్రాలు అందజేస్తారు.

బాల ప్రభల నుంచి విద్యుత్ ప్రభల దాకా....

అప్పట్లో కొండకు ఎద్దుల సహాయంతో ప్రభలను తరలించేవారు. 20 అడుగుల దాకా ఎత్తుతో తయారు చేసేవారు. కాలక్రమేణా ప్రభల ఎత్తు 80, 90 అడుగుల దాకా చేరడంతోపాటు విద్యుత్ ప్రభలు తయారుచేయడం ప్రారంభించారు. ఒక్కో ప్రభను తరలించడానికి 100 మందికిపైగానే అవసరమవుతారు. ఒకప్పుడు ఎద్దులతోనే ప్రభలను తరలించే ప్రజలు, ప్రస్తుతం ట్రాక్టర్ల సాయంతో ప్రభలను కొండకు తరలిస్తున్నారు.

ఎత్తైన విద్యుత్ ప్రభల తయారీ, కొండకు తరలించడం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాదం, తిరిగి గ్రామానికి చేర్చడానికి ఒక్కో ప్రభకు రూ.50 లక్షల దాకా ఖర్చు అవుతుంది. కోటప్పకొండకు 20 కి.మీ ఆ పై దూరం గల గ్రామాల్లోని విద్యుత్ ప్రభలు కొండకు చేర్చడానికి శివరాత్రికి ఒక రోజు ముందే గ్రామం నుంచి ప్రభ బయలుదేరుతుంది. ప్రభకు కింద నుంచి పై వరకు కనీసం 90 తాడులు పైనే కడతారు. ప్రభ కదిలే సమయంలో ఒక్కొక్క తాడును 5–10 మంది పట్టుకుంటారు. పక్కకు వాలకుండా జాగ్రత్తగా ప్రభని ముందుకు నడుపుతారు. కొంతమంది బాల ప్రభల పేరిట చిన్న చిన్న ప్రభలను భక్తిశ్రద్ధలతో కొండకు చేరుస్తారు. నర్సరావుపేట, చిలుకలూరి పేట, పురుషోత్తమపట్టణం, కమ్మవారిపాలెం, కావూరు,అప్పాపురం, కేసానుపల్లి, అమీన్ సాహిబ్ పాలెం, గంగనపాలెం, కోమటినేనివారిపాలెం, గోవిందపురం, ఉప్పలపాడు, నకరికల్లు, దేచవరం, గామాలపాడు, ఈవూరు, బొమ్మరాజుపల్లి, రొంపిచెర్ల, చేజర్ల, ముప్పాళ్ల, సంతమాగులూరు తదితర గ్రామాలు, పట్టణాలు నుండి చిన్న, మధ్య, భారీ తరహా ప్రభలు కొండకు వస్తాయి.

ప్రభలు సంస్కృతి ప్రారంభమైందిలా...

పరమశివుడు మూడు కొండలపై (త్రికూటం) ధ్యానంలో ఉండేవారని భక్తుల నమ్మకం. స్థలపురాణం ప్రకారం...కొండ సమీపంలోని కొండకావూరు గ్రామానికి చెందిన ఆనందవల్లి (గొల్లభామ) ప్రతిరోజూ స్వామి వారికి పాలను ఆహారంగా అందించేదట. గర్భం దాల్చిన ఆనందవల్లి.. స్వామి దగ్గరకు వెళ్లి.. స్వామి నేను కొండ ఎక్కలేకపోతున్నాను.. నాతో పాటు కిందికి వస్తే ప్రతి రోజులాగే పాలు ఆహారంగా ఇస్తానందట. గొల్లభామ వెంట వస్తానని, అయితే కొండ దిగుతున్న సమయంలో చివరి వరకు వెనక్కితిరిగి చూడకుండా దిగాలని స్వామి ఒక షరతు విధించారట. ఎప్పుడైతే నువ్వు వెనుదిరిగి చూస్తావో అప్పుడు శిల అయిపోతానన్నారట. షరతుకు ఒప్పుకున్న ఆనందవల్లి ముందు నడుస్తుంటే స్వామి వెనుక వస్తున్నాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో ఆనందవల్లి వెనుదిరిగి చూసిందంట. అంతే ప్రస్తుతం గుడి ఉన్న బ్రహ్మ శిఖరంపై స్వామి శిల అయ్యారని చెబుతారు. ఈ క్షేత్రంలో ఆనందవల్లిని దర్శించుకున్న తర్వాతే భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. భక్తులు స్వామి వద్దకు వెళ్లి కొండ పూర్తిగా దిగి రావాలని వేడుకున్నారంట. అప్పుడు ఎప్పుడైతే నా కొండకు కోటొక్క ప్రభలు వస్తాయో అప్పుడు కొండ దిగి వస్తానని చెప్పాడంట. అప్పటి నుంచి కోటయ్య చెంతకు భక్తులు ప్రభలతో రావడం ప్రారంభమైందని స్థానికులు చెబుతారు.



సుభిక్షం కోసం...

గ్రామాలు పచ్చని పాడిపంటలతో ఉండాలంటే కోటయ్య కొండకు ప్రభ కట్టుకొని వైభవంగా వెళ్లాలని ఇక్కడ ప్రజలు భావిస్తారు. దశాబ్దాలుగా క్రమం తప్పకుండా కొన్ని గ్రామాలు ప్రభలను కొండకు తరలిస్తున్నాయి. ప్రభల విషయంలో గ్రామాల మధ్య పోటీ కూడా ఉంటుంది. గ్రామ పెద్దలు ఇంటికి ఇంత, ఎకరానికి ఇంత అని చందా వేసుకొని ప్రభను నిర్మిస్తారు. గ్రామాలతో పాటు ప్రత్యేకంగా కొన్ని కుటుంబాలు ప్రభలు తయారు చేసుకుంటాయి. వ్యక్తిగత కోర్కెలు తీరిన తరువాత మొక్కు తీర్చుకుంటారు. భారీ విద్యుత్ ప్రభలపై ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తూ భక్తులు జాగారం చేస్తారు. ప్రభ కొండకు బయలుదేరే ముందు గ్రామంలో, కొండ వద్ద తిరునాళ్ల రోజు, తిరిగి గ్రామానికి వచ్చిన తర్వాత మరోసారి పండగ వాతావరణంలో ప్రభ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. గ్రామస్తులకు విందు భోజనాలు ఏర్పాటు చేస్తారు.

పూర్వీకుల నుంచీ ఆచారం



తరతరాలుగా మా పూర్వీకులు కోటప్పకొండకు ప్రభలు కడుతున్నారు. 69 ఏళ్లుగా ప్రభను కడుతున్నాం. రూ.30 లక్షల వరకు ఖర్చవుతుంది. ప్రభల సంస్కృతిని రాబోయే తరాలు సైతం కొనసాగించేలా మేము పండుగను జరుపుతున్నాం.

– పూనాటి కోటేశ్వరరావు, అమిన్‌సాహెబ్‌పాలెం, నాదెండ్ల మండలం

గ్రామం బాగుకోసం



కోటప్పకొండకు ప్రభలను కడితే గ్రామం సుభిక్షంగా ఉంటుందని పెద్దల విశ్వాసం. అదే ఆనవాయితీని కాపాడుతూ వస్తున్నాం. శివరాత్రికి కొన్ని వారాల ముందే ప్రభల ఏర్పాటుకు సిద్ధమవుతాం. ప్రభ తిరిగి గ్రామం వచ్చేవరకు అదో యజ్ఞంలా పనిచేస్తాం.

– జాగర్లమూడి హనుమంతరావు, గురవాయిపాలెం గ్రామం, నరసరావుపేట రూరల్ మండలం

క్లుప్తంగా...

డీడీఈ పరీక్షలు మళ్లీ వాయిదా

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న డీడీఈ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 24 నుంచి మార్చి 15వతేదీ వరకు జరుగనున్న దూరవిద్యకు సంబంధించిన యూజీ, పీజీ పరీక్షలను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఎస్వీయూ అధికారులు ఇప్పటికే మూడుమార్లు వాయిదా వేసి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

బడ్జెట్‌లో ఉద్యోగుల సమస్యలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (మెట్రో): ప్రభుత్వోద్యోగుల సమస్యలు, వారికి అందాల్సిన బకాయిలపై బడ్జెట్ సమావేశాల్లో చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పల నాయుడు శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఉద్యోగుల డీఏ పాత బకాయిలు, సరెండర్ లీవ్స్ బకాయిలు, ఇన్సూరెన్స్, మెచ్యూర్ బాండ్స్‌కు సంబంధించిన బకాయిలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి, విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గాదె శ్రీనివాసుల నాయుడుకు ఎస్‌జేఎఫ్ మద్దతు

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి, బీసీ సామాజికవర్గానికి చెందిన గాదె శ్రీనివాసుల నాయుడుకు సోషల్ జస్టిస్ ఫోరమ్ (ఎస్‌జేఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఎస్‌జేఎఫ్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్య యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీల పార్టీ అని గొప్పలు చెప్పుకునే టీడీపీ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లోని మూడు స్థానాల్లో ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

బాలుడి ఊపిరితిత్తుల్లో చిక్కుకున్న కట్టె పుల్ల

తొలగించి ప్రాణాలు కాపాడిన వైద్యులు



శిశువుతో వైద్య బృందం

బీచ్‌రోడ్డు(విశాఖ): ఊపిరితిత్తుల్లో చిక్కుకున్న కట్టె పుల్ల ముక్కను తొలగించి 6 నెలల బాబుకు వైద్యులు ప్రాణం పోశారు. వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. ఒడిశాకు చెందిన 6 నెలల శిశువును రక్తంలో ఆక్సిజన్ స్థాయి చాలా తక్కువతో (60 శాతం) విషమ స్థితిలో విశాఖ వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్ హేమంత్, డాక్టర్ లక్ష్మణ్ నేతృత్వంలోని ఎమర్జెన్సీ బృందం వెంటనే చర్యలు తీసుకుని శిశువును బ్రాంకోస్కోపీ సూట్‌కు తరలించారు. శిశువు ఊపిరితిత్తుల్లో ఒక కట్టె పుల్ల చిక్కుకున్నట్లు కనుగొన్నారు. ఇది వాయుమార్గానికి పూర్తిగా అడ్డంకిగా మారింది. వైద్య బృందం వేగంగా పనిచేసి 10 నిమిషాల్లోనే బ్రాంకోస్కోపీ బాస్కెట్‌ని ఉపయోగించి ఆ కొమ్మను విజయవంతంగా తొలగించింది. దీంతో శిశువుకు ఆక్సిజన్ స్థాయి మెరుగుపడింది.

జనసేన నాయకుడి అరెస్ట్

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు త్సవటపల్లి నాగ భూషణంను శనివారం అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపరచగా, బెయిల్ మంజూరైందని ఎస్సై అవినాష్ తెలిపారు. గత సంక్రాంతికి చెయ్యేరులో ప్రభల తీర్థం సందర్భంగా ఆర్కెస్ట్రా వద్ద మెయిన్ రోడ్డు వెంబడి ట్రాఫిక్ క్లియరెన్స్ విషయంలో నాగభూషణం పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేశారు. నాగభూషణంను అరెస్టు చేసి ముమ్మిడివరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు.



పూతతో మామిడిచెట్లు కళకళ

శ్రీసత్యసాయి జిల్లాలోని పలుచోట్ల మామిడి తోటల్లో ఈసారి పూత ఆలస్యంగా వచ్చింది. అయినా చెట్ల నిండా కనిపిస్తోంది. ఎండలు ఎక్కువ అవుతుండటంతో ఈ పూతను ఎలా కాపాడుకోవాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత నిలిస్తే మాత్రం పంట బాగానే చేతికి అందుతుందని చెబుతున్నారు. తనకల్లు మండలం, దేగానివారిపల్లి వద్ద పూతతో మామిడి చెట్లు ఇలా కళకళలాడుతున్నాయి. -తనకల్లు

ఆదికేశవులు నాయుడు ఆస్తులపై వివాదం

వాట్సాప్‌లో వైరల్‌గా మారిన వీడియోలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ డీకే ఆదికేశవులు నాయుడుకు చెందిన ఆస్తులపై వివాదం నెలకొంది. వివాదానికి సంబంధించి ఆయన తనయుడు డిఏ శ్రీనివాస్‌కు, మరో వ్యక్తికి వాగ్వాదం చోటుచేసుకున్న వీడియోలు కొన్ని వాట్సాప్‌లో శనివారం వైరల్‌గా మారాయి. ఆదికేశవులు నాయుడు, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే సత్యప్రభకు బెంగళూరులో ఆస్తులు ఉన్నాయి. వీరిరువురి మరణానంతరం పలు ఆస్తులు కుటుంబ సభ్యులు సామరస్యంగానే పంచుకున్నట్లు తెలిసింది. అయితే బెంగళూరు వైట్ ఫీల్డ్‌లో రూ.వందల కోట్ల విలువ చేసే ఓ స్థలంపై డీఏ శ్రీనివాస్‌కు, అక్కడున్న ఒక వ్యక్తికి మధ్య వివాదం నెలకొంది. ఈ ఆస్తికి సంబంధించిన వ్యాజ్యం కోర్టులో ఉండగా, ప్రత్యర్థి ఖాళీ జాగాలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలుసుకున్న శ్రీనివాస్, అక్కడకు చేరుకున్నారు. పనులు నిలుపుదల చేయాలని కోరినా, ప్రత్యర్థి పట్టించుకోకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే బెంగళూరు పోలీసులు ఘటనా స్థలంలో ఉండటంతో శ్రీనివాస్‌ను బయటకు లాక్కెళ్లారు. పోలీసుల తీరును నిరసిస్తూ శ్రీనివాస్ నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు.



శ్రీనివాస్‌ను లాక్కెళుతున్న పోలీసులు

ఏసీలో చెలరేగిన మంటలు

20 లక్షల రూపాయల ఆస్తి నష్టం



ఐదవ అంతస్తులో చెలరేగుతున్న మంటలు

తిరుపతి క్రైమ్: తిరుపతిలోని భవాని నగర్ సమీపంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఏసీ నుంచి మంటలు చెలరేగడంలో పెద్ద మొత్తంలో ఆస్తినష్టం జరిగింది. అగ్నిమాపక అధికారుల వివరాల మేరకు.. భవాని నగర్ సమీపంలోని శ్రీనివాస తేజ రెసిడెన్సీలోని 5వ అంతస్తులో ఉన్న లియాకాతాళి ప్లాట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఏసీలో నుంచి మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న ఫర్నిచర్, టీవీలు, ఫ్రిజ్ అన్నీ కాలిపోయాయి. సుమారు రూ. 20 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లుగా అంచనావేస్తున్నట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,327 మంది స్వామివారిని దర్శించుకోగా 22,804 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గరుడ వాహనా గోవిందా!



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉదయం పల్లకీపై మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కలు చెల్లించుకున్నారు. శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు దివ్య మోహినీ రూపంలో ఉత్సవ మూర్తై, తిరుచ్చిపై చిన్ని కృష్ణుడు తన కృపాకటాక్షాలతో భక్తులను అనుగ్రహించారు. భక్తుల కోలాటాలు, చెక్క భజనలు, కేరళ వాయిద్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ నాలుగు మాడ వీధుల్లో గోవింద నామస్మరణలో మంగాపురం మార్మోగింది.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడండి

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా పల్నాడు జిల్లా కోటప్పకొండ తిరునాళ్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో తిరునాళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభలు తరలింపునకు అంతరాయం కలుగకుండా రోడ్లను తీర్చిదిద్దాలన్నారు. ప్రభల రాకపోకలకు విద్యుత్ వైర్లు తగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోటప్పకొండ వద్ద ఏర్పాట్లను ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అధికారులతో కలిసి పరిశీలించారు.

గోవాడలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



అమర్తలూరు(వేమూరు): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గుంటూరు జిల్లా అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు పడకుండా ఉండేందుకు ఆలయంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వీఐపీలకు ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం కార్య నిర్వహణాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. ప్రతి క్యూ లైన్ వద్ద పురుషులు, మహిళా కానిస్టేబుళ్లను నియమిస్తున్నట్లు తెలిపారు.

భృంగి వాహనంపై మల్లేశ్వరుడు

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం 5వ రోజు స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళగిరి తహసీల్దార్ కె. దినేష్ రాఘవేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. మాజేటి సూర్య వేణుగోపాల కృష్ణ దంపతులు, ఎల్‌కే శర్మ దంపతులు ఉత్సవ కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈవో జె.వి. నారాయణ వేడుక నిర్వహణను పర్యవేక్షించారు.



యువోత్సాహం

రేణిగుంట(ఏర్పేడు): తిరుత్సవ పేరిట ఐఐటీలో ప్రతియేటా నిర్వహించే సాంస్కృతిక సంబరాలు ఈ ఏడాది కూడా యువోత్సాహంతో మిన్నంటాయి. ఏర్పేడు సమీపంలోని ఐఐటీ ప్రాంగణంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ పర్యవేక్షణలో విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో తిరుత్సవ సంబరాలు సాగుతున్నాయి. శనివారం ఉదయం విద్యార్థుల బృందం మర్డర్ మిస్టరీని ఛేదించేందుకు మెదడుకు పదును పెట్టారు. ఎస్కేప్ రూమ్, కౌన్ బనేగా కరోడ్‌పతి, స్క్వాడ్ గేమ్స్, ఫ్యాషన్ షో ప్రదర్శనలు సాగాయి. సాయంత్రం విద్యార్థుల బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకుంది.

మహా శివరాత్రి పర్వదినం (ఫిబ్రవరి 26) సందర్భంగా శైవ క్షేత్రాలన్నీ అంగరంగ వైభవంగా ముస్తాబవుతున్నాయి. శివుడికి ఎంతో ఇష్టమైన రోజు అయిన మహా శివరాత్రికి జాగరణ చేసేందుకు భక్తులు శివాలయాలకు పోటెత్తుతారు. ఆ రోజు శివాలయాలన్నీ హరోం హర అంటూ శివనామ స్మరణతో మార్మోగుతాయి. సినిమా ఇండస్ట్రీకి కూడా మహా శివుడితో ప్రత్యేక అనుబంధం ఉందనే చెప్పాలి. శివుడి నేపథ్యంలో ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చి, ప్రేక్షకులను అలరించాయి. తాజాగా పరమేశ్వరుడి నేపథ్యంలో పలు సినిమాలు తెరకెక్కుతున్నాయి. అలాగే శివ భక్తి నేపథ్యంలో పాటలు కూడా ఉన్నాయి. ఆ చిత్రాల విశేషాల గురించి తెలుసుకుందాం.

హరోం హర

శివుడి నేపథ్యంలో...

తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోలైన అక్కినేని నాగార్జున, ధనుష్ నటిస్తున్న భారీ మల్టీస్టారర్ మూవీ 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో రష్మికా మందన్న హీరోయిన్. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శివుడి నేపథ్యం ఉంటుందని తెలుస్తోంది. గత ఏడాది మహా శివరాత్రి కానుకగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఆహార దేవతగా భావించే అన్నపూర్ణా దేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న ఫొటో పోస్టర్‌లో ఉంది. అంటే... ఈ కథలో శివుడి గురించి ఏదో ఒక లైన్ టచ్ చేసి ఉంటారని కచ్చితంగా ఊహించవచ్చు. పైగా మహా శివరాత్రి కానుకగా ప్రత్యేకించి ఆ పోస్టర్ విడుదల చేయడం కూడా శివుడి నేపథ్యం ఉంటుందని చెప్పకనే చెప్పింది యూనిట్. ఈ సినిమాలో మురికి వాడల్లో నివశించే వ్యక్తిగా ధనుష్ పాత్ర ఉంటుంది. అలాగే ముంబైకి చెందిన ఓ ధనవంతుడి పాత్రలో నాగార్జున కనిపించనుండగా, రష్మికా మందన్న మధ్యతరగతి యువతి పాత్ర చేస్తున్నారు. నటుడు జిమ్ సర్భ్ ఓ బిలియనీర్ బిజినెస్ మ్యాన్‌గా కనిపిస్తారు.

శివ భక్తుడి కథ

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియన్ మూవీగా నిర్మించారు. ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 25న ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది 'కన్నప్ప' యూనిట్. పరమశివుడికి వీర భక్తుడైన కన్నప్ప నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది. కన్నప్పలోని వీరత్వం, భక్తిని మేళవించి ఈ మూవీ తెరకెక్కించారు ముఖేశ్ కుమార్ సింగ్. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ శివుడి పాత్ర చేయడం విశేషం. శివ తాండవం చేస్తున్న అక్షయ్ కుమార్ పోస్టర్‌ని చిత్ర బృందం విడుదల చేయగా అద్భుతమైన స్పందన వచ్చింది. శివుడిగా ఆయన పాత్ర ఎలా ఉండబోతోందో ఆ పోస్టర్ ద్వారా చూపించింది యూనిట్. అంతేకాదు... ఈ సినిమా నుంచి విడుదలైన 'శివ శివ శంకరా...' పాటకి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఈ చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్ద పీట వేశారు. ఈ మూవీలో తిన్నడు పాత్రలో మంచు విష్ణు, రుద్ర పాత్రలో ప్రభాస్, పార్వతీ దేవిగా కాజల్ అగర్వాల్ నటించారు. మధుబాల, ప్రీతీ ముకుందన్, ఐశ్వర్య, దేవరాజ్, విష్ణు మంచు కుమార్తెలు అరియానా, వివియానా వంటి వారు ఇతర పాత్రల్లో నటించారు.



ధనుష్, నాగార్జున
బెల్లంకొండ సాయి శ్రీనివాస్
అక్షయ్ కుమార్
తమన్నా
సుధీర్‌బాబు

– దేరంగుల జగన్ మోహన్

శివ తాండవం

పాప వినాశక సాక్షాత్ సాంబ శివ అంటూ ఆడి పాడుతున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'భైరవం'. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటించారు. ఈ మూవీలో అదితీ శంకర్, ఆనంది, దివ్యా పిళ్లై కథానాయికలు. పెన్ స్టూడియోస్‌పై డా. జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో శివుడి నేపథ్యంలో ఓ పాట తెరకెక్కించారు మేకర్స్. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'భైరవం' థీమ్ సాంగ్‌ను విడుదల చేసింది యూనిట్. ఈ పాటలో పరమ శివుని భయం, బలం ఈ రెండింటినీ తన హావభావాలు, నృత్యంతో అద్భుతంగా కనబరిచారు సాయి శ్రీనివాస్. చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించిన ఈ పాటని శంకర్ మహదేవన్ తనదైన శైలిలో పాడారు. ఓ ఆలయం ముందు ఈ పాటను చిత్రీకరించారు. ''ఈ నెల 26న రానున్న మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ ఆధ్యాత్మిక పాటని విడుదల చేశాం. పరమ శివుడి దైవిక సారాన్ని అందంగా ప్రజెంట్ చేసి, లోతుగా ప్రతిధ్వనించే ఎమోషన్స్‌ని ఈ పాట ఆవిష్కరిస్తుంది. సాయి శ్రీనివాస్ పాత్ర శివ తాండవం ప్రేరణ స్ఫూర్తితో మెస్మరైజ్ చేస్తుంది'' అని చిత్రయూనిట్ తెలిపింది.

జటాధర

వైవిధ్యమైన కథా నేపథ్యం ఉన్న చిత్రాలు, పాత్రలను ఎంచుకుని తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన హీరోగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియో సమర్పణలో ఉమేశ్ కేఆర్ భన్సల్, ప్రేరణా అరోరా నిర్మిస్తున్నారు. సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రం 'జటాధర'. అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ తిరిగే కథ ఇది. అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, పురాణ చరిత్ర వీటి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా కూడా పరమ శివుడితో ముడిపడిన కథే అని సమాచారం. పైగా టైటిల్‌ని బట్టి చూస్తే ఇదే వాస్తవం అనిపిస్తుంది. జటాధరుడు అని పరమ శివుణ్ణి పిలుస్తారనే విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అనంత పద్మనాభ స్వామి ఆలయంలోని నిధిని మాత్రమే కాకుండా ఆలయ చరిత్ర, పురాణ కథల్ని కూడా చూపించబోతున్నారు మేకర్స్. ఈ సినిమాలో సుధీర్ బాబు పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది.

పరమ శివుని భక్తురాలు

హీరోయిన్ తమన్నా లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. ప్రముఖ దర్శకుడు సంపత్ నంది ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించడం విశేషం. తొలి భాగాన్ని తెరకెక్కించిన డైరెక్టర్ అశోక్ తేజ రెండో భాగానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా, యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్నారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో శివ భక్తురాలైన శివ శక్తి నాగసాధు పాత్రలో నటిస్తున్నారు తమన్నా. తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఓదెల మల్లన్న స్వామి ఎలా కాపాడారు? అనే అంశంతో 'ఓదెల 2' తెరకెక్కుతోంది. మల్లన్న స్వామి అంటే శివుడే అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ సినిమా షూటింగ్ సింహ భాగం వారణాసిలోని కాశీలో జరిగింది. శనివారం విడుదలైన ఈ సినిమా టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది.

ఇవే కాదు... మరికొన్ని సినిమాలు కూడా శివుడి నేపథ్యంలో తెరకెక్కుతున్నాయి.

ఓ ప్రేమ... ప్రేమ


'ఆర్టిస్ట్' పోస్టర్

సంతోష్ కల్వచెర్ల, క్రిషికా పటేల్ జంటగా రతన్ రిషి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆర్టిస్ట్'. ఎస్‌జేకే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై జేమ్స్ వాట్ కొమ్ము నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. సురేష్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఓ ప్రేమ ప్రేమ..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. 'జారే కన్నీరే అడుగుతుందా.. . నేరం ఏముందో చెప్పమంటూ... నా ప్రేమే ఇలా ఓ ప్రశ్నయ్యేనా... నా మౌనం ఇలా ఈ బదులిచ్చేనా...' అంటూ భావోద్వేగంగా సాగుతుందీ పాట. రాంబాబు గోసాల సాహిత్యం అందించిన ఈ పాటని రమ్యా బెహ్రా పాడారు. ''ఒక వినూత్నమైన ప్రేమ కథతో 'ఆర్టిస్ట్' సినిమా రూపొందింది. ఈ చిత్రం నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'చూస్తూ చూస్తూ..' సాంగ్‌కు మంచి స్పందన వచ్చింది. సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది. 'సత్యం' రాజేశ్, వినయ్ వర్మ, తనికెళ్ల భరణి, పి.సోనియా ఆకుల, స్నేహ, మాధురి శర్మ తదితరులు నటించిన ఈ సినిమాకి కెమేరా: చందూ ఏజే, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సురేష్ బసంత్, లైన్ ప్రొడ్యూసర్: కుమార్ రాజా.

ప్రేమిస్తా మామ


చంద్రహాస్, 'దిల్' రాజు

చంద్రహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. సంపత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్‌గా చేశారు. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మించారు. ఆర్ఆర్ ధ్రువన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రెడ్డి మామ...' అంటూ సాగే ఓ మాస్ బీట్ సాంగ్‌ను నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేసి, యూనిట్‌ని అభినందించారు. ఈ పాటకి సురేష్ గంగుల సాహిత్యం అందించగా, నకాష్ అజీజ్, సాహితి చాగంటి పాడారు. త్వరలోనే రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమేరా: వైఆర్ శేఖర్.

ఆశ్చర్యపడిన వారిని అబ్బుర పరిచింది!


రష్మికా మందన్నా

'ప్రతి గింజపై తినే వారి పేరు రాసి ఉంటుంది' అంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని.... 'ప్రతి పాటపై పాడే వారి పేరు రాసి ఉంటుంది' అంటాడు ఏసుదాస్. సినిమాల్లోని పాత్రలకు సంబంధించి కూడా ఇది వర్తిస్తుందేమో! ఊహించిన పాత్రలో నటించి, ఆ నటనకు ఫస్ట్ క్లాసు మార్కులు తెచ్చుకుంటే ఆ సంతోషమే వేరు. ఇటీవల విడుదలైన హిస్టారికల్ డ్రామా మూవీ 'ఛావా'లో మహారాణి యశూబాయి పాత్రలో నటించింది రష్మిక. మరాఠా సామ్రాజ్యం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ఛత్రపతి శివాజీ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ పాత్రలో విక్కీకౌశల్, అక్షయ్ ఖన్నా ఔరంగజేబ్ పాత్రలో నటించారు. మిగిలిన పాత్రల సంగతి ఎలా ఉన్నా సౌత్ ఇండియన్ అమ్మాయి యశూబాయి భోంస్లే పాత్రలో నటించడం ఆశ్చర్యంగా, విశేషంగా మారింది. రష్మికకు ఈ పాత్ర సవాలుగా మారింది. గతంలో ఎంతో మంది ప్రతిభావంతులు నాటకం, సినిమా, టీవీల్లో ఈ పాత్రను రక్తి కట్టించడం వల్ల సహజంగానే అంచనాలు భారీగా ఉంటాయి. ఆ అంచనాలకు తగ్గకుండా నటించి శభాష్ అనిపించుకుంది రష్మిక. 'ఛావా' సెట్స్‌కు సంబంధించి రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన అన్-సీన్ ఫొటోలు, వీడియోలు నెట్‌లోకంలో చక్కర్లు కొడుతున్నాయి. 'మహారాణి యశూబాయి పాత్రని పోషిస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. దక్షిణ భారతానికి చెందిన అమ్మాయిగా అది సాధ్యం అవుతుంది అని అనుకోలేదు' అని తన మనసులో మాట రాసింది రష్మిక.

సమ్మర్‌లో సారంగపాణి


'వెన్నెల' కిశోర్, ప్రియదర్శి, 'వైవా' హర్ష

ప్రియదర్శి, రూపా కొడవయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాను గత ఏడాది డిసెంబరులోనే విడుదల చేయాలనుకున్నారు. కానీ కుదర్లేదు. దీంతో తాజాగా 'సారంగపాణి జాతకం' సినిమాను సమ్మర్‌లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. ''మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేక అతను చేతలతో చేసే పనులతో ఉంటుందా? అనే ప్రశ్నలకు సమాధానంగా ఈ మూవీని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నం చేశాం'' అని ఈ సినిమాను ఉద్దేశించి మేకర్స్ తెలిపారు. 'వెన్నెల' కిశోర్, 'వైవా' హర్ష, నరేశ్ విజయ కృష్ణ, అవసరాల శ్రీనివాస్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

బిజినెస్ రీల్

సునీల్ భారతీ మిత్తల్‌కు నైట్‌హుడ్ పురస్కారం



న్యూఢిల్లీ: టెలికం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో ఉన్న భారతీ ఎంటర్‌ప్రైసెస్ ఫౌండర్, చైర్మన్ సునీల్ భారతీ మిత్తల్ తాజాగా గౌరవ నైట్‌హుడ్ పతకాన్ని అందుకున్నారు. బ్రిటన్‌లో నాయకత్వం, వ్యాపార పెట్టుబడులకుగాను మిత్తల్‌కు నైట్ కమాండర్ ఆఫ్ ద మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ ద బ్రిటీష్ ఎంపైర్ (కేబీఈ) వరించింది. యూకే రాజు చార్లెస్–3 తరఫున ఢిల్లీలో బ్రిటిష్ హై కమిషనర్ లిండీ కామెరాన్ నుండి ఆయన ఈ గౌరవాన్ని స్వీకరించారు.

స్కూట్సీలో రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఆహార, నిత్యావసరాల డెలివరీ సంస్థ స్విగ్గీ తాజాగా తమ అనుబంధ సంస్థ స్కూట్సీ లాజిస్టిక్స్‌లో రూ. 1,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. ఏక మొత్తంగా లేదా విడతలవారీగా రైట్స్ ఇష్యూ కింద ఈ మొత్తాన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించింది. సప్లై చెయిన్ సర్వీసులు అందిస్తున్న స్కూట్సీ వ్యాపార విస్తరణకు ఈ నిధులు ఉపయోగపడనున్నట్లు తెలిపింది.

ఎస్‌బీఐ ఎంఎఫ్ చేతికి ఆల్కెమ్ షేర్లు

6.41 లక్షల షేర్లు కొనుగోలు

న్యూఢిల్లీ: ఫార్మా రంగ కంపెనీ ఆల్కెమ్ ల్యాబొరేటరీస్‌లో ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్(ఎంఎఫ్) 0.54 శాతం వాటా సొంతం చేసుకుంది. ఒక్కో షేరుకి రూ. 4,680 సగటు ధరలో 6.41 లక్షల షేర్లు కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 300 కోట్లకుపైగా వెచ్చించింది. దీంతో ఆల్కెమ్ ల్యాబ్‌లో ఎస్‌బీఐ ఎంఎఫ్ వాటా 2.16 శాతం నుంచి 2.7 శాతానికి బలపడింది. ఎన్‌ఎస్‌ఈ బ్లాక్ డీల్ వివరాల ప్రకారం ఆల్కెమ్ ప్రమోటర్ల సంబంధిత కుటుంబ ట్రస్ట్ ఈ వాటాను విక్రయించింది.

ఎన్‌ఎస్‌ఈలో ఆల్కెమ్ షేరు 2.5 శాతంపైగా క్షీణించి రూ. 4,600 వద్ద ముగిసింది.

ఐఫోన్ 16ఈ ఫోన్లపై రెడింగ్టన్ ఆఫర్లు



న్యూఢిల్లీ: ఇటీవల ప్రవేశపెట్టిన యాపిల్ ఐఫోన్ 16ఈ స్మార్ట్‌ఫోన్లపై ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు టెక్ దిగ్గజం యాపిల్ తదితర కంపెనీల ఉత్పత్తుల పంపిణీ సంస్థ రెడింగ్టన్ వెల్లడించింది. ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ మొదలైన బ్యాంక్‌ల క్రెడిట్ కార్డులపై రూ. 4,000 వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, అలాగే ఎక్స్చేంజ్ బోనస్ కింద రూ. 6,000 వరకు పొందవచ్చని వివరించింది. ఫిబ్రవరి 21 నుంచి ప్రీ–ఆర్డర్లు ప్రారంభమయ్యాయని, ఫోన్లు 28 నుంచి లభిస్తాయని సంస్థ తెలిపింది.

యాక్సిస్ సెక్యూరిటీస్‌కు జరిమానా

న్యూఢిల్లీ: మార్కెట్ నిబంధనలతో పాటు స్టాక్ బ్రోకర్ల నిబంధనలను ఉల్లంఘించినందుకు యాక్సిస్ సెక్యూరిటీస్‌పై సెబీ రూ.10 లక్షల జరిమానా విధించింది. 45 రోజుల్లోగా జరిమానా చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. క్లయింట్ల నిధుల అక్రమ నిర్వహణ, సమాచారాన్ని దాచిపెట్టడంతో పాటు యాక్సిస్ సెక్యూరిటీస్ పలు చోట్ల నియంత్రణ విధానాలు అనుసరించడంలో విఫలమైనట్లు సెబీ గుర్తించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

23-2-2025

విశాఖ	450–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450–00
విజయవాడ	465–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	430–00
వరంగల్	432–00
రిటైల్ ధర	4.90

ఈవీ చార్జ్!

స్పీడ్ బ్రేకర్లున్నా ఎలక్ట్రిక్ వెహికిల్స్ జోరు



సాధారణ వాహనాలను మించిన వృద్ధి ● 2024లో రోడ్డెక్కిన 19,49,114 ఈవీలు


ఛార్జింగ్‌కు ఎక్కువ సమయం పట్టడం, ఒకసారి చార్జింగ్ చేస్తే ఎంత దూరం ప్రయాణిస్తుందోనన్న ఆందోళన, మౌలిక సదుపాయాలు పరిమితంగా ఉండడం, వినియోగదారులకు భరోసా లేకపోవడం.. ఈ అంశాలే ఇప్పుడు ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) వృద్ధి వేగానికి ప్రధాన అడ్డంకులు. ఇదంతా నాణేనికి ఒకవైపు. మరోవైపు బ్యాటరీల సామర్థ్యం పెంచడానికి, వేగంగా చార్జింగ్ పూర్తి కావడానికి తయారీ సంస్థలు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయి. చార్జింగ్ మౌలిక వసతులు క్రమంగా విస్తరిస్తున్నాయి. దీంతో వినియోగదార్లలో ఈవీల పట్ల ఆమోదం క్రమంగా పెరుగుతోంది. ఇందుకు అమ్ముడవుతున్న ఈవీలే నిదర్శనం. దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో కలిపి 2024లో 2,61,07,679 యూనిట్ల వాహనాలు రోడ్డెక్కితే.. ఇందులో ఈవీలు 7.46 శాతం వాటాతో 19,49,114 యూనిట్లు కైవసం చేసుకున్నాయి. ఆసక్తికర అంశం ఏమంటే మొత్తం వాహన పరిశ్రమ గత ఏడాది 9.11 శాతం వృద్ధి చెందితే.. ఎలక్ట్రిక్ వాహన విభాగం ఏకంగా 27 శాతం దూసుకెళ్లడమే.

- సాక్షి, బిజినెస్ బ్యూరో.

రికార్డుల దిశగా..

భారత్‌లో ఈవీ పరిశ్రమ 2024లో గరిష్ఠ విక్రయాలతో సరికొత్త రికార్డు సృష్టించింది. నిమిషానికి 3.7 యూనిట్లు అమ్ముడయ్యాయి. 2015–2024 కాలంలో 54 లక్షల యూనిట్ల ఈవీలు రోడ్డెక్కాయి. ప్రస్తుత వృద్ధి వేగాన్నిబట్టి ఈవీ రంగంలో 2029–30 నాటికి ప్యాసింజర్ కార్స్ విక్రయాలు 9.60 లక్షల యూనిట్లకు చేరవచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. అలాగే టూవీలర్స్ 1.37 కోట్ల యూనిట్లు, త్రీవీలర్స్ 12.8 లక్షల యూనిట్లను తాకుతాయని ఈవీ రంగం భావిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, నూతన సాంకేతికత, కంపెనీల దూకుడు.. వెరసి చార్జింగ్ స్టేషన్స్ సంఖ్య 13.2 లక్షలకు చేరవచ్చని నివేదికలు చెబుతున్నాయి. దేశంలో 2024 డిసెంబర్ 20 నాటికి 25,202 చార్జింగ్ స్టేషన్స్ వినియోగంలో ఉన్నాయి. మొత్తం త్రిచక్ర వాహన అమ్మకాల్లో ఈ–త్రీవీలర్స్ వాటా ఏకంగా 56 శాతం ఉంది. 210 కంపెనీలు ఈ–టూవీలర్స్ విభాగంలో పోటీపడుతున్నాయి. డిసెంబర్ నెల అమ్మకాల్లో టూవీలర్స్ సెగ్మెంట్‌లో బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ కో టాప్–2లో ఉన్నాయి. త్రీవీలర్స్‌లో మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ, బజాజ్ ఆటో, ప్యాసింజర్ వెహికిల్స్ విభాగంలో టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఐసీఈ విభాగాన్ని ఏలుతున్న దిగ్గజ కంపెనీలే ఈవీల్లోనూ పాగా వేస్తున్నాయి.

వ్యయాలు తగ్గినప్పటికీ..



ఐసీఈ ఇంజన్ కలిగిన వాహనాలతో పోలిస్తే ఈవీకి అయ్యే రోజువారీ వ్యయాలు తక్కువ. అయితే ప్రతిరోజు తక్కువ దూరం ప్రయాణించే వారికి ఈవీ చక్కని ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. అవసరం నిమిత్తం సుదూర ప్రయాణం చేయాల్సి వస్తే మాత్రం మరో మార్గం వెతుక్కోవాల్సిందే. ఐసీఈ వాహనాల మాదిరిగా దారిలో పెట్రోల్, డీజిల్ పోయించుకుని గమ్యం చేరినట్టు ఈవీలకు వీలు కాదు. ఒకవేళ ఈవీతో దూర ప్రయాణం చేయాల్సి వస్తే.. చార్జింగ్ కేంద్రాల వద్ద బ్యాటరీ చార్జింగ్ పూర్తి అయ్యే వరకు నిరీక్షించాల్సిందే. ఈ అంశమే ఈవీల వృద్ధి వేగానికి స్పీడ్ బ్రేకర్‌గా నిలిచింది. చార్జింగ్‌నుబట్టి ప్రయాణాలు ఆధారపడతున్నాయని కస్టమర్లు అంటున్నారు.

ఈ-కామర్స్ కంపెనీలతో..

ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల వృద్ధికి ఈ–కామర్స్ కంపెనీల దూకుడు కూడా తోడవుతోంది. కర్బన ఉద్గారాలను తగ్గించే దిశగా ఈ కంపెనీలు నడుం బిగించడం ఇందుకు కారణం. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ–కామర్స్ సంస్థలు, ఊబర్, ఓలా, రాపిడో వంటి అగ్రిగేటర్లు, స్విగ్గీ, జొమాటో తదితర ఫుడ్ డెలివరీ యాప్స్, బిగ్‌బాస్కెట్, జెప్టో, బ్లింకిట్, డంజో వంటి క్విక్ కామర్స్ సంస్థలు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విషయంలో డెలివరీ పార్ట్‌నర్స్, డ్రైవర్ పార్ట్‌నర్స్‌ను ప్రోత్సహిస్తున్నాయి. సులభ వాయిదాల్లో ఈవీల కొనుగోలు, బ్యాటరీల స్వాపింగ్ సౌకర్యాలు, చార్జింగ్ మౌలిక వసతులను కల్పించేందుకు ముందుకు వస్తున్నాయి.



వెన్నుదన్నుగా ప్రభుత్వం..



ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) నుంచి కొత్తతరం ఈవీ, ఫ్లెక్స్ ఫ్యూయల్ టెక్నాలజీని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాలు, వాహన విడిభాగాల పరిశ్రమకు రూ.25,938 కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను ప్రకటించింది. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ స్టోరేజ్ విభాగానికి రూ.18,100 కోట్లు, పీఎం ఈ–డ్రైవ్ పథకానికి రూ.10,900 కోట్ల విలువైన ఇన్సెంటివ్స్ అందిస్తోంది. ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగంలో విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ఆటోమేటిక్ రూట్లో 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతిస్తోంది. కనీసం 50 కోట్ల డాలర్ల పెట్టుబడితో ప్లాంట్లు స్థాపించే సంస్థలు పూర్తిగా తయారైన ఈవీలను దిగుమతి చేస్తే పన్ను 70–100 శాతం నుంచి కొత్త ఈవీ పాలసీలో 15 శాతానికి తగ్గించారు. లిథియం అయాన్ బ్యాటరీలపై పన్నును 21 నుంచి 13 శాతానికి చేర్చారు. ఈవీ, చార్జింగ్ మౌలిక వసతులు, బ్యాటరీస్ రంగంలో 2030 నాటికి 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెల్లువెత్తుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈవీ మార్కెట్ ఆరేళ్లలో ప్రపంచంలో తొలి స్థానాన్ని కైవసం చేసుకుంటుందని భారత ప్రభుత్వం ధీమాగా ఉంది. కొత్తగా అమ్ముడయ్యే వాహనాల్లో ఈవీల వాటా 2030 నాటికి 30 శాతం ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

ఈవీల అమ్మకాలు, మొత్తం పరిశ్రమలో వాటా, వృద్ధి (శాతాల్లో)

	2023	2024	వృద్ధి
ఈవీల అమ్మకాలు	15,32,386	19,49,114	27
పరిశ్రమలో ఈవీల వాటా	6.3	7.4	17.46

2024లో విభాగాల వారీగా మొత్తం వాహన విక్రయాలు, ఈవీల వాటా, 2023తో పోలిస్తే వృద్ధి (శాతాల్లో)

విభాగం	మొత్తం అమ్మకాలు	వృద్ధి	ఈవీలు	వృద్ధి
ద్విచక్ర వాహనాలు	1,89,12,959	10.78	11,48,575	33
త్రిచక్ర వాహనాలు	12,21,909	10.49	6,91,323	18
ప్యాసింజర్ వాహనాలు	40,73,843	5.18	99,068	20

ఎలక్ట్రిక్ వాహనాల్లో విభాగాల వారీగా అమ్మకాలు, వృద్ధి

ఈవీ విభాగం	2024	2023	వృద్ధి %ల్లో
టూ వీలర్స్	11,48,575	8,60,418	33
త్రీ వీలర్స్	6,91,323	5,83,715	18
ప్యాసింజర్ వెహికిల్స్	89,827	73,290	22
లైట్ ప్యాసింజర్ వెహికిల్స్	9,241	9,271	0
బస్‌లు	3,822	2,397	59
హెవీ గూడ్స్ వెహికిల్స్	220	330	(33)
లైట్ గూడ్స్ వెహికిల్స్	5,996	2,283	162
ఇతర వాహనాలు	110	682	(83)



రీసేల్ వాల్యూ సవాల్..

ఐసీఈ వాహనాల స్థాయిలో సెకండ్ హ్యాండ్ మార్కెట్లో ఈవీలకు డిమాండ్ లేకపోవడం కస్టమర్లను నిరాశకు గురిచేస్తోంది. రీసేల్ వాల్యూ పట్ల ప్రజల్లో ఉన్న ఆందోళన డిమాండ్‌ను పరిమితం చేస్తోందని కియా ఇండియా సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, నేషనల్ హెడ్ హర్‌దీప్ సింగ్ బ్రార్ అన్నారు. జీఎస్టీ, రహదారి పన్ను ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. ఖరీదైన బ్యాటరీ కారణంగా ఐసీఈ వాహనంతో పోలిస్తే ఈవీ ధర ఎక్కువగా ఉంటోంది. ఈ అంశం కూడా ఈవీ స్వీకరణను పరిమితం చేస్తూనే ఉంది. ఈవీలు మరింత చవకగా మారితేనే డిమాండ్ ఊపందుకుంటుందన్నది కస్టమర్ల మాట. ఐసీఈ కార్ల కంటే ఎలక్ట్రిక్ కార్ల ధర 30–50% ఎక్కువ. అలాగే ద్విచక్ర వాహనాల ధర 20–30% అధికంగా ఉంటోంది.



9 సంస్థలలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ పెట్టుబడి

రూ. 446 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం అజీమ్ ప్రేమ్‌జీ పెట్టుబడుల సంస్థ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ తాజాగా 9 కంపెనీలలో వాటాలు కొనుగోలు చేసింది. జాబితాలో భారతీ ఎయిర్‌టెల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ తదితరాలున్నాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఇందుకు రూ. 446 కోట్లకుపైగా వెచ్చించింది. అనుబంధ సంస్థ పీఐ అపార్చునిటీస్ ఏఐఎఫ్ వీ ఎల్ఎల్‌పీ ద్వారా ఎయిర్‌టెల్‌లో 5.44 లక్షల షేర్లు, జిందాల్ స్టీల్‌లో 9.72 లక్షల షేర్లు, రిలయన్స్‌లో 5.7 లక్షల షేర్లు, ఇన్ఫోసిస్‌లో 3.28 లక్షల షేర్లు సొంతం చేసుకుంది. ఈ బాటలో ఐసీఐసీఐ బ్యాంకులో 3.33 లక్షల షేర్లు, హిందాల్కోలో 8.13 లక్షల షేర్లు, అంబుజా సిమెంట్స్‌లో 5.14 లక్షల షేర్లు, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో 1.09 లక్షల షేర్లు, ఎస్‌బీఐ లైఫ్‌లో 84,375 షేర్లు చొప్పున కొనుగోలు చేసింది. ఒక్కో షేరునీ సగటున రూ. 477–1,807 ధరల శ్రేణిలో సొంతం చేసుకుంది. టారిష్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడింగ్ కంపెనీ ఈ వాటాలు విక్రయించింది.

270 గిగావాట్ల గరిష్ట డిమాండ్‌కు సిద్ధం

- 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు
- విద్యుత్ శాఖ సెక్రటరీ పంకజ్ అగర్వాల్



న్యూఢిల్లీ: ప్రస్తుత వేసవిలో రోజువారీ 270 గిగావాట్ల గరిష్ఠ డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర విద్యుత్ శాఖ సెక్రటరీ పంకజ్ అగర్వాల్ తెలిపారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లు (థర్మల్ పవర్), ముఖ్యంగా దిగుమతి చేసుకునే బొగ్గు ఆధారిత ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో తప్పనిసరిగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. 2024 వేసవిలో గరిష్ఠ డిమాండ్ 260 గిగావాట్లు ఉంటుందని అంచనా వేయగా, 2024 మే 30న నమోదైన గరిష్ఠ డిమాండ్ 250 గిగావాట్లు కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో 51 మిలియన్ టన్నుల మేర బొగ్గు నిల్వలు ఉన్నాయని, 21 రోజుల విద్యుదుత్పత్తి అవసరాలకు సరిపోతాయని చెప్పారు. అవసరమైతే డిమాండ్‌ను చేరుకునేందుకు వీలుగా ఎలక్ట్రిసిటీ చట్టంలోని సెక్షన్ 11ను ప్రయోగిస్తామన్నారు. ఈ సెక్షన్ కింద ప్రభుత్వ ఆదేశాల మేరకు పవర్ ప్లాంట్లు కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది.

2035 నాటికి 335 గిగావాట్లు

2035 నాటికి దేశంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 335 గిగావాట్లకు చేరుకుంటుందని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ తెలిపారు. థర్మల్ పవర్ ప్లాంట్లలో బయోమాస్ పెల్లెట్ మిశ్రమం ప్రస్తుతం 5 శాతంగా ఉంటే, వచ్చే ఏప్రిల్ 1 నుంచి 7 శాతానికి పెరగనున్నట్టు చెప్పారు. గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 24 గిగావాట్ల మేర ఉందని, అయితే ఒక్కో యూనిట్ ఖర్చు రూ.14గా ఉన్నట్టు తెలిపారు.

సొంతిల్లు, వ్యాపారం దీర్ఘకాల లక్ష్యాలు

- ఆర్థిక స్వేచ్ఛ కూడా
- మిలీనియల్స్ టాప్–3 ప్రాధాన్యం వీటికే
- ఓ ప్రైవేటు అధ్యయనంలో వెల్లడి



ముంబై: సొంతిల్లు సమకూర్చుకోవడం, వ్యాపారం ప్రారంభించడం, ఆర్థిక స్వేచ్ఛ.. మిలీనియల్స్ (1980–1996 మధ్య జన్మించినవారు) టాప్–3 దీర్ఘకాలిక ప్రాధాన్యతలుగా ఉన్నాయి. 'ఫైబ్–మిలీనియల్ అప్‌గ్రేడ్ ఇండెక్స్' నిర్వహించిన అధ్యయనంలో ఈ ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. మెట్రోలు, నాన్ మెట్రో పట్టణాల్లో 8,000 మంది వ్యక్తుల అభిప్రాయాలను ఈ అధ్యయనంలో భాగంగా తెలుసుకున్నారు.

ముఖ్యమైన అంశాలు..

- 30 ఏళ్లలోపు వయసు వారిలో 41 శాతం మంది సొంతంగా ఇల్లు సమకూర్చుకోవడం తమ తొలి లక్ష్యంగా చెప్పారు.
- ఒంటరి పురుషులతో పోల్చితే, ఒంటరి మహిళల్లో సొంతంగా ఇల్లు కొనుగోలు చేయడం ఎక్కువ ప్రాధాన్య లక్ష్యంగా ఉంది.
- వ్యాపారం ప్రారంభించడం, దాన్ని వృద్ధి చేయడం 21 మంది లక్ష్యంగా ఉంది.
- దీర్ఘకాలంలో ఆర్థిక స్వేచ్ఛ సాధించడమే తమ లక్ష్యమని 19 శాతం మంది చెప్పారు.
- ఇక స్వల్పకాల లక్ష్యాలను గమనించినట్టయితే.. వృత్తిలో ఎదుగుదల, కొత్త గ్యాడ్జెట్, వాహనం కొనుగోలు, ఆరోగ్యం విషయంలో దృఢంగా ఉండాలని (కంటి సర్జరీలు, దంత చికిత్సలు తదితర) మిలీనియల్స్ కోరుకుంటున్నారు.
- పోటీ పెరగడంతో మంచి ఉద్యోగం సంపాదించే విషయంలో మెట్రోల్లోని మిలీనియల్స్ ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. ఇలా భావిస్తున్నవారు 60 శాతంగా ఉన్నారు.
- తాము పొదుపు చేస్తామని, ఆర్థిక అంశాలకు వ్యూహాత్మకంగా ప్రణాళిక వేసుకుంటామని 39 శాతం మంది చెప్పారు.
- 21 శాతం మంది ఇతర ఆదాయ వనరుల కోసం అన్వేషిస్తామని చెబితే, దీర్ఘకాల లక్ష్యాల కోసం రుణ సాయం తీసుకుంటామని 29 శాతం మంది తెలిపారు.
- 15 శాతం మందిలో దీర్ఘకాల ఆర్థిక ప్రణాళిక లేనే లేదు.
- స్వల్పకాల ఆకాంక్షలను తీర్చుకునేందుకు ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ నుంచి రుణాలు తీసుకుంటామని చాలా మంది చెప్పారు.
- ఈ విషయంలో యువతరానికి మార్గదర్శనం అవసరమని ఈసర్వే నివేదిక అభిప్రాయపడింది. బాధ్యతాయుతమైన రుణాల దిశగా వారిని చైతన్యవంతం చేయాలని, తద్వారా తమ రుణ పరపతిని కాపాడుకుంటూనే కలలను సాకారం చేసుకోగలరని పేర్కొంది.

జపాన్ ఎగుమతులకు బూస్ట్

- ద్వైపాక్షిక వాణిజ్య సమతూకానికి ప్రాధాన్యం
- వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ: ఎగుమతులు పెంచుకోవడం ద్వారా ఇండియా జపాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంలో సమతూకాన్ని తీసుకురానున్నట్లు వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇందుకు తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) ఏప్రిల్–జనవరిలో జపాన్‌కు దేశీ ఎగుమతులు 21 శాతం పైగా ఎగసి 5.1 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే సమయంలో దిగుమతుల విలువ 9.1 శాతం పెరిగి 15.92 బిలియన్ డాలర్లను తాకింది. వెరసి 10.82 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు నమోదైంది. గతేడాది(2023–24)లో జపాన్‌కు భారత్ ఎగుమతులు 5.15 బిలియన్ డాలర్లుకాగా.. దిగుమతులు 17.7 బిలియన్ డాలర్లు. వాణిజ్య లోటు 12.55 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దీంతో రెండు దేశాల మధ్య వాణిజ్య సమతూకానికి చర్యలు చేపట్టినట్లు గోయల్ తెలియజేశారు. ఇందుకు అనుగుణంగా ఎగుమతుల పెంపుపై దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. తద్వారా పరస్పర లబ్ధికి వీలుంటుందని ఇండియా–జపాన్ ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడుల(ఎకానమీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్) సదస్సులో గోయల్ తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రీన్ ఎనర్జీ, పునరుత్పాదక ఇంధనం, హైటెక్ సెమీకండక్టర్ల తయారీ, ఎలక్ట్రానిక్స్ గూడ్స్, ఏఐ తదితర విభాగాలలో మరింత సహకారానికి జపనీస్ సంస్థలను ఆహ్వానించారు. సమీకృత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(సీఈపీఏ)పై రెండు దేశాలు 2011లో సంతకాలు చేశాయి. 1,400కుపైగా జపనీస్ కంపెనీలు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. పలు జపనీస్ కంపెనీలతో 8 రాష్ట్రాలలో 11 పారిశ్రామిక టౌన్‌షిప్‌లు విస్తరించాయి. ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ముంబై, అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్‌సహా ఢిల్లీ, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై మెట్రో వ్యవస్థలు దేశీ అభివృద్ధిలో జపనీస్ కంపెనీల భాగస్వామ్యాన్ని ప్రతిఫలిస్తున్నట్లు గోయల్ ప్రస్తావించారు. సమీప భవిష్యత్‌లో ముంబై, అహ్మదాబాద్‌ల మధ్య బుల్లెట్ ట్రయిన్ సర్వీసులు ప్రారంభంకాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



షినెల్ హెన్రీ హిట్టింగ్



షినెల్ హెన్రీ

- సిక్సర్లతో విజృంభించిన విండీస్ ఆల్‌రౌండర్
- 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో 62 పరుగులు
- ఢిల్లీ క్యాపిటల్స్‌పై యూపీ వారియర్స్ విజయం
- 'హ్యాట్రిక్' తీసిన గ్రేస్ హ్యారిస్
- మహిళల ప్రీమియర్ లీగ్

బెంగళూరు: ఆల్‌రౌండర్ షినెల్ హెన్రీ (23 బంతుల్లో 62; 2 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ షాట్లతో వీర విహారం చేయడంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నమెంట్‌లో యూపీ వారియర్స్ జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో యూపీ వారియర్స్ 33 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. గత రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలు చవిచూసిన యూపీ వారియర్స్ ఈ పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హెన్రీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. గత మ్యాచ్‌లోనే తన పవర్ హిట్టింగ్‌ను ప్రపంచానికి చాటిన హెన్రీ... ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్‌ను ఊచకోత కోసింది. కెప్టెన్ దీప్తి శర్మ (13), తహిల మెక్‌గ్రాత్ (24), శ్వేత సెహ్రావత్ (11), కిరణ్ నవగిరె (17) భారీ స్కోర్లు చేయలేకపోయారు. దినేశ్ వృందా (4), గ్రేస్ హ్యారిస్ (2), ఉమ ఛెత్రీ (3) విఫలమయ్యారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో జెస్ జొనాసెన్ 4 వికెట్లు పడగొట్టగా... తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి, మరిజానె కాప్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.3 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (35 బంతుల్లో 56; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (5), మరిజానె కాప్ (9), అనాబెల్ సదర్లాండ్ (5), జెస్ జొనాసెన్ (5), సారా బ్రైస్ (5) విఫలమయ్యారు. యూపీ వారియర్స్ బౌలర్లలో గ్రేస్ హ్యారిస్ 'హ్యాట్రిక్' సహా 4 వికెట్లు పడగొట్టగా... క్రాంతి గౌడ్ 4 వికెట్లు ఖాతాలో వేసుకుంది. షినెల్ హెన్రీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. లీగ్‌లో నేడు విశ్రాంతి రోజు కాగా... సోమవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో యూపీ వారియర్స్ తలపడుతుంది.



హ్యారిస్

హెన్రీ రికార్డు ఫిఫ్టీ

తాజా సీజన్‌లో పాయింట్ల ఖాతా తెరిచేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న యూపీ వారియర్స్ ఎట్టకేలకు శుభారంభం చేసింది. బ్యాటింగ్‌లో హెన్రీ మెరుపులకు బౌలింగ్‌లో గ్రేస్ హ్యారిస్ 'హ్యాట్రిక్', క్రాంతి గౌడ్ మెరుపులు తోడవడంతో వారియర్స్ లీగ్‌లో తొలి విజయం నమోదు చేసుకుంది. టాపార్డర్ పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో యూపీ జట్టు 14 ఓవర్లు ముగిసేసరికి 91/6తో నిలిచింది. వారియర్స్ జట్టు మిగిలిన ఆరు ఓవర్లలో మహా అయితే మరో 30 పరుగులు చేస్తుందేమో అనుకుంటే... హెన్రీ సుడిగాలిలా చెలరేగిపోయింది. శిఖా పాండే వేసిన 17వ ఓవర్‌లో 4,6,6 బాదిన హెన్రీ... 18వ ఓవర్‌లో మరో ఫోర్ కొట్టింది. ఇక అరుంధతి వేసిన 19వ ఓవర్‌లో మూడు సిక్సర్లతో విజృంభించింది. ఈ క్రమంలో హెన్రీ 18 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకుంది. డబ్ల్యూపీఎల్ 2023 సీజన్‌లో సోఫియా డాంక్లీ కూడా 18 బంతుల్లో హాఫ్‌సెంచరీ చేసింది. హెన్రీ దూకుడుతో చివరి నాలుగు ఓవర్లలో యూపీ వారియర్స్ జట్టు 67 పరుగులు పిండుకుంది. డబ్ల్యూపీఎల్‌లో ఇది రెండో అత్యధికం.

హ్యారిస్ హ్యాట్రిక్

ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆకట్టుకోలేకపోయింది. జెమీమా రోడ్రిగ్స్ హాఫ్‌సెంచరీతో ఒంటరి పోరాటం చేయగా... తక్కిన వాళ్లు ప్రభావం చూపలేకపోయారు. యువ మీడియం పేసర్ క్రాంతి గౌడ్ ధాటికి ఢిల్లీ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. షఫాలీ వర్మ (30 బంతుల్లో 24; 4 ఫోర్లు) పర్వాలేదనిపించినా... వేగంగా ఆడలేకపోయింది. బ్యాటింగ్‌లో రాణించిన హెన్రీ బంతితోనూ మెరిసి మరిజానె కాప్‌ను ఔట్ చేసింది. ఇక ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో గ్రేస్ హ్యారిస్ 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. 20వ ఓవర్ తొలి బంతికి నికీ ప్రసాద్ (18) క్యాచ్ ఔట్ కాగా... రెండో బంతికి అరుంధతి (0), మూడో బంతికి మిన్ను మణి (0) గోల్డెన్ డకౌట్‌గా పెవిలియన్ చేరారు.

స్కోరు వివరాలు

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: కిరణ్ నవగిరె (సి) నికీ (బి) అరుంధతి 17; దినేశ్ వృందా (సి) సారా (బి) మరిజానె కాప్ 4;దీప్తి (సి) నికీ (బి) జెస్ జొనాసెన్ 13; తహిల మెక్‌గ్రాత్ (సి) అనాబెల్ (బి) జెస్ జొనాసెన్ 24; శ్వేతా సెహ్రావత్ (బి) అరుంధతి 11; గ్రేస్ హ్యారిస్ (బి) మరిజానె కాప్ 2; ఉమ (సి) సారా(బి) శిఖ 3; షినెల్ హెన్రీ (సి) జెమీమా (బి) జెస్ జొనాసెన్ 62; సోఫియా (సి) మరిజానె కాప్ (బి) జెస్ జొనాసెన్ 12; సైమా ఠాకూర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1–17, 2–38, 3–61, 4–79, 5–84, 6–89, 7–109, 8–166, 9–177, **బౌలింగ్:** మరిజానె కాప్ 4–0–18–2; శిఖ పాండే 4–0–39–1; అనాబెల్ సదర్లాండ్ 4–0–30–0; అరుంధతి రెడ్డి 4–0–52–2; జెస్ జొనాసెన్ 4–0–31–4.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) సైమా(బి) క్రాంతి గౌడ్ 24; మెగ్ లానింగ్ (బి) క్రాంతి గౌడ్5; జెమీమా (సి) దీప్తి (బి) క్రాంతి గౌడ్ 56; మరిజానె కాప్ (సి) సోఫియా (బి) హెన్రీ 9; అనాబెల్ (సి) దీప్తి (బి) గ్రేస్ హ్యారిస్ 5; జెస్ జొనాసెన్ (సి అండ్ బి) క్రాంతి గౌడ్ 5; సారా (స్టంప్) ఉమ (బి) దీప్తి 5; నికీ (సి) హెన్రీ (బి) గ్రేస్ 18, శిఖ (నాటౌట్) 15; అరుంధతి రెడ్డి (సి) శ్వేత (బి) గ్రేస్ 0; మిన్ను మణి (సి అండ్ బి) గ్రేస్ 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం: (19.3 ఓవర్లలో ఆలౌట్) 144. వికెట్ల పతనం:** 1–26, 2–43, 3–76, 4–97, 5–106, 6–111, 7–111, 8–144, 9–144, 10–144, **బౌలింగ్:** షినెల్ హెన్రీ 4–0–42–1; సోఫియా 4–0–28–0; క్రాంతి గౌడ్ 4–0–25–4; గ్రేస్ హ్యారిస్ 223–0–15–4; దీప్తి శర్మ 4–0–25–1; తహిల మెక్‌గ్రాత్ 1–0–9–0.



రాజా రిత్విక్‌కు కాంస్యం

న్యూఢిల్లీ: భారత గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ కాపెల్ ఇంటర్నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిశాడు. ఫ్రాన్స్ వేదికగా జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో 7 పాయింట్లు సాధించిన తెలంగాణ స్టార్ ప్లేయర్ మూడో స్థానంలో నిలిచాడు. ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ బోయెర్ మహెల్ పసిడి పతకం సాధించగా... భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ ఇనియాన్ పన్నీర్‌సెల్వం రజత పతకం దక్కించుకున్నాడు. 26 దేశాలకు చెందిన 533 మంది ప్లేయర్లు పాల్గొన్న ఈ టోర్నీలో రిత్విక్ 9 రౌండ్‌లలో 7 పాయింట్లు సాధించాడు. ఆరో సీడ్‌గా బరిలోకి దిగిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ 6 గేమ్‌లు గెలిచి రెండింటిని 'డ్రా' చేసుకున్నాడు. ఒక గేమ్‌లో ఓటమి పాలయ్యాడు. కాపెల్ అంతర్జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన రాజా రిత్విక్‌ను తెలంగాణ చెస్ సంఘం కార్యదర్శి జయచంద్ర ప్రత్యేకంగా అభినందించారు.

ప్రపంచ అథ్లెటిక్స్‌కు గుల్వీర్ అర్హత

5000 మీటర్ల ఇండోర్ ఆసియా రికార్డు నమోదు



న్యూఢిల్లీ: భారత యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్ 5000 మీటర్ల ఇండోర్ రేసులో ఆసియా రికార్డు నెలకొల్పుతూ... ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు. అమెరికా బోస్టన్‌లో జరిగిన ఇండోర్ ఈవెంట్‌లో గుల్వీర్ 12 నిమిషాల 59.77 సెకన్లలో లక్ష్యాన్ని చేరి నాలుగో స్థానంలో నిలిచాడు. తద్వారా 5000 మీటర్ల ఇండోర్ రేసును 13 నిమిషాల లోపు పూర్తిచేసిన తొలి భారతీయుడిగా రికార్డుల్లోకెక్కాడు. ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన గుల్వీర్... ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అర్హత మార్క్ (13 నిమిషాల 1 సెకన్)ను దాటాడు. 'నా ప్రదర్శనతో ఆనందంగా ఉన్నా . ఓవరాల్‌గా టైమింగ్ మెరుగు పరుచుకోవడంపై దృష్టి పెడుతున్నా. ఈ క్రమంలో ఇండోర్‌లో ఆసియా రికార్డు టైమింగ్ నమోదు చేయడం గర్వంగా ఉంది. నేరుగా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించడంతో సంతృప్తిగా ఉన్నా' అని గుల్వీర్ పేర్కొన్నాడు. 5000 మీటర్ల ఔట్‌డోర్ రేసులోనూ జాతీయ రికార్డు (13 నిమిషాల 11.82 సెకన్లు) గుల్వీర్ సింగ్ పేరిటే ఉంది.

భళా భారత్



- ఎఫ్ఐహెచ్ ప్రొలీగ్‌లో భారత హాకీ జట్లకు విజయాలు
- 4–0తో ఐర్లాండ్‌ను చిత్తు చేసిన పురుషుల జట్టు
- 1–0తో జర్మనీపై మహిళల జట్టు విజయం

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు విజయ పరంపర కొనసాగుతోంది. శనివారం జరిగిన పోరులో టీమిండియా 4–0 గోల్స్ తేడాతో ఐర్లాండ్ జట్టుపై విజయం సాధించింది. శుక్రవారం 3–1 గోల్స్ తేడాతో ఐర్లాండ్‌ను ఓడించిన భారత్... వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆధిపత్యం కనబర్చింది. భారత్ తరఫున నీలమ్ సంజీప్ (14వ నిమిషంలో), మన్‌దీప్ సింగ్ (24వ నిమిషంలో), అభిషేక్ (28వ నిమిషంలో), శంషేర్ సింగ్ (34వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభంలో చక్కటి ఆటతీరు కనబర్చిన ఐర్లాండ్ 9వ నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇక అక్కడి నుంచి భారత్ జోరు ప్రారంభమైంది. వరుస విరామాల్లో గోల్స్ కొట్టిన భారత్ ఆధిక్యం అంతకంతకూ పెంచుకుంటూ పోయింది. నీలమ్ 14వ నిమిషంలో ఫీల్డ్‌గోల్‌తో భారత్ ఖాతా తెరవగా... ఆ తర్వాత మన్‌దీప్, అభిషేక్, శంషేర్ తలా ఒక గోల్ కొట్టారు. మ్యాచ్‌లో భారత్‌కు మరిన్ని పెనాల్టీ కార్నర్ అవకాశాలు లభించినా... రెగ్యులర్ కెప్టెన్, స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ విశ్రాంతి తీసుకోవడంతో మన ఆధిక్యం మరింత పెరగలేదు. చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థి ప్లేయర్లు మన రక్షణ పంక్తిని దాటి ముందుకు సాగలేకపోయారు. తదుపరి మ్యాచ్‌లో సోమవారం ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది.

దీపిక గోల్‌తో భారత్ గెలుపు

మరో వైపు మహిళల విభాగంలో భారత జట్టు శనివారం 1–0 గోల్స్ తేడాతో జర్మనీపై విజయం సాధించింది. శుక్రవారం తొలి పోరులో 0–4 గోల్స్ తేడాతో జర్మనీ చేతిలో ఓడిన భారత్... రెండో మ్యాచ్‌లో దానికి బదులు తీర్చుకుంది.



భారత్ తరఫున స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ దీపిక (12వ నిమిషంలో) ఏకైక గోల్ చేసింది. పెనాల్టీ కార్నర్‌ను సమర్థవంతంగా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపి జట్టుకు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా మరో గోల్ సాధ్య పడలేదు. ఫలితంగా భారత్ విజయం సాధించింది. తదుపరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత అమ్మాయిల జట్టు మ్యాచ్ ఆడుతుంది.



జీవన్–విజయ్ జోడీకి టైటిల్

పుణే: మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ జీవన్ నెడుంజెళియన్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జంట చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో జీవన్–విజయ్ జంట 3–6, 6–3, 10–0తో రెండో సీడ్ బ్లేక్ బేల్‌డన్–మాథ్యూ క్రిస్టోఫర్ (ఆస్ట్రేలియా) ద్వయంపై విజయం సాధించింది. జీవన్–విజయ్ జోడీకి సంయుక్తంగా ఇదే తొలి టైటిల్ కాగా... విజయ్ సుందర్ పుణేలో మూడో సారి విజేతగా నిలిచాడు. తొలి సెట్‌లో పరాజయం పాలైన భారత జంట ఆ తర్వాత ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విజృంభించింది. 2 ఏస్‌లు సంధించిన జీవన్–విజయ్ జోడీ... 3 డబుల్ ఫాల్ట్స్ చేసింది. ఈ విజయంతో రూ. 7 లక్షల నగదు బహుమతితో పాటు 100 ర్యాంకింగ్స్ పాయింట్లు భారత ప్లేయర్ల ఖాతాలో చేరాయి. దీంతో ఏటీపీ ర్యాంకింగ్స్‌లో జీవన్ 94వ స్థానానికి, విజయ్ 104వ ర్యాంక్‌కు చేరనున్నారు.

లంకపై భారత్ మాస్టర్స్ గెలుపు

- రాణించిన బిన్నీ, యూసుఫ్, ఇర్ఫాన్
- ఐఎంఎల్ టి20 టోర్నీ

నవీముంబై: అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్)లో ఉత్కంఠ రేపిన పోరులో భారత్ మాస్టర్స్ జట్టు 4 పరుగుల తేడాతో శ్రీలంక మాస్టర్స్‌పై గెలుపొందింది. 223 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన శ్రీలంక గెలిచేందుకు ఆఖరి బంతి దాకా పెద్ద పోరాటమే చేసింది. చివరి 6 బంతులకు 9 పరుగులు చేయాల్సి ఉండగా అభిమన్యు మిథున్ చక్కని బౌలింగ్‌తో లంక బ్యాటర్లను కట్టడి చేశాడు. ఆఖరి ఓవర్లో కేవలం 4 పరుగులే ఇచ్చాడు. దీంతో ఈ లీగ్‌లో సచిన్ టెండూల్కర్ సారథ్యంలో భారత్ తొలి విజయాన్ని నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ మాస్టర్స్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్లు సచిన్ (10), అంబటి రాయుడు (5) ఇద్దరు నిరాశపరచగా, స్టువర్ట్ బిన్నీ (68), యూసుఫ్ పఠాన్ (56 నాటౌట్), గుర్‌కీరత్ సింగ్ (44), యువరాజ్ (31 నాటౌట్) లంక బౌలర్లపై దంచేయడంతో 200 పైచిలుకు స్కోరు సాధించింది. లంక బౌలర్లలో సురంగ లక్మాల్ 2 వికెట్లు తీశాడు. అనంతరం శ్రీలంక మాస్టర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 218 పరుగులకు పరిమితమైంది. కుమార సంగక్కర (51), జీవన్ మెండిస్ (42) రాణించారు. భారత బౌలర్లలో ఇర్ఫాన్ పఠాన్ 3 వికెట్లు పడగొట్టగా, ధవళ్ కులకర్ణి 2 వికెట్లు తీశాడు.



గోవా ఘన విజయం

2–0 గోల్స్ తేడాతో కేరళ బ్లాస్టర్స్ చిత్తు ● ఇండియన్ సూపర్ లీగ్



న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) 12వ విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో గోవా జట్టు 2–0 గోల్స్ తేడాతో కేరళ బ్లాస్టర్స్‌పై విజయం సాధించింది. గోవా జట్టు తరఫున ఇకెర్ గుర్రొటెనె (46వ నిమిషంలో), మొహమ్మద్ యాసిర్ (73వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. మ్యాచ్‌లో గోవా జట్టు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై 6 షాట్లు ఆడగా... కేరళ బ్లాస్టర్స్ ఒక్కటేసారి గోల్ పోస్ట్‌పైకి గురిచూసినా అది లక్ష్యాన్ని చేరలేదు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 21 మ్యాచ్‌లు ఆడిన గోవా జట్టు 12 విజయాలు, 3 పరాజయాలు, 6 'డ్రా'లతో 42 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో రెండో స్థానానికి చేరింది. మరోవైపు కేరళ బ్లాస్టర్స్ 21 మ్యాచ్‌ల్లో 7 విజయాలు, 11 పరాజయాలు, 3 'డ్రా'లతో 24 పాయింట్లు సాధించి 10వ స్థానంలో ఉంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టు 3–1 గోల్స్ తేడాతో పంజాబ్ ఫుట్‌బాల్ క్లబ్‌పై గెలుపొందింది. ఈస్ట్ బెంగాల్ తరఫున దిమిత్రోస్ (15వ నిమిషంలో), మహేశ్ సింగ్ (47వ నిమిషంలో), లాల్‌చుంగుంగా (54వ నిమిషంలో) తలా ఒక గోల్ కొట్టారు. పంజాబ్ తరఫున ఇజెక్విల్ విడాల్ (62వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. ప్రస్తుతం ఈస్ట్ బెంగాల్ జట్టు 24 పాయింట్లతో పట్టిక తొమ్మిదో స్థానంలో ఉండగా... పంజాబ్ అన్నే పాయింట్లతో 11వ స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో మోహన్ బగాన్‌తో ఒడిషా ఫుట్‌బాల్ క్లబ్ తలపడుతుంది.

ఆరుగురు బందీలకు విముక్తి

ఒప్పందం ప్రకారమే విడిచిపెట్టిన హమాస్



విడుదల చేసినందుకు కృతజ్ఞతగా హమాస్ సాయుధుడికి ముద్దుపెడుతున్న ఒమెర్ షెమ్ టోవ్

నుసెయిరత్: కాల్పుల విరమణ ఒప్పందంపై నీలి నీడలు కమ్ముకుంటున్న వేళ ముందుగా ప్రకటించిన విధంగానే హమాస్ తన చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీల్లో ఆరుగురిని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం రెడ్ క్రాస్‌కు అప్పగించింది. గాజాలోని నుసెయిరత్‌లో శనివారం ఉదయం ముందుగా ఏర్పాటు చేసిన వేదికపైకి మాస్క్ ధరించిన హమాస్ సాయుధులు ముగ్గురు బందీలను తీసుకువచ్చారు. వీరు ఒమెర్ వెన్‌కెర్ట్(23), ఒమెర్ షెమ్ టోవ్(22), ఎలియా కోహెన్(27). ముగ్గురూ ఆరోగ్యంగానే కనిపించారు. ఎంతో సంతోషంతో ఉన్న ఒమెర్ షెమ్ టోవ్ పక్కనున్న హమాస్ మిలిటెంట్ నుదుటిపై ముద్దిచ్చాడు. వీరి విడుదలను గమనిస్తున్న కుటుంబసభ్యులు ఆనంద బాష్పాలతో సంతోషం పట్టలేక కేకలు వేశారు. అనంతరం వీరిని రెడ్ క్రాస్ వాహనాల్లో ఇజ్రాయెల్ సరిహద్దుల్లోకి తీసుకెళ్లారు. అక్కడ వీరికి అధికారులు స్వాగతం పలికారు. అంతకుముందు, గాజాలోని రఫాలో జరిగిన కార్యక్రమంలో టల్ షోహమ్(40), అవెరా మెంగిస్టు(38) అనే బందీలను హమాస్ సాయుధులు రెడ్ క్రాస్ సిబ్బందికి అప్పగించారు. ఇక, ఆరో బందీ 36 ఏళ్ల బెడోయిన్ సంచార తెగకు చెందిన హిషామ్ అల్- సయేద్‌ను కూడా విడిచిపెట్టింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఇతడు 2015లో గాజాలోకి ప్రవేశించి, హమాస్ బందీగా మారాడు.

2014 నుంచి బందీగా ఉండి..

శనివారం విడుదలైన వారిలో కోహెన్, షెమ్ టోవ్, వెన్‌కెర్ట్‌లు 2023 అక్టోబర్ 7న కిబ్బుట్జ్‌లో నోవా మ్యూజిక్ ఫెస్టివల్‌పై హమాస్ శ్రేణులు జరిపిన మెరుపు దాడిలో చిక్కారు. కిడ్నాపైన సమయంలో సాధారణ దుస్తుల్లో ఉన్న వీరు శనివారం విడుదలైనప్పుడు మాత్రం నకిలీ ఆర్మీ యూనిఫాంతో కనిపించారు. టల్ షోహమ్‌కు ఆస్ట్రేలియా పౌరసత్వం కూడా ఉంది. మ్యూజిక్ ఫెస్టివల్‌కు వచ్చిన ఇతడిని కుటుంబం సహా హమాస్ బందీలుగా పట్టుకుపోయింది. షోహమ్ భార్య, ఇద్దరు పిల్లలు, మరో ముగ్గురు బందీలను 2023 నవంబర్‌లో బందీల మార్పిడి సమయంలో విడుదల చేశారు. ఇంకా, ఇథియోపియా మూలాలున్న ఇజ్రాయెల్ పౌరుడు మెగిస్టు 2014లో అనుకోకుండా గాజాలోకి ప్రవేశించి హమాస్‌కు పట్టుబడ్డాడు. దశాబ్దానికి పైగా హమాస్ చెరలోనే గడిపిన ఇతడు సజీవంగా రావడంతో కుటుంబసభ్యుల ఆనందానికి అంతే లేకుండా పోయింది.


షిరి బిబాస్ మృతదేహం అప్పగింత

గురువారం హమాస్ అప్పగించిన బందీల మృత దేహాల్లో ఒకటి షిరి బిబాస్‌ది కాదని, అది గుర్తు తెలియని మరో పాలస్తీనా మహిళదంటూ ఇజ్రాయెల్ ప్రకటించడం తెలిసిందే. ఇది పొరపాటేనంటూ హమాస్ సైతం అంగీకరించింది. ఈ మేరకు పాలస్తీనియన్ ముజాహిదీన్ బ్రిగేడ్స్ అనే సాయుధ గ్రూపు మరో మృతదేహాన్ని శుక్రవారం రాత్రి రెడ్ క్రాస్‌కు అప్పగించింది. పరిశీలించిన కుటుంబ సభ్యులు, పరీక్షలు జరిపిన ఇజ్రాయెల్ ఫోరెన్సిక్ అధికారులు అది షిరి బిబాస్ మృతదేహమేనని ధ్రువీకరించడంతో కథ సుఖాంతమైంది. మొదటి దశలో సజీవంగా ఉన్న బందీల విడుదల శనివారంతో ముగియగా వచ్చే వారంలో చనిపోయిన నలుగురు బందీల మృతదేహాలను అప్పగించనున్నట్లు హమాస్ ప్రకటించింది. కాగా, హమాస్ చెరలో ఇంకా 60 మంది వరకు బందీలుగా ఉన్నట్లు చెబుతున్న ఇజ్రాయెల్ వీరిలో సగం మందివరకు చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తోంది.


యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళాకు తరలివచ్చిన భక్తుల వాహనాలివీ. డ్రోన్ కెమెరా శనివారం ఇలా క్లిక్ మనిపించింది.

మహా కుంభ్‌కు 60 కోట్ల మంది..!

సాక్షి, న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు జన జాతర కొనసాగుతోంది. జనవరి 13వ తేదీన మేళా అధికారికంగా ప్రారంభం కాక ముందు నుంచే మొదలైన భక్తుల రాకడ రోజురోజుకూ పెరుగుతోంది. మొత్తం 45 కోట్ల మంది వరకు రావచ్చన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అంచనా తలకిందులైంది. ఇప్పటికే 60 కోట్ల మార్కును దాటినట్లు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ శనివారం ప్రకటించారు. 26వ తేదీన కుంభ మేళా ముగిసేసరికి ఇది 75 కోట్లకు చేరుకునే అవకాశముందని అధికార యంత్రాంగం చెబుతోంది. చివరి రోజైన 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినం, ఆఖరి షాహీ స్నాన్ ఉండటంతో త్రివేణీ సంగమంలో స్నానమాచరించేందుకు ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలివస్తారని యంత్రాంగం అందుకు తగినట్లుగా భారీ ఏర్పాట్లలో తలమునకలై ఉంది. ఇలా ఉండగా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కుటుంబసభ్యులతో పాటు శనివారం త్రివేణీ సంగమంలో పుణ్యస్నానమాచరించారు. ఆయనతోపాటు యూపీ సీఎం ఆదిత్యనాథ్ ఆయన మంత్రివర్గ సహచరులు కూడా స్నానాలు చేశారు.


ఢిల్లీ సీఎం రేఖా గుప్తాతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ప్రధాని మోదీతో ఢిల్లీ సీఎం భేటీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా శనివారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలుసుకున్నారు. సీఎంగా గురువారం బాధ్యతలు చేపట్టాక ప్రధానితో రేఖా గుప్తా మొట్టమొదటి అధికారిక సమావేశమిదే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాద పూర్వకంగా కలుసుకున్నట్లు అనంతరం ఆమె 'ఎక్స్'లో తెలిపారు. ఇలా ఉండగా, సోమవారం నుంచి ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు మొదలు కానున్నాయి. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ భేటీలో కొత్త ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తారని శాసనసభ సెక్రటేరియట్ తెలిపింది. మూడు రోజులపాటు సాగే ఈ సెషన్‌లో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపికతో పాటు గత ఆప్ ప్రభుత్వం పనితీరుపై పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను సభలో ప్రవేశపెట్టనున్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు సీనియర్ ఎమ్మెల్యేలు విజేందర్ గుప్తా, మోహన్ సింగ్ బిష్త్‌లను పార్టీ నామినేట్ చేసిందని బీజేపీ నేతలు శనివారం తెలిపారు. రెండో రోజైన 25న లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సభ నుద్దేశించి ప్రసంగించనున్నారు.

రేపు పీఎం కిసాన్ నిధుల విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి కిసాన్ పథకం 19వ విడత నిధులను కేంద్రం సోమవారం విడుదల చేయనుంది. బిహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 9.8 కోట్ల రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.22 వేల కోట్లను జమ చేయనున్నారు. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదిలో మూడు విడతల్లో రూ.6 వేలు అందిస్తున్న విషయం తెలిసిందే. 19వ విడతతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు అందజేసిన మొత్తం రూ. 3.68 లక్షల కోట్లు కాగా, 10 కోట్ల మంది రైతులు లబ్ధి పొందారని కేంద్రం శనివారం తెలిపింది.

రేకుల షెడ్డుపై ఇసుకను కుమ్మరించడంతో ఐదుగురు కార్మికులు మృతి

జాల్నా: రేకుల షెడ్డు కింద జనం నిద్రిస్తున్న విషయం తెలీక ఓ డ్రైవర్ టిప్పర్‌తో తెచ్చిన ఇసుకను దానిపై కుమ్మరించాడు. దీంతో, ఆరుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని జఫ్రాబాద్ తహశీల్ పరిధిలోని పసోడి–చందోల్ వంతెన వద్ద శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రాజెక్టు కోసం తెచ్చిన ఇసుకను డ్రైవర్ తాత్కాలిక షెడ్డుపై అన్‌లోడ్ చేశాడని పోలీసులు తెలిపారు. ఇసుక కింద చిక్కుకుపోయిన ఒక బాలికను, మహిళను రక్షించామన్నారు. పరారీలో ఉన్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

ఒక్క రోజులోనే 20 లక్షల పీఎంఏవై ఇళ్లు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

పుణె: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద ఒక్క రోజులోనే 20 లక్షల మంది లబ్ధిదారులు ఇళ్ల మంజూరు పత్రాలను అందుకున్నట్లు హోం మంత్రి అమిత్ షా తెలిపారు. సొంతిల్లు ఉండాలన్న ఈ కుటుంబాల చిరకాల కోరికను తాము సాకారం చేశామన్నారు. ఒకే సమయంలో 20 లక్షల మందికి ఇటువంటి ఆనందం కలగడం అరుదైన సందర్భమని చెప్పారు. శనివారం పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పీఎంఏవై పథకం కింద 10 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో మొదటి విడత డబ్బును కూడా ఆయన జమ చేశారు. మోదీ ప్రభుత్వం మూడో విడత అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొట్టమొదటి కేబినెట్ భేటీలోనే పీఎంఏవై రెండో దశకు అనుమతులను మంజూరు చేసిందని అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే పథకాలను విమర్శిస్తున్న రాహుల్ బాబా 'మోదీ మ్యాజిక్'ను గమనించాలన్నారు. గతంలో జన్‌ధన్ ఖాతాలను ప్రభుత్వం ప్రారంభించినప్పుడు కూడా ఇవే విమర్శలు చేశారని, అయితే, పీఎంఏవై పథకం మొదటి విడత డబ్బును ఈ ఖాతాల్లోనే జమ చేసిన విషయం గమనించాలని కాంగ్రెస్ అగ్రనేతను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు.

అశ్లీల కంటెంట్ నియంత్రణకు కఠిన చట్టం!

ప్రస్తుతమున్న చట్టాలు, నిబంధనలను పరిశీలిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ: సోషల్ మీడియా, డిజిటల్ వేదికలపై ఇటీవలి కాలంలో కనిపిస్తున్న కంటెంట్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. యూట్యూబ్ కార్యక్రమంలో రణవీర్ అల్లాబాదియా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణకు కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకురావడం అవసరమని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, నియమ నిబంధనలను క్షుణ్నంగా పరిశీలిస్తోంది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఇటీవల ఓటీటీలు, సోషల్ మీడియా వేదికలకు కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఐటీ రూల్స్–2021లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టంచేసింది. వయస్సు ఆధారిత కంటెంట్ వీక్షకులకు అందుబాటులో ఉండాలని పేర్కొంది. ఓటీటీలు స్వీయ నియంత్రణ పాటించాలని, నైతిక విలువలు కలిగి ఉండాలని తేల్చిచెప్పింది.

కోట్లు పంచుకుందాం.. టికెట్ ఇవ్వండి

- దొంగలతో డీల్‌కు సిద్ధమైన క్రెడిట్‌కార్డ్ పోగొట్టుకున్న వ్యక్తి
- ఫ్రాన్స్‌లో వింత ఘటన

పారిస్: రూపాయి రూపాయి నువ్వేం చేయగలవంటే?. బంధాలు, బంధుత్వాలను తుంచేస్తా అని చెప్పిందట. డబ్బు ఉందన్న అహంతో కొందరు తమ ఆత్మీయులను ఆమడ దూరం పెట్టేసిన వైనాలు మనందరం చూశాం. అయితే అదే డబ్బు శత్రువులను కూడా మిత్రులుగా మారుస్తుందని ఫ్రాన్స్‌లోని ఓ ఘటన నిరూపించింది. సాధారణంగా మన పర్సు, క్రెడిట్ కార్డులను కొట్టేసిన వాళ్లు మనకు కనబడితే చితకబాదుతాం. కానీ ఫ్రాన్స్‌లో 40 ఏళ్ల ఓ వ్యక్తి మాత్రం తన క్రెడిట్ కార్డును కొట్టేసిన వ్యక్తులను అక్కున చేర్చుకునేందుకు తహతహలాడుతున్నాడు. ఇందులో ఒక ఆర్థిక కోణం, నగదు ప్రేమ దాగి ఉంది. ఈయన దగ్గర కొట్టేసిన క్రెడిట్ కార్డుతో కొనుగోలు చేసిన ఒక లాటరీ టికెట్‌కు జాక్‌పాట్ తగిలింది. ఏ లక్షో రెండు లక్షలో కాకుండా ఏకంగా రూ.4,53,00,000ల జాక్‌పాట్ తగిలింది.

టికెట్ ఎలా చేజిక్కించుకోవాలి?

జాక్‌పాట్ తగిలిన టికెట్‌ను కౌంటర్‌లో ఇచ్చేసి నగదుగా మార్చుకునే అవకాశం ఆ దొంగలకు లేదు. ఎందుకంటే సంబంధిత టికెట్ కొనుగోలు పత్రాలు వాళ్ల వద్ద లేవు. ఆ టికెట్ కొనేందుకు ఉపయోగించిన క్రెడిట్ కార్డ్ వాళ్లది కాదు. దొంగతనం చేశారు కాబట్టి ఒకవేళ టికెట్ పట్టుకుని కౌంటర్ వద్దకు వస్తే పోలీసులు పట్టుకెళ్తారు. దీంతో దొంగలు ఆ రూ. 4.53 కోట్ల విలువైన లాటరీటికెట్‌ను నగదుగా మార్చుకునే అవకాశం కోల్పోయారు. కానీ ఆ అవకాశం క్రెడిట్ కార్డ్ యజమాని అయిన జీన్ డేవిడ్.ఈ అనే వ్యక్తికి ఉంది. కానీ అతని వద్ద టికెట్ లేదు. ఇందుకు ఆయనో పథకం వేశారు. క్రెడిట్ కార్డ్ కొట్టేసిన దొంగలపై ఎక్కడాలేని ప్రేమ ఒలకబోస్తున్నారు. ''నా క్రెడిట్ కార్డులు దొంగలించిన మీపై నాకు ఇప్పుడు కోపం లేదు. గతంలో మీపై పోలీస్ కేసు పెట్టాను. కావాలంటే ఆ కేసును ఇప్పుడు ఉపసంహరించుకుంటా. అయితే మీరు ఆ లాటరీ టికెట్‌ను నాకు ఇచ్చేయండి. కావాలంటే అందులో సగం మొత్తాన్ని మీకు వాటాగా ఇచ్చేస్తా''అని ఒక చక్కటి ఆఫర్ ఇచ్చారు. అయితే ఇంకా తమ కౌంటర్ వద్దకు ఎవరూ రాలేదని లాటరీ నిర్వహణ సంస్థ లా ఫ్రాంకైస్ డీస్ జీయక్స్(ఎఫ్‌డీజే) శనివారం ప్రకటించింది.

సిటీలో కొట్టేసి..

టౌలూస్ నగరానికి చెందిన జీన్ డేవిడ్ ఫిబ్రవరి మూడో తేదీన కారులో తన బ్యాక్‌ప్యాక్‌ను ఉంచేసి వెళ్లాడు. కారు తెరచి దొంగలు ఆ బ్యాక్‌ప్యాక్‌ను, అందులోని పర్సు, క్రెడిట్ కార్డులను కొట్టేశారు. ఆ కార్డుతో ఒక చిల్లర దుకాణంలో లాటరీ టికెట్ కొన్నారు. ''ఇల్లూ, చెప్పుకోవడానికి అడ్రస్ కూడా లేని ఇద్దరు వ్యక్తులు మా దుకాణానికి వచ్చి కాంటాక్ట్‌లెస్ విధానంలో 52.50 యూరోలతో ఒక లాటరీ టికెట్, మరికొన్ని సిగరెట్లు కొన్నారు. టికెట్ కొన్న ఆనందంలో వాళ్లు సిగరెట్లు కూడా మర్చిపోయి వెళ్లారు''అని టబాక్ డిస్ థెర్మ్స్ దుకాణ యజమాని చెప్పారు.

ఆలసించిన ఆశాభంగం

క్రెడిట్ కార్డ్ యజమాని జీన్ డేవిడ్ తన లాయర్ ద్వారా మరోసారి ఒక సవివరమైన ప్రకటన ఇప్పించారు. ''ఆ ఇద్దరు దొంగలు లేకుండా ఈ లాటరీ విజయం సాధ్యమయ్యేదే కాదు. వాళ్లు టికెట్ కొన్నారు కాబట్టే ఇవాళ ఇంత సొమ్ము మన పరం అయ్యే సదవకాశం దక్కింది. అందుకే దొంగల్లారా.. దయచేసి ఆ లాటరీ టికెట్ మాకు ఇచ్చేయండి. మీ వద్ద ఉన్నా అది మీకు ఉపయోగపడదు. మాకు ఇచ్చేస్తే మీకూ అందులో వాటా తప్పకుండా ఇస్తాం. డీల్ కుదుర్చుకుందాం. మా ఆఫీస్‌కు వచ్చేయండి. మీరు ఆలస్యం చేస్తే ఆ టికెట్‌ను నగదుగా మార్చుకునే క్లెయిమ్ గడువు తీరిపోతుంది. అప్పుడు మనందరికీ దక్కేది సున్నా. కాలం మించిపోతోంది. సమయం లేదు మిత్రమా. త్వరగా వచ్చి ఒడంబడిక చేసుకుని డబ్బు తీసుకెళ్లండి. ఆ డబ్బుతో మేం సెటిల్ అవుతాం. మీరూ సెటిల్ అవ్వండి''అని లాయర్ పియరీ డెబూసన్ చెప్పారు. ఈ వింత ప్రకటన చూసి ఫ్రాన్స్ ప్రజలు సామాజిక మాధ్యమాల్లో తమకు నచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు.

అందుకు తగ్గట్లే త్వరలో ట్యాక్స్

భారత్, చైనాలపై పన్నులు పెంచడంపై ట్రంప్ పునరుద్ఘాటన

న్యూయార్క్: అమెరికాకు చెందిన ఉత్పత్తులపై భారత్, చైనా దేశాలు ఏ స్థాయిలో అయితే దిగుమతి సుంకాలు వేస్తున్నాయో అంతే శాతం దిగుమతి సుంకాలు తామూ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. శుక్రవారం వాషింగ్టన్‌లో వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ట్రంప్ పాల్గొని ప్రసంగించారు. ''అమెరికాపై ఏదైనా కంపెనీ లేదంటే ఒక దేశం ఎంత పన్నులు విధిస్తే మనమూ ఇకపై అంతే సుంకాలు వసూలుచేద్దాం. సింపుల్‌గా చెప్పాలంటే భారత్ లేదా చైనాలు మనపై ఎంత పన్నుల భారం మోపుతాయో అమెరికా సైతం అంతే పన్నుల భారాన్ని వాటిపై వేయనుంది. త్వరలోనే ఈ కొత్త పన్నులను తీసుకొస్తాం. ఇదొక అనులోమానుపాత సిద్ధాంతం అనుకోండి. అటు ఎంత పెరిగితే ఇటు అంతే పెరుగుతుంది. అటు ఎంత తగ్గితే ఇటూ అంతే తగ్గుతుంది. వాళ్లు మనకు ఛార్జీ వేస్తున్నారు. మనమూ వాళ్లకు ఛార్జీ వేద్దాం''అని అక్కడి అమెరికన్లనుద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు. ''మనం గతంలో ఇలా ఎప్పుడూ ప్రతిస్పందించలేదు. కానీ ఈసారి మాత్రం మనం అవతలి దేశాలకు తగ్గట్లుగా చర్యలు తీసుకోబోతున్నాం''అని అన్నారు. గత మంగళవారం సైతం ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా తనను కలిసిన భారత ప్రధాని నరేంద్ర మోదీతోనూ ఇదే విషయం స్పష్టంచేశానని ట్రంప్ చెప్పారు. ''మంత్రి హోవార్డ్ సారథ్యంలోనే అమెరికా విదేశాలపై కొత్త పన్నుల విధానాన్ని అమలుచేయబోతోంది. నూతన వాణిజ్య మంత్రి హోవార్డ్‌కు వాణిజ్య సంబంధాలపై మంచి పట్టు ఉంది''అని పొగిడారు.

నా నాలుగో ఫేవరెట్ పదం

కొద్దిసేపు ట్రంప్ సరదాగా మాట్లాడారు.''నా కిష్టమైన పదాలను చెప్పాలంటే దేవుడికి అగ్రస్థానం ఇస్తా. ఇందులో మరో మాటే లేదు. ప్రచారంవేళ కాల్పుల ఘటనల నుంచి తప్పించుకున్నా. దేవుడు రక్షించాడు. నా మొదటి ఫేవరెట్ పదం దేవుడు. తర్వాత కుటుంబం, ఆ తర్వాత రిలేషన్‌షిప్''అని అన్నారు. పదే పదే టారిఫ్ అని వల్లెవేస్తున్నారుగా అని అక్కడి మీడియా ప్రశ్నించగా ''అవును. టారిఫ్ ఇప్పుడు నా ఫేవరెట్ నాలుగో పదం. దీన్నే ఖాయం చేసుకోండి''అని ట్రంప్ అన్నారు.

డీఎన్‌ఏ సాక్ష్యం నిర్దోషిగా తేల్చింది

హత్య కేసులో 30 ఏళ్లకు జైలు నుంచి విడుదల

హొనొలులు: నిర్దోషినని మొత్తుకున్నా వినకుండా ఓ వ్యక్తిని తప్పుడు సాక్ష్యాల ఆధారంగా అధికారులు జైలులో వేశారు. కొత్తగా దొరికిన డీఎన్‌ఏ సాక్ష్యంతో అతడు చివరికి 30 ఏళ్ల తర్వాత జైలు నుంచి విడుదలయ్యాడు. అమెరికాలోని హవాయికి చెందిన గొర్డన్ కొర్డిరో అనే వ్యక్తి ఇందులో బాధితుడు. మౌయి దీవికి చెందిన తిమోతీ బ్లయిస్‌డెల్ 1994లో హత్యకు గురయ్యాడు. డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు వెళ్లిన అతడు సమీపంలోని స్కిడ్‌రో ప్రాంతంలోని లోయలో శవమై తేలాడు. ఈ కేసులో 22 ఏళ్ల గొర్డన్ కొర్డిరోను పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టు విచారణలో ఒక జడ్జి మాత్రమే దోషిగా పేర్కొనగా తీర్పు హంగ్‌గా తేలింది. మరోసారి చేపట్టిన విచారణలో దోషిగా తేలడంతో హత్య, దోపిడీ నేరాల కింద పెరోల్‌కు కూడా వీల్లేని జీవిత కారాగార శిక్ష పడింది. వాస్తవానికి హత్య జరిగినట్లుగా చెబుతున్న రోజున తన ఇంట్లో తోబుట్టువుల మధ్య గడిపాడు. తన సోదరి కారులో స్టీరింగ్ బిగించాడు. కారు గ్యారేజీకి మరమ్మతులు చేశారు. అయితే, అధికారులు జైలులో ఉన్న నలుగురు ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారాన్ని కొర్డిరోకు వ్యతిరేకంగా సాక్ష్యాలుగా పరిగణనలోకి తీసుకుని, జీవిత ఖైదు విధించారు. అప్పటి నుంచి మౌయి కమ్యూనిటీ కరెక్షనల్ సెంటర్‌లో నిర్బంధంలోనే ఉన్నాడు. కొర్డిరో కేసు వివరాలను తెలుసుకున్న 'హవాయి ఇన్నోసెన్స్ ప్రాజెక్ట్'బృందం ఇటీవల ఈ కేసులో మరికొన్ని ఆధారాలను సేకరించింది. మృతుడు తిమోతీ దుస్తుల నుంచి సేకరించిన డీఎన్‌ఏను పరీక్షలకు పంపింది. అందులోని డీఎన్‌ఏ కొర్డిరోది కాదు, వేరెవరిదోనని విశ్లేషణలో తేలింది. ఈ మేరకు ఆ బృందం కోర్టులో మళ్లీ కేసు వేసింది. డీఎన్‌ఏ ఫలితాలను బట్టి, కొర్డిరో దోషి కాదని వాదించింది. గతంలో ఈ కేసు వాదించిన లాయర్లు, పోలీసు అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే అమాయకుడైన కొర్డిరో దశాబ్దాలపాటు జైలులో మగ్గాల్సి వచ్చిందని పేర్కొంది. వాదనలు విన్న జడ్జి క్రిస్టిన్ హమ్మన్..కొర్డిరోను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తీర్పుపై గొర్డన్ కొర్డిరో ఆనందం వ్యక్తం చేశారు. తనకిది 'ఫ్రీడం ఫ్రైడే'అంటూ పేర్కొన్నారు. వెంటనే తన తల్లి వద్దకు వెళ్లాలని ఉందన్నారు.



ఈవిడ... పాస్‌పోర్ట్‌లో 'అతను'

వాషింగ్టన్: జన్మతః అబ్బాయిగా పుట్టి అమ్మాయిగా మారిన ప్రముఖ హెచ్‌బీవో 'యుఫోరియా'సిరీస్ నటి హంటర్ షాఫెర్ అమెరికా నూతన ప్రభుత్వం నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్త పాస్‌పోర్ట్‌లో తన పేరుకు ముందు అబ్బాయి అని పేర్కొనడాన్ని నటి తీవ్రంగా తప్పుబట్టారు. 1998లో జన్మించిన హంటర్ 2019 ఏడాదిలో శస్త్రచికిత్స తర్వాత అమ్మాయిగా మారారు. ఆనాటి పాస్‌పోర్ట్‌లో అమ్మాయి అనే ఉంది. డ్రైవింగ్ లైసెన్స్‌లోనూ అలాగే ఉంది. కానీ తాజాగా డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడయ్యాక లెస్బియన్, గే తదితర ఎల్‌జీబీటీక్యూ+ లింగమార్పిడి వర్గాల కోసం ప్రత్యేకంగా 'ఎక్స్'వంటి పదాలను ఉపయోగించబోమని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఎల్‌జీబీటీక్యూ+ వర్గాల వ్యక్తులను అమ్మాయి లేదా అబ్బాయిగా మాత్రమే ప్రభుత్వం పరిగణిస్తుంది. పుట్టినప్పటికి స్థితిని మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. దీంతో హంటర్ కొత్త పాస్‌పోర్ట్‌లో అబ్బాయి అని వచ్చింది. దీనిపై హంటర్ ఆవేదన వ్యక్తంచేశారు. ''విదేశాల్లో సినిమా షూటింగ్ వేళ పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నా. దాంతో కొత్తగా దరఖాస్తు చేస్తే అబ్బాయి అని పేర్కొంటూ కొత్త పాస్‌పోర్ట్ ఇచ్చారు. మారిన వ్యక్తుల వ్యక్తిగత స్వేచ్ఛను ప్రభుత్వం పట్టించుకోదా?. ప్రజాస్వామ్య అమెరికాలో పౌరుల హక్కులకు విలువ లేదా?. అబ్బాయి అని పేర్కొనడంతో నాకెన్నో ఇబ్బందులు తలెత్తుతాయి. విదేశాల్లో 'అబ్బాయి' అని ఉంటే విమానాశ్రయాల్లో, మరెన్నో చోట్ల చాలా సమస్యలొస్తాయి''అని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.

అక్రమ వలసదార్లను ఎప్పుడు తరిమేస్తారు?

- ఈ ప్రశ్నను దేశ ప్రజలంతా అడగాలి
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సూచన
- అక్రమ వలసదార్లు ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారని ఆందోళన

ఛత్రపతి శంభాజీ నగర్: దేశంలో ఎన్నికల ప్రక్రియలో అక్రమ వలసదార్లు జోక్యం చేసుకుంటున్నారని, నిర్ణయాత్మక శక్తులుగా మారుతున్నారని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అమెరికా నుంచి అక్రమ వలసదార్లను అక్కడి ప్రభుత్వం బలవంతంగా బయటకు పంపిస్తోందని పరోక్షంగా ప్రస్తావించారు. మన దేశంలో అలాంటి ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో చెప్పాలంటూ ప్రజలంతా ప్రశ్నించాలని సూచించారు. శనివారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మరఠ్వాడా యూనివర్సిటీ 65వ స్నాతకోత్సవంలో జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగించారు. అక్రమ వలసదార్ల వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ''మన దేశంలో నివసించే హక్కు లేని కోట్లాది మంది ఇక్కడే చట్టవిరుద్ధంగా నివసిస్తున్నారు. ఇక్కడే బతుకుతున్నారు. మన వనరులపై కన్నేశారు. వాటి కోసం డిమాండ్ చేస్తున్నారు. మన విద్య, ఆరోగ్యం, గృహం.. ఇలా అన్నింటిపైనా వారి దృష్టి పడింది. వారు మరింత ముందుకెళ్తున్నారు. మన ఎన్నికల ప్రక్రియలో సైతం జోక్యం చేసుకుంటున్నారు. అక్రమ వలసదార్ల సమస్యపై అందరికీ అవగాహన కల్పించాలి. ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలి''అని పేర్కొన్నారు. జాతీయవాదమే మన మతమని ఉద్ఘాటించారు. జాతీయవాదానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేశంలో బలవంతపు మత మార్పిళ్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ధన్‌ఖడ్ ఆరోపించారు. నచ్చిన మతాన్ని స్వీకరించే హక్కు పౌరులందరికీ ఉందని చెప్పారు. అయితే, ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి మతం మార్చడం దారుణమని విమర్శించారు. మత మార్పిళ్ల ద్వారా భారతదేశ జనాభా ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసి, దేశంపై ఆధిపత్యం చెలాయించడానికి కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. కొన్ని దేశాల్లో మతమార్పిళ్ల వల్ల మెజార్టీ సమూహాలు మైనార్టీలుగా మారిపోయాయని గుర్తుచేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే సామాజిక సామరస్యం అవసరమని ఉద్ఘాటించారు.

రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలి

మన రాజ్యాంగాన్ని విస్తృతంగా అధ్యయనం చేసి, పూర్తిగా అర్థం చేసుకోవాలని జగదీప్ ధన్‌ఖడ్ సూచించారు. రాజ్యాంగం మనకు ఎంతగా అర్థమైతే మనం జాతీయవాదం వైపు అంతగా మొగ్గుచూపుతామని తెలిపారు. మనకు జాతీయవాదమే అతిపెద్దగా మతంగా భావించాలన్నారు. కొందరు దుష్టులు విదేశాల నుంచి వస్తున్న నిధులతో మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

మోదీ తన మిత్రుడు ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోవాలి

బ్యాలెట్ ఓటింగ్‌పై కాంగ్రెస్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఓటింగ్ కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లకు బదులుగా బ్యాలెట్ పేపర్లను వాడాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారులకు చేసిన సూచనపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని మోదీ తన మిత్రుడు ట్రంప్ వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. మనదేశ ఎలక్టోరల్ విధానం సమగ్రతపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు బ్యాలెట్ విధానమే సరైన సమాధానమని పేర్కొంది. అమెరికాలో ఇటీవల జరిగిన రాష్ట్రాల గవర్నర్ల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ..'ఈవీఎంల విధానం చాలా ఖరీదైన వ్యవహారం. దీనికి బదులుగా బ్యాలెట్ విధానాన్ని, ఒకే రోజు ఓటింగ్ చేపట్టడం వంటివి తీసుకురావడం మంచిది'అని తెలిపారు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం 'ఎక్స్'లో పలు పోస్టులు చేశారు. 'ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా లక్షల సంఖ్యలో ఓటర్లు పెరిగారు. అదేసమయంలో, ప్రతిపక్షాలకు చెందిన వారి ఓట్లను పెద్ద సంఖ్యలో తొలగించారు. ఇవన్నీ తెలిస్తే మోదీ మిత్రుడు ట్రంప్ సైతం షాకవుతారు'అని పేర్కొన్నారు. 'ఈవీఎంలతో ఎన్నికల విధానాన్ని తారుమారు చేయవచ్చని ప్రపంచానికంతటికీ తెలిసినా బీజేపీ మాత్రం అమాయకత్వం ప్రదర్శించటం విషాదకరం. పారదర్శకతకు దూరంగా పారిపోయే బీజేపీ వైఖరి చూస్తే వాళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది'అని తెలిపారు.

ధర్మతిడ, సచధర్మతిడ అనే బిరుదులు ఉన్న కుషాణ చక్రవర్తి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మౌర్యుల అనంతర యుగం -2

మౌర్యుల అనంతరం క్రీ.పూ 200 - క్రీ.శ 300 మధ్య కాలంలో భారతదేశంలో అనేక విదేశీ రాజ్యాలు ఏర్పడ్డాయి. మధ్యాసియా, ఇరాన్ నుంచి వచ్చిన విదేశీ తెగలు స్థానిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని స్వతంత్ర రాజ్యాలను ఏర్పాటు చేశాయి. వారిలో ముఖ్యమైన వారు ఇండో గ్రీకులు, శకులు లేదా సైథియన్లు, పార్థియన్లు, యూచీలు.

ఇండో గ్రీకులు

వీరు మౌర్యానంతర యుగంలో భారతదేశంపై దండెత్తిన తొలి విదేశీయులు. వీరినే యవనులని, బాక్ట్రియా గ్రీకులని పిలుస్తారు. భారత్‌లో శకాల కేంద్రంగా యూథిడిమస్, తక్షశిల కేంద్రంగా యూక్రటైడ్స్ అనే రెండు రాజ్యాలు ఏర్పడ్డాయి.

డియోడోటస్: ఇతడు మొదట సెల్యూసిడ్ సామ్రాజ్యంలో బాక్ట్రియాకు గవర్నర్‌గా ఉండేవాడు. సెల్యూసిడ్ రాజు రెండో ఆంటియోకస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి స్వతంత్ర ఇండో గ్రీకు రాజ్యాన్ని స్థాపించాడు.

యూథిడిమస్ వంశం

యూథిడిమస్: ఇతడు డియోడోటస్‌ను వధించి యూథిడిమస్ వంశ పాలనను ప్రారంభించాడు. ఇండో గ్రీకు సామ్రాజ్యానికి తొలి స్వతంత్ర రాజుగా ఇతణ్ని పరిగణిస్తారు.

డెమిట్రియస్-1: భారతదేశ భూభాగాలను జయించి ఇండో గ్రీకు సామ్రాజ్యంలో భాగంగా చేసినవాడు డెమిట్రియస్. తన సేనాపతి మినాండర్‌తో కలిసి తక్షశిలను జయించాడు. శకాలను నూతన రాజధానిగా చేసుకోవడమే కాక దాని పేరును యూథిడేమియాగా మార్చాడు.

మినాండర్: ఇతడు రెండో డెమిట్రియస్ తర్వాత శకాల రాజ్యాన్ని పరిపాలించాడు. భారతదేశాన్ని పాలించిన ఇండో గ్రీకు రాజులందరికంటే ఇతడు గొప్పవాడు. బౌద్ధ మతస్థుడు. 'మిళింద పన్హ' అనే గ్రంథంలో ఇతనికి, బౌద్ధ తత్త్వవేత్త నాగసేనునికి మధ్య జరిగిన సంభాషణల గురించి వివరంగా ఉంది.

యూక్రటైడ్స్ వంశం

యూక్రటైడ్స్: డెమిట్రియస్ భారతదేశ దండయాత్రలో ఉండగా, యూక్రటైడ్స్ బాక్ట్రియాను ఆక్రమించి తక్షశిల కేంద్రంగా తన పేరుతో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. తన కుమారుడు హీలియోకిల్స్ చేతిలో హత్యకు గురయ్యాడు.

ఆంటియాల్ సిదాస్: ఇతడు హెలియోడోరస్ అనే తన రాయబారిని మగధరాజు భాగభద్రుని వద్దకు పంపాడు. ఈ హీలియోడోరస్ వేయించినదే బేస్‌నగర్ స్తంభ శాసనం.

హర్మయూస్: యూక్రటైడ్స్ వంశంలో చివరి రాజు. ఇతని తర్వాత వీరి సామ్రాజ్యాన్ని పహ్లవులు(పార్థియన్లు), శకులు ఆక్రమించారు.

శకులు

మధ్యాసియా నుంచి వచ్చి భారతదేశంపై దండెత్తిన మరో విదేశీ తెగ. వీరినే సైథియన్లు, క్షాత్రపులు అంటారు. భారతదేశంలో నాలుగు శకరాజ్యాలు ఏర్పడగా, ఆఫ్ఘానిస్తాన్‌లో ఒక రాజ్యం ఏర్పడింది. భారతదేశంలోని నాలుగు శకరాజ్యాల్లో అతి ముఖ్యమైనవి క్షహరాట, కార్ధమక.

తక్షశిల శకులు

మోగా (మౌయోస్): భారతదేశంలో శకుల అధికారాన్ని స్థాపించిన తొలిరాజు ఇతడు. తక్షశిల కేంద్రంగా క్రీ.పూ. 80 నుంచి 20 వరకు పాలించాడు. ఇతడు రాగి, వెండి నాణేలను జారీ చేశాడు. వాటిపై గ్రీకు దేవతలతోపాటు శివుడు, బుద్ధుడి బొమ్మలను ముద్రించాడు. మోగా తర్వాత ఏజెస్, ఎజిలిసెస్, ఏజెస్-2 అనే రాజులు పాలించారు.

క్షహరాట శకులు

వీరు మహారాష్ట్ర, గుజరాత్ మొదలైన ప్రాంతాలను పాలించిన పశ్చిమ క్షాత్రపులు. మొదట కుషాణులకు సామంతులుగా పాలించేవారు.

భూమకుడు: ఇతడు క్షహరాట వంశ స్థాపకుడు. మిన్నాగర (మాందసోర్) వీరి రాజధాని. ఖరోష్టి, బ్రాహ్మీ లిపులను నాణేలపై ఉపయోగించాడు.

నహపాణుడు: ఈ వంశంలో అందరి కంటే గొప్పవాడు. అనేక రాగి, వెండి నాణేలు జారీ చేశాడు. ఇతడి అల్లుడు, సేనాధిపతి ఉషవదత్తుడు జారీ చేసిన శాసనాలు నహపాణుని విజయాలను, సామ్రాజ్య విస్తీర్ణం గురించి తెలుపుతున్నాయి. ఇతడు క్రీ.శ. 124లో శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి చేతిలో మరణించాడు. గౌతమీపుత్ర శాతకర్ణి పేరుతో పునర్ముద్రించిన నహపాణుని నాణేలు జోగల్‌తంబి అనే ప్రాంతంలో భారీ సంఖ్యలో లభించాయి.

కార్దమక శకులు

వీరు ఉజ్జయినీ కేంద్రంగా పశ్చిమ భారతదేశాన్ని పాలించారు.

చష్టానుడు: ఇతడు కార్దమక శకుల వంశంలో మొదటి రాజు. టాలమీ రాసిన 'జాగ్రఫీ' అనే గ్రంథంలో ఇతన్ని టియస్తనీస్ అని పేర్కొన్నారు.

రుద్రదమనుడు: భారతదేశంలోని శకులందరిలోకి అత్యంత గొప్పవాడు. ఇతడు జునాఘడ్(గిర్నార్ శాసనం) వద్ద సంస్కృత శాసనాన్ని వేయించాడు. శాతకర్ణి అనే రాజును రెండుసార్లు ఓడించినట్లు ఇందులో ప్రస్తావించాడు. చంద్రగుప్త మౌర్యుడి కాలంలో నిర్మించిన సుదర్శన తటాకాన్ని మరమ్మతు చేయించాడు. తన కుమార్తె రుద్రదమనికకు వాశిష్టీపుత్ర శివశ్రీ శాతకర్ణితో వివాహం చేశాడు.

3వ రుద్ర సింహుడు: రుద్రదమనుడి అనంతరం అనేకమంది బలహీన రాజులు పాలించారు. మూడో రుద్ర సింహుడు ఈ వంశంలో చివరివాడు. ఇతడు గుప్తరాజు రెండో చంద్రగుప్తుడి చేతిలో మరణించడంతో భారతదేశంలో ఈ వంశ పాలన ముగిసింది.

పార్థియన్లు

వీరినే పహ్లవులు అని కూడా అంటారు. వీరు ఇరాన్ ప్రాంతానికి చెందినవారు.

గోండోఫెర్నెస్: భారతదేశాన్ని పాలించిన ఇతర పార్థియన్ రాజుల ఆధారాలు అంతగా లభించలేదు. 'తఖ్త్-ఇ-బాహి' అనే శాసనం గోండోఫెర్నెస్ విజయాలను తెలుపుతోంది. ఇతడు అఫ్గానిస్తాన్‌ను పాలించిన చివరి శకరాజు హెర్మాయూస్‌ను ఓడించి, రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. సెయింట్ థామస్ అనే క్రైస్తవ సన్యాసి... గోండోఫెర్నెస్‌ను క్రైస్తవంలోకి మార్చాడని 'యాక్ట్స్ ఆఫ్ జూడాస్ థామస్, ది అపోజిల్' అనే సిరియన్ గ్రంథం పేర్కొంటోంది.


కుషాణులు

మధ్యాసియాలోని యూచీ అనే తెగలోని 5 శాఖల్లో ఒక దానికి చెందిన వారు కుషాణులు. వీరినే తొచేరియన్లు అని కూడా పిలుస్తారు. చైనాపై దాడి ద్వారా జీవనాన్ని గడిపే ఈ తెగలు చైనా మహాకుడ్య నిర్మాణం వల్ల ఆ అవకాశం కోల్పోయారు. దీంతో భారతదేశంపై దాడి చేశారు. ఇక్కడ పాలకులుగా ఉన్న పార్థియన్లు, శకుల స్థానాలను కుషాణులు ఆక్రమించారు. ఫలితంగా భారతదేశంలో ఖొరాసాన్ నుంచి వారణాసి వరకు వారి సామ్రాజ్యం విస్తరించింది. వీరి మొదటి రాజధాని పురుషపురం. రెండో రాజధాని మధుర.

కాడ్ ఫైసెస్-1: ఇతడినే కుజుల కాడ్‌ఫైసెస్ అంటారు. భారతదేశంలో కుషాణ సామ్రాజ్యాన్ని స్థాపించిన వాడు ఇతడే. చివరి గ్రీకురాజు హెర్మాయూస్‌కు సామంతుడిగా ఉండి తర్వాత పార్థియన్లను అంతం చేసి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు కేవలం రాగి నాణేలను మాత్రమే ముద్రించాడు. అవి అగస్టస్ చక్రవర్తి నాణేలను పోలి ఉండేవి. ఇతడికి 'మహా రాజాధిరాజా' అనే బిరుదు ఉంది. ఇతడు బౌద్ధ, శైవ మతాలను ఆదరించినట్లు తెలుస్తోంది.

కాడ్‌ఫైసెస్-2(వీమా కాడ్‌ఫైసెస్): కుషాణ సామ్రాజ్యం భారతదేశం లోపలి ప్రాంతాల వరకు విస్తరించడానికి ఇతడు ప్రధాన కారకుడు. శైవమతాన్ని ఆదరించాడు. బంగారు నాణేలను ముద్రించాడు. శైవాభిమానాన్ని నాణేల ద్వారా ప్రకటించాడు.

కనిష్కుడు: భారతదేశాన్ని పాలించిన కుషాణ రాజుల్లో అందరికంటే గొప్పవాడు కనిష్కుడు. ఇతడు క్రీ.శ. 78లో 'శక' అనే పేరుతో భారతదేశంలో ఒక నూతన శకాన్ని ప్రారంభించాడు. ఇతడిని అశోకుడి తర్వాత అతిపెద్ద సామ్రాజ్య నిర్మాతగా భావిస్తారు. పాటలీపుత్రం మీద దాడి సందర్భంగా ఇతడు అశ్వఘోషుడనే ప్రముఖ బౌద్ధ పండితుడిని తనతో పాటు పురుషపురానికి తీసుకొని వెళ్లాడు. కాశ్మీర్‌లో తన పేరుతో కనిష్కపుర అనే నగరాన్ని నిర్మించాడు. కుందలవనంలో నాలుగో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. ఇతడి ఆస్థానంలో అనేకమంది పండితులకు ఆశ్రయం లభించింది. వారిలో ముఖ్యమైన వారు పార్శ్వ, వసుమిత్ర, అశ్వఘోష, నాగార్జున, చరకుడు, మాతర మొదలైనవారు. రాగి నాణేలు, బంగారు నాణేలు జారీ చేశాడు. బంగారు నాణేలపై ఒక వైపు రాజు, మరో వైపు దేవత గుర్తులుండేవి. కనిష్కుడు దేవపుత్ర, సీజర్ అనే బిరుదులు పొందాడు. గాంధార శైలిలో బోధిసత్త్వుల విగ్రహాలను చెక్కడం ఇతడి కాలంలోనే ప్రారంభమైంది. మధుర శిల్పకళా శైలిని ప్రోత్సహించాడు.



కనిష్కుని తర్వాతి రాజులు

కనిష్కుడి అనంతరం వశిష్కుడు, హువిష్కుడు, రెండో కనిష్కుడు మొదలైన రాజులు పాలించారు. ఇతని తర్వాత కుషాణ సామ్రాజ్యాన్ని ససానియన్లు, నాగులు, భారశివులు ఆక్రమించారు.


మాదిరి ప్రశ్నలు

1. అలెగ్జాండర్ తర్వాత భారతదేశ లోపలి ప్రాంతాలపై దండయాత్ర చేసిన గ్రీకు రాజు?
ఎ) యూథిడిమస్ బి) యూక్రటైడ్స్
సి) డెమిట్రియస్ డి) మినాండర్
2. మహేశ్వర అనే బిరుదు పొందిన విదేశీ రాజు?
ఎ) కుజుల కాడ్‌ఫైసెస్
బి) ఆంటియాల్ సిదాస్
సి) వీమా కాడ్‌ఫైసెస్
డి) హెలియో డోరస్
3. వీమా కాడ్‌ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖ?
ఎ) పాశుపతం బి) కాపాలికం
సి) కాలాముఖం డి) అఘోర శైవం
4. పాంచావొ అనే చైనా సేనాని చేతిలో ఓడిన కుషాణ చక్రవర్తి?
ఎ) కుజుల కాడ్‌ఫైసెస్ బి) కనిష్కుడు
సి) వీమా కాడ్‌ఫైసెస్ డి) హువిష్కుడు
5. కనిష్కుడు ఎవరి సలహా వల్ల కుండల వనంలో నాలుగో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు?
ఎ) వసుమిత్రుడు బి) అశ్వఘోషుడు
సి) శీలభద్రుడు డి) పార్శ్వ
6. శివుడు, నంది గుర్తు కలిగిన నాణేలను జారీ చేసిన కుషాణ చక్రవర్తి?
ఎ) హువిష్కుడు బి) వాసుదేవుడు
సి) రెండో కనిష్కుడు డి) వశిష్కుడు
7. కశ్యపమాతంగ ఎవరి పాలనా కాలంలో చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు?
ఎ) మౌర్యుల కాలంలో
బి) శుంగుల కాలంలో
సి) శకుల కాలంలో
డి) కుషాణుల కాలంలో
8. మహారాజ మహాత్మా అనే బిరుదున్న శకరాజు?
ఎ) రుద్ర దమనుడు బి) భూమకుడు
సి) మోగా డి) నహపాణుడు
9. అభిషేక లక్ష్మీ అనే భారతీయ దేవతను తన నాణేలపై ముద్రించిన శకరాజు?
ఎ) చష్టానుడు బి) ఏజెస్
సి) నహపాణుడు డి) అజిలిసెస్
10. 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' గ్రంథంలో మంబారాస్ అనే పేరుతో ఎవరిని పేర్కొన్నారు?
ఎ) మిళిందుడు బి) నహపాణుడు
సి) రుద్ర దమనుడు డి) భూమకుడు
11. తన నాణేల మీద గ్రీకు, ఖరోష్టి, బ్రాహ్మీ లిపులను ఉపయోగించిన శకరాజు?
ఎ) చష్టానుడు బి) భూమకుడు
సి) మోగా డి) రుద్రదమనుడు
12. మహాక్షాత్రప అనే బిరుదు పొందిన రాజు?
ఎ) నహపాణుడు బి) రుద్రదమనుడు
సి) ఉషవదత్తుడు డి) భూమకుడు
13. భారతదేశంలో తొలి సంస్కృత శాసనాన్ని ఎవరి కాలంలో జారీ చేశారు?
ఎ) సముద్రగుప్తుడు బి) కనిష్కుడు
సి) రుద్రదమనుడు డి) గౌతమీపుత్ర శాతకర్ణి
14. ధర్మతిడ, సచధర్మతిడ అనే బిరుదులు ఉన్న కుషాణ చక్రవర్తి?
ఎ) కనిష్కుడు బి) హువిష్కుడు
సి) కుజుల కాడ్‌ఫైసెస్
డి) వీమా కాడ్‌ఫైసెస్
15. సెల్యూసిడ్ రాజు 2వ అంటియోకస్ చేతిలో ఓడిన భారతీయ రాజు?
ఎ) సుభాగ సేనుడు బి) బిందుసారుడు
సి) భాగభద్రుడు డి) పుష్య మిత్రుడు

సమాధానాలు

1) సి; 2) సి; 3) ఎ; 4) బి; 5) డి; 6) బి; 7) డి; 8) సి; 9) డి; 10) బి; 11) ఎ; 12) బి; 13) సి; 14) సి; 15) ఎ.

'రూబియోలా' అనే మరో పేరు కలిగిన వ్యాధి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

ప్రాక్టీస్ బిట్స్

1. రాజుకు రే చీకటి ఉందని డాక్టర్ నిర్ధారించాడు. మరి రాజు కిందివాటిలో దేనికి సంబంధించి ఉంటాడు?
1) ఎక్కువ వెలుతురు, రాత్రుల్లో వస్తువులను చూడలేడు.
2) రంగు వస్తువులను, పగటిపూట వస్తువులను చూడలేడు.
3) తక్కువ వెలుతురులో, రాత్రిపూట వస్తువులను చూడలేడు.
4) రాత్రిపూట వస్తువులను చూస్తాడు, పగటిపూట వస్తువులను చూడలేడు.
2. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రానికి సంబంధించి సరైంది?
1) లైంగిక చక్రం దోమలో జరుగుతుంది. అలైంగిక చక్రం మానవుడిలో జరుగుతుంది.
2) లైంగిక, అలైంగిక చక్రాలు మానవుడి లో జరుగుతాయి.
3) అలైంగిక చక్రం దోమలో జరుగుతుంది. లైంగిక చక్రం మానవుడిలో జరుగుతుంది.
4) లైంగిక, అలైంగిక చక్రాలు అవకాశాన్ని బట్టి వేటిలోనైనా జరగవచ్చు.
3. అండకోశానికి సంబంధించిన కణాలే ఒక దానితో ఒకటి సంయోగం చెంది ఏర్పడే కణం?
1) సంయుక్త బీజం
2) ద్వితీయ కేంద్రకం
3) అంకురచ్ఛదం
4) ప్రతిపాద కణం
4. మొక్క ఆహార కర్మాగారంగా దేన్ని పేర్కొంటారు?
1) విత్తనం 2) అండకోశం
3) వేరు 4) పత్రం
5. ప్రొజెస్టిరాన్ హార్మోన్ పని?
1) గ్లైకోజన్‌ను గ్లూకోజ్‌గా మార్చడం.
2) గాయిటర్ రాకుండా కాపాడడం.
3) గర్భాశయ పెరుగుదల, జరాయువు ఏర్పడడం.
4) నపుంసకత్వం రాకుండా ఉండడం.
6. సహజ శత్రువులైన కీటకాలను ప్రవేశపెట్టి కలుపు మొక్కలను నాశనం చేసే పద్ధతి?
1) బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతి
2) జీవక్రియా విధాన పద్ధతి
3) భౌతిక పద్ధతి
4) రసాయన పద్ధతి
7. స్పర్శ గ్రాహకాలు ఏ భాగాలపై ఎక్కువగా ఉంటాయి?
1) వేళ్ల కొనలపై
2) నొసటి ప్రాంతంలో
3) పెదవులపై
4) 1, 3
8. కిందివాటిలో ఏ రుచికి చెందిన గ్రాహకాలు నాలుక వెనుక భాగంలో ఉంటాయి?
1) తీపి 2) ఉప్పు
3) పులుపు 4) చేదు
9. పాములు వాటి శాస్త్రీయ నామాలకు సంబంధించి సరైన జత?
ఎ) తాచుపాము - రస్సెల్స్ వైపర్
బి) కట్లపాము - ఓఫియోఫెగస్ హెన్న
సి) ఎకిస్ కారినేటా- సాస్కేల్ వైపర్
డి) రక్తపింజర- బంగారస్ ఫాసియేటస్
1) ఎ, సి 2) సి, డి
3) బి, డి 4) ఎ, డి
10. చిన్న పిల్లల్లో అతి సామాన్యంగా కలిగే చర్మ వ్యాధి గజ్జిని కలిగించే క్రిమి ఏ వర్గానికి చెందింది?
1) ప్లాటి హెల్మింథిస్
2) ప్రోటోజోవా
3) ఆర్థ్రోపొడా
4) నిమాటిహెల్మింథిస్
11. కిందివాటిలో వేటిని బయోఎరువులుగా ఉపయోగిస్తారు?
1) ఆకుపచ్చ శైవలాలు
2) నీలి ఆకుపచ్చ శైవలాలు
3) గోధుమ వర్ణపు శైవలాలు
4) పైవన్నీ
12. 'రూబియోలా' అనే మరో పేరు కలిగిన వ్యాధి?
1) ఆటలమ్మ 2) తట్టు (పొంగు)
3) పోలియో (శిశు పక్షవాతం)
4) గవద బిళ్లలు
13. అలిసిపోవడం, శ్లేష్మంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం వంటి లక్షణాలను గుర్తించిన డాక్టర్ ఆ వ్యాధిగ్రస్తుడికి ఏ వ్యాధి ఉంది అని నిర్ధారిస్తాడు?
1) కుష్టు 2) క్షయ
3) మలేరియా 4) కోరింత దగ్గు
14. కిందివాటిలో ఏ రెండు ప్రవచనాలు సరైనవి?
ఎ)చింతకాయ, మామిడి, నిమ్మ మొదలైన వాటిని పొగబెట్టడం ద్వారా నిల్వ చేస్తారు.
బి) బ్యాక్టీరియా వేగంగా వృద్ధి చెందడానికి తగిన ఉష్ణోగ్రత 20°C- 40°C
సి) ఈస్ట్‌లు ఆమ్ల ద్రావణంలో వృద్ధి చెందుతాయి.
డి) ఎఫ్లోటాక్సిన్ కాలేయాన్ని పాడు చేస్తుంది.
1) ఎ, బి 2) సి, డి
3) బి, డి 4) ఎ, సి
15. మంచి కలపను ఇచ్చే ఇండియన్ రోజ్‌వుడ్ శాస్త్రీయ నామం?
1) టెక్టోనియా గ్రాండిస్
2) షొరియా రొబస్టా
3) డాల్ బర్జియాలాటి పోలియా
4) అజార్డికా ఇండికా
16. కేన్సర్‌కు సంబంధించి కిందివాటిలో ఏది సరైన జత?
1) మాలిగ్నెంట్ - ఊపిరితిత్తులు ప్రమాదకరం కావు.
2) కార్సినోమా- ఉపకళా కణాలకు వచ్చే కాన్సర్
3) అపాయం చేయని వ్రణాలు-కార్సి నోమా
4) ఇతర భాగాలకు సోకే గడ్డలు- బినైన్ గడ్డలు.
17. గోళ్లు, రోమాలు,కొమ్ములు వంటి జంతు నిర్మాణాలు ఏ కణజాలం నుంచి తయారవుతాయి?
1) సంయోజక కణజాలం
2) కండర కణజాలం
3) అస్థి కణజాలం
4) ఉపకళా కణజాలం
18. ప్రౌఢ మానవుడిలో ఉండే కుంతకాల సంఖ్య?
1) 4 2) 8
3) 10 4) 12
19. మానవుడి జీర్ణ క్రియలో సెల్యులోజ్ తంతువుల ఉపయోగం కానిది?
1) ఆహారానికి బరువును చేకూర్చడం.
2) పేగులో ఆహారం సులువుగా జారేట్లు చేయడం.
3) ప్రొటీన్‌ల జీర్ణ క్రియలో ఉపయోగపడడం.
4) జీర్ణమైన పోషకాలను సమర్థవంతంగా పీల్చుకునేటట్లు చేయడం.
20. ఇతర జంతువులతో పోల్చినప్పుడు నెమరువేసే జంతువుల్లో గ్లూకోజ్ మట్టం ఏ విధంగా ఉంటుంది?
1) అతి ఎక్కువగా 2) సమానంగా
3) అతి తక్కువగా 4) కొలవలేం
21. ఈ కిందివాటిలో ఏది ఆంత్ర రసంలో మాత్రమే ఉంటుంది?
1) ఎమిలాప్సిన్ 2) ట్రిప్సిన్
3) ఎంటిరోకైనేస్ 4) కీమోట్రిప్సిన్
22. కిందివాటిలో ఏ జీవి నీలం రంగు రక్తాన్ని కలిగి ఉంటుంది?
1) వానపాము 2) కప్ప
3) నత్త 4) బొద్దింక
23. కిందివాటిలో కీటకాహారి మొక్క కానిది?
1) డ్రాసిరా 2) నెపంథిస్
3) డైమోనియా 4) కస్కుటా
24. పత్ర రంధ్రాలు తెరుచుకోవడం, మూసుకోవడం కిందివాటిలో ఏ చర్యపై ఆధారపడి ఉంటాయి?
1) విసరణ 2) బాష్పోత్సేకం
3) కిరణజన్యసంయోగక్రియ
4) వేరు పీడనం
25. కిందివాటిలో ఏ జీవి ద్రవ రూపంలో ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకుంటుంది?
1) నత్త 2) వానపాము
3) ఈగ 4) చేప
26. సాధారణంగా శాఖాహార జంతువుల్లో ఏ దంతాలు లోపిస్తాయి?
1) కుంతకాలు 2) రదనికలు
3) చర్వణకాలు 4) అగ్రచర్వణకాలు
27. కిందివాటిలో ఏ జీవి విసర్జక పదార్థంగా యూరికామ్లాన్ని విసర్జిస్తుంది?
1) కప్ప 2) చేప
3) వానపాము 4) బొద్దింక
28. పట్టుపురుగులు - గొంగళి పురుగులు కిందివాటిలో ఏ రకం భక్షక విధానానికి ఉదాహరణ?
1) ఏకరక భక్షణ 2) బహుళరక భక్షణ
3) జాంతవ భక్షణ 4) సర్వ భక్షణ
29. అతినీలలోహిత కిరణాలను శోషణం చేసుకునే వాయువు?
1) ఆక్సిజన్ 2) ఆర్గాన్
3) నత్రజని 4) ఓజోన్
30. సముద్రంలో ఎంత లోతు వరకు కిరణజన్య సంయోగక్రియ జరపడానికి అవసరమయ్యే కాంతి ఉంటుంది?
1) 500 మీటర్లు 2) 2000 మీటర్లు
3) 1000 మీటర్లు 4) 200 మీటర్లు
31. ఎడారి మొక్కల ఆకు ఉపరితలం ద్వారా నీరు ఆవిరి రూపంలో ఎందుకు బయటకు పోదు?
1) పత్రరంధ్రాలు ఉపరితలంపై ఉండవు.
2) ఈ మొక్కలన్నింటిలో పత్రాలే ఉండవు
3) ఆకులపై మైనపుపూత ఉండడం వల్ల
4) పత్రరంధ్రాలు పెద్దవిగా ఉండడం వల్ల
32. శీతాకాలంలో వలస వెళ్లే పక్షులకు ఉదాహరణ?
1) ఆస్ట్రిచ్
2) సైబీరియా కొంగ
3) ఆఫ్రికన్ చిలుకలు
4) పెంగ్విన్‌లు
33. చేప కాలేయ నూనెలో ఉండే విటమిన్‌లు?
1) A, D 2) B, C
3) E, K 4) C, D
34. ఒక రైతు బ్రీడర్ విత్తనాలను ఎంచుకున్నాడు. వాటికి కిందివాటిలో ఏ లేబుల్ ఉంటుంది?
1) నీలం రంగు
2) తెలుపు రంగు
3) బంగారు పసుపు
4) ఆకుపచ్చ (ముదురు)
35. కోళ్ల పెంపకంలో డీబేకింగ్ అంటే?
1) కోళ్లు గుడ్లను పెట్టకుండా చేయడం.
2) కోళ్ల కాలిగోళ్లను తీసివేయడం.
3) కోళ్లలో వ్యాధులు రాకుండా వ్యాక్సినేషన్ చేయించడం.
4) కోళ్ల ముక్కుల చివరలను కత్తిరించడం
36. రక్తంలో ప్రతిరక్షకాలు ఉండే స్థానం?
1) ఎర్రరక్త కణాలు
2) ఇస్నోఫిల్స్
3) ప్లాస్మా 4) బేసోఫిల్స్
37. నిష్కాంతి చర్యలో క్షయకరణం చెందే వాయువు?
1) O_2 2) CO_2
3) H_2 4) N
38. మొక్కలు ఆకుపచ్చని రంగులో ఉండడానికి కారణం?
1) ఆకుపచ్చని కాంతిని వక్రీభవించడం.
2)ఆకుపచ్చని కాంతిని పరావర్తనం చేయడం.
3) ఆకుపచ్చని కాంతిని శోషించడం.
4) అన్ని రంగుల కాంతిని పరావర్తనం చేయడం.
39. కంఠ బిలంపై మూతలా పని చేసే నిర్మాణం?
1) నాలుక 2) పటలిక
3) కొండ నాలుక 4) ఉపరికుల

మాదిరి ప్రశ్నలు

1) 3 2) 1 3) 2 4) 4
5) 3 6) 2 7) 4 8) 4
9) 2 10) 3 11) 2 12) 2
13) 2 14) 3 15) 3 16) 2
17) 4 18) 2 19) 3 20) 3
21) 3 22) 3 23) 4 24) 2
25) 3 26) 2 27) 4 28) 1
29) 4 30) 4 31) 3 32) 2
33) 1 34) 3 35) 4 36) 3
37) 2 38) 2 39) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఐటీడీఎం, చెన్నైలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ఐఐఐటీడీఎం)..అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1కు 40ఏళ్లు,గ్రేడ్-2కు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1కు రూ.1,01,500 నుంచి రూ.1,67,400, గ్రేడ్-2కు రూ.71,000 నుంచి రూ.1,17,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సెమినార్ ప్రజంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.03.2025.
» **వెబ్‌సైట్:** https://iiitdm.ac.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ముంబైలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ముంబై షిప్ రిపేర్ యూనిట్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్)-03, సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రికల్)-03, సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రానిక్స్)-01.
» **అర్హత:** 60 శాతం మార్కులతో మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 03.03.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** మొదటి సంవత్సరం నెలకు రూ.37,000, రెండో సంవత్సరం రూ.38,000, మూడో సంవత్సరం రూ.40,000లతో పాటు ఎక్స్‌ట్రా పని గంటలకు నెలకు రూ.3000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.03.2025
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలు చట్టం తీసుకొచ్చిన సంవత్సరం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఎకానమీ

స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల మధ్య భౌగోళిక, పరిపాలనా వైరుధ్యాలు ఉన్నప్పటికీ రెండు ప్రాంతాల్లోనూ జమీందారీ, జాగీర్దారీ వ్యవస్థలు ఉన్నాయి. వాణిజ్య పంటల సాగు, నీటి పారుదల సౌకర్యాలు అధికంగా ఉండటం, నూతన ఉత్పాదక వస్తువులను వినియోగించడం, రవాణా, విద్య సౌకర్యాలు ఆంధ్ర ప్రాంతంలో అధికంగా కనిపించాయి. అక్కడ పెట్టుబడిదారీ విధాన దోపిడీ ఉంటే, తెలంగాణలో ఫ్యూడల్ విధాన దోపిడీ ఉండేది. ఈ విధంగా రెండు ప్రాంతాల్లోనూ రైతాంగం దోపిడీకి గురైంది.

భూ సంస్కరణలు- చరిత్రాత్మక పరిశీలన

వ్యవస్థాపూర్వక అవరోధాల కారణంగా తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధి సన్నగిల్లింది. అనుస్థాపిత భూస్వామ్య వ్యవస్థ రెండు ప్రాంతాల్లోనూ బలపడింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజల ఆర్థిక జీవనంలో మార్పులు తీసుకురావడానికి భూస్వామ్య వ్యవస్థలో, కౌలు విధానంలో మార్పులు అవసరమయ్యాయి. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కొన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో తిరుగుబాట్లు జరిగాయి. ఈ క్రమంలో భూసంస్కరణల చట్టాల ఆవశ్యకత ఏర్పడింది.

తెలంగాణ ప్రాంతంలో జాగీర్దారీ, ఇనాంల రద్దు

తెలంగాణలో కౌలుదార్లలో ఉన్న అశాంతిని తొలగించడానికి మేజర్ జనరల్ చౌదరి పరిపాలన అధికారాలు చేపట్టిన తర్వాత 'హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ' ఏర్పాటు చేశారు. వ్యవసాయరంగ స్థితి గతులను పరిశీలించిన కమిటీ భూసంస్కరణల చట్టాలను రూపొందించడానికి అవసరమైన సూచనలను 1949లో అందించింది. తర్వాత 1949 ఆగస్టు 15న హైదరాబాద్ జాగీర్ల రద్దు రెగ్యులేషన్ 1358 ఫసలీ చట్టాన్ని ప్రకటించారు. దీని ప్రకారం మొదట జాగీరు భూములను, అనంతరం సర్ఫేఖాస్ భూములను రైత్వారీ భూములుగా ప్రకటించారు. 1949 సెప్టెంబరు 14న మరో హైదరాబాద్ జాగీర్ రద్దు నిబంధనల చట్టాన్ని రూపొందించారు. మొత్తం 7866 గ్రామాల్లో ఫ్యూడల్ దోపిడీకి కారణమైన 975 జాగీర్దార్లను తొలగించి వ్యవసాయం చేసే రైతులకు యాజమాన్య హక్కులు కల్పించారు. దీంతో పాటు జాగీర్దారీ భూముల శిస్తులో 12.5 శాతం రాయితీ ఇచ్చారు.

ఇనాం భూములను సాగు చేసే రైతాంగానికి లాభం చేకూర్చేలా ఇనాంలను రద్దు చేశారు. మొదటగా 1955లో హైదరాబాద్ ఇనాం భూముల రద్దు చట్టాన్ని రూపొందించారు. మత సంబంధిత చారిటబుల్ సంస్థల ఆధీనంలో ఉన్న ఇనాం భూములు మినహా మిగిలినవి రద్దవుతాయని ఈ చట్టంలో పేర్కొన్నారు. న్యాయ సంబంధ అడ్డంకుల కారణంగా వీటి అమలు సాధ్యం కాలేదు. కానీ ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 1967లో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతం) ఇనాంల రద్దు చట్టాన్ని అన్ని రకాలైన ఇనాం భూములకు వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు.

ఆంధ్ర ప్రాంతంలో మధ్యవర్తుల తొలగింపు

స్వాతంత్ర్యానికి పూర్వం 1938లో ప్రకాశం కమి టీ రిపోర్టు ఆధారంగా రూపొందించిన బిల్లును మద్రాస్ రాష్ట్ర అసెంబ్లీ చర్చించింది. జమీందారీ రద్దు కోసం, జమీందారీ ప్రాంతాల్లో భూమి శిస్తు క్రమబద్ధీకరణ కోసం ఉద్దేశించిన రెండు బిల్లులను 1948లో శాసన సభలో ప్రవేశపెట్టారు. మద్రాస్ ఎస్టేట్ బిల్లు 1949 ఏప్రిల్ 19న శాసనసభ, 1950లో భారత రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టంగా మారింది. దీని ప్రకారం పర్మినెంట్ సెటిల్‌మెంట్ ఎస్టేట్‌లు, గ్రామీణ భూములు, అడవులు, గనులు, ఖనిజాల భూములన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయి.

ఈ చట్టం ద్వారా తొలగించిన జమీందారులకు నష్టపరిహారాన్ని పొందే హక్కు కల్పించారు. 1949 సెప్టెంబరు వరకు పెద్ద జమీందారీ ప్రాంతాలైన విజయ నగరం, వేంకటగిరి, పిఠాపురం, బొబ్బిలి, శివగంగ, రామినీడు ప్రాంతాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ చట్టం ఇనాం ఎస్టేట్‌లకు కూడా వర్తించేలా ఉన్నందువల్ల రాష్ట్రంలోని 7,423 ఇనాం గ్రామాల్లో 4,157 గ్రామాలకు ఈ చట్టాన్ని వర్తింపచేసింది. అనంతరం 3,300 ఇనాం ఎస్టేట్‌లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1956 చట్ట ప్రకారం ఖండిక ఇనాం ఎస్టేట్‌లు రద్దయ్యాయి. మొత్తం 11,126 ఇనాం ఎస్టేట్‌లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 20.25 లక్షల రైతులకు యాజమాన్య హక్కులు కల్పించింది.

తెలంగాణలో కౌలుదారీ చట్టాలు

- రాష్ట్ర ప్రభుత్వం 1950 జూన్ 10న హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ సూచన అనుసరించి హైదరాబాద్ (తెలంగాణ ప్రాంతం)కౌలు వ్యవసాయ భూము ల చట్టాన్ని ప్రకటించింది. మత సంబంధ ఇనాం భూములకు తప్ప మిగిలిన భూములకు ఈ చట్టం వర్తిస్తుంది.
- 1949 నుంచి ఆరేళ్లు కౌలుదార్లుగా ఉన్న వారిని రక్షిత కౌలుదార్లుగా గుర్తిస్తారు.
- భవిష్యత్తులో (కొన్ని పరిమితుల్లో, మినహాయింపులతో) ఇతరులకు భూములను కౌలుకు ఇవ్వడాన్ని చట్టం వచ్చిన మూడేళ్ల తర్వాత నిషేధించారు.
- కౌలు సమయంలో కౌలుదారుడు భాటకాన్ని సక్రమంగా చెల్లిస్తున్నప్పుడు అతడిని కౌలు నుంచి తొలగించడానికి వీలు లేదు.
- కౌలుదారుడు తన ఇష్ట ప్రకారం తన హక్కులను భూస్వామిపరం చేయాలనుకుంటే నెల రోజుల ముందు రాత పూర్వకంగా తహసీల్దారు సమక్షంలో నోటీసు ఇవ్వాలి. ఈ విషయంలో తహసీల్దారు సంతృప్తి చెందితేనే చట్టరీత్యా చెల్లుతుంది.
- కౌలుకు తీసుకున్న భూమిని ఉప విభజన చేసినా లేదా ఆ భూమిని ఇతరులకు కౌలుకు ఇచ్చినా కౌలు ఒప్పందం రద్దవుతుంది.
- కౌలుదారుడు కౌలు భూమిని దుర్వినియోగం చేసినప్పుడు, భూమికి నష్టం కలిగించినప్పుడు, వ్యవసాయేతర కార్యకలాపాలకు వినియోగించుకున్నప్పుడు భూస్వామి తన భూమి స్వాధీనం చేసుకోవచ్చు.
- కౌలు పరిమాణం భూమి శిస్తు కంటే మెట్ట భూములకు 4 నుంచి 5 రెట్లు, మాగాణి భూములకు 3 నుంచి 4 రెట్లు వరకు ఉండొచ్చు.
- రక్షిత కౌలుదారుడు తాను సేద్యం చేస్తున్న భూమిని ప్రభుత్వానికి, భూ తనఖా బ్యాంకులకు, సహకార సంఘాలకు తనఖా పెట్టుకోవచ్చు.



ఆంధ్ర ప్రాంతంలో కౌలుదారీ చట్టాలు

- ఆంధ్ర ప్రాంతంలో 1949లో మద్రాస్ ప్రభుత్వం జారీచేసిన 'ఆంధ్ర ప్రాంత కౌలుదార్ల, రైతురక్షణ చట్టం'వల్ల కొన్ని వర్గాల కౌలుదార్లకు, రైతులకు తాత్కాలిక రక్షణ కల్పించారు.
- ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూసంస్కరణల కోసం లక్కరాజు సుబ్బారావు అధ్యక్షతన ఏర్పడిన కమిటీ భూ యాజమాన్య మార్పులను నిరోధించడం, కౌలు రక్షణ, కౌలు భూములకు కనిష్ఠ, గరిష్ఠ పరిమితులను నిర్దేశించడంపై అధ్యయనం చేసి 1955 అక్టోబర్ 30న కొన్ని సూచనలతో నివేదిక అందించింది. దీనికి అనుగుణంగా 1956 జూలైలో ఆంధ్ర వ్యవసాయ కౌలుదార్ల రక్షణ ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం జారీ చేసింది.
- ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలుచట్టాన్ని 1956లో ఏర్పాటు చేశారు. దీని ప్రకారం వివిధ రకాల భూముల కౌలు పరిమాణం స్థూల ఉత్పత్తిలో 28.3శాతం నుంచి 50శాతం వరకు ఉండొచ్చు.
- హైదరాబాద్ రాష్ట్రంలో కౌలు భూములను స్వాధీనం చేసుకోవడానికి వివిధ నిబంధనలు ఉంటే, ఆంధ్ర రాష్ట్రంలో నిర్దిష్టమైన నిబంధనలేవీ లేవు. సొంత వ్యవసాయ నిర్వచనం కట్టుదిట్టంగా లేకపోవడంతో కౌలు పరిమాణాన్ని ప్రణాళిక సంఘ సూచనలకు వ్యతిరేకంగా నిర్ణయించారు.
- 'ఆంధ్రరాష్ట్రంలో కౌలు చట్టాలు కౌలుదార్లకు రాయితీ హక్కులు కల్పించలేద'ని వావిలాల గోపాలకృష్ణయ్య వ్యాఖ్యానించారు.
- ఆంధ్రరాష్ట్రంలో కౌలుదారీ బిల్లును భూస్వాముల రక్షణ బిల్లుగా గుర్తించవచ్చని వి. కుమరయ్య వ్యాఖ్యానించారు.
- 'తెలంగాణ ప్రాంతంలోని రైత్వారీ, జాగీర్దారీ ప్రాంతాల్లో వేలకొద్దీ రక్షిత కౌలు దారులను వెళ్లగొట్టారని, ఇది జాగీర్దారీ ప్రాంతంలో అధికంగా ఉంది' అని ఖుస్రో అభిప్రాయపడ్డారు.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణలో పోలీసు చర్య తర్వాత ఎవరు పరిపాలన అధికారాలు చేపట్టారు?
   ఎ) కారస్ వాలీస్
   బి) మేజర్ జనరల్ చౌదరి
   సి) కొండా రంగారెడ్డి
   డి) కొండా లక్ష్మణ్ బాపూజీ
2. హైదరాబాద్ (తెలంగాణ ప్రాంతం) కౌలువ్యవసాయ భూముల చట్టాన్ని ఎప్పుడు చేశారు?
   ఎ) 1949 జూన్ 5
   బి) 1949 జూన్ 8
   సి) 1950 జూన్ 10
   డి) 1951 జూన్ 10
3. హైదరాబాద్(తెలంగాణ ప్రాంతం) కౌలు వ్యవసాయ భూముల చట్టం-1950 ను ఏ కమిటీ సూచనల ఆధారంగా ఏర్పాటు చేశారు?
   ఎ) హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ
   బి) హైదరాబాద్ కౌలుదార్ల పరిరక్షణ కమిటీ
   సి) హైదరాబాద్ భూగరిష్ఠ పరిమితి కమిటీ
   డి) పైవేవీ కావు
4. హైదరాబాద్ జాగీర్ల రద్దు రెగ్యులేషన్‌ను ఎప్పుడు ప్రకటించారు?
   ఎ)1947 ఆగస్టు 15
   బి)1948 ఆగస్టు 15
   సి)1949 ఆగస్టు 15
   డి)1950 ఆగస్టు 15
5. హైదరాబాద్ జాగీర్ రద్దు నిబంధన చట్టాన్ని రూపొందించినది?
   ఎ) 1949 సెప్టెంబర్ 14
   బి) 1949 సెప్టెంబర్ 30
   సి) 1950 సెప్టెంబర్ 30
   డి) 1955 సెప్టెంబర్ 30
6. మద్రాస్ ఎస్టేట్ బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది, చట్టంగా ఎప్పుడు రూపొందింది?
   ఎ) 1949 బి) 1950
   సి) 1951 డి) 1952
7. ఇనాంల రద్దు చట్టాన్ని అన్ని రకాలైన ఇనాం భూములకు వర్తింపజేస్తున్నట్లు ఎప్పుడు ప్రకటించారు?
   ఎ) 1966 బి) 1965
   సి) 1967 డి) 1957
8. ఆంధ్ర ప్రాంత కౌలుదార్ల, రైతురక్షణ చట్టాన్ని మద్రాస్ ప్రభుత్వం ఏ సంవత్సరంలో జారీ చేసింది?
   ఎ) 1949 బి) 1950
   సి) 1952 డి) 1953
9. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూసంస్కరణల కోసం ఏర్పాటైన కమిటీకి అధ్యక్షుడు ఎవరు?
   ఎ) ప్రకాశం పంతులు
   బి) లక్కరాజు సుబ్బారావు
   సి) నీలం సంజీవరెడ్డి
   డి) దామోదరం సంజీవయ్య
10. ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలు చట్టం తీసుకొచ్చిన సంవత్సరం?
    ఎ) 1953 బి) 1954
    సి) 1955 డి) 1956
11. హైదరాబాద్ కౌలు వ్యవసాయ భూముల చట్టం ప్రకారం మెట్ట భూములకు సంబంధించి కౌలు పరిమాణం భూమి రెవెన్యూ కంటే ఎన్ని రెట్లు ఉండొచ్చు?
    ఎ) 2 రెట్లు బి) 3 రెట్లు
    సి) 3.5 రెట్లు డి) 4 నుంచి 5 రెట్లు
12. ఎవరి అభిప్రాయంలో తెలంగాణ ప్రాంతంలోని రైత్వారీ ప్రాంతంతో పోల్చినపుడు జాగీర్దారీ ప్రాంతంలో అధికంగా రక్షిత కౌలుదార్లను వెళ్లగొట్టారు?
    ఎ) ఖుస్రో బి) గున్నార్ మిర్డల్
    సి) ఆర్థర్ కాటన్
    డి) థామస్ మన్రో
13. ఆంధ్ర రాష్ట్రంలో కౌలు చట్టాలు కౌలుదారులకు రాయితీ హక్కులు కల్పించలేదని ఎవరు వ్యాఖ్యానించారు?
    ఎ) గున్నార్ మిర్డల్
    బి) వావిలాల గోపాలకృష్ణయ్య
    సి) బెజవాడ గోపాలరెడ్డి
    డి) వి. కుమరయ్య
14. ఆంధ్ర రాష్ట్రంలో కౌలుదారీ బిల్లును భూస్వాముల రక్షణ బిల్లుగా గుర్తించవచ్చని వ్యాఖ్యానించినది?
    ఎ) వి. కుమరయ్య
    బి) దామోదరం సంజీవయ్య
    సి) ఆనం సుబ్బారెడ్డి
    డి) ప్రకాశం పంతులు
15. అఖిల భారత కిసాన్ సభను 1936లో ఏ కాంగ్రెస్ మహాసభలో ఏర్పాటు చేశారు?
    ఎ) కాన్పూర్ బి) లక్నో
    సి) మద్రాస్ డి) హైదరాబాద్
16. 1920లో ఎవరికి వ్యతిరేకంగా ముస్లిం రైతులు పోరాటం చేశారు?
    ఎ) చల్లపల్లి జమీందారు
    బి) పిఠాపురం జమీందారు
    సి) విసునూరు దేశ్‌ముఖ్
    డి) గద్వాల దివాని
17. జాగీర్దార్లకు, దేశ్‌ముఖ్‌లకు, నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించాలని 1945లో వామపక్షవాదులు ఏ మహాసభలో తీర్మానించారు?
    ఎ) నల్గొండ బి) ఖమ్మం
    సి) వరంగల్ డి) ఆదిలాబాద్

సమాధానాలు

1) బి; 2) సి; 3) ఎ; 4) సి; 5) ఎ; 6) బి; 7) సి; 8) ఎ; 9) బి; 10) డి; 11) డి; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) బి; 16) సి; 17) బి.

Teenagers without guidance can be easily..

BANK EXAMS
GENERAL ENGLISH



Directions (Q. 1 - 5): Which of the phrases (1), (2), (3), (4) and (5) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct?

1. The footprints might be <u>done</u> by burglars.
   1) Doing 2) made 3) worked
   4) put 5) post
2. This problem can be solved by <u>control</u> pollution.
   1) controlled 2) controlling
   3) continuous 4) continuing
   5) controls
3. Manohar woke up late. <u>Consequent</u> he missed the train.
   1) Subsequent
   2) Concurrent 3) In addition
   4) Consequently
   5) In spite of
4. They <u>thanked to</u> the family for helping them.
   1) thanks 2) thank
   3) thank you 4) thanked
   5) thanking
5. Teenagers without guidance can be easily <u>influence</u>.
   1) influences
   2) were influenced
   3) was influence
   4) influenced
   5) influencing

Directions (Q. 6-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

6. In all (1)/ that excitement. (2)/ I had forgotten (3)/ to take my present for him. (4)/ No error (5)
7. The magic show last night (1)/ was a great success. (2)/ The news was published on the newspaper this morning. (3)/ It was well-written. (4)/ No error (5)
8. The teacher let us paint with our pencils. (1)/ But she did not allow us (2)/ to do exercises in the same way. (3)/ Instead, she wanted us to write with ink. (4)/ No error (5)
9. Last week, an unemployed man killed self (1)/ by jumping down from the roof of a flat. (2)/ He was stupid. (3)/ He must face up to realities. (4)/ No error (5)
10. Feeling bored after a day's work, (1)/ I and my friend decided (2)/ to go for a film (3)/ show at the INOX that night. (4) / No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The court _____ all the three accused setting _____ the earlier order sentencing them to four years in prison.
    1) convicted, ahead
    2) acquitted, aside
    3) charged, above
    4) demanded, forth
    5) ruled, forward
12. Chandrayaan II the _____ project would be another _____ in the history of the country's space ventures.
    1) ambivalent, historical
    2) ambiguous, milestone
    3) ambitious, landmark
    4) ambition, rarity
    5) ambidextrous, feather
13. The bank _____ agricultural growth to be lower due to _____ an uneven rains.
    1) experience, lower
    2) predicts, heavy
    3) expects, deficit
    4) foretell, scarce
    5) outlooks, surplus
14. Foreign _____ look at India as one among _____ markets.
    1) business, many
    2) employees, growing
    3) employers, subsidiary
    4) tourists, sample
    5) investors, emerging
15. Excavations had ____ the ____ significance of the cannons.
    1) exposed, mastery
    2) rejoiced, importance
    3) told, prominent
    4) reformed, pointed
    5) revealed, historical

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. CO and H_2 are the most common molecules in interstellar gas clouds.
B. Stars from inside relatively dense concentrations of interstellar gas and dust known as molecular clouds.
C. When the density reaches a certain point, stars form.
D. The deep cold also causes the gas to clump to high densities.
E. At these temperatures, gases become molecular meaning that atoms bind together.
F. These regions are extremely cold temperature about 10 to 20K, just above absolute zero.

16. What is the LAST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) E 4) F 5) C
18. What is the FIRST sentence after rearrangement?
    1) A 2) C 3) B 4) E 5) D
19. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 21-25): Read the following passage carefully and answer the questions given below it.

For many people the first primitive testimonies of magnetite started from Peter Peregrinus in 1269 and it might be true but let me know about the person who has first found that stone that we now call a magnet, the story goes round a shepherd named Magnet and he first of all discovered the magnet when an iron tip of his crook was pulled towards the stone which we now call as a magnet. The magnetic field around our planet earth was measured to be 4.0 Gauss about 4,000 years and it is same even today so it can be said that it is one of the first natural force which man had discovered years ago. Cleopatra who is still remembered as the beautiful women of the world has been reported to wear a magnet on her forehead to avoid the signs of aging. And at that time the magnet was called as Lodestone. Scientists believe that birds are the only creatures that can see the magnetic field of earth and this force helps them in finding their home in the long distance flights. Usually the magnets are made up of iron or steel but we can also make very powerful magnets through special alloys of nickel, copper, cobalt and aluminum. Hammering a magnet results in demagnetization because the molecules inside the magnet gets scattered and thus lose their North and South Pole's alignment. The same phenomenon occurs when a magnet is heated on a flame. The modern medical science has also observed magnets to be quite affective in curing different diseases and thus for the treatment of many major diseases like cancer the affect of magnetism are utilized. Some veterinarians use magnets to retrieve a wire or any other metal body from the stomach of an animal. The earth magnet is also like a long bar of magnet that is located at the center of earth. The study of ocean floor core samples was carried out by some scientists and it was found that the giant vertebrates of our earth like dinosaurs died due to the decline of earth's magnetic field. So these were some interesting facts about magnets that have been found by many scientists after series of researches. The more the researches were carried on magnets and magnetic field the more fields of life started getting benefits from the magnets, till now all the industries including medical to latest technologies are getting benefits from magnets.

21. In ancient times magnet was also called as:
    1) a healing stone
    2) a powerful stone
    3) a miracle stone
    4) a lodestone
    5) mystery stone
22. Demagnetization occurs through
    1) hammering and heating
    2) lose of south pole
    3) loss of north pole
    4) repulsion between the molecules
    5) attraction between the molecules
23. Veterinarian is
    1) using his powers to remove wire
    2) cleans animals
    3) who treats animals
    4) recognize diseases
    5) cures cancer
24. The extinction of dinosaurs happened because
    1) man used his intelligence
    2) survival of the fittest
    3) struggle for existence
    4) decline of earth's magnetic field
    5) series of researches were carried
25. The natural force which man had discovered years ago
    1) was powerful in curing many diseases
    2) was not realized for a longer period of time
    3) still research is needed in this area
    4) enhanced its value over the years
    5) remains the same even after so many years

ANSWERS

1) 2	2) 2	3) 4	4) 4
5) 4	6) 4	7) 3	8) 4
9) 1	10) 2	11) 2	12) 3
13) 3	14) 5	15) 5	16) 1
17) 3	18) 3	19) 3	20) 5
21) 4	22) 1	23) 3	24) 4
25) 5			